
'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 18 | సంచిక: 10


బుధవారం | 2-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పంజాబ్ ఫటాఫట్

మెరిసిన ప్రభ్‌సిమ్రన్, అయ్యర్. లక్నో జట్టుపై 8 వికెట్లతో విజయం. -14లో



క్రాష్ మార్కెట్..

దలాల్ స్ట్రీట్‌కు 'లిబరేషన్ డే' ఫీవర్.. సెన్సెక్స్ 1,390 పాయింట్లు పతనం. -15లో



టారిఫ్‌లకు వేళాయె

భారత్ సహా ప్రపంచ దేశాలపై అగ్రరాజ్యం అమెరికా ప్రతీకార సుంకాల బాదుడు బుధవారం నుంచే మొదలవనుంది.

- వివరాలు 6లో



అమానవీయం.. చట్టవిరుద్ధం

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో బుల్డోజర్లతో నివాస గృహాలను కూల్చేయడం పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో



పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ కాదు

రాజకీయాలు తనకు ఫుల్‌టైమ్ ఉద్యోగం కాదని యూపీ సీఎం, బీజేపీ సీనియర్ నేత యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



నేడు లోక్‌సభకు వక్ఫ్ బిల్లు

వక్ఫ్ సవరణ బిల్లుపై నేడు లోక్‌సభలో చర్చ జరగనుంది. బిల్లు ఆమోదానికి కేంద్రం పట్టుదలతో ఉండగా విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

- వివరాలు 6లో



రూ. 94,000

సరికొత్త గరిష్టానికి చేరిన బంగారం ధర

ఒక్క రోజులో రూ. 2,500 పెరుగుదల

రూ. లక్ష దిశగా పయనిస్తున్న పసిడి

ఏడాదిలో ఏకంగా రూ. 24 వేలు మించిన ధర

2024 ఏప్రిల్ 1న రూ. 70 వేలు పలికిన పసిడి.. 2023 ఏప్రిల్‌తో పోలిస్తే రూ. 34,100 దూసుకెళ్లిన విలువ

ఐదేళ్లలో రెండింతలు దాటిన గోల్డ్ రేట్

ధరల పరుగుతో రూ. 118 లక్షల కోట్లు పెరిగిన భారతీయుల సంపద

ఏడాదిలోనే రూ. 60 లక్షల కోట్లు ఎగసిన విలువ

- వివరాలు 3లో

హెచ్‌సీయూది కాదు

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి స్పష్టీకరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

- ఆ 400 ఎకరాలు పరిశ్రమల స్థాపనకు వినియోగిస్తాం
- యూనివర్సిటీ పరిధిలో ఉన్న భూములకు చట్టబద్ధత కల్పిస్తాం
- ఆ పరిసరాల్లో పర్యావరణానికి ముప్పు తెచ్చే చర్యలేవీ చేపట్టబోం
- ఆ భూముల కోసం వైఎస్సార్ అలుపెరుగని పోరాటం చేశారు: భట్టి
- టీడీపీ ప్రభుత్వం బిల్లీరావుకు భూమి ఇస్తే.. కాంగ్రెస్ సర్కార్ కాపాడింది
- బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచారం చేస్తున్నాయి
- 25వ సర్వే నంబర్ భూమికి కచ్చితమైన రికార్డులు లేవు: శ్రీధర్‌బాబు
- చాలెంజ్ చేస్తున్నాం.. పర్యావరణం దెబ్బతింటోందని నిరూపిస్తారా?: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానిది (హెచ్‌సీయూ) కాదని ప్రభుత్వం పేర్కొంది. ఆ భూమి వర్సిటీదే కానప్పుడు తీసుకుంటున్నామనడంలో వాస్తవం ఏముంటుందని ప్రశ్నించింది. ఈ భూముల కోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేసింది. ఈ భూమిని పరిశ్రమల స్థాపనకు వినియోగిస్తామని తెలిపింది. ప్రస్తుతం వర్సిటీ పరిధిలో ఉన్న భూములకు చట్టబద్ధత కల్పిస్తామని వెల్లడించింది. హెచ్‌సీయూకు చెందిన ఇంచ్ భూమిని కూడా తీసుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. పర్యావరణానికి ముప్పు తెచ్చే చర్యలు వర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఏమాత్రం చేపట్టబోమని హామీ ఇచ్చింది. హెచ్‌సీయూ భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ వివిధ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం, అభివృద్ధిని అడ్డుకునేలా బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచా రం చేస్తున్నాయని విమర్శించారు. ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వ అధీనంలోనే ఉందని చెప్పారు.

వర్సిటీకి భూమి ఇచ్చింది కాంగ్రెస్ సర్కారే: భట్టి

భూమి ఇచ్చి హెచ్‌సీయూను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భట్టి అన్నారు. ఇందులో 400 ఎకరాల భూమిని తెలుగుదేశం ప్రభుత్వం బిల్లీరావుకు చెందిన మోసపూరితమైన కంపెనీ ఐఎంజీ భారత్‌కు కట్టబెట్టిందని తెలిపారు. ఈ భూమి తీసుకున్నందుకు మిగతా 2వ పేజీలో ▶

అట్టుడికిన హెచ్‌సీయూ

- ధర్నా చేసేందుకు వచ్చిన సీపీఎం, బీజేవైఎం నాయకులు
- సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు.. నిరసనకారుల అరెస్ట్

2 లో

జోక్యం చేసుకోండి..

- హెచ్‌సీయూ భూముల అంశంపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కేంద్రమంత్రులు, ఎంపీల వినతి
- పార్లమెంట్‌లోనూ ఈ అంశాన్ని లేవనెత్తిన బీజేపీ ఎంపీలు లక్ష్మణ్, ధర్మపురి

2 లో

మాట కలిపి.. మభ్యపెట్టి..

హైదరాబాద్ శివార్లలో విదేశీ యువతిపై అత్యాచారం

- స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు వచ్చిన జర్మనీ యువతి
- మీర్‌పేట్‌లోని స్నేహితుడి ఇంట్లో కొద్దిరోజులుగా నివాసం
- సోమవారం మందమల్లమ్మ చౌరస్తా వద్ద నిందితుడి పరిచయం
- అందమైన ప్రదేశాలు చూపిస్తానని తీసుకెళ్లిన మహ్మద్ అస్లాం
- యువతి స్నేహితుడికి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు?
- బాధితురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం

నిందితుడు అస్లాంను అదుపులోకి తీసుకున్న పోలీసులు..

- వివరాలు 5లో

కొలిక్కి చేరని 'క్లింటన్' కేసు!

- 15 ఏళ్ల క్రితం అమెరికన్‌పై అత్యాచారం.. క్లింటన్ ఫౌండేషన్‌లో పనిచేసేందుకు నగరానికి వచ్చిన మహిళ
- పోలీసులు దర్యాప్తు చేసినా ఫలితం శూన్యం

5 లో

ఆటిజం.. అర్థం చేసుకుందాం

నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం



కోపగించుకోవద్దు.. వేరుగా చూడొద్దు

బుద్ధి మాంద్యం కాదు.. మానసిక వైకల్యం అని అనలేం

చిన్నారుల్ని పీడించే, తల్లిదండ్రులను వేధించే ఓ రుగ్మత

ఎందుకొస్తుందో చెప్పలేం.. మందులూ లేవు: నిపుణులు

దేశంలోని 0–9 ఏళ్ల చిన్నారుల్లో 1 నుంచి 1.5 శాతం మందిలో ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్.. తెలంగాణలో 60 వేల నుంచి 90 వేల మందిలో ఈ రుగ్మత!

బాధితుల్లో బాలురే అధికం.. 2 ఏళ్ల వయస్సు లోపు గనుక గమనిస్తే సులభంగా బయటపడే చాన్స్

థెరపీలే పరిష్కారం.. పుట్టగొడుగుల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లు.. ప్రభుత్వ నియంత్రణ లేక భారీగా వసూళ్లు

16 లో

బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైంది

కాంగ్రెస్ ఎంపీలు చామల, మల్లు, అనిల్



సాక్షి, న్యూఢిల్లీ: హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైందని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. ఈ రెండు పార్టీలు భగవంతుడికీ, భక్తుడికీ అనుసంధానంలా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. ఏబీవీపీ విద్యార్థులను రెచ్చగొట్టి బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ పబ్బం గడుపుతున్నాయని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం ఈ భూమి తెలంగాణకు సొంతమని అప్పటి రిజిస్ట్రార్ సంతకం చేశారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానానికి కేంద్రం ఆమోదం తెలిపాలనే డిమాండ్‌తో బుధవారం జంతర్‌మంతర్‌లో నిర్వహిస్తున్న 'బీసీల పోరు గర్జన'కు విపక్షాలు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు నష్టంచేసే పని సీఎం రేవంత్ చేయరు

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు నష్టం చేసేపని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయ రని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూముల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తున్నాయని మంగళవారం మీడియాతో అన్నారు. ఈ భూముల్లో వన్యప్రాణులున్నట్టు ఆయా పార్టీల అనుబంధ సంఘాలు గ్రాఫిక్స్ సృష్టించి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం చర్చలో ఉన్న 400 ఎకరాల భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తే ఇటు హైకోర్టుతో పాటు అటు సుప్రీంకోర్టులో కొట్లాడి మరీ రేవంత్‌రెడ్డి ఆ భూములను ప్రభుత్వపరం చేశారని, ఇప్పుడా భూములను రాష్ట్రానికి ఆదాయం తెచ్చేందుకు వినియోగించే ప్రయ త్నం చేస్తున్నారని దయాకర్ చెప్పారు.


ఆ 25 ఎకరాలిచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా?

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



చందానగర్ (హైదరాబాద్): టీఎన్‌జీవో కాలనీలో మైహోం విహంగకు 25 ఎకరాలు కట్టబెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు బీజేపీ నాయకులు ఏమీ మాట్లాడలేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. మంగళవారం టీఎన్‌జీఓ కాలనీలోని మైహోమ్ విహంగ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. రామేశ్వరరావు కోసం బీజేపీ, బీజేపీ రిస్తేదార్ సమితి (బీఆర్ఎస్) లోపాయికారీ ఒప్పందం కుదుర్చు కున్నాయని ఆరోపించారు. కంచెగచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల కోసం న్యాయపోరాటం చేసి సాధించిన భూమిని రాష్ట్ర ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. గతంలో టీఎన్‌జీవో కాలనీలో రామేశ్వరరావు హైరైజ్ భవనం నిర్మాణం చేస్తే 100 ఫీట్ల రోడ్డు కోసం హెచ్‌సీయూ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుందని, ఓ వ్యక్తి కోసం భూమి తీసుకోవడం తప్పుకాదా? అని ఆయన ప్రశ్నించారు. రామేశ్వరరావు కోసం రెండు పార్టీలూ ఒక్కటైపోతాయని, కోర్టు ద్వారా న్యాయ పోరాటంలో సాధించిన భూమి రాష్ట్ర సంక్షేమానికి వినియోగిస్తామంటే మాత్రం విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని బల్మూరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదండీ జాతర్



గ్యాసు వేస్తు ఎందుకని!

అసత్య ప్రచారం గట్టిగా తిప్పి కొట్టాలి

మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి మంతనాలు

- హెచ్‌సీయూ భూముల వివాదంపై చర్చ
- ఆ భూములకు ఎలాంటి చట్టబద్ధత కల్పించలేదన్న రేవంత్!
- 1,500కు పైగా ఎకరాలపై వర్సిటీకి హక్కులు కల్పిద్దామని వెల్లడి!



సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) భూములకు సంబంధించిన వివాదం నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుబాటులో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కలతో సమావేశమయ్యారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో జరిగిన ఈ భేటీలో యూనివర్సిటీ భూములు, పూర్వాపరాలపై చర్చించారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని గట్టిగా తిప్పి కొట్టాలని సూచించారు. హెచ్‌సీయూకు 1975లో భూమి కేటాయించినా.. అప్పటి నుంచి ఇప్పటివరకు యూనివర్సిటీకి ఎలాంటి చట్టబద్ధత కల్పించలేదని వివరించినట్లు సమాచారం. వాస్తవానికి 2,300 ఎకరాలు యూనివర్సిటీకి కేటాయించినా.. వివిధ దశల్లో ప్రభుత్వ అవసరాల కోసం భూమిని తీసుకుంటూ వచ్చినట్టుగా చెప్పారని తెలిసింది. ప్రస్తుతం యూనివర్సిటీ పరిధిలో ఉన్న 1,500కు పైగా ఎకరాలపై యూనివర్సిటీకి హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకుందామని అన్నట్టు తెలిసింది.

ఆ భూముల్లోనూ శిలలు, చెరువులు కాపాడదాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అభివృద్ధి చేయాలనుకుంటున్న 400 ఎకరాల్లోనూ.. యూనివర్సిటీ విద్యార్థులు, పర్యావరణవేత్తల మనోభావాలు దెబ్బతినకుండా సహజ సిద్ధ శిలా సంపద లేదా చెరువులను కాపాడుదామని ఆ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబులను కోరినట్లు తెలిసింది. వీరి ప్రతిపాదనతో ముఖ్యమంత్రి కూడా ఏకీభవిస్తూ.. వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ పరిరక్షించాల్సిందేనని స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికీ ఏదో విధంగా అడ్డుపుల్లలు వేయడమే పనిగా విపక్షాలు పెట్టుకున్నాయని, ఇప్పుడు కూడా విద్యార్థులను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. కాగా ఆ భూములు పూర్తిగా ప్రభుత్వానివేనని, అందులో ఎలాంటి వివాదం లేదని సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చిన అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పినట్లు తెలిసింది.

వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లతో మంత్రుల సమావేశం

ముఖ్యమంత్రితో సమావేశం తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు.. వర్సిటీ మాజీ ప్రొఫెసర్లు డి.నర్సింహారెడ్డి, హరగోపాల్, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం పర్యావరణవేత్తలతో సుదీర్ఘంగా సమావేశం అయ్యారు. యూనివర్సిటీకి భూముల కేటాయింపు, అలైనేషన్ లేకపోవడం, వివిధ అవసరాల కోసం ప్రభుత్వం భూమి తిరిగి తీసుకోవడం లాంటి వివరాలను వారికి వివరించారు.


హెచ్‌సీయూది కాదు..

▶ మొదటి పేజీ తరువాయి

పరిహారంగా యూనివర్సిటీకి ఆనుకునే మరోచోట (గోపన్‌పల్లి వైపు) 397 ఎకరాలు ఇచ్చిందని చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారుల మధ్య అప్పట్లోనే ఒప్పందం జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 2006 నవంబర్ 21న ఐఎంజీ భారత్‌కు టీడీపీ ఇచ్చిన భూమిని రద్దు చేశారని తెలిపారు. దీంతో బిల్లీరావు హైకోర్టును ఆశ్రయించారని, కానీ వైఎస్సార్ అలుపెరుగని న్యాయ పోరాటంతో ప్రజల భూమిని తిరిగి దక్కించుకునేందుకు ప్రయత్నం చేశారని తెలిపారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళుగా ఈ భూమిని కాపాడే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. రూ.కోట్ల విలువైన భూమిని గాలికొదిలి పరోక్షంగా ఫ్రాడ్ కంపెనీకి మేలు చేసిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి న్యాయ పోరాటం చేసి, విజయం సాధించామని, ప్రజల భూమిని ప్రజలకు చెందేలా చేశామని వివరించారు. ప్రస్తుతం ఈ భూమిని టీజీఐఐసీ ద్వారా పరిశ్రమల స్థాపనకు వినియోగించే ప్రయత్నం చేస్తున్నామని భట్టి పేర్కొన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చి, యువతకు ఉద్యోగాలు కల్పించడమే దీని ఉద్దేశమన్నారు. ఇందులో ప్రభుత్వంలోని ఏ ఒక్కరి స్వార్థం లేదని చెప్పారు. వర్సిటీ పరిసర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తుంటే వాటికి తమ హయాంలోనే అనుమతులు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ నేతలు..ఇప్పుడు పర్యావరణం దెబ్బతింటోందని మాట్లాడటంలో అర్థం లేదని విమర్శించారు. వారి రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు భట్టి విజ్ఞప్తి చేశారు.

ఫెవికాల్ బంధంతో అసత్యాల ప్రచారం: పొంగులేటి

హెచ్‌సీయూ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటోందని నిరూపించగలరా? అని బీఆర్ఎస్, బీజేపీ నేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. దీనిపై ప్రత్యేక కమిటీ వేస్తామని, ఒక్క పక్షిగానీ, జంతువుగానీ చనిపోయిందని రుజువు చేయాలని విపక్షాలను డిమాండ్ చేశారు. రెండు ప్రతిపక్ష పార్టీలూ ఫెవికాల్ బంధంతో అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. దశాబ్దాలుగా ఈ భూమి కోర్టు పరిధిలో ఉంటే పోరాటం చేయలేని బీఆర్ఎస్, పరోక్షంగా బిల్లీరావుకు సహకరించిందని ఆరోపించారు. ప్రజల భూమిని తాము కాపాడుతుంటే అబద్ధాలతో గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ కృషిని చూసి విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు మొదలు, దాని అభివృద్ధికి కృషి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని పేర్కొన్నారు. వర్సిటీ భూమిలోంచి గత ప్రభుత్వం రోడ్డు వేయబోతుంటే హెచ్‌సీయూ వీసీ కోర్టును ఆశ్రయించారని, అప్పుడు ఈ భూమిపై వర్సిటీకి అధికారం లేదని అప్పటి ప్రభుత్వం చెప్పిందన్నారు. విద్యార్థుల మనోభావాలు ఏమాత్రం దెబ్బ తిననివ్వబోమని చెప్పారు. విద్యార్థుల ముసుగులో అరాచకం చేయాలని చూసే శక్తులను ఏమాత్రం ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు.



కంచ గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన భూములపై టీజీఐఐసీ విడుదల చేసిన మ్యాప్ ఇదే

ఆ ప్రచారంలో వాస్తవం లేదు: శ్రీధర్‌బాబు

కంచ గచ్చిబౌలిలోని 25వ సర్వే నంబర్‌లో ఉన్న భూమికి ఇప్పటివరకూ కచ్చితమైన రికార్డులు లేవని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 2016లో దీనిపై అప్పటి ప్రభుత్వం ఐఏఎస్‌లతో కమిటీ వేసిందని, ఆ కమిటీ 1,500 ఎకరాలపై యూనివర్సిటీకి హక్కులు కల్పించేందుకు కొన్ని సిఫారసులు చేసిందని చెప్పారు. అయితే గత ప్రభుత్వం ఈ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మంత్రి విమర్శించారు. ఇటీవల తాము యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌తో సంప్రదింపులు జరిపామని, చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఆ 400 ఎకరాల భూమిలో చెరువులు, బండరాళ్ల దెబ్బతింటున్నాయని ఒక వర్గం మీడియా, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

హెచ్‌సీయూ భూముల అంశంలో జోక్యం చేసుకోండి

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కేంద్రమంత్రులు, ఎంపీల వినతి

- పార్లమెంట్‌లోనూ ఈ అంశాన్ని లేవనెత్తిన ఎంపీలు లక్ష్మణ్, ధర్మపురి



కిషన్‌రెడ్డి నేతృత్వంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం ఇస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, అర్వింద్, నగేశ్, బండి సంజయ్, ఈటల

సాక్షి, న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి (హెచ్‌సీయూ) చెందిన 400 ఎకరాల భూమి విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ కేంద్రమంత్రులు, ఎంపీలు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం వేలం వేయాలనుకుంటున్న భూమిలో 700 రకాల ఔషధ మొక్కలు, 220 రకాల పక్షులు ఉన్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గొడెం నగేశ్‌ల బృందం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతి పత్రం అందజేసింది. ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన అనంతరం బీజేపీ ఎంపీలు తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానానికి కప్పం కట్టేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూములను అమ్ముతోందని బీజేపీ ఎంపీలు ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. భూముల అమ్మకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుగానే కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు.

ట్రిపుల్‌ఆర్ రాజ్యాంగం అమలవుతోంది: లక్ష్మణ్

తెలంగాణలో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి రాజ్యాంగమే అమలవుతోందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దుయ్యబట్టారు. మంగళవారం పార్లమెంటు ఉభయ సభల్లోనూ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని తెలంగాణ బీజేపీ ఎంపీలు లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్ లేవనెత్తారు. రాజ్యసభ జీరో అవర్‌లో ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు తీర్చలేకే ప్రభుత్వం భూములను అమ్ముతోందన్నారు. లోక్‌సభలో ధర్మపురి అర్వింద్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతూ.. భూమి వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేసేందుకు చొరవ చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం: భూపేంద్ర యాదవ్

హైదరాబాద్‌లోని కంచె గచ్చిబౌలి భూములపై నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలకు హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణ బీజేపీ ఎంపీలు భూపేంద్ర యాదవ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. తక్షణమే గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని ఆ భూములను పరిరక్షించాలని కోరారు.

బీజేపీ ఎమ్మెల్యేల అరెస్ట్

ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఉద్రిక్తత



ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు

సాక్షి,హైదరాబాద్/హిమాయత్‌నగర్: హెచ్‌సీయూ భూము లను పరిశీలించడానికి బీజేపీ ఎమ్మెల్యేలు వెళతారన్న ముందస్తు సమాచార నేపథ్యంలో వారందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో హౌస్‌అరెస్ట్ చేశారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను పోలీసులు చుట్టుముట్టి అక్కడకు వచ్చిన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రాబోయే రోజుల్లో ఓయూ, కేయూ భూములు కూడా అమ్ముతారేమో: ఏలేటి

ఇప్పుడు హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ, రాబోయే రోజుల్లో ఉస్మానియా, కాకతీయ వర్సిటీల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మేయాలని చూస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 'తెలంగాణలో అరాచక పాలన నడుస్తోంది. భూములు అమ్మితే కానీ ప్రభుత్వం నడవని పరిస్థితి. రియల్ ఎస్టేట్ దందా చేయడానికే ఈ ప్రభుత్వం ఉందా'అని ఏలేటి ప్రశ్నించారు. మంగళవారం హెచ్‌సీయూ సందర్శనకు వెళుతున్న తన హౌస్‌అరెస్ట్, బీజేపీ ఎమ్మెల్యేల అరెస్ట్‌ను ఆయన ఖండించారు. వెంటనే అఖిలపక్ష బృందాన్ని హెచ్‌సీయూకు తీసుకెళ్లి చూపించాలని డిమాండ్ చేశారు. 'త్వరలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలను సందర్శిస్తాం. వర్సిటీల భూముల జోలికి వెళితే సహించేది లేదు. భూముల వేలం ఆపడానికి ఉద్యమిస్తాం'అని హెచ్చరించారు. కాంగ్రెస్ మిత్రపక్ష నేతలైన ప్రొఫెసర్ కోదండరామ్, కూనంనేని సాంబశివరావులకు హెచ్‌సీయూ భూముల వివాదం కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

వేలాన్ని వెనక్కి తీసుకోవాలి: పాయల్ శంకర్



పాయల్‌శంకర్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు 'ధరణి పేరుతో నాడు కేసీఆర్ దోపిడీ చేశారు. భూమాత పేరుతో నేడు కాంగ్రెస్ భూ దందా చేయడానికి ప్రయత్నిస్తోంది'అని ఆరోపించారు. హెచ్‌సీయూ భూములపై వాస్తవ పరిస్థితులకు తెలుసుకుందామని వెళుతుంటే పోలీసులు తమను నిర్బంధించారని, అణచివేత ప్రజాపాలన అవుతుందా అని పాయల్‌శంకర్ ప్రశ్నించారు.

ఆ భూములు ప్రభుత్వానివే

గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోబోదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. యూనివర్సిటీని ఆనుకుని ఉన్న ఈ భూములు ప్రభుత్వానివేనని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఎలాంటి వివాదం, న్యాయపరమైన చిక్కులు లేవని, ఎటువంటి పంచాయతీలేని ఈ భూముల విషయంలో బీఆర్ఎస్, బీజేపీలు అనవసర వివాదాన్ని సృష్టిస్తున్నాయని విమర్శించారు. గతంలో ఇదే సర్వేనంబర్‌లోని భూములను మైహోం సంస్థకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చిందని మహేశ్ గౌడ్ గుర్తు చేశారు. ఆ సమయంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల వద్దకు వెళ్లడానికంటే ముందు గత ప్రభుత్వం అప్పజెప్పిన భూముల్లో నిర్మించిన మైహోం విహంగ వద్దకు బీజేపీ నేతలు వెళ్లాలని వ్యాఖ్యానించారు.

కేటీఆర్ ఓ పిరికి ట్వీటర్..

హడావుడిగా ట్వీట్లు పెట్టి తప్పని తెలిసిన తర్వాత వాటిని తొలగించే వారిని పిరికి ట్వీటర్లు అని పిలుస్తారని, కేటీఆర్ కూడా ఓ పిరికి ట్వీటర్ అని మహేశ్‌గౌడ్ చెప్పారు. హెచ్‌సీయూ భూముల్లో నెమళ్ల ఉన్నట్టు ట్వీట్ చేసి అది తప్పని తెలిసిన తర్వాత తొలగించారని చెప్పారు.

ఫార్మర్ కమ్యూనిటీ యాప్ ఆవిష్కరణ

ఏఐసీసీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన ఫార్మర్ కమ్యూనిటీ యాప్‌ను మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ యాప్‌ను స్కాన్ చేయడం ద్వారా రైతులకు సహాయం అందించే సైన్యంలో ఎవరైనా చేరవచ్చని చెప్పారు.

మంత్రివర్గ విస్తరణపై మీకెవరు చెప్పారు?

మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు ఉంటుందని పీసీసీ చీఫ్‌ను విలేకరులు ప్రశ్నించగా, అధిష్టానం ఎప్పుడు చెబితే అప్పుడు ఉంటుందని ఆయన బదులిచ్చారు. మూడో తేదీన ఉంటుందాఅని వారు అడగగా, మూడో తేదీన ఉంటుందని మీకెవరు చెప్పారని ఆయన విలేకరులను తిరిగి ప్రశ్నించారు.

అట్టుడికిన హెచ్‌సీయూ

ధర్నా చేసేందుకు వచ్చిన సీపీఎం, బీజేవైఎం నాయకులు

- సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు.. నిరసనకారుల అరెస్ట్



సీపీఎం కార్యకర్త కాలును బూట్‌కాలుతో తొక్కుతున్న పోలీస్

గచ్చిబౌలి: కంచ గచ్చిబౌలి భూముల వేలానికి నిరసనగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ధర్నాకు వచ్చిన సీపీఎం, బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హెచ్‌సీయూ ప్రధాన ద్వారం బయట నిరసనకారులు.. వర్సిటీ లోపల విద్యార్థుల ధర్నాతో హెచ్‌సీయూ అట్టుడికిపోయింది. మంగళవారం హెచ్‌సీయూ విద్యార్థులు మహాధర్నాకు పిలుపు ఇవ్వడం, వర్సిటీ భూములను పరిశీలిస్తామని బీజేపీ ఎమ్మెల్యేలు చెప్పిన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటల సమయంలో అటు సీపీఎం, ఇటు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్, వర్సిటీ భూములను వేలం వేయొద్దని, విద్యార్థులకు వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని నినదించారు. అప్పటికే భారీ సంఖ్యలో మోహరించిన పోలీసు బలగాలు, నిరసనకారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని అరెస్టు చేసే క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దొరికినవారిని దొరికినట్టే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా నాయకురాళ్లను అరెస్ట్ చేశారు. నాలుగైదు వాహనాల్లో నిరసన కారులను నార్సింగి, కొల్లూరు, మాదాపూర్, రాజేంద్రనగర్, రాయదుర్గం పీఎస్‌లకు తరలించారు. దాదాపు 68 మందిని అరెస్టు చేసి, వారిపై కేసులు నమోదు చేసి రాత్రి విడుదల చేసినట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థులు మహాధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా హౌస్ అరెస్టులు చేశారు. ఆందోళనకు నాయక త్వం వహించిన వారిలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్, సీపీఎం నేత శోభన్, ఉస్మానియా యూనివర్సిటీ పీడీఎస్‌యూ అధ్యక్షుడు ఆవుల నాగరాజు తదితరులు ఉన్నారు. ఆందోళనల నేపథ్యంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



హెచ్‌సీయూ లోపల విద్యార్థుల ధర్నా



ప్రధానద్వారం వద్ద నిరసన

- ఆందోళన సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ మాట్లాడుతూ వర్సిటీ భూములను కాపాడేందుకు ఎన్ని ఉద్యమాలైనా చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. భూముల వేలాన్ని తక్షణమే సీఎం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
- విద్యార్థులపై పోలీసుల ఉక్కుపాదాన్ని నిరసిస్తూ ధర్నాకు వెళితే ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేశారని సీపీఎం నాయకులు వాపోయారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలను తరలిస్తున్న పోలీసులు



హెచ్‌సీయూ వద్ద బీజేవైఎం నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

పుత్తడి @ రూ.94,000

సరికొత్త గరిష్టానికి చేరిన బంగారం ధర



- ఒక్క రోజులో రూ.2,500 పెరుగుదల
- రూ. లక్ష దిశగా పయనిస్తున్న పసిడి
- ఏడాదిలో ఏకంగా రూ.24 వేలు మించిన ధర
- ఐదేళ్లలో రెండింతలు దాటిన గోల్డ్‌రేట్
- ధరల పరుగుతో రూ.118 లక్షల కోట్లు పెరిగిన భారతీయుల సంపద
- ఏడాదిలోనే రూ.60 లక్షల కోట్లు ఎగిసిన విలువ

సాక్షి, స్పెషల్ డెస్క్: పసిడి దూకుడు ఆగడం లేదు. తాజాగా మరో రికార్డును తిరగరాస్తూ 10 గ్రాముల (24 క్యారట్లు) పుత్తడి ధర హైదరాబాద్ మార్కెట్లో రూ.94,000లకు చేరింది. ఒకానొక దశలో రూ.94,200లను కూడా తాకింది. ఒక్క రోజులోనే ధర రూ.2,500 దూసుకెళ్లడం గమనార్హం. పరిశ్రమ నిపుణులు అంచనా వేసినట్లుగానే రూ.1 లక్షకు చేరువ దిశగా పుత్తడి ధర పరుగులు తీస్తోంది. ఏప్రిల్ 2 నుంచి అన్ని దేశాలపై టారిఫ్‌ల పెంపు అమలు చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో కొనుగోళ్ల సెంటిమెంట్‌కు బలాన్నిచ్చింది. ఇన్వెస్టర్లకుతోడు ఆభరణాల వర్తకులు సైతం కొనుగోళ్లకు దిగడంతో పసిడి ధర ఆల్‌టైం హై నమోదు చేసింది. అటు 22 క్యారట్ల పసిడి రూ.86,300లకు చేరింది. మరోవైపు వెండిలో మూడురోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. కిలోకు రూ.500 నష్టపోయి రూ.1,02,500 స్థాయికి పరిమితమైంది. కాగా, గతేడాది ఏప్రిల్ 1న బంగారం ధర రూ.70,000 నమోదైంది. అంటే ఏడాదిలో రూ.24 వేలు పెరగడం విశేషం. ఇక 2020 ఏప్రిల్ 1న పసిడి ధర రూ.46,500 పలికింది. తాజా రికార్డుతో పోలిస్తే ఐదేళ్లలో ధర రెండింతలకు ఎగిసింది. ధరలో 102 శాతం వృద్ధి నమోదైందన్న మాట.

సురక్షిత ఆస్తుల వైపు..

2025లో ఇప్పటివరకు పసిడి 18 కొత్త గరిష్టాలను తాకింది. 2024లో 40 కంటే ఎక్కువసార్లు ఆల్‌టైమ్ గరిష్టాలను అందుకుంది. ఏప్రిల్ 1న అంతర్జాతీయంగా ఔన్స్ (31.1గ్రాములు) ధరరూ.2,68,784 దాటింది. రెండు వారాల క్రితం ఇది రూ.2,56,800 ఉంది. యూఎస్ ప్రతిపాదిత సుంకాలు, ఆర్థిక అనిశ్చితి ఆందోళనల మధ్య బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక మాంద్యం ముప్పు, ఫెడరల్ రిజర్వ్ రేటు కోతలకు అవకాశముందన్న అంచనాల కారణంగా పెట్టుబడిదారుల సెంటిమెంట్ బంగారం వంటి సురక్షిత ఆస్తుల వైపు మళ్లుతోంది. పెట్టుబడికి సురక్షిత సాధనంగా పుత్తడి నిలిచిందని సికింద్రాబాద్‌లోని ఆదినాథ్ జువెల్లర్స్ ఎండీ ముకేశ్‌కుమార్ సురానా వివరించారు.

ఐదేళ్లలో 3,627 టన్నులు..

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) అంచనా ప్రకారం 2019 నాటికి భారతీయ కుటుంబాల వద్ద సుమారు 24,000–25,000 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. 2020 నుంచి 2024 వరకు 3,627 టన్నుల పసిడిని భారత్ దిగుమతి చేసుకుంది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద ఉన్న పుత్తడి నిల్వలు 2019 నాటికి 618.2 టన్నులు. 2024 డిసెంబర్ నాటికి ఇవి 876.18 టన్నులకు చేరాయి. ఐదేళ్లలో ఆర్‌బీఐ 258 టన్నులు అదనంగా సమకూర్చుకుంది. కరోనా మహమ్మారి, తదనంతర కాలంలో అమ్మకం, తాకట్టు ద్వారా కోట్లాది కుటుంబాలను బంగారమే ఆదుకుంది. గత ఏడాది డిసెంబర్ నాటికి దేశంలో ప్రజల వద్ద పుత్తడి నిల్వలు 25,000 టన్నులు ఉన్నాయని హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ వెల్లడించింది.

దాచిందంతా బంగారమే..


అవును మీరు చదివింది నిజమే. దాచిందంతా బంగారమే. ఎంతలా అంటే ఊహకు అందనంత. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా రూ.11,87,50,00,00,00,000 కోట్లు. సింపుల్‌గా రూ.118 లక్షల కోట్లకుపైమాటే. భారతీయ కుటుంబాలు దాచుకున్న 25,000 టన్నుల బంగారం విలువ ఐదేళ్లలో ఈ స్థాయిలో ఎగిసింది. పుత్తడి ధర ఐదు సంవత్సరాల్లో రెండింతలకుపైగా దూసుకుపోవడమే ఇందుకు కారణం. అయితే ఒక్క ఏడాదిలోనే భారతీయ కుటుంబాల వద్ద బంగారం రూపంలో ఉన్న ఈ సంపద రూ.60 లక్షల కోట్లు వృద్ధి చెందడం మరో విశేషం. ఆభరణం, పొదుపు, పెట్టుబడి.. బంగారం కొనుగోలుకు కారణం ఏదైనా ఈ 'గోల్డెన్‌డేస్'జనానికి కాసులు కురిపిస్తోందని పెద్దపల్లికి చెందిన బంగారం వ్యాపారి కట్టా సంజీవ్ కుమార్ తెలిపారు. ధర దూకుడుగా ఉన్నా భవిష్యత్ అవసరాల కోసం కొనుగోళ్లు జరుపుతున్నారని చెప్పారు.

ఐదేళ్ల బంగారం ముచ్చట్లు

3,627 టన్నులు
భారత్ దిగుమతి చేసుకున్న పుత్తడి

258 టన్నులు
ఆర్‌బీఐ అదనంగా సమకూర్చుకున్న బంగారం

రూ. **47,500**
అధికమైన పసిడి ధర



సంవత్సరాల వారీగా ఏప్రిల్ 1న హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారట్ల బంగారం ధర 10 గ్రాములకు ఇలా..

2025	-	రూ.94,000
2024	-	రూ.70,000
2023	-	రూ.59,900
2022	-	రూ.61,500
2021	-	రూ.47,600
2020	-	రూ.46,500

పసిడి రూపంలో పెరిగిన సంపద

రూ.**118** లక్షల కోట్లు — ఐదేళ్లలో

రూ.**60** లక్షల కోట్లు — సంవత్సరంలో

2,16,265 టన్నులు
2024 డిసెంబర్ నాటికి ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన పసిడి

11.56 శాతం
మొత్తం పరిమాణంలో భారతీయుల వద్ద ఉన్న బంగారం

న్యాయవాదిని ఎందుకు అనుమతించడం లేదు?

'ఫార్ములా'–ఈ కేసులో పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేస్ కేసుకు సంబంధించిన విచారణకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు వెంట న్యాయవాదిని అనుమతించడం లేదన్న ఆరోపణలపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 21కు వాయిదా వేసింది. ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై నవంబర్ 19న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ–1గా కేటీఆర్, ఏ–2గా నాటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఏ–3గా హెచ్ఎండీఏ నాటి చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి పేరు చేర్చారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జనవరి 9న విచారణకు రావాలని జనవరి 6న ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డీఎస్పీ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన వెంట న్యాయవాదిని అనుమతించాలని కోరగా పోలీసులు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పోలీసుల తరఫున న్యాయవాది బాల మోహన్‌రెడ్డి, పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రభాకర్‌రావు విచారణకు హాజరయ్యారు.

రామగుండం ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తి రికార్డు



జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 2,600 మెగావాట్ల ఎన్టీపీసీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 15,046 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించింది. గత మార్చిలో 1,471 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. ఇందుకోసం 75.39 ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) నమోదు చేసింది. అలాగే ఆర్థిక సంవత్సరంలో 15,046 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని 66 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో నమోదు చేసింది. బొగ్గు ఆధారిత ఎన్టీపీసీ థర్మల్ ప్లాంట్లలో రామగుండం ఎన్టీపీసీ సరికొత్త రికార్డు సృష్టించింది.

బీజేపీ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత

- 75 ఏళ్లు దాటినవారు పదవుల నుంచి తప్పుకోవాలని ఒత్తిళ్లు
- కేంద్రంలో మళ్లీ ఏర్పడేవి సంకీర్ణ ప్రభుత్వాలే.. మనమే కీలకం
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే వరంగల్‌లో భారీసభ
- బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్



ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: 'కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అన్ని రంగాల్లోనూ బీజేపీ విఫలం కావడంతోపాటు ఆ పార్టీ నిజ స్వరూపాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు. బీజేపీలో 75 ఏళ్లు దాటినవారు అధికారిక పదవుల నుంచి తప్పుకోవాలంటూ ఆ పార్టీలో ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో బీజేపీ నాయకత్వం అనేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోంది. రాబోయే రోజుల్లో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు మాత్రమే ఏర్పడతాయి. సంకీర్ణ రాజకీయాల్లో మనం కీలకంగా మారుతాం'అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 20 మంది ముఖ్య నేతలతో మంగళవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లపై చర్చించారు. దేశ, రాష్ట్ర రాజకీయ స్థితిగతులపైనా కేసీఆర్ ఈ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్‌కు తగినంత సమయం ఇచ్చాం

'రాష్ట్రంలో అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రజలు వందశాతం ప్రభుత్వ పనితీరుపై పూర్తి అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదిన్నరగా తగినంత సమయం ఇచ్చాం. ప్రభుత్వాన్ని ఎండగట్టి, హామీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భారీ బహిరంగసభ నిర్వహించడమే సరైన మార్గం. అందుకే వరంగల్‌లో జరిగే బహిరంగసభను విజయవంతం చేసేందుకు పార్టీ యంత్రాంగం పూర్తి స్థాయిలో కదలాలి. తెలంగాణ సోయి మనకు ఉన్నా ఏమరుపాటుతనంతోనే ఓటమి పాలయ్యాం. రాజకీయాల్లో గెలుపోటములు సహజమే అయినా, ప్రజలకు చేరువయ్యేందుకు మనం కృషి చేయాలి'అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

రజతోత్సవ సభ కేంద్రంగా దిశానిర్దేశం

వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నియోజకవర్గాల వారీగా జనం, వాహనాల సమీకరణపై పలు సూచనలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి నుంచి రెండు లక్షల మంది జనసమీకరణ లక్ష్యంగా నిర్దేశించినట్టు సమాచారం. బుధవారం నుంచి జిల్లాల వారీగా ముఖ్య నేతలతో బహిరంగసభ సన్నాహాలపై కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో సమీక్షిస్తారు. బుధవారం ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లా నేతల సమావేశం జరుగుతుంది. కేసీఆర్ వరుస సమీక్షల నేపథ్యంలో కేటీఆర్ జిల్లాల వారీగా బహిరంగసభ సన్నాహక సమావేశాలు రద్దయ్యే అవకాశమున్నట్టు తెలిసింది.

బహిరంగసభ తర్వాతే సంస్థాగత నిర్మాణం


వరంగల్ సభ నిర్వహణ సమన్వయ బాధ్యతలను ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీనేత గ్యాదరి బాలమల్లుకు అప్పగించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు జన సమీకరణపై దృష్టి పెట్టాల్సిందిగా కేసీఆర్ ఆదేశించారు. బహిరంగ సభ ముగిసిన తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు, అన్ని స్థాయిల్లో పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు షెడ్యూలు విడుదల చేస్తామని కేసీఆర్ స్పష్టత ఇచ్చారు.

బాకీ వసూలుకోసం వచ్చి.. భార్య చేయి పట్టుకున్నారని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్యాయత్నం

చందుర్తి (వేములవాడ): బాకీ డబ్బుల వివాదంలో తన భార్య చేయి పట్టుకున్నారని మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. చందుర్తి ఎస్సై అంజయ్య కథనం ప్రకారం.. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన బోదాసు రాజు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివరాత్రి దేవయ్య, దండుగుల నరేశ్ వద్ద ఏడేళ్ల క్రితం రెండు తులాల బంగారాన్ని అప్పుగా తెచ్చుకుని జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. కొన్నాళ్లకు రెండు తులాల బంగారం తిరిగిచ్చాడు. ఒప్పందం ప్రకారం మరో తులం బంగారం బాకీ ఉన్నాడు. ఐదేళ్ల క్రితం రాజు గల్ఫ్ నుంచి స్వగ్రామానికి చేరుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పటినుంచి దేవయ్య, నరేశ్ బంగారం కోసం రాజును వేధిస్తున్నారు. మంగళవారం కూడా వచ్చి తులం బంగారం అడిగారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగింది. 'నీ భార్యను తీసుకెళ్తేనే బంగారం ఇస్తావు..'అంటూ దేవయ్య, నరేశ్.. రాజు భార్య చేయి పట్టుకోవడంతో మనస్తాపానికి గురైన అతడు అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. రాజు భార్య ఫిర్యాదు మేరకు దేవయ్య, నరేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య వివరించారు.


హెచ్‌సీయూ ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపాలి: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేస్తున్న హెచ్‌సీయూ విద్యార్థుల ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. కంచ గచ్చిబౌలి భూములు హైదరాబాద్ యూనివర్సిటీవని విద్యార్థులు అంటుంటే, రాష్ట్ర ప్రభుత్వానివేనని ప్రభుత్వం అంటోందని ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని ఒక ప్రకటనలో కోరారు. యూనివర్సిటీ పక్కనున్న 400 ఎకరాలకు బదులుగా, వర్సిటీకి అంతే మొత్తంలో భూములిచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు చూపిస్తోందని, దీనిపై సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యార్థుల ప్రతినిధి బృందంతో చర్చించి, వారి అభిప్రాయాలను స్వీకరించాలని కూనంనేని సూచించారు. వర్సిటీ విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు.

ఆ 400 ఎకరాల చదును వెంటనే ఆపండి

- కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో మరో పిల్
- వెంటనే విచారణ చేపట్టాలన్న గత పిల్ న్యాయవాది
- నేడు వాదనలు వినేందుకు సిద్ధమన్న హైకోర్టు
- విచారణ చేపట్టనున్న ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ)కి బదిలీ చేసి, చదును చేయడాన్ని వెంటనే ఆపాలని హైకోర్టులో మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ కె.బాబురావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. 'సర్వే నంబర్ 25లోని కంచ గచ్చిబౌలి అడవిలో 30–40 జేసీబీలతో సర్కార్ చెట్లను తొలగిస్తోంది. హింసాత్మక అటవీ నిర్మూలనను ఆపాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు..ప్రభుత్వం ఆ 400 ఎకరాలను చదును చేస్తున్న నేపథ్యంలో అత్యవసర విచారణ చేపట్టాలని తొలి పిల్ దాఖలు చేసిన వటా ఫౌండేషన్ (ఈఎస్‌పీవో) తరఫు న్యాయవాది ఒమర్ ఫారుక్.. ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం ముందు విజ్ఞప్తి చేశారు. మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశారు. అభ్యర్థనను పరిశీలించిన ధర్మాసనం రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై బుధవారం విచారణ చేపడతామని స్పష్టం చేసింది. వాస్తవానికి వటా దాఖలు చేసిన పిల్‌ను ధర్మాసనం ఏప్రిల్ 7కు వాయిదా వేసింది. కానీ, సర్కార్ చెట్లను తొలగించి భూమి చదును చేస్తున్న నేపథ్యంలో ఈ రెండు పిల్‌లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

ఐటీ, ఇతర అవసరాల కోసం ఎకరం రూ.75 కోట్లకు సంస్థలకు కేటాయించేలా కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల అటవీ భూములను టీజీఐఐసీకి సర్కార్ కేటాయించింది. దీనికి సంబంధించి గత ఏడాది జూన్ 26న రెవెన్యూశాఖ జారీ చేసిన జీవో 54ను సవాల్ చేస్తూ వటా ఫౌండేషన్ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం గత నెల 24న విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాదనలు చెప్పాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తుందా? చేస్తే ఎలాంటి ఆదేశాలిస్తుంది? అనేది ఉత్కంఠగా మారింది.

ఓయూలో హెచ్‌సీయూ భూముల సెగ

విద్యార్థి సంఘాల భారీ నిరసన ర్యాలీ




విద్యార్థి నేతల నిరసన ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): హెచ్‌సీయూ భూముల నిరసన సెగ ఓయూకు తాకింది. మంగళవారం హెచ్‌సీయూ భూములను విక్రయించవద్దని, ఓయూలో నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్‌వీ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, పీడీఎస్‌యూ (విజృంభన), పీడీఎస్‌యూ నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్ట్స్ కాలేజీ నుంచి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. గతంలో హైకోర్టు పేరుతో వ్యవసాయ యూనివర్సిటీకి సంబంధించిన 100 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారని, ఇప్పుడు ప్రభుత్వం కజానా నింపుకునేందుకు 400 ఎకరాల భూమిని విక్రయిస్తున్నారని విద్యార్థి నాయకులు ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఉపయోగపడే భూములను లాక్కోవడం సిగ్గుచేటన్నారు. ఓయూలో విద్యార్థుల ఆందోళనలపై విధించిన నిషేధాజ్ఞలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఆర్ పరిహారం పంపిణీ షురూ

- ఉత్తర భాగంలో 1,950 హెక్టార్లకు రూ.5,100 కోట్ల పరిహారం
- రాష్ట్రం వాటా రూ.2,550 కోట్లు.. బడ్జెట్‌లో రూ.1,250 కోట్లు
- కేంద్రం పర్యావరణ అనుమతులివ్వటంతో పరిహారం ప్రక్రియ ప్రారంభం
- 'కాలా'ల వారీగా అవార్డుల పాస్ మొదలు
- వేగంగా పరిహారం పంపిణీ, భూముల మ్యుటేషన్‌కు చర్యలు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగం అలైన్‌మెంటులో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు మార్గం సుగమమైంది. ఉత్తర భాగానికి తాజాగా కేంద్ర అటవీ శాఖ పర్యావరణ అనుమతులు జారీ చేయటంతో గ్రామాల వారీగా అవార్డులు పాస్‌చేయటం ప్రారంభించారు. త్వరలో పరిహారం డబ్బులు వారి ఖాతాల్లో జమ చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తర భాగంలో 1,950 హెక్టార్ల మేర భూమిని సేకరిస్తున్నారు. దీనికి సంబంధించి నిర్వాసితులకు రూ.5,100 కోట్లను పరిహారంగా అందించాల్సి ఉంది. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2,550 కోట్లు భరించాల్సి ఉండగా, ఇటీవలి బడ్జెట్‌లో ట్రిపుల్ ఆర్‌కు రూ.1,250 కోట్లు ప్రతిపాదించింది. ఈ మొత్తాన్ని పరిహారం కోసమే వినియోగించనున్నారు. కేంద్ర ప్రభుత్వం వాటాకు సంబంధించిన నిధులు ఎన్‌హెచ్ఏఐ ఖాతాలో జమ అయ్యాయి. ఇప్పుడు భూసేకరణ ప్రాధికార సంస్థ (కాలా)ల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా డబ్బులు ఉమ్మడి ఖాతాలోకి విడుదల కానున్నాయి. అక్కడి నుంచి రైతుల ఖాతాలకు బదిలీ అవుతాయి.

రోడ్ నంబర్ నిబంధన నుంచి మినహాయింపు

కొత్తగా నిర్మించబోయే జాతీయ రహదారులకు రోడ్ నంబర్‌ను కేటాయించిన తర్వాతనే పర్యావరణ అనుమతులు వస్తాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. దీంతో ట్రిపుల్ ఆర్‌కు ఎక్స్‌ప్రెస్ వే నంబర్ కేటాయించటానికి ముందు పర్యావరణ అనుమతులు జారీ చేసేందుకు వీలు కలిగింది. ట్రిపుల్ ఆర్ బడ్జెట్‌కు కేంద్ర ఆర్థిక శాఖ నుంచి అప్రూవల్ రావాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే దానికి నంబర్ కేటాయిస్తారు. ఈ ప్రక్రియ పూర్తవటానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఉత్తరభాగం 162 కి.మీ. నిడివి రోడ్ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచింది. రెండు పర్యాయాలు గడువు కూడా పొడిగించింది. పర్యావరణ అనుమతులు రాకుండా టెండర్లను తెరిచేందుకు వీలుండదు. ఫలితంగా టెండర్ల గడువు పొడిగిస్తూ వెళ్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ముందుగానే పర్యావరణ అనుమతుల జారీకి కేంద్రం ఓకే చెప్పింది.

80% మ్యుటేషన్ అయ్యాకే పనులు..: రోడ్ నిర్మించే సంస్థను ఎంపిక చేసేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. అక్కడి సాంకేతిక సమస్యలు పరిష్కరించుకున్న తర్వాత వాటిని ఓపెన్ చేసి నిర్మాణ సంస్థను ఖరారు చేస్తారు. అప్పటికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావాలంటే, మొత్తం అలైన్‌మెంట్ నిడివిలో 80 శాతం భూమికి సంబంధించిన మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంటుంది. వీలైనంత వేగంగా, ఎలాంటి సాంకేతిక, న్యాయ సంబంధిత చిక్కులు రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరలో మ్యుటేషన్..

భూపరిహారం జారీకి వీలుగా కాలా (భూసేకరణ ప్రాధికార సంస్థ)ల వారీగా అవార్డుల జారీ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. కాలాల పరిధిలోని గ్రామాలవారీగా రైతులు, వారి అధీనంలో ఉన్న భూముల వివరాలను అధికారులు సేకరించారు. ఆయా రైతులను కాలా కార్యాలయానికి పిలిపించి అవార్డులపై సంతకాలు తీసుకుంటున్నారు. రైతు భూమి విస్తీర్ణం, ఆ భూముల్లోని నిర్మాణాలు, విలువైన తోటలు, చెట్లు, ఇతర నిర్మాణాలు, కేంద్ర భూసేకరణ చట్టం ప్రకారం వాటికి చెల్లించే మొత్తం.. తదితర వివరాలను తెలుపుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే వారి ఖాతాల్లో పరిహారం నగదు జమ చేయనున్నారు. మరో నెలన్నరలో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరైనా భూ యజమానులు ఈ పరిహారం మొత్తాన్ని తీసుకునేందుకు ససేమిరా అంటే ఆర్బిట్రేషన్ ప్రకారం మరోసారి పరిశీలించి తుది మొత్తాన్ని ఖరారు చేస్తారు. అప్పటికి కూడా ఆ మొత్తం తక్కువగా ఉందన్న కారణంతో తీసుకునేందుకు నిరాకరించే పక్షంలో కోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఖాతాలో జమ చేస్తారు. ఖాతాల్లో జమ చేసిన తర్వాత భూముల దస్తావేజులను అధికారులు సేకరించి భూమి మ్యుటేషన్ చేయిస్తారు. దీంతో ఆ భూములు ఎన్‌హెచ్ఏఐ అధీనంలోకి వెళ్తాయి.

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి

రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: విలువైన హెచ్‌సీయూ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో నెలకొన్న సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాజ్యసభలో మంగళవారం రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూముల్లో చెరువులతో పాటు అరుదైన వృక్ష సంపద, పెద్ద సంఖ్యలో జింకలు, నెమళ్లు, పక్షులు ఉన్నాయని, ఇది జీవవైవిధ్యానికి నెలవుగా ఉందని వివరించారు. అత్యంత విలువైన ఈ భూముల్ని వేలం వేయొద్దంటూ విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు అభ్యర్థిస్తున్నారని, వీటిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, మనందరిపై ఉందని రవిచంద్ర స్పష్టం చేశారు.

చాక్లెట్ దొంగిలించాడని..

బాలుడిని నిర్బంధించి చిత్రహింసలు పెట్టిన మార్ట్



గాయాలు చూపుతున్న శివ

ఇబ్రహీంపట్నం: చాక్లెట్ దొంగిలించాడనే ఆరోపణతో నాలుగు గంటల పాటు ఓ బాలుడి (హాస్టల్ విద్యార్థి)ని నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో మంగళవారం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం తిప్పలమడుగు గ్రామానికి చెందిన ఆరూరి శివ (14) మంచాల మండలం నోముల గ్రామ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం 2 గంటలకు ఇబ్రహీంపట్నంలోని మెగా మార్ట్‌కు వెళ్లాడు. అక్కడ ఓ చాక్లెట్ దొంగిలించాడన్న కారణంతో యాజమాన్యం శివను నిర్బంధించింది. సెల్లార్‌లోని ఓ రూమ్‌లో బంధించి, నోట్లో ఉప్పు కుక్కి, పైపుతో నలుగురు కొట్టారు. దీంతో తట్టుకోలేని శివ గట్టిగా అరవడంతో స్థానికులు గమనించి డయల్ 100కి కాల్ చేశారు. పోలీసులు రాత్రి 9 గంటలకు ఘటనా స్థలానికి చేరుకొని శివను విడిపించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ముజాయిత్, బషీర్, చింటు, షమీర్, రాకేశ్ దాడికి పాల్పడినట్లు గుర్తించారు. మార్ట్ యాజమాని కుమారుడు ముజాయిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



శరీరాన్ని మంచి ఆరోగ్యంతో ఉంచుకోవటం ఒక కర్తవ్యం. లేకుంటే మనసును దృఢంగా, స్పష్టంగా ఉంచుకోలేం.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 2 ఏప్రిల్ 2025

'విముక్తి' తీరుతెన్నులెలా?!

'అమెరికా విముక్తి దినం'గా ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన రోజు రానేవచ్చింది. ఇన్నాళ్లూ 'అన్యాయమైన సుంకాల'తో 'అధ్వాన్నమైపోయిన' అమెరికాకు ఏప్రిల్ 2 (బుధవారం) నుంచి విముక్తి లభించి, లక్షల కోట్ల డాలర్లు ఆర్జించి పెట్టగల ప్రతి సుంకాల మోత మోగబోతున్నదని దేశ ప్రజలను ఆయన ఊరిస్తున్నారు. విలక్షణమైన ప్రకటనలతో ఏకకాలంలో తన భక్త గణాన్నీ, ప్రత్యర్థులనూ రంజింపజేయటం ట్రంప్ ప్రత్యేకత. అయితే ఆయన విధించబోయే సుంకాల రంగు, రుచి, వాసన ఆ రెండు వర్గాలకూ అంతుబట్టడం మాట అటుంచి... కొమ్ములు తిరిగిన ఆర్థికవేత్తల అవగాహనకే అందటం లేదు. ట్రంప్ చర్య వల్ల ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుందని మాత్రం ఆర్థికవేత్తలు జోస్యం చెబుతున్నారు. ఆడం స్మిత్, డేవిడ్ రికార్డో వంటి 18, 19 శతాబ్దాల నాటి స్వేచ్ఛా మార్కెట్ ఆర్థికవేత్తల ఆలోచనల్నించి బయటికొస్తేనే ట్రంప్ అర్థమవుతారని ఆర్థిక నిపుణులు కొందరి వాదన. ట్రంప్ ఒక మాట మీదవుంటే కాస్తయినా అర్థమయ్యే వారు. కానీ ఆయన రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఒకసారి మిత్ర దేశాలకైనా, వేరే దేశాలకైనా ఒకటే నిబంధన అంటారు. మరోసారి తద్విరుద్ధంగా మిత్ర దేశాలతో చర్చించి పరిష్కరించుకుంటామంటారు. ఆ మాటెలావున్నా తొలిసారి అధ్యక్షుడైనప్పుడు 2018–19 మధ్య ట్రంప్ చైనాపై విధించిన ప్రతి సుంకాల ప్రభావం ద్రవ్యోల్బణంపై పెద్దగా లేదుగనుక, ఇప్పుడూ ఉండకపోవచ్చని కొందరి మాట.

ట్రంప్ ప్రకటించబోయే ప్రతి సుంకాల తీరుతెన్నులెలావుంటాయో ఆయన సన్నిహిత సలహాదారులకు సైతం ఇంతవరకూ తెలియదు. ప్రతి సుంకాలు మధ్యస్థంగా, పరస్పరం చర్చించి పరిష్కరించుకునే విధంగా ఉంటాయని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్ గత నెలలో తెలిపారు. కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలతో విడివిడిగా చర్చించి ఒప్పందానికొస్తామని అన్నారు. మన వంతుగా ఎలాంటి చర్యలుంటాయో ప్రభుత్వం ఇంతవరకూ వెల్లడించలేదు. కానీ భారత్ తరఫున ట్రంప్ ఇప్పటికే ఒకటి రెండు ప్రకటనలు చేశారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించటానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ పక్షం రోజులనాడు చెబితే దానిపై విపక్షాలు పార్లమెంటులో ప్రభుత్వాన్ని నిలదీశాయి. ఇంతవరకూ ఆ విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని, అమెరికాకు చెప్పింది కూడా లేదని ప్రభుత్వం వివరించింది. మంగళవారం మరోసారి ఆయన అదే తరహాలో మాట్లాడారు. భారత్ గణనీయంగా సుంకాలు తగ్గించబోతున్నట్టు 'కొద్దిసేపటి క్రితమే' తనకు సమాచారం అందిందన్నారు. దీనిపై మన ప్రభుత్వం స్పందించలేదు. కానీ యూరప్ నుంచి అమెరికాకు పెను సవాల్ ఎదురుకాబోతున్నదని యూరోపియన్ యూనియన్ (ఈయూ) చేసిన ప్రకటన సూచిస్తోంది. 'అమెరికా ప్రతి సుంకాలు ఏ స్థాయిలోవున్నాయో తెలిసిన వెంటనే ఏం చేయాలన్న అంశంలో పకడ్బందీ ప్రణాళిక సిద్ధమైంద'ని ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయన్ తెలియజేశారు. యూరప్ నుంచి వచ్చే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై 2,800 కోట్ల డాలర్ల మేర సుంకాలు విధించినట్టు గత నెలలో ట్రంప్ ప్రకటించిన వెంటనే, ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే మోటార్ సైకిళ్లు, బోట్లు, మద్యం వగైరాలపై ఈయూ సైతం భారీ సుంకాలు విధించింది. అయితే అదే సమయంలో అమెరికా నుంచి వచ్చే కార్లపై 2.5 శాతం మేర సుంకాలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అమెరికా– ఈయూల మధ్య వార్షిక వాణిజ్యం లక్షన్నర కోట్ల డాలర్లు. యూరప్‌తో సాగుతున్న వాణిజ్యంపై అమెరికాలో 10 లక్షల ఉద్యోగాలు ఆధారపడివున్నాయి.

ఈ 'విముక్తి' సుంకాల రగడ పర్యవసానంగా మనతోపాటు అమెరికా, యూరప్, లండన్, జపాన్, హాంకాంగ్ తదితర ప్రపంచమార్కెట్లన్నీ పల్టీలు కొడుతున్నాయి. అన్నిచోట్లా అమెరికా షేర్లు పతనమవుతున్నాయి. చాలామంది ఈ సుంకాలెలా ఉండబోతున్నాయో తెలిసేవరకూ వేచి చూసే ధోరణిలో ఉండబట్టి కొంత నిలకడ కనబడుతోంది. కానీ ట్రంప్ అన్నంతపనీ చేస్తే ప్రపంచ మార్కెట్లకు బుధవారం శాపగ్రస్త దినం కావడం ఖాయం. సుంకాలు పెంచటంవల్ల అమెరికాకు దిగుమతయ్యే సరుకుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ఏటా అమెరికా 3 లక్షల కోట్ల డాలర్ల సరుకును దిగుమతి చేసుకుంటుంది. సరుకుతో నిమిత్తం లేకుండా అన్నిటిపైనా 20 శాతం అదనంగా సుంకం విధిస్తామని ట్రంప్ చెబుతున్నారు. ఈ లెక్కన ఏటా 60,000 కోట్ల డాలర్ల ఆదాయం లభిస్తుంది. కానీ ఈ భారాన్ని చివరకు దేశ పౌరులే మోయాల్సివుంటుందని, అది భారమవుతుందని ట్రంప్ గ్రహించటం లేదు. ఇప్పటికే జీవనవ్యయం పెరిగి, బ్యాంకుఖాతాలు ఖాళీ అవుతూ, ఉద్యోగాలు కోల్పోయే స్థితి వుండగా, ప్రతి సుంకాలతో ఇది మరింత విషమిస్తుంది. మాంద్యం ముంచుకొస్తుంది.

అమెరికా ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరుస్తానని, ఉద్యోగాల విషయంలో శ్వేతజాతి అమెరికన్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దుతానని ట్రంప్ ఇచ్చిన హామీని నమ్మి జనం ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. కానీ అందుకు విరుద్ధంగా అమలులో ఉన్న అంతర్జాతీయ అమరికను ధ్వంసం చేసే పనిలో ట్రంప్ బిజీగా ఉన్నారు. ఆయన చర్యలు దేశాన్ని 1930నాటి ఆర్థిక మాంద్యం రోజులకు తీసుకెళ్లినా ఆశ్చర్యం లేదని పలువురి మాట. 1930 జూలైలో నాటి అధ్యక్షుడు హెర్బర్ట్ హూవర్ స్మూట్–హాలీ ట్యారిఫ్ చట్టాన్ని తీసుకురావటంతో అమెరికా దిగుమతులు 67 శాతం పడిపోయి ఆ దేశ ఆర్థికవ్యవస్థ కళ్లు తేలేసింది. ఇప్పుడు ట్రంప్ అలాంటి దుస్సాహసానికి దిగబోతున్నారు. పర్యవసానాలెలావుంటాయో చూడటం తప్ప ప్రపంచంలో దీన్ని నివారించగలవారెవరూ లేరు.

అవివేక మార్గంలో అగ్రరాజ్యం

విశ్లేషణ



మనోజ్ జోషీ

1990లలో, న్యూయార్క్‌లోని బ్రాడ్‌వేలో పర్యటిస్తున్న చైనా ప్రతినిధి బృందం గురించి 'న్యూయార్క్ టైమ్స్' ఒక నివేదికను ప్రచురించింది. ఇతిహాసాల రంగస్థల, సంగీత, వినోద ప్రదర్శన క్షేత్రాల కూడలిగా ప్రసిద్ధి చెందిన 'బ్రాడ్‌వే' అభివృద్ధి, నిర్వహణల గురించి అధ్యయనం చేసి షాంఘై లేదా బీజింగ్‌లో సరిగ్గా అటువంటి సాంస్కృతిక బహుళస్థలిని ఎలా వృద్ధి చేయవచ్చో తెలుసుకోవడమే ఆ సందర్శకుల లక్ష్యం. అమెరికా శక్తి... దాని సైన్యంలో మాత్రమే కాదు, దాని శక్తిమంతమైన సంస్కృతిలో కూడా ఉందని చైనీయులు బాగా అర్థం చేసుకున్నారు. ఒక దేశ 'శక్తి'కి ప్రామాణికమైన లక్షణం ఏమిటంటే, ఇతర దేశాలు తనను అనుకరించేలా స్వీయ విధానాలను రూపొందించు కోగలిగిన సామర్థ్యమే. అది సైనిక శక్తి కావచ్చు, ఆర్థికపరమైన దృఢ శక్తి కావచ్చు. సంస్కృతి, విలువలు, భావజాలంతో ఆ దేశం ప్రతిఫలించే సమ్మోహన శక్తి ద్వారా ఆ అనుకరణ మరింత సులభంగా జరుగుతుంది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నాలుగేళ్లపాటు, అమెరికా అణ్వాయుధాలపై గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. అదే సమయంలో యూరప్ పునరుజ్జీవనానికి 'మార్షల్ ప్లాన్'ను ప్రారంభించింది. పైగా తన ప్రపంచ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి నాటో సైనిక కూటమిని సృష్టించింది. అదే మార్షల్ ప్లాన్... ఆర్థిక, ఆరోగ్య, వాణిజ్య రంగాలలో ప్రజోపయోగ వస్తుసేవలను అందుబాటులోకి తెచ్చి ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించటానికి వీలుగా ఐక్యరాజ్యసమితిని, ప్రపంచ బ్యాంకును, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థను, ప్రపంచ ఆరోగ్య సంస్థను, వాణిజ్య సుంకాలపై సాధారణ ఒప్పందాన్ని(గాట్) నెలకొల్పేందుకు కూడా అమెరికాకు తోడ్పడింది.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా సాంస్కృతిక ఆకర్షణ విస్తృతం అవుతున్న కొద్దీ ఈ అంతర్జాతీయ సంస్థలు అమెరికా శక్తికి మరింత బలం చేకూర్చే సాధనాలుగా మారాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు అమెరికా తన ప్రధాన దాతృత్వ సంస్థ అయిన 'యుఎస్ ఎయిడ్'ని మూసివేయడం ద్వారా, ఇప్పటివరకు తన శక్తిని వినియోగించుకుని అభివృద్ధి చేసుకున్న ఆధిపత్యాన్ని తానే దెబ్బతీసుకోబోతున్నట్లు కనిపిస్తోంది. 'యుఎస్ ఎయిడ్' ప్రపంచంలోనే అభివృద్ధి సహాయానికి సంబంధించి అతి పెద్ద దాతృత్వ సంస్థ. ఆ సంస్థ ఏటా అందించే 70 బిలియన్ డాలర్లను ఉక్రెయిన్, జోర్డాన్, పాలస్తీనా వంటి వ్యూహాత్మక ప్రయోజనాలు కలిగిన దేశాలకు, అలాగే తను మానవతా సహాయం అందించిన (సూడాన్, యెమెన్, దక్షిణ సూడాన్, ఆఫ్ఘనిస్తాన్) దేశాలకు అమెరికా పంపిణీ చేసింది.

ఆధిక్యశక్తి (హార్డ్ పవర్) స్థానంలో ఔదార్య శక్తి (సాఫ్ట్ పవర్)ని ప్రయోగించటం అమెరికా స్థిరమైన వ్యూహం. ఈ విధానాన్ని భారత్‌తో సహా ఇతర దేశాలు అనుసరించడానికి ప్రయత్నించాయి. 1950లు, 60లలో ఆరోగ్య, వ్యవసాయ, ఆహార, విద్యారంగాలలో భారత అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో యుఎస్ ఎయిడ్ ముఖ్య పాత్ర పోషించింది. అదే సమయంలో పాక్‌ను ఆయుధీకరించే తన విధానం నుండి ఉత్పన్నమయ్యే భారతీయ అసంతృప్తిని మళ్లించటానికి యుఎస్ ఎయిడ్‌ను అమెరికా తెలివైన మార్గంగా చేసుకుంది.



అమెరికా తన సాఫ్ట్ పవర్‌ను విదేశీ సహాయ నగదు నిధుల ద్వారా మాత్రమే కాక, నాలుగు ప్రధాన అంశాల ద్వారా కూడా ప్రయోగించింది. మొదటిది – వినోదం, మీడియా, పరిశ్రమలు, విద్యా వ్యవస్థ. రెండవది – ప్రజాస్వామ్యం, సమానత్వం, మానవ హక్కుల పట్ల, అలాగే శక్తివంతమైన పౌర సమాజం పట్ల తన నిబద్ధత. మూడవది – ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులు మొదలైనవి. నాల్గవది – తన చురుకైన వినియోగదారీ ఆధారిత ఆర్థిక వ్యవస్థ. వీటన్నిటితో కూడిన 'సాఫ్ట్ పవర్'తో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికా తన హోదాను నిలుపుకొంది.

విద్యార్థులు, పరిశోధకులు, అవకాశాల కోసం చూస్తున్న వ్యాపారవేత్తలు, కళాకారులు, ప్రదర్శకులు; అలాగే చట్టబద్ధమైన లేదా చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా పెద్ద సంఖ్యలో అమెరికాకు తరలివచ్చిన కార్మికులలో అమెరికాకు ఉన్న ఈ 'సాఫ్ట్ పవర్' ఎంతో ఆకర్షణను కలిగించింది. ప్రపంచవ్యాప్తంగా, అమెరికా ఒక గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థగా, సంక్షేమ రాజ్యంగా, సాంకేతిక విజ్ఞానంలో లీడర్‌గా ప్రశంసలు అందుకుంది. తద్వారా అమెరికా సంస్కృతికి, ఫ్యాషన్లకు విస్తృతంగా అనుకరణలు ప్రారంభం అయ్యాయి. ఈ కారణంగా ఇతర అగ్ర రాజ్యాల విధానాలలో లేని పరోపకార ధోరణి అమెరికా విధానాలలో ఉందనే అభిప్రాయం కూడా ఏర్పడింది.

కానీ నేడు ఇవన్నీ తిరగబడుతున్నాయి. ట్రంప్ పాలనలోని 'అమెరికా ఫస్ట్' విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల తీర్పును రద్దు చేయడానికి లేదా కళంకం లేని న్యాయ వ్యవస్థపై దాడి చేయడానికి అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రయత్నం ప్రజాస్వామ్యంలోని ముఖ్యమైన వ్యవస్థలను దుర్బలం చేసింది.

అమెరికాలో విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియాతోపాటు చర్చిలు కూడా నేడు దాడికి గురవుతున్నాయి. ఇవన్నీ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' (మాగా) ఉద్యమం డిమాండ్లకు అనుగుణంగా ఉండాలన్న సంకేతాలను ఆయన పంపుతున్నారు. వైట్ హౌస్ ఆదేశాల ఉల్లంఘనలకు గాను విశ్వవిద్యాలయాలు డబ్బును తిరిగి చెల్లించాలని ట్రంప్ బెదిరించడం అమెరికన్ సంస్కృతిని వర్ణించే మేధాపరమైన స్వేచ్ఛను దెబ్బతీస్తుంది. నిజంగా ఉన్నాయో, లేవో తెలియని గ్రహాంతరవాసుల మాదిరిగా ట్రంప్ పరిపాలన విదేశీయులు, వీసా హోల్డర్లు, పర్యాటకులు, శాశ్వత నివాసితులు లేదా గ్రీన్ కార్డ్ హోల్డర్ల జీవితాన్ని కష్టతరం చేస్తోంది. ఈ చర్యలు అమెరికన్ 'సాఫ్ట్ పవర్' గుండెకాయపైనే దాడి చేస్తాయి.

అమెరికా సాఫ్ట్ పవర్‌ను చూసి ప్రపంచం అసూయ చెందేది. కానీ నేడు, షాంఘై, బీజింగ్‌లు కూడా 'బ్రాడ్‌వే' తరహా సాంస్కృతిక కేంద్రాలను కలిగి ఉన్నాయి. సంస్కృతితో పాటు కన్ఫ్యూషియస్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్కాలర్‌షిప్‌ల ద్వారా చైనీస్ భాషను ప్రోత్సహించడానికి విద్యార్థులను చైనా ఆకర్షిస్తోంది. ఇది సాఫ్ట్ పవర్ మరొక లక్షణం. భారతదేశం సంక్లిష్టమైన విదేశాంగ విధాన సవాళ్లను అధిగమించడానికి సాఫ్ట్, హార్డ్ పవర్ మిశ్రమాన్ని ఉపయోగిస్తోంది. దాంతో భారత్ విదేశీ విద్యార్థులకు ప్రధాన గమ్యస్థానం అయింది.

ఈ హైపర్–రియలిస్ట్ యుగంలో సాఫ్ట్ పవర్ ఏమంత ముఖ్యం కాదని చెప్పడం సులభమే. కానీ వాస్తవం ఏమిటంటే, హార్డ్ పవర్ దానికదిగా... సాఫ్ట్, హార్డ్‌లు కలిసిన 'స్మార్ట్ పవర్' సాధించగల సామర్థ్యాన్ని పొందలేదు. లేకుంటే, చైనా లేదా రష్యా... ప్రపంచంలో అత్యంత వాంఛనీయమైన దేశాలుగా పరిగణన పొందేవి. నిజానికి ధనిక దేశాలకు, లేదా మధ్య ఆదాయ దేశాలకు, అమెరికా ఇష్టమైన ఎంపిక! ఎందుకంటే తమ జీవితాలను మెరుగుపరచుకోవాలని కోరుకునే లక్షలాది వలసదారులకు అమెరికానే అనువుగా ఉంది.

ట్రంప్ అధికారంలో ఉన్నప్పటికీ సినిమాలు, సంగీతం, సాంకేతికత ద్వారా అమెరికా ప్రపంచవ్యాప్తంగా తన ప్రాధాన్యాన్ని నిలుపుకొనే అవకాశం ఉంది. కానీ మిత్రదేశాల విశ్వాసాన్ని తక్కువగా అంచనా వేయడం అగ్రరాజ్యానికే దెబ్బ. అలాగే, అమెరికా విలువలు, లక్ష్యాల పట్ల ప్రపంచానికి ఉన్న అభిప్రాయాన్ని మార్చడం కూడా ఆ దేశానికే నష్టదాయకం. వీటన్నిటి వల్ల 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' విధానం ప్రపంచంలో అమెరికాకు ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది. దాని దీర్ఘకాలిక ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

> ◆ ఆధిక్యశక్తి (హార్డ్ పవర్) స్థానంలో ఔదార్య శక్తి (సాఫ్ట్ పవర్)ను ప్రయోగించటం అమెరికా స్థిరమైన వ్యూహం. ఈ విధానాన్ని భారతదేశంతో సహా ఇతర దేశాలు అనుసరించడానికి ప్రయత్నించాయి. అదే సమయంలో పాకిస్తాన్‌ను ఆయుధీకరించే తన విధానం నుండి ఉత్పన్నమయ్యే భారతీయ అసంతృప్తిని మళ్లించటానికి యుఎస్ ఎయిడ్‌ను అమెరికా ఒక తెలివైన మార్గంగా చేసుకుంది.

> ◆ ప్రపంచవ్యాప్తంగా అమెరికా సాంస్కృతిక ఆకర్షణ విస్తృతం అవుతున్న కొద్దీ యు.ఎన్., ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు అమెరికా శక్తికి మరింత బలం చేకూర్చే సాధనాలుగా మారాయి. అయితే ట్రంప్ ఇప్పుడు 'యుఎస్ ఎయిడ్'ని మూసివేయడం ద్వారా, ఇప్పటివరకు అమెరికా తన సాఫ్ట్ పవర్‌తో అభివృద్ధి చేసుకున్న ఇతర దేశాల విధానాలను తనే దెబ్బతీయబోతున్నట్లు కనిపిస్తోంది.

సోషల్ మీడియా

కనిపించని నేరం



దేశ రాజధానిలోని జైళ్లు తీవ్రమైన రద్దీని ఎదుర్కొంటున్నాయి. ఖైదీల సంఖ్య వాటి అంచనా సామర్థ్యాన్ని మించి రెట్టింపు అయింది. 10 వేల ఖైదీలను ఉంచేందుకు నిర్మించిన జైళ్లలో ప్రస్తుతం 19 వేల మంది ఖైదీలు ఉన్నారు.

– అనూప్ వర్మ, జర్నలిస్ట్

రవాణా పొగ తగ్గాలి



ఇండియాకు కాలుష్యం అతి పెద్ద సవాలుగా పరిణమించింది. ఇందుకు ప్రధాన కారణం రవాణా రంగం. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఆధారపడటం రెండు విధాలుగా చేటు తెస్తోంది. ఇంధన దిగుమతులపై ఏటా 22 లక్షల కోట్ల రూపాయల ఖర్చు అవుతోంది. మరో వైపు పర్యావరణం దెబ్బ తింటోంది. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను కనిష్ఠంగా లేదా అస్సలు ఉత్పత్తి చేయని శక్తి వనరులను (క్లీన్ ఎనర్జీ) ఉపయోగించటం ప్రస్తుతావసరం.

– నితిన్ గడ్కరీ, కేంద్ర రవాణా శాఖ మంత్రి

ప్రశ్నార్థక సామర్థ్యం



పారిశ్రామిక విప్లవానికి నాంది పలికిన దేశం ఇప్పుడు దేశీయంగా ఉక్కును తయారు చేసే సామర్థ్యం లేని మొదటి జీ7 దేశంగా అవతరించబోతోంది! (బ్రిటిష్ స్టీల్ కంపెనీ స్కన్‌థోర్ప్ ప్రాంతంలోని రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను, ఉక్కు తయారీ కార్యకలాపాలను నిలిపివేయాలని యోచిస్తుండటంతో 2,700 సిబ్బంది ఉద్యోగాలు ప్రమాదంలో పడనుండటంపై).

– సదానంద్ ధూమే, వాల్‌స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్

'గ్రోక్' బొట్టు బిళ్ల



ఏఐ తెలివైనదేనా? ఎల్లవేళలా కాకపోవచ్చు. ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ 'గ్రోక్'... భారతీయ యాసల్ని చక్కగా అర్థం చేసుకుంటోంది కానీ, బిందీ (బొట్టు)ని ముఖంపై ఎక్కడ పెట్టాలో తెలియనట్లుంది. బిందీతో నా 'గిబ్లీ' ఇమేజ్‌ని జనరేట్ చేయమని నేను 'గ్రోక్'ని అడిగినప్పుడు బొట్టును నా కనుబొమల మధ్య కాక, వేరెక్కడో పెట్టింది. నవ్వు రావటం లేదా?

– సుజాతా పాండే, మహిళా హక్కుల న్యాయవాది

వక్ఫ్ బిల్లుపై వ్యతిరేకత ఎందుకంటే...

అభిప్రాయం



ముహమ్మద్ షరీఫ్

కేంద్ర ప్రభుత్వం బుధవారం (నేడు) పార్లమెంట్‌లో 'వక్ఫ్ సవరణ బిల్లు'ను ప్రవేశపెడుతోంది. ఈ చర్యను ముస్లింల సంక్షేమ కార్యకలాపాలకు ఇచ్చిన ఆస్తులను కబళించే ప్రణాళికలో భాగంగా ముస్లిం సమాజం భావిస్తోంది. అలాగే ఇది లౌకికస్ఫూర్తి, మత స్వేచ్ఛ, సమానత్వం అనే రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కుతోంది. అందుకే ముస్లిం పర్సనల్ లా బోర్డ్ దీన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతోంది. ముస్లిం సమాజం ఈ బిల్లును వ్యతిరేకించడానికి కారణాలు చాలానే ఉన్నాయి.

వక్ఫ్‌కి ఆదాయం ఎలా తేవాలి? ఆదాయాన్ని ఎలా వినియోగించాలి అనేదానిపై సర్వహక్కులు వక్ఫ్ బోర్డ్‌కి ఉంటాయి. కానీ ఈ సవరణ బిల్లులోని సెక్షన్ 32, సబ్ సెక్షన్ 2 క్లాజ్ (ఇ)ను సవరించడం ద్వారా ఈ ఆదాయ సముపార్జన, వినియోగాలపై వక్ఫ్ బోర్డుకున్న అధికారాలు పరిమితం చేయబడ్డాయి. ఇప్పటికే వక్ఫ్ భూముల్లో 50% అన్యాక్రాంతమయ్యాయి. 'ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ' అనే ప్రభుత్వ సంస్థ ఢిల్లీలోని 30% వక్ఫ్ భూములను ఆక్రమించుకుంది. ఇప్పుడు ప్రతిపాదిత బిల్లు గనక చట్టం అయితే ఉన్న భూములను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. సరైన పత్రాలు లేని భూములు వక్ఫ్ అధీనంలో ఉంటే అది (వక్ఫ్ బై యూజర్) వక్ఫ్ ప్రాపర్టీగానే భావించబడుతుంది. ఇప్పుడు దీన్ని తొలగించనున్నారు. అదే జరిగితే డాక్యుమెంట్స్ లేని వక్ఫ్ ఆస్తులు ఆరునెలల్లోగా రిజిస్టర్ కాకపోతే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

మత నియమాల ప్రకారం ఒకసారి సంక్షేమ కార్యక్రమాలకు దానం చేసిన ఆస్తిని ఇతర కార్యకలాపాలకు వాడకూడదు. ఈ బిల్లుతో దాన్ని తుంగలో తొక్కి పెద్ద స్థాయిలో వక్ఫ్ భూములను కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం ఆక్రమించుకోవచ్చు. లేదా కార్పొరేట్లకు కట్టబెడుతుంది.

అలాగే, సెక్షన్ 104 ఓనర్ షిప్‌కి సంబంధించినది. చట్టం ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ చేయవచ్చు. కానీ కొత్త సవరణ ప్రకారం ముస్లింలే డొనేట్ చేయాలి. దానధర్మాల కోసం ఇచ్చేదానిలో మతాలను చొప్పించడం సరికాదు. మరోవైపు ముస్లింలు మాత్రం ఇతర మత సంస్థలకు డొనేట్ చేయడాన్ని నిషేధించలేదు. ఇది ద్వంద్వ వైఖరి మాత్రమే కాక వక్ఫ్‌ను బలహీనపరిచే చర్య కూడా!

చాలా రాష్ట్రాల్లో హిందువేతరులు కూడా హిందూ దేవాలయాలకు దానం చేయవచ్చు అనే నిబంధన ఉంది. ఇదే నిబంధన వక్ఫ్ విషయంలోఎందుకు



పాటించడం లేదు అనేది కీలకప్రశ్న. గతంలో వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లింలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు తలపెట్టిన సవరణ ద్వారా కౌన్సిల్‌లో ముస్లింల సంఖ్యను సగానికి తగ్గించి, మిగిలిన సగాన్ని ముస్లిమేతరులతో భర్తీ చేస్తుంది. మరి ఎండోమెంట్ బోర్డుల లాంటి వాటిలో ముస్లింలకు స్థానం ఎందుకు కల్పించరు అని ఎవరైనా ప్రశ్నిస్తే ఏం జవాబిస్తారు? సెక్షన్ 9 ప్రకారం వక్ఫ్ కౌన్సిల్‌లోనూ, సెక్షన్ 14 ప్రకారం వక్ఫ్ బోర్డులోనూ ఇద్దరేసి ముస్లిమేతరులు సభ్యులుగా ఉంటారు. ఇది ముస్లింల రాజ్యాంగ హక్కులకు విఘాతమే!

గతంలో వక్ఫ్ సీఈఓ ముస్లిం అయి ఉండాలి అనే నిబంధన ఉంది. ప్రస్తుతం దానిని తొలగించి ముస్లిమేతరులు కూడా సీఈఓ కావచ్చని మార్చబోతున్నారు. ఇది ముస్లింల హక్కులకు గొడ్డలి పెట్టు.

ఇప్పటివరకు వక్ఫ్‌కి డొనేట్ చెయ్యాలంటే ఇస్లామ్ మతావలంబి అయి ఉండాల్సిన అవసరం ఉండేది కాదు. ప్రస్తుత ప్రతిపాదిత సవరణ ద్వారా ఐదేళ్ళుగా ప్రాక్టీసింగ్ ముస్లింగా ఉన్నవారు మాత్రమే డొనేట్ చేయాలనడం దారుణం మాత్రమే కాదు... వక్ఫ్‌ను బలహీన పరచడం! అదే ఎండోమెంట్ వారి విషయానికి వచ్చేటప్పటికి ప్రాక్టీసింగ్ హిందువే దానం చేయాలనే నిబంధన లేదు.

సెక్షన్ 5 ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్‌కు ఉన్న అధికారాలను పరిమితం చేయడం జరిగింది. సెక్షన్ 3ఇ ప్రకారం కలెక్టర్లను వక్ఫ్ భూవివాదాల విచారణ, పరిష్కారాల కోసం నియమించడం సరికాదు. ఎందుకంటే కలెక్టర్ రెవిన్యూ రికార్డ్‌లకు అధిపతి కనుక అతను ప్రభుత్వ పక్షపాతి అవుతాడు. వివాదంలో ఉన్న ఏ వక్ఫ్ ఆస్తినైనా ప్రభుత్వ ఆస్తిగా మార్చేస్తాడు. ఒకసారి వక్ఫ్ అయితే అది ఎప్పటికీ వక్ఫే అన్న మతనియమానికి ఇది విరుద్ధం. అంతే కాక, అధికారుల పక్షపాతంతో, అధికార దుర్వినియోగంతో కొన్ని రోజుల్లోనే మొత్తం వక్ఫ్ ఆస్తులను ముస్లిం సమాజం కోల్పోయే ముప్పుంది.

ఈ బిల్లు ద్వారా వక్ఫ్ భూములకు లిమిటేషన్ చట్టాన్ని వర్తింపచేస్తున్నారు. ఇదే జరిగితే వక్ఫ్ బోర్డులు శాశ్వతంగా ఆక్రమణలో ఉన్న వక్ఫ్ భూములను తిరిగిపొందే హక్కును... అనగా రైట్ ఆఫ్ రికవరీని కోల్పోతాయి. అంటే కోల్పోయిన వక్ఫ్ భూములు ఎప్పటికీ రికవర్ అయ్యే అవకాశం లేదు.

ఈ అన్ని కారణాల రీత్యా ఈ బిల్లును ప్రజాస్వామ్య వాదులందరూ వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో 'రైతు ఉద్యమ' స్ఫూర్తితో ముస్లింలు ఉద్యమబాట పట్టబోతున్నారు. సంయుక్త పార్లమెంటరీ సంఘం చెప్పిన అభ్యంతరాల్ని కాదని ప్రభుత్వం బిల్లు తేవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

వ్యాసకర్త 'జమాఅతె ఇస్లామీ హింద్' ఏపీ రాష్ట్ర కార్యదర్శి । 99483 15926

తప్పులను సరిదిద్దుకోకపోతే సంకటమే!

అభిప్రాయం



డా॥ అంజనేయ గౌడ్

ఎంతో చారిత్రక నేపథ్యంతో పాటు బోధన, పరిశోధనల్లో దేశంలోనే పేరెన్నికగన్నది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ). ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే ఆ యూనివర్సిటీలో అలజడికి కారణమవ్వడం చర్చనీయాంశమయ్యింది. 'ఆరు సూత్రాల పథకం'లో భాగంగా 2,300 ఎకరాల విస్తీర్ణంలో 1974లో ఈ విశ్వవిద్యాలయం ప్రారంభమయ్యింది. ఈ కేంద్ర విశ్వవిద్యాలయం రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల విద్యార్థులకు వైవిధ్యమైన, ఉన్నతమైన విద్యా జీవితాన్ని అందిస్తున్నది. 2015లో ఉత్తమ కేంద్ర విశ్వవిద్యాలయంగా భారత రాష్ట్రపతి 'విజిటర్స్' అవార్డును సహితం పొందింది. 2020లో 'ఇండియా టుడే' ప్రకటించిన ర్యాంకింగ్‌లో దేశంలోని మొత్తం ఉత్తమ ప్రభుత్వ వర్సిటీలలో రెండో స్థానంలో నిలిచింది. అకడమిక్ సంబంధిత అంశాల్లోనే కాకుండా సామాజిక మార్పు దిశగా దేశంలో జరుగుతున్న ప్రతి ప్రయత్నంతోనూ అనుబంధాన్ని కొనసాగిస్తూ, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వామిగా ఉంటూ, విశ్వవిద్యాలయానికి ఉండవలిసిన మానవీయ చలనశీల స్వాభావికతను కూడా హెచ్‌సీయూ కాపాడుకుంటూనే ఉన్నది. విద్యార్థులలో ప్రజల కోసం అమరులైన వీరస్వామి లాంటి వాళ్ళు, వివక్ష సమాజంపై సిరా దండోరా మోగించిన నాగప్పగారి సుందర్ రాజు లాంటి కీర్తిశేషులైన అధ్యాపకులు, అలాగే సమాజంతో మేధాపరమైన సంబంధాన్ని నిత్యం ఉనికి లోనే ఉంచుకొని వృత్తి జీవితాన్ని మరింత చైతన్యవంతంగా కొనసాగించిన రత్నం, హరగోపాల్ వంటి ఎందరో మేధావులకు చిరునామా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.

జాతీయ, అంతర్జాతీయ అంశాలపై లోతైన అధ్యయనాలు, అర్థవంతమైన చర్చలు, ఆరోగ్యవంతమైన భావజాల సంఘర్షణలకు హెచ్‌సీయూ కేంద్రం. 2016లో జరిగిన రోహిత్ వేముల బాధాకర ఉదంతం, సెంట్రల్ వర్సిటీలలో కొనసాగుతున్న అవలక్షణాలను సహితం దేశవ్యాప్తంగా చర్చకు పెట్టి పెద్ద పోరాటానికి దారితీసింది. ఆ సందర్భంలోనే హెచ్‌సీయూ గేట్ ముందు రాహుల్ గాంధీ కూడా ధర్నాలో కూర్చొని విద్యావ్యవస్థలో వివక్షకు వ్యతిరేకంగా, పాలకుల వైఖరిని ఎండగడుతూ ప్రసంగించారు. రెండు సార్లు భిన్న సందర్భాల్లో హెచ్‌సీయూకు



వచ్చిన రాహుల్ గాంధీకి ఈ వర్సిటీతో స్నేహపూర్వక సంబంధమే కాదు... దానిపై సంపూర్ణమైన అవగాహనే ఉండి ఉంటుంది. అలాంటి వర్సిటీలో సొంత పార్టీ రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా, ఉగాది పండుగనాడు ప్రదర్శించిన పోలీస్ జులుం దేశవ్యాప్తంగా చర్చగా మారిన తర్వాత కూడా రాహుల్ కనీసం స్పందించకపోవడం బాధాకరం. విద్యార్థుల ఉద్యమానికి కుట్రకోణం ఆపాదించేందుకు అరెస్ట్ చేసిన ఇద్దరు విద్యార్థులను అసలు వారు వర్సిటీ విద్యార్థులే కాదని పోలీస్ అధికారితో ప్రకటింపజేసి... రిమాండ్ రిపోర్టులో మాత్రం వర్సిటీ విద్యార్థులుగా పేర్కొని ప్రభుత్వం అభాసుపాలైంది.

వివాదానికి కారణంగా చెబుతున్న 400 ఎకరాలు సర్కార్‌వేనని హెచ్‌సీయూ అంగీకరించిందని అబద్ధాలు వల్లించింది రాష్ట్ర సర్కార్. తీరా అసలు రెవెన్యూ సిబ్బంది సర్వేనే నిర్వహించలేదనీ, హద్దులే నిర్ణయించలేదనీ వర్సిటీ రిజిస్ట్రార్ అధికారికంగా ప్రకటించడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అబద్ధం బట్టబయలైపోయింది. అసలు 2004 ఎన్నికలకు ముందు ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం చివరిరోజుల్లో అనుమానాస్పదంగా బిల్లీరావు అనే అతనికి చెందిన 'ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థకు అప్పనంగా 400 ఎకరాల విలువైన ఈ భూమిని కేటాయించడమే అతి పెద్ద రాజకీయ వివాదమైంది. క్రీడల అభివృద్ధి పేరిట జరిగిన భూ పందేరాన్ని 2006లో వైఎస్సార్ ప్రభుత్వం పరిశీలించి, పనులే ప్రారంభించని కారణంగా రద్దు చేసింది. ఆనాటి చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకం వల్ల వైఎస్సార్ సర్కార్ రద్దు చేసినా, సుప్రీం కోర్ట్ దాకా తర్వాతి ప్రభుత్వాలు న్యాయపరమైన భూపోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అనాడు సర్కార్ దిగిపోయే ముందు అన్యాయమైన విధానంలో స్వాధీనం చేసుకొని, పందేరం చేసిన విలువైన వర్సిటీ భూములను తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ స్వాధీనం చేసుకొని, వేలం వేసేందుకు ఉవ్విళ్లూరుతుండటమే విద్యార్థిలోకానికి ఆవేదన కలిగిస్తున్నది. ఎడాపెడా వాగ్దానం చేసిన పథకాల అమలుకు కావలసిన నిధుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయ భూముల వేలానికి దిగజారడం అన్యాయం.

ఇప్పటికైనా హెచ్‌సీయూ విజ్ఞప్తిని సానుకూలంగా అర్థం చేసుకొని, భూములను దానికే అప్పగించాలి. చేసిన తప్పులకు దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే తగిన రాజకీయ మూల్యాన్ని కాంగ్రెస్ పార్టీ చెల్లించుకోవలసి వస్తుంది.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ । 98853 52242

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చవితి ఉ.7.33 వరకు, తదుపరి పంచమి తె.5.25 (తెల్లవారితే గురువారం), **నక్షత్రం:** కృత్తిక ప.1.50 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.4.54 నుండి 6.24 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.34 నుండి 1.06 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.59, **సూర్యాస్తమయం:** 6.09.



అడుగంటిన మత్తడివాగు

మార్చి మొదటివారం నుంచే భానుడు ప్రతాపం చూపడంతో ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో భూగర్భ జలమట్టం గతంలో ఎన్నడూలేని విధంగా పది మీటర్ల లోతుకు పడిపోయింది. తాంసి, తలమడుగు మండలాల్లోని పలు గ్రామాలకు తాగునీటిని అందించే తాంసి మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరింది. ప్రాజెక్టు నీటిమట్టం 0.571 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.111లకు పడిపోయింది. నీరంతా అడుగంటడంతో ప్రాజెక్టు పూర్తిగా నెర్రెలు వారింది. ఏటా ఏప్రిల్ నెలాఖరు, మే మొదటివారంలో అడుగంటాల్సిన ఈ ప్రాజెక్టు ఏప్రిల్ మొదటి వారానికే ఎండిపోవడం జిల్లాలోని భూగర్భజలాలు పడిపోతున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

మాట కలిపి.. మభ్యపెట్టి

హైదరాబాద్ శివార్లలో విదేశీ యువతిపై అత్యాచారం | పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం

- స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు వచ్చిన జర్మనీ యువతి
- మీర్‌పేట్‌లోని స్నేహితుడి ఇంట్లో కొద్దిరోజులుగా నివాసం
- సోమవారం మందమల్లమ్మ చౌరస్తా వద్ద నిందితుడి పరిచయం
- అందమైన ప్రదేశాలు చూపిస్తానని తీసుకెళ్లిన మహ్మద్ అస్లాం
- బాధితురాలి స్నేహితుడికి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు?
- బాధితురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి
- నిందితుడు అస్లాంను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పహాడీషరీఫ్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్ధురాలై స్వయంగా చూసేందుకు వచ్చిన ఓ జర్మన్ యువతిపై ఓ దుర్మార్గుడు నమ్మించి లైంగికదాడికి పాల్పడ్డాడు. గత సోమవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇటలీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన శరత్‌చంద్ర చౌదరికి, అక్కడ బాధితురాలు (22), మిలన్ (22)అనే మరో యువకుడితో స్నేహం ఏర్పడింది. గత నెలలో ఇండియా సందర్శన నిమిత్తం మిలన్‌తో కలిసి బాధితురాలు ఇక్కడికి వచ్చి శరత్ నివాసంలోనే ఉంటున్నారు. రోజూ నగరంలోని పలు ప్రదేశాలను సందర్శిస్తున్నారు. సోమవారం బాధితురాలు, ఆమె స్నేహితుడు కాసేపు బయట తిరిగి వచ్చేందుకు మల్లమ్మ చౌరస్తా వద్దకు వచ్చి నిలబడ్డారు.



ఘటన జరిగిన మామిడిపల్లి గుట్ట ప్రాంతం

మాట కలిపి.. మోసగించి

పాతబస్తీకి చెందిన మహ్మద్ అస్లాం (25) తన ఐదుగురు మైనర్ కుటుంబసభ్యులతో కలిసి కారులో అటుగా వచ్చి సాయంత్రం 6 గంటల సమయంలో బాధితులను చూసి 'హాయ్' అంటూ మాట కలిపాడు. వారు కూడా స్పందించటంతో సిటీ చూపిస్తానని వారిని కారులో ఎక్కించుకుని యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంతాలకు తిప్పాడు. నగర శివార్లలో అందమైన లొకేషన్లు ఉంటాయని నమ్మించి పహాడీషరీఫ్ ప్రాంతానికి తీసుకొచ్చాడు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న మామిడిపల్లి కొండల్లో ఫొటోలు దిగాలని చెప్పి ఐదుగురు మైనర్లతో పాటు మిలన్‌ను అక్కడ దింపేశాడు. బాధితురాలిని కారులోనే కూర్చోమని చెప్పి, ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకొద్దామని కొద్ది దూరం (మిలన్ ఉన్న ప్రాంతానికి 100 మీటర్లు) నిర్మానుష్య ప్రాంతంలోకి కారును తీసుకెళ్లాడు. బాధితురాలిని చంపుతానని బెదిరించి కారులోనే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం తిరిగి మైనర్లను, మిలన్‌ను వదిలి వెళ్లిన ప్రాంతానికి వచ్చాడు. ఊహించని దారుణానికి భయకంపితురాలైన బాధితురాలు కారు ఆగకముందే దూకేసింది. ఆ వెంటనే తన కుటుంబ సభ్యులను కారులో ఎక్కించుకొని అస్లాం అక్కడి నుంచి పారిపోయాడు. అస్లాం పథకం ప్రకారం కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి బాధితులకు తాగించాడని, దీంతో మిలన్ ఆ సమయంలో మైకంలో ఉండి తన స్నేహితురాలిని కారులో ఒంటరిగా తీసుకెళుతున్నా స్పందించలేకపోయాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు అస్లాంపై గతంలోనూ పాత కేసులున్నట్లు సమాచారం.

మామిడిపల్లి గుట్టల్లో సీన్ రీ కన్‌స్ట్రక్షన్..

బాధితురాలు, మిలన్‌తో కలిసి ఆటోలో మీర్‌పేట్‌కు బయల్దేరగా, యువతి ఆందోళనను గమనించిన ఆటోడ్రైవర్ రాత్రి 9 గంటల సమయంలో బాలాపూర్ పోలీస్‌స్టేషన్ బయట వారిని దించి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న బాలాపూర్ పోలీసులు, ఘటన జరిగిన స్థలం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని వివరించి అక్కడికి పంపించారు. బాధితులి ఫిర్యాదు మేరకు అస్లాంపై అత్యాచారం నేరం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు.. మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డితో కలిసి కేసును పర్యవేక్షించి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు.

భారతీయ సంస్కృతి నచ్చి వచ్చి..

బాధితురాలికి భారత సంస్కృతి, సంప్రదాయాలంటే ఎంతో ఇష్టమని శరత్ కుటుంబ సభ్యులు తెలిపారు. శరత్, మిలన్, మరో జర్మన్ స్నేహితుడితో కలిసి ఆమె ఇటలీ యూనివర్సిటీలో సినీ పరిశ్రమకు సంబంధించిన కోర్సు చేశారు. నలుగురూ కలిసి రూపొందించిన ఓ వీడియో షూట్ ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్.రాజమౌళికి తెగ నచ్చేసిందంట. తన సినిమాలో అవకాశం కూడా ఇస్తాని రాజమౌళి వీరికి హామీ ఇచ్చినట్లు శరత్ కుటుంబీకులు చెప్పారు. మీర్‌పేట్‌లోని మిథులానగర్‌లో ఉన్న ఇటీవల హోలీ వేడుకల్లో కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొంది. శుక్రవారం తెల్లవారుజామున వీరు జర్మనీకి తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది.

లైంగికదాడుల కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తాం

- మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండపేటతో పాటు హైదరాబాద్‌లో లైంగిక దాడుల కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని పీఆర్, మహిళా సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. 'లైంగిక దాడి ఘటనలకు మత్తు పదార్థాలూ కారణమని భావిస్తున్నాం. వీటి కట్టడికి ప్రభుత్వం పనిచేస్తోంది. గస్తీ పెంచాలని పోలీస్ శాఖను కోరాం. పోలీసుల సహకారంతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఘటనలు వెలుగులోకి వచ్చిన వెను వెంటనే స్పందించామని, గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశామన్నారు. మంగళవారం ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయల్, హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, సుధీర్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీతో మంత్రి సీతక్క ఫోన్‌లో మాట్లాడారు. కేసు పురోగతి వివరాలు, బాధితుల ఆరోగ్య పరిస్థితులను ఆమెకు అధికారులు వివరించారు. 'బాధితుల బాగోగులను ప్రభుత్వమే చూస్తుంది. లైంగిక దాడి ఘటనలను ఉపేక్షించేది లేదు. నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటాం' అని సీతక్క వెల్లడించారు.

టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ. 21,000

- మా ప్రభుత్వం ఏర్పడే నాటికి కేవలం రూ.12,534 మాత్రమే
- దీంతో 64,582 మంది రైతులకు లబ్ధి: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మంచిరోజులు వచ్చాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ. 21000కు చేరిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే రూ. 8,500 పెరిగిందని పేర్కొన్నారు. తద్వారా 64,582 మంది ఆయిల్‌పామ్ రైతులకు అదనపు లబ్ధి చేకూరనుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పంట మార్పిడి ఆవశ్యకత, వంటనూనెల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును పెద్దఎత్తున చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ కోసం 14 కంపెనీలకు అనుమతులిచ్చామని, ఇప్పటివరకు సుమారు 2.43 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల యాజమాన్యం, అంతర పంటల సాగు కొరకు 45,548 మంది రైతుల ఖాతాలలోకి రూ.72 కోట్లను తమ ప్రభుత్వం జమ చేసిందని, రైతులకు అధిక ధరలను అందించి, సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12,534 ఉండగా, ఈ నెల టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.21,000కు చేరుకుందని వెల్లడించారు.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు



కొందుర్గు పీహెచ్‌సీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

కొందుర్గు: రంగారెడ్డి జిల్లా కొందుర్గు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సోమవారం తొమ్మిది మంది విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. ఎనిమిదో తరగతి డార్మెటరీ హాల్‌లో నిద్రించిన విద్యార్థినుల కాళ్లు, చేతులకు మంగళవారం ఉదయం గిరిన గాయాలు కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రత్యేక అధికారి నిస్సీ షెకీనా గాయపడిన విద్యార్థులను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి పంపించి, వైద్యం చేయించారు. ఇదే సమయంలో పీహెచ్‌సీ విజిట్‌కు వచ్చిన షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి విద్యార్థులతో మాట్లాడారు. ఎలుకలు స్వల్పంగా గాయపర్చడం పెద్ద ప్రమాదమేమీ కాదని, ఆందోళన చెందాల్సిన పనిలేదని బాలికలకు ధైర్యం చెప్పారు. అందరికీ టీటీ ఇంజెక్షన్లు ఇప్పించి పంపించారు. అనంతరం పాఠశాల ప్రత్యేకాధికారి నిస్సీతో మాట్లాడగా ఉగాది పండుగ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు భక్ష్యాలు తేవడంతో ఎలుకలు వచ్చినట్లున్నాయని తెలిపారు. గదులకు ఎక్కడా రంధ్రాలు లేవని, పాఠశాల చుట్టూ చెట్లపొదలు ఉండటం, ప్రహరీ లేకపోవడంతో ఎలుకలు సంచరిస్తున్నాయని తెలిపారు.

పాశవికంగా ప్రవర్తించారు

- వివాహితపై లైంగికదాడి ఘటనలో కీలక ఆధారాల సేకరణ
- వివరాలు వెల్లడించిన మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ



ఘటనా స్థలంలో పోలీసులతో మాట్లాడుతున్న ఐజీ

ఊర్కొండ: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వివాహితపై జరిగిన లైంగికదాడిలో నిందితులు చాలా పాశవికంగా ప్రవర్తించారని మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ చెప్పారు. మంగళవారం అత్యాచార ఘటన జరిగిన ప్రదేశాన్ని నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్‌తో కలిసి పరిశీలించారు. నిందితులను విచారించి పలు వివరాలను సేకరించామని, వాటి ఆధారంగా ఎస్పీ పర్యవేక్షణలో కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లును విచారణ అధికారిగా నియమించామన్నారు. నిందితులు లైంగికదాడికి పాల్పడిన సమయంలో మందుతోపాటు గంజాయి తాగారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులకు కఠినశిక్ష పడేలా త్వరగా విచారించి వారికి శిక్ష ఖరారు చేసేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకు హైకోర్టు నుంచి ప్రత్యేక అనుమతి తీసుకొని విచారణ చేస్తామని ఐజీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ ఘటనపై చాలా సీరియస్‌గా ఉందని, డీజీపీ ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు శిక్షపడేలా విచారణ చేపట్టాలని సూచించారని, పోలీసులు ప్రత్యేకంగా మూడు టీంలను ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు. ఐజీ వెంట కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐలు మాధవరెడ్డి, కృష్ణదేవ ఉన్నారు.

కొలిక్కి చేరని 'క్లింటన్' కేసు!

- 15 ఏళ్ల క్రితం బంజారాహిల్స్‌లో అమెరికన్‌పై అత్యాచారం
- క్లింటన్ ఫౌండేషన్‌లో పనిచేసేందుకు నగరానికి వచ్చిన మహిళ
- పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసినా ఫలితం శూన్యం



సాక్షి, హైదరాబాద్: రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జర్మన్ యువతిపై జరిగిన అఘాయిత్యం రాజధానిలో తీవ్ర కలకలం సృష్టించింది. 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని బంజారాహిల్స్‌లో ఓ విదేశీ యువతిపై అత్యాచారం జరిగింది. అమెరికా నుంచి వచ్చి, బేగంపేటలోని క్లింటన్ ఫౌండేషన్‌లో న్యూట్రీషన్‌గా పనిచేసిన బాధితురాలిపై 2010 జూలై 7న ఓ వ్యక్తి దారుణానికి ఒడిగట్టాడు. అప్పట్లో ఈ కేసు తీవ్ర సంచలనంగా మారడంతో ఏకంగా రాష్ట్ర డీజీపీ రంగంలోకి దిగారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినా నిందితుడిని మాత్రం పట్టుకోలేకపోయారు.

తుపాకీ చూపించి అత్యాచారం...

అమెరికాకు చెందిన సదరు యువతి (అప్పట్లో 25 ఏళ్లు) ఉద్యోగ నిమిత్తం 2009లో నగరానికి వచ్చింది. బంజారాహిల్స్ రోడ్డు నెం. 11లోని ఓ ఇంటి పెంట్‌హౌజ్‌లో ఏడాదిన్నర పాటు నివసించింది. ఎప్పటిలాగే తన విధులు ముగించుకుని 2010 జూలై 6 రాత్రి 8 గంటలకు తన ఇంటికి చేరుకుంది. తలుపులు లోపల నుంచి తాళం వేసుకుని నిద్రించింది. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో దాదాపు 30 ఏళ్ల వయసున్న యువకుడు కిటికీ గ్రిల్ తొలగించి లోపలకు ప్రవేశించాడు. బెడ్‌రూమ్‌లోకి వెళ్లి రివాల్వర్ చూపిస్తూ అరిస్తే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం ఆమెపై అత్యాచారం చేసి పారిపోయాడు. ఉదయం బాధితురాలు నేరుగా ఆస్పత్రికి వెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

తెలిసిన వారిగా ఆధారాలు లభించినా...

ఈ కేసు దర్యాప్తు కోసం నాటి పోలీసు కమిషనర్ ఏకే ఖాన్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఘాతుకం జరిగిన రోజు యువతి అల్మారాలో రూ.5 లక్షలు ఉన్నాయి. ఆమె ఇంట్లోకి ప్రవేశించిన ఆగంతకుడు తొలుత ఆ డబ్బు గురించే అడిగాడు. దీంతో ఆమెకు తెలిసిన వ్యక్తే ఈ పని చేసినట్లు పోలీసులు అనుమానించారు. ఆ అమెరికన్ అప్పట్లో బేగంపేటలోని ఓ జిమ్‌కు వెళ్లేవారు. అక్కడ ఆమెతో సన్నిహితంగా మెలిగే కొందరిని అనుమానించారు. క్లూస్ టీమ్ నిపుణులు ఘటనా స్థలి నుంచి 14 ఆధారాలు సేకరించారు. ఎన్ని రకాలుగా దర్యాప్తు చేసినా... కేసు మాత్రం కొలిక్కిరాలేదు. ఆ యువతి తన స్వదేశానికి వెళ్లిపోతూ 'ఫ్రమ్ పాస్ట్ ఫ్యూ ఇయర్స్ ఐ హావ్ స్వీట్ మెమరీస్ ఇన్ హైదరాబాద్. బట్.. దిస్ ఇన్సిడెంట్ ఈజ్ ఎ బ్యాడ్ మెమరీ ఫర్ మీ' (హైదరాబాద్‌లో కొంతకాలంగా ఎన్నో తీపి జ్ఞాపకాలు భద్రపర్చుకున్నా. ఈ దురదృష్టకర ఘటన చేదు గుర్తుగా మిగిలిపోయింది) అని పోలీసులతో అన్న మాటలు ఇప్పటికీ అధికారులను వెక్కిరిస్తూనే ఉన్నాయి.

'విదేశీ' కేసులపై ప్రత్యేక చట్టం తేవాలి..

విదేశీయులపై జరిగే నేరాలకు సంబంధించిన కేసులు దేశంలో తక్కువగానే నమోదవుతున్నాయి. అత్యాచారం వంటి ఉదంతాలు అరుదు. అనేక కేసుల్లో నిందితులు చిక్కుతున్నా.. ఈ కేసుల్లో శిక్షలు పడే శాతం మాత్రం దారుణంగా ఉంటోంది. బాధితులు తమ దేశాలకు వెళ్లిపోయిన తర్వాత కేసు విచారణను పట్టించుకోకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రతి కేసుకూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు పెట్టడం సాధ్యం కాకపోవడంతో విచారణకు చాలా సమయం పడుతోంది. ఇవన్నీ నేరగాళ్లకు కలిసి వస్తున్నాయి. విదేశీయులపై జరిగే నేరాలకు సంబంధించి ప్రత్యేక చట్టం, కోర్టులు అమలులోకి తీసుకువస్తే ఈ పరిస్థితులు మారే అవకాశం ఉంది. - పి.రామకృష్ణ, మాజీ డీఎస్పీ

బూతులు తిడుతూ.. విద్యార్థినులను కొడుతూ..

- 'సంక్షేమ' బాలికలపై ప్రిన్సిపల్ వేధింపులు
- బాలికలను కొడుతున్న వీడియో వైరల్



విద్యార్థినులను కొడుతున్న ప్రిన్సిపల్

వికారాబాద్: ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక స్కూల్ భవనం పైనుంచి దూకి ప్రాణాపాయం నుంచి బయటపడిన బాలిక ఘటనను మరువకముందే.. ఇదే స్కూల్ ప్రిన్సిపల్ విద్యార్థినులను బూతులు తిడుతూ, కొడుతున్న వీడియో కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా కొత్తగడిలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో నెల రోజుల కిందట ఓ పదో తరగతి విద్యార్థిని స్కూల్ బిల్డింగ్ పైనుంచి కిందికి దూకింది. తీవ్ర గాయాలపాలైన బాలిక కాలు విరగగా ప్రాణాలతో బయటపడింది. ఇందుకు స్కూల్ సిబ్బంది వేధింపులే కారణమని బాధితురాలు తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఘటనను మరువక ముందే.. ముగ్గురు బాలికలను తన చాంబర్‌కు పిలిపించుకున్న ప్రిన్సిపల్ వారిని అసభ్యకరంగా తిడుతూ, ఇష్టానుసారం కొడుతున్న వీడియో వైరల్‌గా మారింది. జుట్టు ఎందుకు విరబోసుకున్నావ్.. యూనిఫామ్ ఎందుకు వేసుకోలేదు.. బయటకు ఎందుకు వెళ్లావ్ అంటూ భయభ్రాంతులకు గురిచేస్తూ దాడి చేస్తున్న దృశ్యాలను చూసి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెన్త్ బాలిక ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని మండిపడుతున్నారు.

జైవీర్‌రెడ్డి కాన్వాయ్‌లో బోల్తాపడిన వాహనం

స్వల్పగాయాలతో బయటపడ్డ సిబ్బంది



దెబ్బతిన్న వాహనం

గుర్రంపోడు: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం చేపూరు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం మధ్యాహ్నం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి కాన్వాయ్‌లోని స్కార్పియో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. గుర్రంపోడు మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పాల్గొని తిరిగి హాలియాకు వెళ్తున్న క్రమంలో చేపూరు క్రాస్ రోడ్డుకు వంద మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. అడ్డువచ్చిన గొర్రెను తప్పించే క్రమంలో రోడ్డు పక్కన కేబుల్ లైన్ గుంతలో వాహనం దిగడంతో అదుపుతప్పి రహదారి దిగువకు దూసుకువెళ్లి పక్కనే గల ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి రెండు పల్టీలు కొట్టింది. అయితే వాహనంలోని బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో డ్రైవర్, గన్‌మెన్, ఫొటోగ్రాఫర్, మరో ఇద్దరు ఎమ్మెల్యే వ్యక్తిగత సిబ్బంది ఉండగా, డ్రైవర్‌తోపాటు, వ్యక్తిగత సిబ్బంది ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి.

ఎగుమతి కోసం ప్రత్యేక వరి సాగు

- నాణ్యమైన విత్తనాలు అభివృద్ధి చేస్తున్న వ్యవసాయ వర్సిటీ
- వాటిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో సాగు చేయించనున్న సర్కారు
- తొలి విడతలో 2.5 లక్షల ఎకరాల్లో ఈ వరి సాగుకు నిర్ణయం
- నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ ఎంపిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగవుతున్న వరికి ఉన్న డిమాండ్‌ను వాణిజ్య పరంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ భూముల్లో పండే వరి ధాన్యానికి విదేశాల్లో ఆదరణ ఉండడంతో ప్రభుత్వమే మరింత నాణ్యమైన వరి పండించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. పిలిప్పీన్స్‌తో ఇప్పటికే బియ్యం ఎగుమతి ఒప్పందాన్ని కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలకు కూడా బియ్యం ఎగుమతి చేయాలని భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఆయా దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపింది. వియత్నాం మన బియ్యం కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది. అయితే తమకు నాణ్యమైన, ప్రమాదకర రసాయనాలు వాడకుండా పండించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పంపాలని కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఎంపికచేసిన ప్రాంతాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి ఎక్స్‌పోర్టు క్వాలిటీతో బియ్యం ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. పిలిప్పీన్స్‌కు పంపిన ఐఆర్–64, ఎంటీయూ 1010 రకాలతో పాటు ఆ దేశ ప్రజలు ఇష్టపడే రీతిలో ఎంపిక చేసిన బియ్యాన్ని ప్రత్యేకంగా పండించి ఎగుమతి చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోనుంది. సోమవారం కాకినాడలో పిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసే కార్యక్రమానికి హాజరైన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య.. మంత్రి ఉత్తమ్, విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఆసక్తి చూపిన వియత్నాం

మనదేశంలో తెలంగాణలో పండించిన ధాన్యం నాణ్యత మిగతా రాష్ట్రాల కన్నా మెరుగ్గా ఉంది. తెలంగాణలో ఉన్న వాతావరణ పరిస్థితులు, సారవంతమైన భూమి, మట్టిలో ఉన్న పోషకాలు వెరసి నాణ్యమైన ధాన్యం పండుతోందని వియత్నాం ప్రతినిధులు తేల్చారు. పిలిప్పీన్స్‌కు పంపుతున్న బియ్యం నాణ్యతలో నంబర్ వన్‌గా ఉంది. వియత్నాం మరింత నాణ్యమైన బియ్యం కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. దీంతో ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ సహకారంతో లక్ష హెక్టార్లలో (2.5 లక్షల ఎకరాలు) నాణ్యమైన వరిని పండించి, ఆ బియ్యాన్ని వియత్నాంతో పాటు ఇండోనేషియా తదితర దేశాలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దక్షిణ తెలంగాణ, నిజామాబాద్‌లో సాగు..

వ్యవసాయ విశ్వ విద్యాలయం ఇచ్చే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసిన జిల్లాల్లో ప్రభుత్వం రైతుల చేత సాగుచేయించనుంది. నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మంతోపాటు ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, మెదక్ జిల్లాలో కలిపి ఖరీఫ్‌లో 2.5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నీటి వనరులున్న సారవంతమైన భూమి ఉన్న గ్రామాలను ఎంపిక చేసి, ఆ గ్రామాల్లోని రైతుల ద్వారా వరిని పండించి ధాన్యాన్ని సేకరించాలని భావిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వియత్నాం, ఇండోనేషియా ప్రజలు ఇష్టపడే నాణ్యత గల వరి వంగడాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. వియత్నాంకు అవసరమైన బియ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వియత్నాంకు చెందిన బియ్యం డీలర్ వివేక్ శర్మ 'సాక్షి'కి తెలిపారు. తెలంగాణ వరికి విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎగుమతి అవకాశాలను సద్వినియోగం చేసుకోనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

మహిళలపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి

మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మహిళలపై దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా భద్రతలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని, ఓటుబ్యాంకు రాజకీయాల కోసం నేరస్తులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నగరంలో జర్మనీ యువతిపై అత్యాచారయత్నం ఘటనను ఖండించారు. మంగళవారం బాధిత మహిళను కార్పొరేటర్ మల్లేశ్, పార్టీ నేత శ్రీరాములు యాదవ్, తదితరులతో కలిసి శిల్పారెడ్డి పరామర్శించారు. పోలీసు అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా నిందితులను అరెస్ట్ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. యువతులపై లైంగికదాడి ఘటనలు పెరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. మహిళా భద్రత కోసం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పనిచేయాలని డిమాండ్ చేశారు.

65 కేసులు.. రూ.3.03 లక్షల విలువైన మందులు స్వాధీనం

అనుమతుల్లేని ఔషధ దుకాణాలు, క్లినిక్‌లపై దాడులు: డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అనుమతుల్లేకుండా మందుల నిల్వ, విక్రయాలు, నాసిరకం మందుల అమ్మకం, అనుమతుల్లేకుండా తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసగిస్తున్న క్లినిక్‌లపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి 31 వరకు ఇలాంటి కేసులు మొత్తం 65 నమోదైనట్టు, రూ.3.03 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్టు డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాధీనమైన డ్రగ్స్‌లో 15 రకాల మందులు నాసిరకమైనవని గుర్తించామన్నారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసగిస్తున్న 50 క్లినిక్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రెండు మెడికల్ షాప్‌లలో డీసీఏ లైసెన్స్‌లేకుండానే మందులు నిల్వ, విక్రయాలు జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. కాలం చెల్లిన మందుల విక్రయం లేదా ఫిజీషియన్ శాంపుల్స్ విక్రయాలకు సంబంధించి మూడు దుకాణాలు గుర్తించినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సోదాల్లో మొత్తం ఏడు చోట్ల నకిలీ క్లినిక్‌లను గుర్తించినట్టు తెలిపారు.



ఊరంతా చేపల కూరే..!

వేసవి వచ్చిందంటే గ్రామాల్లోని చెరువుల్లో నీరు తగ్గుముఖం పడుతుంది. దీంతో స్థానికులు చేపల వేటకు ఉపక్రమిస్తారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కుర్నవల్లి గ్రామంలోని పెద్ద చెరువుకు మంగళవారం ఉదయమే చేరిన జనం జలపుష్పాలు వేటాడటంలో నిమగ్నమయ్యారు. ఊతలు, వలల సాయంతో చేపలు పట్టగా అందరికీ సరిపడా చేపలు దొరకడంతో ఉత్సాహంగా ఇళ్లకు బయల్దేరారు. దీంతో కుర్నవల్లి గ్రామమే కాక చుట్టుపక్కల గ్రామాల్లోని దాదాపు అందరి ఇళ్ల నుంచి మంగళవారం సాయంత్రానికి చేపల కూర వాసన ఘుమఘుమలాడింది. - కరకగూడెం

టారిఫ్‌లకు వేళాయె

అమెరికా 'విముక్తి దినం' వచ్చేసింది

- దేశాలపై సుంకాల బాదుడు నేటినుంచే
- టారిఫ్‌లను ట్రంపే ప్రకటిస్తారు: వైట్‌హౌస్
- భారత్‌పైనా ప్రతీకార సుంకాలని వెల్లడి
- గట్టిగా బదులిచ్చి తీరతాం: యూరప్

న్యూయార్క్/వాషింగ్టన్/రోమ్/టోక్యో: ప్రపంచ వాణిజ్య యుద్ధానికి వేళైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గొప్పగా ప్రకటించుకుంటూ వస్తున్న 'విముక్తి దినం' రానే వచ్చింది. ప్రపంచ దేశాలపై అగ్ర రాజ్యం ప్రతీకార సుంకాల బాదుడు బుధవారం నుంచే మొదలవనుంది. ఈ పరిణామం ప్రపంచ దేశాల్లో కలకలం రేపుతోంది. అమెరికాతో పాటు చాలా దేశాల్లో స్టాక్‌మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. భారత్‌కు కూడా భారీ వడ్డింపులు తప్పవని వైట్‌హౌస్ తాజాగా స్పష్టం చేసింది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ''అమెరికా వ్యవసాయోత్పత్తులు తదితరాలపై భారత్ 100 శాతం సుంకాలు విధిస్తోంది. మా పాడి ఉత్పత్తులపై యూరోపియన్ యూనియన్ దేశాలు 50 శాతం టారిఫ్‌లు వసూలు చేస్తున్నాయి. జపాన్ అయితే మా బియ్యంపై ఏకంగా 700 శాతం టారిఫ్‌లు విధించింది. మా బటర్, చీజ్ తదితరాలపై కెనడా 300 శాతం టారిఫ్‌లు వడ్డిస్తోంది. ఈ దేశాలన్నీ నడ్డి విరిచే టారిఫ్‌లతో అమెరికాను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఆయా దేశాలకు మా ఎగుమతులను అసాధ్యంగా మార్చేశాయి'' అంటూ ఆక్షేపించారు. ''ఇక ప్రతీకారానికి వేళైంది. వాళ్లకు అంతకు అంతా వడ్డించబోతున్నాం. అమెరికా ప్రజల సంక్షేమం దిశగా అధ్యక్షుడు తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయం బుధవారం నుంచే అమల్లోకి రానుంది'' అని పునరుద్ఘాటించారు. ఏయే దేశాలపై ఏ రంగంలో ఎంత సుంకాలు విధించబోయేదీ అధ్యక్షుడే స్వయంగా ప్రకటిస్తారని ఆమె తెలిపారు. ఈ టారిఫ్‌లు ఆరంభం మాత్రమేనని, వాటిని త్వరలో భారీగా పెంచుతామని ట్రంప్ ఇప్పటికే పేర్కొనడం తెలిసిందే. ''అమెరికాపై టారిఫ్‌లను భారత్ భారీగా తగ్గిస్తోంది. చాలా దేశాలు కూడా అదే బాటన నడుస్తున్నాయి'' అని సోమవారం ఆయన మీడియాతో చెప్పుకొచ్చారు.

మా ప్లాన్లు మాకున్నాయి: ఈయూ

అమెరికా టారిఫ్‌లకు బెదిరేది లేదని యూరోపియన్ యూనియన్ స్పష్టం చేసింది. వాటిని ఎదుర్కోవడానికి తమ వద్ద గట్టి ప్రణాళికలున్నాయని ఈయూ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లెయన్ చెప్పారు. మంగళవారం ఆమె ఈయూ పార్లమెంటులో మాట్లాడారు. అమెరికావి తప్పుడు చర్యలని ఆక్షేపించారు. ''మేం మొదలు పెట్టిన యుద్ధం కాదిది. అగ్ర రాజ్యానికి దీటుగా బదులిస్తాం. టారిఫ్‌ల బారినుంచి మా ప్రజలను, ఆర్థిక వ్యవస్థలను అన్నివిధాలా కాపాడుకుని తీరతాం'' అని ప్రకటించారు. ''మేం ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్. ఎలాంటి బేరసారాలకైనా కావాల్సినన్ని శక్తియుక్తులు మాకున్నాయి'' అన్నారు. ''కొన్ని అంశాల్లో అమెరికాకు అన్యాయం జరుగుతోందని ట్రంప్ భావిస్తుంటే, పలు అంశాల్లో మా విషయంలోనూ అదే జరుగుతోందన్నది మా అభిప్రాయం. వీటిపై చర్చలకు మేం సిద్ధమే. ఎందుకంటే టారిఫ్‌ల రగడ అంతిమంగా ప్రజలపైనే భారం వేస్తుంది. వారి జీవన వ్యయం పెరుగుతుంది'' అని చెప్పారు. టారిఫ్ బాదుడు నుంచి జపాన్‌ను మినహాయించాలని ఆ దేశ ప్రధాని షిగెరు ఇషిబా మరోసారి ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే వాషింగ్టన్ వెళ్లి ఆయనతో చర్చించేందుకు కూడా సిద్ధమన్నారు.



న్యూఢిల్లీ: భారత్‌కు అమెరికాయే అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. ఈ నేపథ్యంలో టారిఫ్‌ల పెంపుతో పడే ప్రభావాన్ని కేంద్ర వాణిజ్య శాఖ నిశితంగా గమనిస్తోంది. ఎలాంటి పరిస్థితులనైనా

దేశీయ మార్కెట్ల పరిరక్షణకే
టారిఫ్‌లపై కేంద్రం ప్రకటన

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. వాణిజ్య నియంత్రణ, దేశీయ మార్కెట్ల పరిరక్షణే లక్ష్యంగా భారత్ సుంకాలు విధిస్తుందని స్పష్టం చేసింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు ప్రకటన చేశారు. హెచ్చు టారిఫ్‌లు దేశానికి మేలు చేయడం లేదని, ఆర్థిక వృద్ధి కోసం వాటిని తగ్గించడం తప్పనిసరని నీతి ఆయోగ్ ఇటీవల చేసిన ప్రకటనపై ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు బదులిచ్చారు. ఆర్థిక వృద్ధికి మరింత ఊతమివ్వడం ద్వారా ప్రపంచ మార్కెట్లో భారత్‌ను ప్రబల శక్తిగా తీర్చిదిద్దాలన్నది తమ దీర్ఘకాలిక లక్ష్యమని వెల్లడించారు. ''పలు దేశాలతో టారిఫ్‌ల సమతుల్యత సాధించే దిశగా కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం పలు దేశాలతో ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరాయి'' అని గుర్తు చేశారు. ప్రస్తుతం 13 దేశాలతో భారత్ ఎఫ్‌టీఏలు చేసుకుంది. అమెరికా, ఈయూ, బ్రిటన్, న్యూజిలాండ్, ఒమన్, పెరు వంటి దేశాలతో ఎఫ్‌టీఏపై చర్చలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి!

అమెరికా వస్తువులు, ఉత్పత్తులపై భారత్ ప్రస్తుతం సగటున 18 శాతం టారిఫ్‌లు వసూలు చేస్తోంది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా టారిఫ్‌లు సగటున 2.8 శాతం మాత్రమే. భారత వ్యవసాయ ఎగుమతులపై అమెరికా 5.3 శాతం సుంకాలు విధిస్తోంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న వ్యవసాయోత్పత్తులపై మాత్రం భారత్ 37.7 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. ఇరు దేశాల మధ్య దాదాపు 30 రంగాల్లో వాణిజ్య లావాదేవీలు జరుగుతున్నాయి. దాదాపుగా ప్రతి రంగంలోనూ భారతే అమెరికాపై హెచ్చు సుంకాలు విధిస్తోంది. దాంతో ఇరు దేశాల మధ్య టారిఫ్‌ల అంతరం ఆటోమొబైల్స్ రంగంలో 23.1 శాతం, వజ్రాలు, బంగారం, ఆభరణాల్లో 13.3, కెమికల్, ఫార్మా రంగంలో 8.6, ఎలక్ట్రానిక్స్‌పై 7.2, ప్లాస్టిక్స్‌పై 5.6, కంప్యూటర్లు, యంత్రాలపై 5.3, ఇనుము, స్టీల్‌పై 2.5, టెక్స్‌టైల్స్, క్లాతింగ్‌లో 1.4 శాతంగా ఉంది. భారత మొత్తం ఎగుమతుల్లో అమెరికాదే 18 శాతం వాటా. ఆ దేశం నుంచి మాత్రం దిగుమతులు 6.22 శాతమే. ద్వైపాక్షిక వాణిజ్యంలో ఈ 10.73 శాతం లోటుపైనా అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది.

పిడుగుల గుట్టు తెలిసిపోయింది

ముందే గుర్తించడంలో ఇస్రో పురోగతి

బెంగళూరు: నిరంతరం భారత భూభాగాలను పర్యవేక్షించే భూస్థిర ఉపగ్రహాలు అందిస్తున్న అధునాతన సమాచారం సాయంతో దేశంలో పిడుగులను ముందే పసిగట్టడంలో పురోగతి సాధించామని ఇస్రో మంగళవారం ప్రకటించింది. పిడుగులు పడే ఆస్కారమున్న పరిస్థితులను గుర్తించడంలో తమ అనుబంధ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సీ) విజయం సాధించిందని ఇస్రో పేర్కొంది. భూమి నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ తొలుత మొదలయ్యే ట్రోపోస్ఫియర్ పొరలో సంభవించే వాతావరణ దృగ్విషయం కారణంగా పిడుగులు పడతాయి. భూమిని తాకే సూర్యకాంతి పరావర్తనం చెందడం, ఉష్ణోగ్రత, గాలుల ప్రభావం సైతం ఈ పిడుగులు ఏర్పడటంపై ఉంటుంది. సూర్యకిరణాల పరావర్తనం విషయంలో ఔట్‌గోయింగ్ లాంగ్‌వేవ్ రేడియేషన్(ఓఎల్‌ఆర్)కు సంబంధించి ఇన్‌శాట్-3డీ ఉపగ్రహం పంపిన సమాచారం ఆధారంగా పిడుగులు పడే ఆస్కారమున్న ప్రాంతాన్ని కాస్తంత ముందుగా గుర్తించవచ్చని ఇస్రో తెలిపింది. ఓఎల్‌ఆర్ తీవ్రత తగ్గితే పిడుగులు పడే అవకాశాలు ఎక్కువ అవుతాయని ఇస్రో వెల్లడించింది.

నేడు లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు

- ఎనిమిది గంటలపాటు చర్చ చేపట్టాలని బీఏసీ భేటీలో నిర్ణయం
- బిల్లుపై నేడు ఓటింగ్
- రేపు రాజ్యసభలో చర్చ, ఓటింగ్
- బిల్లును ఆమోదింపజేసుకోవాలని పట్టుదలతో ఉన్న కేంద్రం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్ష 'ఇండియా' కూటమి
- బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తామన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

న్యూఢిల్లీ: కీలకమైన వక్ఫ్(సవరణ) బిల్లుపై బుధవారం లోక్‌సభలో చర్చ జరుగనుంది. బిల్లును ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండగా, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ వాదనలు సమర్థంగా వినిపించేందుకు ఇరుపక్షాలూ సిద్ధమయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగిసిన వెంటనే వక్ఫ్(సవరణ బిల్లు)ను లోక్‌సభలో ప్రవేశపెడతానని మైనార్టీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. బిల్లుపై చర్చ అనంతరం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. బిల్లుపై చర్చ కోసం ఉభయ సభల్లో ఎనిమిది గంటల చొప్పున సమయం కేటాయించాలని నిర్ణయించారు. అధికార ఎన్డీయేలోని కొన్ని భాగస్వామ్య పక్షాలు వక్ఫ్(సవరణ) బిల్లులో సవరణలు సూచిస్తున్నాయి. బిల్లును జేపీసీ ఇప్పటికే క్షుణ్నంగా పరిశీలించిందని, సవరణలు అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. బిల్లు కచ్చితంగా ఆమోదం పొందుతుందని సీనియర్ బీజేపీ నేత ఒకరు ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయేలో బీజేపీ తర్వాత పెద్ద పార్టీలైన తెలుగుదేశం, జేడీ(యూ) తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. బుధవారం సభ్యులంతా హాజరుకావాలని ఆదేశించాయి. బిల్లుకు మద్దతు పలకాలని ఆ రెండు పార్టీలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇతర పార్టీలు సైతం తమ ఎంపీలకు విప్‌లు జారీ చేశాయి. వక్ఫ్ (సవరణ) బిల్లును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదటినుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దేశంలో మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ రాజ్యాంగ వ్యతిరేక బిల్లును అంగీకరించే ప్రసక్తే లేదని ఇప్పటికే పలుమార్లు తేల్చిచెప్పింది. పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లుకు వ్యతిరేకంగా తాము ఓటు వేయనున్నట్లు పార్టీ ఎంపీలు చెబుతున్నారు.



మంగళవారం పార్లమెంట్ హౌస్‌లో ఇండియా కూటమి నేతల భేటీలో రాహుల్, ఖర్గే

బీఏసీ సమావేశం నుంచి విపక్షాల వాకౌట్

వక్ఫ్ (సవరణ) బిల్లు లోక్‌సభ ముందుకు రానున్న నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా అధ్వర్యంలో బీఏసీ సమావేశం జరిగింది. విపక్షాలు సహా వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. బిల్లుపై ఎనిమిది గంటల పాటు చర్చ చేపట్టాలన్న ప్రతిపాదనకు వారు అంగీకరించారు. అయితే, ఈ బిల్లు విషయంలో మోదీ ప్రభుత్వం తమ గొంతును అణచివేస్తోందని ఆరోపిస్తూ బీఏసీ సమావేశం నుంచి విపక్ష నేతలు వాకౌట్ చేశారు. దీన్నిబట్టి చూస్తే బుధవారం లోక్‌సభలో వాడీవేడీగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. బిల్లును ఎలాగైనా అడ్డుకోవాలన్న లక్ష్యంతో విపక్ష 'ఇండియా' కూటమి నేతలు ఉమ్మడి వ్యూహం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. 'ఇండియా' కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రాంగోపాల్ యాదవ్, సుప్రియా సూలే, కల్యాణ్ బెనర్జీ, సంజయ్ సింగ్, టి.ఆర్.బాలు, తిరుచ్చి శివ, కనిమొళి, మనోజ్‌కుమార్ ఝా తదితరులు మంగళవారం సమావేశమయ్యారు. ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను అణచివేయడానికే వక్ఫ్(సవరణ) బిల్లును మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. బిల్లుకు మద్దతు పలుకున్న తెలుగుదేశం, జేడీ(యూ)లకు ప్రజలు కచ్చితంగా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాజ్యాంగవిరుద్ధమైన బిల్లును ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, రాజ్యసభలోనూ బీఏసీ సమావేశం జరిగింది. గురువారం బిల్లుపై ఎనిమిది గంటలపాటు చర్చ చేపట్టాలని నిర్ణయానికొచ్చారు. లోక్‌సభలో బిల్లు సులువుగా నెగ్గే పరిస్థితి కనిపిస్తోంది. సభలో మొత్తం 542 మంది సభ్యులుండగా, అధికార ఎన్డీయేకు 293 మంది ఎంపీల బలం ఉంది. రాజ్యసభలోనూ అంకెలు ఎన్డీయేకే అనుకూలంగా ఉన్నాయి.

ఏమిటీ వివాదం?

వక్ఫ్ బిల్లు. దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల నియంత్రణ, వివాదాల పరిష్కారంలో ప్రభుత్వాలకు అధికారం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లు తీవ్ర వివాదాలకు దారి తీస్తోంది. అందులో ఐదు నిబంధనలను ప్రతిపాదించారు. వాటి ప్రకారం వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు విధిగా స్థానం కల్పించాలి. ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుకు చెందుతుందా, ప్రభుత్వానికి అన్న వివాదం తలెత్తితే దానిపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం నియమించే ఉన్నతాధికారి నిర్ణయమే అంతిమం. ఇలాంటి వివాదాలపై ఇప్పటిదాకా వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పే అంతిమంగా ఉంటూ వస్తోంది. ఇకపై ఆ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారి కూడా ఉండాలని బిల్లులో ప్రతిపాదించారు. అంతేగాక వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులను ఇకపై హైకోర్టులో సవాలు చేయవచ్చు. బిల్లు చట్టంగా మారి అమల్లోకి వచ్చిన ఆర్నెల్లో లోపు దేశంలోని ప్రతి వక్ఫ్ ఆస్తినీ సెంట్రల్ పోర్టల్లో విధిగా నమోదు చేయించాలి. ఏదైనా భూమిని సరైన డాక్యుమెంట్లు లేకున్నా చాలాకాలంగా మతపరమైన అవసరాలకు వాడుతుంటే దాన్ని వక్ఫ్ భూమిగానే భావించాలన్న నిబంధనను తొలగించాలని పేర్కొన్నారు. వీటిని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డుతో పాటు పలు ముస్లిం సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇవి రాజ్యాంగ విరుద్ధమని పలు విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమానవీయం.. చట్టవిరుద్ధం

- ప్రయాగ్‌రాజ్‌లో కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో బుల్డోజర్లతో నివాస గృహాలను కూల్చివేయడం పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ అమానవీయం, చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఆరు వారాల్లోగా రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీని ఆదేశించింది. ప్రయాగ్‌రాజ్‌లో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతీఖ్ అహ్మద్‌కు చెందినదిగా చెబుతున్న భూమిలో నిర్మించిన ఇళ్లను అధికారులు కూల్చివేశారు. ఆ ఇళ్లు తమవేనని, వాటిని కూల్చడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ అడ్వొకేట్ జుల్ఫికర్ హైదర్, ప్రొఫెసర్ అలీ అహ్మద్‌తోపాటు మరికొందరు తొలుత అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వారి పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఆ ఇళ్లను కూల్చివేసిన తీరును చూసి తాము ఆవేదనకు గురయ్యామని పేర్కొంది. చట్టబద్ధమైన పాలన అమలవుతున్న దేశంలో ఇలా అరాచకంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే హఠాత్తుగా కూల్చివేయడం ఏ రకమైన న్యాయమని నిలదీసింది. తగిన ఆశ్రయం పొందే హక్కు పౌరులకు ఉందని, అది మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో అంతర్భాగమేనని ధర్మాసనం వెల్లడించింది. ఆ విషయం అధికారులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని స్పష్టంచేసింది. మళ్లీ ఇళ్లు నిర్మించుకొనే ఆర్థిక స్తోమత పిటిషనర్లకు లేదని, నష్టపరిహారం ఇప్పించాలని వారి తరఫు న్యాయవాది కోరగా, ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. అయితే, పరిహారం ఇవ్వాలన్న ఆదేశాన్ని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వ్యతిరేకించారు. బాధితులకు ప్రత్యామ్నాయంగా ఎక్కడైనా వసతి కల్పిస్తే బాగుంటుందని సూచించగా, ధర్మాసనం తిరస్కరించింది. ఇళ్లు కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి పరిహారం ఇవ్వడం న్యాయమేనని తేల్చిచెప్పింది.

టపాసుల గోదాములో పేలుడు

- 18 మంది దుర్మరణం
- ఐదుగురికి తీవ్ర గాయాలు

పాలన్‌పూర్: గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో ఘోరం చోటుచేసుకుంది. బాణసంచా గోదాములో పేలుళ్లు సంభవించి భారీ మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 18 మంది చనిపోగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీసా పట్టణంలోని పారిశ్రామికవాడలో మంగళవారం ఉదయం 9.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పేలుడు తీవ్రతకు టపాసులు నిల్వ ఉంచిన భవనం పైకప్పు నేలకూలిందని ఎస్పీ అక్షయ్‌రాజ్ మక్వానా చెప్పారు. బాధితులంతా మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలని తెలిపారు. వీరిలో చాలామంది స్లాబ్ కింద పడి నలిగిపోయారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేయనున్నట్లు సీఎం భూపేంద్ర పటేల్ ప్రకటించారు.

ఇరాన్‌పై దాడి చేస్తే దారుణ పరిణామాలు

అమెరికాకు రష్యా హెచ్చరిక

మాస్కో: అణ్వాయుధాల ఒప్పందం కుదుర్చుకోకుంటే బాంబులు వేసేందుకైనా వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించడంపై రష్యా తీవ్రస్థాయిలో మండిపడింది. ఇరాన్ అణు కార్యక్రమ స్థావరాలపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికాను రష్యా హెచ్చరించింది. ఈ మేరకు ఇంటర్నేషనల్ అఫైర్స్ జర్నల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ రెబ్కోవ్ మంగళవారం మాట్లాడారు. ''ఇరాన్‌నుద్దేశిస్తూ అమెరికా చేసే బెదిరింపులు, హెచ్చరికలు అనవసరంగా పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తాయి. ఇలాంటి పద్ధతులు సరైనవి కావు. ఈ విధానాలను మేం ఖండిస్తున్నాం. ఇరాన్‌పై సొంత నిర్ణయాలను రుద్దాలని అమెరికా ప్రయత్నిస్తోంది'' అని అన్నారు. ఉక్రెయిన్ విషయంలో పరోక్షంగా తమతో అమెరికా సంప్రదింపులు జరుపుతున్న నేపథ్యంలో అమెరికాతో తమకున్న ప్రస్తుత దౌత్యబంధానికి బీటలు పడకూడదని రష్యా కోరుకుంటోంది. అందుకే నేరుగా ట్రంప్‌ను దూషించకుండా జాగ్రత్తలు పడుతోంది. జనవరిలో ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అమెరికా, ఇరాన్‌ల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానని రష్యా సూచనప్రాయంగా తెలిపింది, అమెరికా, ఇరాన్‌ల మధ్య సహేతుకమైన చర్చలను మేం అభిలషిస్తున్నాం'' అని సెర్గీ వ్యాఖ్యానించారు.

పాలిటిక్స్ ఫుల్‌టైమ్ కాదు

నేనొక యోగిని మాత్రమే

- పార్టీ ఆదేశాలనుసారమే సీఎంగా సేవలు
- బుల్డోజర్ ఓ 'అవసరం'
- హిందువుల నుంచి క్రమశిక్షణ నేర్చుకోవాలి
- ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్న యోగి



లక్నో: రాజకీయాలు అనేవి తనకు ఫుల్‌టైమ్ ఉద్యోగం కాదని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. మనస్ఫూర్తిగా చెప్పాలంటే తాను కేవలం యోగిని మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు. 'బుల్డోజర్ మోడల్‌ను మా ప్రభుత్వం సాధించిన ఘనతగా చూడటం లేదు. అదొక అవసరం. సమాజహితం కోసం దాన్ని మెరుగైన విధానంలో వాడొచ్చని మేం చూపించాం'' అన్నారు. మంగళవారం పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై యోగి సుదీర్ఘంగా మాట్లాడారు.

అగ్రనేతలతో విభేదాల్లేవు

''బీజేపీ అగ్రనేతలతో నిజంగా విభేదాలే ఉంటే ఇంకా సీఎంగా కొనసాగగలనా? అవన్నీ వదంతులే. నా రాజకీయ జీవితానికి పరిమితి ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు నాకుంది. నన్నే కాదు, దేశం కోసం పరిశ్రమించే ప్రతి ఒక్కరినీ ఆర్‌ఎస్‌ఎస్ ముందుండి ప్రోత్సహిస్తుంది. సరైన పథంలో లేని వాళ్లలోనూ స్ఫూర్తి నింపి సన్మార్గం వైపు నడిపిస్తుంది. బీజేపీ ఆదేశానుసారం యూపీ ప్రజలకు సేవ చేస్తున్నా'' అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో దిగిపోతారని, భావి ప్రధాని అవకాశాలు యోగికే ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ''రాజకీయాలు నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. నేనొక యోగిని మాత్రమే. ఇతర రాష్ట్రాల్లోనూ నాకు పాపులారిటీ పెరగడానికి వేరే కారణం ఉందనుకుంటున్నా. యాత్రల్లో భాగంగా దేశవ్యాప్తంగా భక్తులు యూపీని సందర్శిస్తున్నారు. 2017 తర్వాత యూపీలో స్పష్టంగా కనిపిస్తున్న అభివృద్ధి వల్ల వారలా భావించి ఉంటారు'' అన్నారు.

రాజకీయాలు, మతంపై...

''కొంతమంది మాత్రమే రాజకీయాలు చేయాలని, మతానికి సైతం పరిధులు ఉండాలని భావించినప్పుడే సమస్యలు తలెత్తుతాయి. స్వార్థం కోసం రాజకీయాలను వాడుకుంటే సమస్యలొస్తాయి. అందరి మంచి కోసం రాజకీయాలు చేస్తే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. సమస్యకు, పరిష్కారానికి మధ్య ఎటువైపు నిల్చోవాలనేదే మతం మనకు బోధిస్తుంది'' అని అన్నారు. మీరు రాజకీయనేత అని చెప్పుకోవడానికి ఇష్టపడతారా లేదంటే మతానికి సంబంధించిన ప్రతినిధి అని చెప్పుకోవడానికి ఇష్టపడతారా? అని ప్రశ్నించగా.. 'పౌరుడిగా పనిచేసేందుకు ఇష్టపడతా. పౌరునిగా రాజ్యాంగబద్ధ కర్తవ్యమే నాకు ముఖ్యం. నా వరకు దేశమే అత్యున్నతం. దేశం బాగుంటే నా మతం కూడా బాగుంటుంది. మతం సురక్షితంగా ఉంటే సంక్షేమ మార్గం దానంతట అదే తెరుచుకుంటుంది'' అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ముస్లింలపై...

''రాష్ట్ర అభివృద్ధిలో ముస్లింలకు తగు ప్రాతినిధ్యం లభిస్తుంది. మైనారిటీలు అయినంత మాత్రాన ముస్లింలకు ప్రత్యేక కేటాయింపులు అంటూ ఏమీ ఉండవు. పాదచారులు రోడ్ల పక్కన నడవాలి. అంతేగానీ రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు. రహదారులపై ట్రాఫిక్ అంతరాయం కల్గించడం చట్ట ప్రకారం నేరం. అయినాసరే అలాగే చేస్తామంటే అందుకు తగ్గ పరిణామాలను 'బుల్డోజర్ న్యాయం' రూపంలో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించేవాళ్లు హిందువులను చూసి నేర్చుకోండి. మహాకుంభమేళా వేళ ప్రయాగ్‌రాజ్‌కు 60 కోట్ల మంది హిందువులు వచ్చారు. దొంగతనం, విధ్వంసం, బెదిరింపులు, కిడ్నాప్ ఘటనలు ఒక్కటి కూడా జరగలేదు. దీనినే మత క్రమశిక్షణ అంటారు. దీన్ని హిందువుల నుంచి ఇతరులు కూడా నేర్చుకోవాలి'' అని ముస్లింలనుద్దేశించి యోగి అన్నారు.

ఆలయాల దాతృత్వం, సేవా కార్యక్రమాలపై..

''విద్య, ఆరోగ్యానికి సంబంధించిన అందరికీ సమానంగా ఆలయాలు, మఠాలు దాతృత్వ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆలయాలతో పోలిస్తే అత్యధిక ఆస్తులున్న వక్ఫ్ బోర్డులు ఏనాడైనా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాయా?. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించడం తప్పు'' అని యోగి అన్నారు. ''నూతన నిర్మాణాలు, పాత ఆక్రమణలను తొలగించడంతోపాటు బుల్డోజర్‌ను మా ప్రభుత్వం 'మెరుగైన రీతి'లో వాడింది. మా సద్వినియోగాన్ని సుప్రీంకోర్టు సైతం గతంలో మెచ్చుకుంది'' అని వ్యాఖ్యానించారు.

మాండలే.. మరుభూమి

- నగరమంతటా కుళ్లిన శవాల వాసనే
- మరో భూకంపం, మరింత విధ్వంసం
- 2,700 దాటిన మయన్మార్ మృతులు

మాండలే: మయన్మార్ భూకంపం దేశంలో రెండో అతి పెద్ద నగరమైన మాండలేను మరుభూమిగా మార్చేసింది. నగరంలో మూడొంతులకు పైగా భవనాలు కుప్పకూలాయి. అవన్నీ క్రమంగా శవాల దిబ్బలుగా మారుతున్నాయి. మౌలిక సదుపాయాల లేమితో శిథిలాల వెలికితీత నత్తనడకన సాగుతోంది. వాటికింద వేలాదిమంది చిక్కుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. భూకంపం సంభవించి ఐదు రోజులు కావస్తుండటంతో వారు ప్రాణాలతో ఉండే అవకాశాలు దాదాపుగా సన్నగిల్లుతున్నాయి. కుళ్లుతున్న శవాలతో మాండలే వీధుల్లో ఇప్పటికే భరించలేనంతటి దుర్గంధం వ్యాపించింది. దీనికితోడు మంగళవారం సాయంత్రం కూడా మాండలేను మరో భూకంపం వణికించింది. 5.1 తీవ్రత భూమి కంపించడంతో ఇప్పటికే దెబ్బతిని పగుళ్లిచ్చిన చాలా భవనాలు కుప్పకూలాయి. దాంతో జనం హాహాకారాలు చేస్తూ రోడ్లపైకి పరుగులు తీశారు. రాత్రంతా ఆరుబయటే జాగారం చేస్తూ గడిపారు. దేశవ్యాప్తంగా భూకంప మృతుల సంఖ్య 2,700, క్షతగాత్రుల సంఖ్య 5,000 దాటాయి. వారి స్మృత్యర్థం మంగళవారం మధ్యాహ్నం దేశవ్యాప్తంగా ప్రజలు నిమిషం పాటు మౌనం పాటించారు. మయన్మార్‌లో 10 వేలకు పైగా భవనాలు కూలిపోయినట్టు ఐరాస పేర్కొన్న నేపథ్యంలో మృతుల సంఖ్య అపారంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రతికూల వాతావరణం కూడా సహాయక చర్యలకు పెద్ద ప్రతిబంధకంగా మారుతోంది. మంగళవారం దాకా విపరీతమైన ఎండ కాయగా బుధవారం నుంచి భారీ వర్ష సూచనలు ఆందోళనగా మారాయి.

బ్యాంకాక్‌లో 21 మంది...

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో భూకంపానికి 21 మంది బలైనట్టు ఇప్పటిదాకా తేలింది. కుప్పకూలిన నిర్మాణంలోని 30 అంతస్తుల భవనం వద్ద శిథిలాల తొలగింపు ఇంకా కొనసాగుతోంది. అందులో పని చేస్తున్నవారిలో 78 మంది ఆచూకీ తేలడం లేదని అధికారులు తెలిపారు. దానికింద చిక్కినవారి సంఖ్య 300 దాకా ఉంటుందని అనధికారిక అంచనాలు చెబుతున్నాయి.

పాపం పసివాళ్లు!

మాండలేకు 40 కి.మీ. దూరంలోని క్యాక్సే పట్టణంలో ఓ ప్రీ స్కూల్లో 70 మంది చిన్నారుల్లో అత్యధికులు భూకంపానికి నిస్సహాయంగా బలయ్యారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. జరిగిన దారుణాన్ని తలచుకుంటూ ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పటికీ గుండెలవిసేలా రోదిస్తున్నారు. మాండలే సమీపంలో కుప్పకూలిన ఓ బౌద్ధారామం శిథిలాల నుంచి ఇప్పటిదాకా 50 మందికి పైగా సన్యాసుల మృతదేహాలను వెలికితీశారు. వాటికింద నలిగి కనీసం మరో 150 మంది మరణించి ఉంటారని చెబుతున్నారు.

మృత్యుంజయులు

మయన్మార్ రాజధాని నేపిడాలో భవన శిథిలాల నుంచి ఓ 63 ఏళ్ల వృద్ధురాలు, ఆమె మనవరాలు ఏకంగా 91 గంటల తర్వాత మంగళవారం ప్రాణాలతో బయటపడ్డారు. మరోచోట ఓ ఐదేళ్ల చిన్నారిని, గర్భిణిని కూడా సహాయక బృందాలు కాపాడాయి.

చిలీ అధ్యక్షునితో మోదీ భేటీ

న్యూఢిల్లీ: సమగ్ర ఆర్థిక వాణిజ్య భాగస్వామ్య ఒప్పందంపై భారత్, చిలీ చర్చలు ప్రారంభించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ ఫాంట్ మంగళవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. వ్యాపారం, వాణిజ్యం, రక్షణ, ఖనిజాలు, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో కలిసి పని చేయాలని, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. లాటిన్ అమెరికాలో చిలీ తమకు అత్యంత కీలక భాగస్వామ్య దేశమని మోదీ పేర్కొన్నారు. చిలీతో దశాబ్దాలుగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకుంటామని వెల్లడించారు. బోరిక్ ఫాంట్‌తో భేటీ అనంతరం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భౌగోళికంగా దూరంగా ఉన్నప్పటికీ రెండు దేశాల మధ్య ఎన్నో సారూప్యతలున్నాయని గుర్తుచేశారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, రైల్వేలు, అంతరిక్షం వంటి రంగాల్లో తమ అనుభవాన్ని చిలీలో పంచుకోడానికి సిద్ధంగా ఉన్నామని మోదీ వెల్లడించారు. ఐరాస భద్రతా మండలితోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల విషయంలో ఇండియా, చిలీ ఏకాభిప్రాయంతో ఉన్నాయని తెలిపారు. రెండు దేశాల మధ్య వీసా జారీ ప్రక్రియను సులభతరంగా మార్చుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.





ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోనూ ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ మార్షల్స్‌గా విధులను చేపట్టనున్నారు. ఈ మేరకు ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు వారం రోజులు శిక్షణ ఇచ్చారు. -8లో



వేసవి విహారం..

ఈ వేసవిలో జాతీయ, అంతర్జాతీయ పర్యటనలకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా టూరిజం సంస్థలు ప్యాకేజీలు ప్రకటిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 36.0/22.0

వాతావరణం

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





హెచ్‌సీయూలో ఆందోళనకు దిగిన విద్యార్థులు

పోలీస్..గో బ్యాక్!

విద్యార్థుల నినాదాలతో హోరెత్తిన హెచ్‌సీయూ



హెచ్‌సీయూలో పోలీసుల పహారా

- కొనసాగిన ఆందోళనలు
- ఆ భూములను యూనివర్సిటీకే అప్పగించాలని డిమాండ్

గచ్చిబౌలి/రాయదుర్గం:

'పోలీస్ గో బ్యాక్ ... సీఎం డౌన్ డౌన్' అంటూ విద్యార్థుల నినాదాలతో హెచ్‌సీయూ క్యాంపస్ దద్దరిల్లింది. మంగళవారం కూడా వర్సిటీలో ఆందోళనలు కొనసాగాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ వర్సిటీ భూములను పరిరక్షిస్తామని వారు నినదించారు. పోలీసులను వెంటనే వర్సిటీ నుంచి పంపేయాలని డిమాండ్ చేశారు.

తరగతుల బహిష్కరణ

హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల పిలుపుతో సామూహికంగా తరగతులను బహిష్కరించారు. దీంతో వర్సిటీలో ఎలాంటి తరగతులు జరగలేదు. వ వైవిద్యాన్ని రక్షించాలని, భూములను అప్పగించాలని ప్లకార్డులతో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పోలీసులకు క్యాంపస్‌లో ఏమి పని అని ప్రశ్నించారు. వెంటనే క్యాంపస్ నుంచి వారిని వెళ్లి పోయేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 400 ఎకరాలతో పాటు మొత్తం స్థలాన్ని యూనివర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం మెయిన్ గేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు.

పోలీసు క్యాంపులు ఎందుకు?



హెచ్‌సీయూలో పోలీసుల క్యాంపులు ఎందుకు? అంత అవసరం ఏమొచ్చిందని మేం అడుగుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే బుల్డోజర్లు, పోలీసులను బయటికి పంపించాలి. హెచ్‌సీయూ క్యాంపస్‌కు చెందిన ఇంచు భూమిని కూడా పోగొట్టుకునేది లేదు. ఎంతవరకైనా పోరాడుతాం

– ఉమేష్, హెచ్‌సీయూ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు

వర్సిటీకి సీఎం రావాలి



సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ వర్సిటీని సందర్శించాలి. ఇక్కడి జంతుజాలాన్ని స్వయంగా చూడాలి. విద్యార్థులను గుంట నక్కలని వ్యాఖ్యానించడం తగదు. 400 ఎకరాలను హెచ్‌సీయూకు వెంటనే కేటాయించాలి. మళ్లీ అక్కడ అటవీ ప్రాంతాన్ని పెంచేలా ప్రభుత్వమే చర్యలు చేపట్టే వరకు పోరాటం ఆగదు.

– అనిల్‌కుమార్, ఏబీవీపీ అధ్యక్షుడు, హెచ్‌సీయూ

భూములు తిరిగి ఇవ్వాలి



క్యాంపస్ నుంచి పోలీసులను వెంటనే వెళ్లిపోయేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. క్యాంపస్ భూములను వెంటనే హెచ్‌సీయూకే కేటాయించాలి. అప్పటి వరకు పోరాటం ఆపేది లేదు. జంతువులు, పక్షులు రాత్రి వేళల్లో జేసీబీల చప్పుళ్లకు భయపడిపోయి తరలిపోతున్నాయి.

– పంకజ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు

'పన్ను' పోటు

అభివృద్ధి ఫుల్.. వసూళ్లు డల్!

జీహెచ్ఎంసీలో కొన్ని ప్రాంతాల్లో వింత పరిస్థితి

- మౌలిక వసతులు కల్పిస్తున్నా పన్నుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ఏళ్లుగా బకాయిలు పేరుకుపోయిన వైనం..
- సదుపాయాల కోసం మాత్రం పోటాపోటీ

సాక్షి, సిటీబ్యూరో:

జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తి పన్ను విషయంలో వింత పరిస్థితి నెలకొంటోంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత తక్కువ స్థాయిలో పన్ను వసూలవుతోంది. నగరంలోని అన్ని ప్రాంతాలను సమాన రీతిలో చూస్తూ మౌలిక వసతులు కల్పించడం, అభివృద్ధి పనులు చేపట్టడం చేస్తున్నా ఆస్తి పన్ను మాత్రం అదేరీతిలో వసూలు కావడం లేదు. ఉదాహరణకు పరిశీలిస్తే..

- ఎల్‌బీనగర్ సర్కిల్‌లో తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను డిమాండ్ రూ.120 కోట్లు కాగా, చార్మినార్ సర్కిల్‌లో ఆస్తి పన్ను డిమాండ్ రూ.620 కోట్లు. వాస్తవానికి చార్మినార్ పాతబస్తీ. పెద్ద భవంతుల్లేవు. పెద్దగా వాణిజ్య భవనాల్లేవు. అయినా అక్కడ అంత మొత్తం ఉంటే, ఎన్నో బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య ప్రాంతాలు ఉన్న ఎల్‌బీనగర్ సర్కిల్‌లో అంతకంటే ఎక్కువ ఆస్తిపన్ను డిమాండ్ ఉండాలి..కానీ దాదాపు అందులో ఐదోవంతే ఉంది. కారణం.. చార్మినార్ సర్కిల్‌లో ప్రజలు ఎంతో కాలంగా ఆస్తిపన్ను చెల్లించనందున దానిపై వడ్డీ..అసలు, వడ్డీల బకాయిలు భారీగా పేరుకుపోవడమే.
- అదే ఎల్‌బీనగర్‌లో బకాయిలు తక్కువగా ఉండటంతో ఆ మేరకే వడ్డీల వల్ల డిమాండ్ కూడా తగ్గింది. రెండు సర్కిళ్లు ఇరుగుపొరుగునే ఉన్నాయి. అయినా అదీ పరిస్థితి. అలాంటి పరిస్థితే ఇతరత్రా ప్రాంతాల్లోనూ ఉంది. ఆయా ప్రాంతాల్లో బకాయిలు, వసూలైన ఆస్తిపన్ను.. అది ఎంత శాతమో కింది టేబుల్‌లో గుర్తించవచ్చు.

సర్కిల్	డిమాండ్ (రూ.కోట్లు)	వసూలు (రూ.కోట్లు)	శాతం
చార్మినార్	620	19.34	3
ఎల్‌బీనగర్	120	54.54	45
సికింద్రాబాద్	215	28.43	13
శేరిలింగంపల్లి	448	288.14	64
గోషామహల్	2852	88.36	3
ఖైరతాబాద్	1657	173.65	10

పన్నులు కట్టరే ..

నగరం పరిస్థితి గతంలోలా లేదు. పాతబస్తీ, కొత్త సిటీ అనే తేడా లేకుండా అంతటా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎస్సార్‌డీపీలో జరిగిన ఫ్లై ఓవర్ల పనులను చూసినా, బహదూర్‌పురా, జూపార్క్, ఆరాంఘర్, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంతాల్లో ఎన్నో ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. నల్లగొండ క్రాస్‌రోడ్ నుంచి ఒవైసీ హాస్పిటల్ వైపు ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్నాయి. పలు రహదారుల అభివృద్ధి పనులు జరగనున్నాయి. పాతబస్తీకి వివిధ ప్రాంతాల నుంచి కనెక్టివిటీ పెరిగింది. మెట్రో రెండో దశ వస్తే ఇంకా పెరుగుతుంది. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం పాతబస్తీని 'అసలైన హైదరాబాద్'గా అభివర్ణించడం తెలిసిందే. జీహెచ్ఎంసీలో పాలకమండలి సమావేశాల సందర్భంగానూ, కమిషనర్‌తో భేటీలోనూ కార్పొరేటర్లు ఇతర ప్రాంతాల వారితో పోటీపడుతూ, తమ స్థానిక సమస్యల పరిష్కారం కోసం పట్టుబడుతున్నారు. అదే తరహాలో ప్రజలు సైతం ఆస్తిపన్నుతో పాటు ఇతరత్రా పన్నులు చెల్లిస్తే మరిన్ని సదుపాయాలు కల్పించవచ్చునని టౌన్‌ప్లానింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



అసలు మించిపోయిన వడ్డీలు

నగరంలో కొన్ని భవనాలు వినియోగంలో లేకపోవడం, వాటికి ఏటేటా అసలు, వడ్డీ.. వడ్డీలపై వడ్డీలు పెరిగి బకాయిలు భారీగా పెరిగిపోయినట్లు కనిపిస్తోందని జీహెచ్ఎంసీలోని కొందరు చెబుతున్నారు. కానీ, అలాంటి వాటిని రికార్డుల్లోంచి ఎందుకు తొలగించడం లేదో, ఆస్తిపన్ను డిమాండ్ జాబితాలో ఎందుకు చూపుతున్నారో అంతుపట్టడం లేదు. ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన ఆస్తిపన్నులోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. వీటిని పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రికార్డే.. కానీ !

తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీహెచ్ఎంసీకి అక్షరాలా రూ.2038.42 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. ఇది జీహెచ్ఎంసీ చరిత్రలోనే అత్యధికమని అధికారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నిజమే కానీ, ఇంతకీ ఇది జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆస్తిపన్ను డిమాండ్‌లో దాదాపు 16 శాతమే.ఎలాగంటే.. ఇదీ లెక్క

జీహెచ్ఎంసీలో..

పాత బకాయిలు: రూ.3887 కోట్లు

వాటిపై వడ్డీ : రూ.7070 కోట్లు

- తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం (2024-2)లో డిమాండ్ రూ.2011 కోట్లు
- దానిపై వడ్డీ: రూ.63 కోట్లు

- పాతబకాయిలు, వడ్డీలు అన్నీ లెక్కిస్తే మొత్తం డిమాండ్ :రూ. 13,031 కోట్లు.
- వసూలైన మొత్తం: రూ.2038 కోట్లు.
- ఈలెక్కన వసూలైంది కేవలం 16 శాతమే.

మొత్తం అస్తులు : 19.68 లక్షలు

ఆస్తిపన్ను చెల్లించిన వారు : 14.08 లక్షలు

నేడు మరోసారి సిట్ ముందుకు శ్రవణ్‌రావు

విచారణకు హాజరుకావాలని నోటీసులు

75 అంశాలతో ప్రశ్నావళి..



ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావు

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావును సిట్ మరోసారి విచారించనుంది. ఈ మేరకు బుధవారం సిట్ ముందు విచారణకు హాజరుకావాలని శ్రవణ్‌రావుకు జూబ్లీహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల క్రితం శ్రవణ్‌రావు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకాగా ఆ రోజు 6 గంటలు ప్రశ్నించినా పోలీసులకు సమాధానం లభించలేదు. దీంతో మరోసారి విచారణకు హాజరుకావాలంటూ తాజాగా సోమవారం నోటీసులు జారీ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు తమ ఎదుట హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ సారి సిట్ బృందం ముందస్తుగానే శ్రవణ్‌రావును అడిగే 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించారు. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరికితే దాదాపుగా ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక వ్యక్తుల పాత్ర వెలుగు చూస్తుందని, ఆ మేరకు ముందుగానే ప్రశ్నలు రూపొందించుకున్నారు. ముఖ్యంగా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మాజీ ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావులతో ఉన్న పరిచయాలపై మూడు రోజుల క్రితమే అడిగినా శ్రవణ్‌రావు సరైన సమాధానం చెప్పలేదు. ఈ సారీ ఇదే ప్రశ్నలను లేవనెత్తి సమాధానాలు రాబట్టాలని చూస్తున్నారు. అంతేకాకుండా ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎక్కడి నుంచి తెచ్చారు..మీకు ఎందుకింత ఇంట్రెస్ట్, మిమ్మల్ని ఉసిగొల్పింది ఎవరు, మీ వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరన్న ప్రశ్నలు అడగడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి కూడా సమాధానాలు రాకపోతే మరోసారి విచారణకు పిలవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తానికి శ్రవణ్‌రావును విచారించడం ద్వారా ఇటు మాజీ పోలీస్ బాస్‌లు, అటు ప్రభుత్వంలో కీలక నేతల వివరాలు వెలుగుచూస్తాయి.

నీటి సరఫరాపై ఆన్‌లైన్ మానిటరింగ్

- ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు
- కొండపాక స్టేషన్‌ను పరిశీలించిన ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీటిని అందిస్తున్న గోదావరి తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా కొండపాక పంపింగ్ స్టేషన్‌ను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరానికి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపింగ్‌కు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముర్మూర్ వద్ద ఇన్ లెట్ నుంచి నగరానికి సరఫరా, ట్రాన్స్ మిషన్ తదితర వివరాలకు సంబంధించిన ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్(స్కాడా)ను వంద శాతం వినియోగం కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎల్లంపల్లి నుంచి నగరానికి సరఫరా చేసే ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు చేసి.. ఆ వివరాలు ప్రధాన కార్యాలయంలో పర్యవేక్షించేందుకు మీటరింగ్ వ్యవస్థను కూడా ఆటోమేషన్ చేయాలని అధికారులకు సూచించారు. అత్యవసర సమయంలో పంపులు రిపేర్లు.. కాలిపోయిన సందర్భంలో నీటి సరఫరా ఆటంకం ఏర్పడకుండా స్టాండ్ బై మోటార్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పంపింగ్ స్టేషన్ పరిసరాల్లో గార్డెన్, సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్మిషన్ జీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

రెండు షిఫ్టుల్లో ట్యాంకర్ల సరఫరా

- పెండెన్సీ తగ్గించేందుకు ప్రత్యేక ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో : వాటర్ ట్యాంకర్ల పెండెన్సీ తగ్గించేందుకు రెండు షిఫ్టుల్లో సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. పగటి వేళల్లో గృహ అవసరాలకు, రాత్రి వేళ కమర్షియల్ అవసరాలకు ట్యాంకర్లను డెలివరీ చేయాలని సూచించారు. మంగళవారం టాంకర్ బుకింగ్.. డెలివరీలపై ఆయన జీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వరుస సెలవులు, పండగల సందర్భంగా కొందరు టాంకర్ డ్రైవర్లు సెలవులపై వెళ్లడంతో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ బుకింగ్ పెండెన్సీ పెరిగినట్టు గుర్తించామన్నారు. షేక్‌పేట్, షాపూర్‌నగర్, బుద్వేల్, ఆసిఫ్‌నగర్, ఎన్టీఆర్ నగర్, భవానీ నగర్, చిలకలగూడ, షాపూర్‌నగర్-2, మౌలాలీ, గాజులరామారం, ఎర్రగడ్డ, గచ్చిబౌలి-2, వెంగళరావునగర్, ఎల్లారెడ్డిగూడ, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్ లలో వందకు పైగా ట్యాంకర్ పెండెన్సీ ఉందని తెలిపారు. పెండెన్సీలు క్లియర్ చేసేందుకు రానున్న రెండు రోజులు అదనపు గంటలు పని చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. ట్యాంకర్ డేటాను అనుసరించి ఏయే ఫిల్లింగ్ స్టేషన్ లలో, ఏయే సమయాల్లో బుకింగ్ అవుతున్నాయో అనాలసిస్ చేసుకుంటే పెండెన్సీ తగ్గించుకోవచ్చన్నారు. అవసరమైన ఫిల్లింగ్ స్టేషన్లలో ఫిల్లింగ్ పాయింట్స్ పెంచుకోవచ్చని అందుకు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు.

కొత్త మెట్రో రైళ్లకు నిధుల బ్రేక్!

10 రైళ్లకు రూ.650 కోట్లు అవసరం

వివిధ నగరాల్లో మెట్రో చార్జీలు ఇలా..		
నగరం	కిలోమీటర్లు	చార్జీ (రూపాయలలో)
హైదరాబాద్	26	60
కోల్‌కత్తా	30	50
బెంగళూరు	25	90
ముంబయి	42	80
ఢిల్లీ	32	60

- ప్రయాణికుల రద్దీ మేరకు కొత్త రైళ్లకు గతంలోనే ప్రణాళికలు
- ఇప్పటికే రూ.6500 కోట్ల నష్టాల్లో ఎల్‌అండ్‌టీ మెట్రో
- చార్జీలు పెంచితేనే కొత్త రైళ్లకు మార్గం సుగమమం
- ప్రస్తుతం మూడు కారిడార్లలో 5 లక్షలు దాటిన ప్రయాణికులు



సాక్షి, సిటీబ్యూరో: కొత్త మెట్రో రైళ్లకు నిధుల కొరత బ్రేకులు వేస్తోంది. నగరంలోని వివిధ కారిడార్లలో ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 5 లక్షల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ మేరకు కొత్త రైళ్లను కొనుగోలు చేయాలని రెండేళ్ల క్రితమే హైదరాబాద్ మెట్రోరైల్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పట్లో నాగ్‌పూర్ మెట్రో రైళ్లను లీజుకు తీసుకోవాలని భావించారు. కానీ సాంకేతిక కారణాల వల్ల సాధ్యం కాలేదు. అనంతరం సొంతంగా కొనుగోలు చేసేందుకు సైతం ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ సన్నాహాలు చేసింది. ఈ మేరకు బెంగళూరు కేంద్రంగా మెట్రోరైళ్లను తయారు చేస్తోన్న భారత్ ఎర్త్‌మూవర్స్ లిమిటెడ్ సంస్థతో సంప్రదింపులు కూడా జరిపారు. కానీ పీకల్లోతు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్‌కు ఇప్పుడు నిధుల కొరత అతి పెద్ద సవాల్‌గా మారింది. గత పదేళ్లలో మెట్రో నష్టాలు సుమారు రూ.6500 కోట్లకు చేరుకున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో ప్రతి రోజు ఒకవైపు ప్రయాణికుల అవసరాలకనుగుణంగా రైళ్లను నడుపుతూనే మరోవైపు అదనపు నిధులను కేటాయించి కొత్త రైళ్లను కొనుగోలు చేయడం కొంత కష్టంగానే మారినట్లు అధికారులు చెబుతున్నారు.

ఏటేటా నష్టాలే...

నగరంలో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి వరుసగా నష్టాలు నమోదవుతున్నాయి. రైళ్ల నిర్వహణలో ప్రయాణికుల నుంచి టిక్కెట్ల ద్వారా వచ్చే ఆదాయం ఏ మాత్రం సరిపోవడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ కారిడార్‌లలో ప్రతిరోజు 57 రైళ్లు సుమారు 1050 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి 3 నిమిషాలకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.45 గంటల వరకు మెట్రోలు అందుబాటులో ఉండేవిధంగా వేళలను కూడా పొడిగించారు. రోజుకు 5 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు అదనపు ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయడం, డిజిటల్ సేవల విస్తరణ, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ పెంపు, తదితర సేవలపైన ఎల్‌అండ్‌టీ దృష్టి సారించింది. ప్రస్తుతం 2 కిలోమీటర్ల కనిష్ట దూరానికి రూ.10 నుంచి గరిష్టంగా 26 కిలోమీటర్ల ప్రయాణానికి రూ.60 చొప్పున చార్జీలు అమలవుతున్నాయి. అయినప్పటికీ గత పదేళ్లలో ప్రయాణికుల నుంచి టిక్కెట్‌ల ద్వారా వచ్చే ఆదాయం నష్టాలను ఏ మాత్రం భర్తీ చేయలేదు. పైగా ఏటేటా నష్టాలే నమోదై ఇప్పుడు రూ.6500 కోట్లకు చేరాయి.

చార్జీల పెంపు అనివార్యమా...

ఈ పరిస్థితుల్లో నగరంలో మెట్రోరైళ్ల నిర్వహణకు టిక్కెట్ చార్జీల పెంపు అనివార్యంగా మారినట్లు అధికారవర్గాల అంచనా. '2017 నుంచి ఇప్పటి వరకు చార్జీలు పెంచలేదు. ఇదే సమయం లో ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో ఒకటి, రెండు సార్లు చార్జీలను సవరించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన సదుపాయాలు కల్పించేందుకు చార్జీల పెంపు కొంత ఊరటనివ్వగలదని భావిస్తున్నాం.' అని ఓ అధికారి వివరించారు. ప్రభుత్వం నుంచి సానుకూలత కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్రం నుంచి రావలసిన రూ.200 కోట్లు లభించినా కొంత మేరకు ఊరట కలుగుతుందని పేర్కొన్నారు.

కనీసం 10 రైళ్లు అవసరం...

ప్రస్తుతం నగరంలో 57 రైళ్లు ఉన్నాయి. ఒక్కో ట్రైన్‌కు 3 కోచ్‌లు ఉంటాయి. వెయ్యి ట్రిప్పులకు పైగా తిరుగుతున్నాయి. మరో 10 రైళ్లను అదనంగా కొనుగోలు చేయగలిగితే 30 కోచ్‌లు వినియోగంలోకి వస్తాయి. దాంతో కనీసం రోజుకు 1.5 లక్షల నుంచి 2 లక్షల మందికి అదనంగా ప్రయాణ సదుపాయం కల్పించేందుకు అవకాశం ఉంటుంది. 3 కోచ్‌లు ఉన్న ఒక ట్రైన్‌కు రూ.65 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. తయారీ సంస్థల నుంచి రైళ్లను కొనుగోలు చేయడంతోపాటు నగరానికి తరలించడం కూడా ఎంతో ముఖ్యం. ఈ లెక్కన 10 రైళ్లకు సుమారు రూ.650 కోట్లకు పైగా నిధులు అవసరం. కొత్త రైళ్ల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదా, చార్జీలను పెంచేందుకు అవకాశం ఇవ్వడం పరిష్కారంగా భావిస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదు

'ఎక్స్'వేదికగా మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి ధ్వజం

సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై పెరిగిపోతున్న అత్యాచారాలను అరికట్టడంలో, హత్యలను నిరోధించడంలో ప్రభుత్వం విఫలమైందని 'ఎక్స్' వేదికగా ఆమె మంగళవారం ధ్వజమెత్తారు. తెలంగాణలో విదేశీయులు కూడా దాడులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ ఘటన మరువకముందే మరో మహిళ కామాంధులకు బలికావటం దారుణమన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఒక జర్మనీ యువతిపై అత్యాచారం జరిగితే దిక్కులేదని విమర్శించారు. రాష్ట్ర రాజధానిలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. గత ఏడాది అత్యాచార కేసులు 29 శాతం పెరిగాయని స్వయంగా డీజీపీ ప్రకటించడం రాష్ట్రంలోని భయానక పరిస్థితిని వెల్లడిస్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా అని సబిత ప్రశ్నించారు. చేతగాని పాలన వల్లే రాష్ట్రంలో మహిళలపై హింస పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం కాదు, ముందు వారి ప్రాణాలను కాపాడాలని సీఎం రేవంత్‌కు సూచించారు.

హెచ్‌సీయూ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి

కాచిగూడ: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమి ఆక్రమణను వెంటనే ఆపాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి మద్దతు తెలియజేస్తూ హెచ్‌సీయూ సందర్శనకు దీపక్ రెడ్డి నేతృత్వంలో బయలుదేరిన బీజేపీ నేతలను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీపక్‌రెడ్డితో పాటు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, పార్టీ నేతలు ఎన్.రాంచందర్‌రావు, పండిళ్ల ప్రసాద్, ఎ.యశ్వంత్, నర్సింగ్ రావు, తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

- నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు సీపీఎం పిలుపు
- రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

రాయదుర్గం: హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పోలీసుల, ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపు ఇస్తున్నట్లు తెలిపారు. మంగళవారం హెచ్‌సీయూ వద్ద నిరసనలకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. వేలం ప్రక్రియను వ్యతిరేకిస్తున్న విద్యార్థులపై ప్రభుత్వం దమనకాండకు పాల్పడుతుందని ఆరోపించారు. భవిష్యత్తు తరాల కోసం ఆందోళన చేస్తుంటే వారిపై అక్రమ కేసులు బనాయించి నవీన్ అనే ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిని జైలుకు పంపడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 430 మంది కార్యకర్తలు, నాయకులను అరెస్ట్ చేశారని, క్యాంపస్‌లో క్లాసులు జరిగే పరిస్థితి లేదని, పోలీసులు అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. 144 సెక్షన్ విధించి ఎలాంటి నిరసనలు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. యూనివర్సిటీ భూములను, అడవులను బుల్డోజర్లతో చదును చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 400 ఎకరాల భూమి వేలం ఆపాలని డిమాండ్ చేశారు.

మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించండి..

రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల వినతి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరగనుందన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో అవకాశం కల్పించాలని రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. జాతీయ నేతలను కలిసిన వారిలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఆరుగురు మంత్రులు నియమితులయ్యారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ కీలకమైన జిల్లాల నుంచి మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేదని వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి కలిపి తెలంగాణ జనాభాలో 42 శాతం ఉన్నారని ఈ వినతిలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమకు ప్రాతినిధ్యం లేకపోవడంతో అభివృద్ధి, పాలనాపరమైన సమస్యలను పరిష్కరించడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల సంక్షేమాన్ని ప్రభావితం చేయడమే కాకుండా తెలంగాణ పురోగతిపై, ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ స్థితిపై విస్తృత ప్రభావాలు ఉండొచ్చని చెప్పారు. 2026లో జరగనున్న డీలిమిటేషన్‌తో, హైదరాబాద్, రంగారెడ్డిలో ఎమ్మెల్యేల సీట్ల సంఖ్య 44కి, ఎంపీ సీట్ల సంఖ్య 8కి పెరుగుతుంది.. కావున ఈ జిల్లాల్లో తమ ఉనికిని బలోపేతం చేయడం అవసరమన్నారు. అంతేకాకుండా ఈ ఏడాది చివర్లో జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ జిల్లాల నుంచి మంత్రివర్గ ప్రాతినిధ్యం కాంగ్రెస్ పార్టీ అవకాశాలను బలోపేతం చేస్తుందని, తమ ఎన్నికల పనితీరును మెరుగుపరుస్తుందని సూచించారు.

రోడ్డు పై పడిన సెల్‌ఫోన్ తీసుకుంటుండగా...

కారు ఢీ కొని యువకుడి మృతి



ప్రవీణ్ (ఫైల్)

శామీర్‌పేట్: రోడ్డు పడిన సెల్ ఫోన్ తీసుకుంటుండగా కారు ఢీ కొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సిద్దిపేట్ జిల్లా, మామిడ్యాల గ్రామానికి చెందిన పొట్ట ప్రవీణ్ (23), హైదరాబాద్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై రాజీవ్ రహదారి మీదుగా వెళుతుండగా తుర్కపల్లి గ్రామ సమీపంలో తన జేబులోంచి సెల్‌ఫోన్ రోడ్డుపై పడింది. దీంతో కిందపడిన సెల్‌ఫోన్‌ను తీసుకుంటుండగా అదే సమయంలో నగరం నుంచి వేగంగా వచ్చిన ఎర్టిగా కారు వెనక నుంచి అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జినోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగర వాసి నుంచి రూ.14.63 లక్షల కాజేసిన ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో నిందితుడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ప్రైవేట్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ఎర వేశారు. తాము సూచించినట్లు ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తే కనీసం 20 శాతం లాభాలు ఉంటాయని నమ్మబలికారు. తొలినాళ్లల్లో లాభాలు చూపించినా.. చివరకు బాధితుడి నుంచి రూ.14.63 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌రెడ్డి నేతృత్వంలోని బృందం కొంత మొత్తం యూపీలో ఉన్న బ్యాంకు ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించింది. అక్కడకు వెళ్లిన అధికారులు సదరు అకౌంట్ హోల్డర్ శివశంకర్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు. నోయిడాలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఇతడిపై మరో కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు.

క్యాండిల్ ర్యాలీ భగ్నం

శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం అన్యాయం

చిక్కడపల్లి: సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న దమనకాండకు వ్యతిరేకంగా చనిపోతున్న మూగజీవాలకు సంఘీభావంగా, అమరులైన నిరుద్యోగులకు నివాళిగా నిరుద్యోగ జేఏసీ నేత జనార్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అశోక్‌నగర్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించతలపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న చిక్కడపల్లి, దోమలగూడ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది అశోక్‌నగర్‌లో ముందస్తుగా భారీగా మోహరించారు. జేఏసీ నేత జనార్దన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బందోబస్తు కొనసాగుతోంది. ముందస్తుగా చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి వదలివేశారు. శాంతియుతంగా క్యాండిల్ ర్యాలీ చేస్తామంటే ఇలా పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని ఆయన అన్నారు.

ఆయుధాలు డిపాజిట్ చేయండి: సీపీ

సాక్షి, సిటీబ్యూరో: ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో లైసెన్స్ ఆయుధాలు కలిగిన వారు తమ ఆయుధాలను అప్పగించాలంటూ నగర కొత్వాల్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం ఆయా ఆయుధాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో లేదా అధీకృత డీలర్ వద్ద డిపాజిట్ చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 29 తర్వాత వాటిని తిరిగి తీసుకోవచ్చని ఆనంద్ పేర్కొన్నారు. ఆయుధాలు డిపాజిట్ చేయని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి



మొయినాబాద్: వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 21 గొర్రెలు మృతి చెందగా మరో తొమ్మిది గాయపడ్డాయి. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సురంగల్‌కు చెందిన జవ్వాజి రవియాదవ్ వ్యవసాయంతోపాటు పాడి గేదెలు, గొర్రెలను పెంచుతున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి జీవాలను దొడ్డిలో పెట్టి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో మెలకువ రావడంతో.. దొడ్డి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించాడు. గొర్రెల మంద వద్ద ఉన్న పెంపుడు కుక్కతో పాటు జీవాల అరుపులు వినిపించడంతో పొలం వద్దకు పరుగులు పెట్టాడు. రవి అరుపులు విన్న కుక్కలు అక్కడినుంచి పారిపోయాయి. వీటి దాడిలో చనిపోయిన గొర్రెల విలు రూ.3 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

పాత గొడవల నేపథ్యంలో.. సోదరుడిని బైక్‌తో ఢీకొట్టి..

బంజారాహిల్స్: పాత గొడవల నేపథ్యంలో వరుసకు సోదరుడు అయిన ఓ వ్యక్తిని హోండా బైక్‌తో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీకి చెందిన కారు డ్రైవర్ ఉపేందర్ బస్తీలోని రాయల్ ఫుడ్ కోర్టు సమీపంలో నిలుచుని ఉన్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన అతడి వరుసకు సోదరుడైన నరేష్ బైక్‌తో ఉపేందర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇరువురి మధ్య గతంలో గొడవలు జరిగాయని దానిని మనస్సులో పెట్టుకుని బైక్‌తో ఢీ కొట్టినట్లు బాధితుడు తెలిపాడు. ఉపేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జైళ్ల శాఖకు స్కోచ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: ఢిల్లీలో ఇటీవల జరిగిన స్కోచ్ సంస్థ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ విశేష సేవలు, సంస్కరణలకు గాను అవార్డు సాధించింది. శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా స్కోచ్ సంస్థ చైర్మన్ సమీర్ కొచ్చర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జైళ్ల శాఖ చేపట్టిన ఖైదీల పునరావాసం, ఉద్యోగ కల్పన, కౌన్సెలింగ్, సామాజిక ప్రవేశం తదితర అంశాలను పరిగణిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఐజీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: ప్రేమ విఫలమై మనస్తాపానికి గురైన ఓ యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఉప్పరపల్లి మహేందర్ (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అడ్డగుట్ట సొసైటీలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో హాస్టల్ నిర్వాహకుడు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. ప్రేమలో ఓడిపోవడమే తన మరణానికి కారణమని రాసి ఉన్న లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు అడిగితే చంపేస్తా..

వృద్ధురాలికి బెదిరింపులు

వెంగళరావునగర్: అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలన్నందుకు ఓ వ్యక్తి ఓ వృద్ధురాలిని చంపుతానని బెదిరించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎన్‌కెఎస్ రాజు, నరసమ్మ దంపతులు వెస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉంటున్నారు. 2017లో వారి ఇంటి సమీపంలో నివాసం ఉండే హనుమంతరావు దుస్తుల వ్యాపారం నిమిత్తం వారి నుంచి రూ.14 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే రాజు మృతి చెందాడు. అప్పటి నుంచి నరసమ్మ పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించడం లేదు. ఈ విషయమై నరసమ్మ అతడిని నిలదీయగా ఆమెను దుర్భాషలాడటమేగాక మరోసారి డబ్బులు అడిగేందుకు ఇంటికి వస్తే నిన్ను కూడా మీ ఆయన దగ్గరకు (చంపుతానని) పంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు.

కోర్టు ఏపీపీ రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చైతన్యపురి ఠాణా పరిధిలోని ద్వారకాపురి కాలనీకి చెందిన బాలిక(5) అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతుండేంది. 2023 ఫిబ్రవరి 22న ఆమె తల్లి వారి పక్క ఇంట్లో నివాసం ఉంటున్న కాసర్ల మహేశ్ (19) వద్ద బాలికను వదిలేసి పనికోసం వెళ్లింది. కొద్ది సేపటికి ఇంటికి తిరిగి వచ్చి చూడగా మహేష్ బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు గుర్తించింది. ఈ విషయమై అతడిని నిలదీయగా ఆమెపై దాడి చేశాడు. దీంతో బాధితురాలి తల్లి చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం మంగళవారం నిందితుడికి పై విధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ. 5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

రైలు కిందపడి రైతు ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్న ఓ వ్యక్తి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు లోకో పైలట్ ద్వారా పోలీసులు సమాచారం అందుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌కు చెందిన రైతు కొండాల అశోక్‌గా గుర్తించారు. ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంతో మనస్తాపానికి గురైన సూసైడ్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విదేశీ యువతిపై లైంగికదాడి బాధాకరం

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి



మీర్‌పేట: విదేశీ యువతిపై లైంగికదాడి జరగడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మీర్‌పేట మిథులానగర్‌లోని స్నేహితుడి ఇంట్లో ఉంటున్న జర్మనీకి చెందిన యువతిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తి పెంచుకుని నెల రోజుల క్రితం యువతి దేశానికి వచ్చిందన్నారు. నెల రోజుల పాటు ఎన్నో జ్ఞాపకాలు తనవెంట తీసుకెళ్దామనుకునే లోపే ఇలాంటి చేదు అనుభవం కలిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి గంటకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, తాజాగా నాగర్‌కర్నూలు జిల్లాలో ఆలయానికి వచ్చిన వివాహితపై, ఎంఎంటీఎస్ రైలులో యువతిపై లైంగిక దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాతబస్తీ లాంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, పోలీసులు పెట్రోలింగ్ చేయడం లేదని ఆరోపించారు. విదేశీ యువతి ఘటనలో ఫొటోలు, వీడియో రికార్డింగ్‌ల వంటి ఆధారాలు ఉన్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 22 శాతం నేరాలు పెరిగాయని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు, గృహహింసలు పెరిగిపోతుండడం ఆందోళనకరమన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, గాజుల మధు, భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, రవినాయక్, రాజు, నీలారవినాయక్ తదితరులు ఉన్నారు.

సైబరాబాద్ ట్రాఫిక్‌లోకి ట్రాన్స్‌జెండర్లు


- వారం పాటు ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ
- ఆ తర్వాత ఐటీ హబ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ విధులు

సాక్షి, సిటీబ్యూరో: ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో త్వరలోనే సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోనూ ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ పోలీసు విధులను చేపట్టనున్నారు. వారం రోజుల పాటు శిక్షణ అనంతరం ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ మార్షల్స్‌గా విధులు నిర్వహించనున్నారు. గతేడాది 97 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను ట్రాఫిక్ పోలీసులకు సహాయకులుగా నియమించిన సంగతి తెలిసిందే. వీరిలో ఇప్పటికే చాలా మంది హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నారు. తాజాగా జరీనా, విశాలాక్షి, అనూష, ప్రభాస్, వాసుప్రియ సైబరాబాద్ ట్రాఫిక్ విభాగంలోకి రానున్నారు. శిక్షణ అనంతరం మాదాపూర్, రాయదుర్గం, నార్సింగి పరిసర ప్రాంతాల్లో వీరు ట్రాఫిక్ మార్షల్స్‌గా విధులు నిర్వహిస్తారు. కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వర్తిస్తారు.

కౌన్సెలింగ్ తర్వాతే..

ట్రై కమిషనరేట్లకు చెందిన 45 మంది ట్రాన్స్‌జెండర్లు, ట్రాన్స్‌జెండర్ మహిళా ఉద్యమకారిణి చంద్రముఖి మువ్వలతో సైబరాబాద్ మహిళా భద్రతా విభాగం డీసీపీ సృజన ఇటీవల సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లకు శిక్షణలో సాధారణ ట్రాఫిక్ మానిటరింగ్, ట్రాఫిక్ పోలీసులకు సహకారంతో పాటు మోటారు వాహన చట్టంపై అవగాహన కల్పిస్తారు. రిక్రూట్‌మెంట్ అనంతరం వారి పనితీరును మూడు నెలల పాటు సమీక్షిస్తారు. అప్పటివరకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌లకు సహాయకులుగా ట్రాన్స్‌జెండర్ ట్రాఫిక్ మార్షల్స్ పనిచేస్తారు. ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ మార్షల్స్‌గా కొత్త జీవితాన్ని ఆరంభించడంలో కౌన్సెలింగ్ తప్పనిసరి. వారి గత జీవితాన్ని మర్చిపోయి, సమాజంలో గౌరవప్రదంగా నూతన జీవితాన్ని ప్రారంభించేందుకు వారిని మానసికంగా సిద్ధం చేసేందుకు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌన్సిలింగ్ సెంటర్ నిర్వాహకురాలు పింకీ గత 3-4 నెలలుగా వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఒత్తిడికి గురికాకుండా చూసేందుకు డిపార్ట్‌మెంట్ తరఫున కూడా పలువురు మనస్తత్వవేత్తలతో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రతి ట్రాఫిక్ మార్షల్ నెలవారీ వేతనం రూ.18 వేలుగా ఉంటుంది. వీరి జీతభత్యాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ, ఐటీఈఎస్ సంస్థలు స్పాన్సర్ చేస్తాయి.


మైనర్లతో భిక్షాటన చేయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు తిరుపతి

మేడిపల్లి: మైనర్లతో భిక్షాటన చేయించి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా, ఉప్పర్ పల్లి గ్రామానికి చెందిన తిరుమల తిరుపతి కూలీగా పని చేస్తూ మీర్‌పేట్ టీకేఆర్ కళాశాల నందనవనం ప్రాంతంలో నివాసం ఉంటుంన్నాడు. అతను గత కొంతకాలంగా అదే ప్రాంతంలోని గుడిసెల్లో ఉంటున్న పేద పిల్లలకు రోజుకు రూ.150 చొప్పున ఇచ్చి నగరంలోని వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేయిస్తున్నాడు. మంగళవారం వారు పీర్జాదిగూడ పీఅండ్‌టీ కాలనీలో భిక్షాటన చేస్తున్నట్లు సమాచారం అందడంతో మేడిపల్లి పోలీసులు దాడిచేసి నిర్వాహకుడితో పాటు 9మంది మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారులను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



తపన్‌కుమార్ బెహరా(ఫైల్)

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన తపన్‌కుమార్ బెహరా సీఎంసీ కంపెనీలో టెక్నికల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ బాలానగర్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బైక్‌పై(టీఎస్ 08హెచ్‌బీ9004) వెళ్తుండగా సుచిత్ర మహీంద్రా షోరూం సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తపన్‌కుమార్ గాల్లో ఎగిరి రోడ్డుపై ఏర్పాటు చేసిన బారికేడ్లపై పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్



సమస్యలను తెలుసుకుంటున్న రామన్ గౌడ్

హిమాయత్‌నగర్: స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.రామన్‌గౌడ్ డివిజన్‌లోని రాజ్‌మొహల్లాలో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాము, నరేందర్, జానకిరామ్, నర్సింగ్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్



వ్యర్థాలను తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీ ఏసీబీ కార్యాలయం వద్ద గడిచిన రెండు రోజులుగా మురుగు సమస్య వేధిస్తుండటంతో అటు ఏసీబీ కార్యాలయ అధికారులతో పాటు ఎమ్మెల్యే కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో జలమండలి అధికారులు స్పందించారు. ఏసీబీ కార్యాలయం వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌లో జెట్టింగ్ మిషన్ ద్వారా ఇరుక్కుపోయిన వ్యర్థాలను, సిల్ట్‌ను మంగళవారం తొలగించారు. దీంతో మురుగు సమస్యకు పరిష్కారం లభించింది.

బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి హౌస్ అరెస్టు



బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని అడ్డుకుంటున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: హెచ్‌సీయూ భూముల పరిశీలనకు వెళ్లేందుకు యత్నించిన బీజేపీ శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బంజారాహిల్స్ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన ఇంటి నుంచి బయటకు రావొద్దంటూ బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. తనకు ఎటువంటి నోటీసులు లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ మహేశ్వర్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

భక్తిశ్రద్ధలతో తులసి పూజ



తులసీ పూజలో చిన్నారులు

సనత్‌నగర్: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న వసంత నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు తారక నామ సహిత తులసీ పూజ (108 సార్లు), హనుమాన్ చాలీసా పారాయణం (5 సార్లు) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే పిల్లలకు శ్రీమద్ రామాయణంలోని బాలకాండపై ప్రవచనాలు చేశారు. శ్రీలక్ష్మీ నరసింహారెడ్డి పిల్లలతో స్వామి వారి భజన చేయించారు. పిల్లల కోసం రామాయణంలో రోజుకోక కాండపై ప్రవచించనున్నట్లు సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి సభ్యుడు బుచ్చిబాబు తెలిపారు. హారిక, పావని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి మహోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కోదండ రామాలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ ఘట్టంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వితలయ్య, శ్రీభూలక్ష్మీ అమ్మవారి ఆలయ ధర్మకర్త విశాల్ సూదం పేర్కొన్నారు.



బంజారాహిల్స్‌లో సన్నబియ్యం బస్తాలతో నిండిపోయిన ఓ రేషన్‌షాపు

రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు



సన్నవి రాకపాయే.. దొడ్డువి ఇవ్వకపాయె..

రేషన్ షాపులకు వచ్చి నిరాశతో వెళ్తున్న కార్డుదారులు

- ఎమ్మెల్సీ కోడ్ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీకి బ్రేక్
- దొడ్డువి ఇస్తారనుకుంటే షాపులకు రాని బియ్యం
- ఇంకో రెండు రోజులు ఆగాల్సిందే అంటున్న సిబ్బంది

బంజారాహిల్స్: ఉగాది కానుకగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని నెల రోజుల నుంచి ప్రభుత్వం ఊదరగొడుతోంది. సన్నబియ్యం ఎప్పుడెప్పుడు తీసుకుందామా అని కార్డుదారులు ఎదురుచూశారు. అయితే మంగళవారం రేషన్ దుకాణాలకు వచ్చిన లబ్ధిదారులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సన్నబియ్యం ఈ నెల పంపిణీ చేయడం లేదని, మే నెలలో పంపిణీ చేస్తామని నోటీసు బోర్డు అంటించారు. కనీసం దొడ్డు బియ్యమైనా ఇస్తారేమోనని షాపులకు వచ్చిన కార్డుదారులు షాక్‌కు గురయ్యారు. ఈ నెల కోటా కింద గత నెలలోనే సన్నబియ్యం బస్తాలు పంపిణీ చేశారు. వాటితోనే షాపులు నిండిపోయాయి. తీరా ఎమ్మెల్సీ కోడ్ అడ్డంకిగా మారడంతో దొడ్డు బియ్యం పంపిణీ కాలేదు.

సన్న బియ్యంతో నిండిపోయిన షాపులు

రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందకు వచ్చే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో 81 రేషన్‌షాపులు ఉండగా అన్ని దుకాణాల్లోనూ సన్నబియ్యం బస్తాలు నిండిపోయాయి. దొడ్డు బియ్యం బస్తాలు ఇప్పటిప్పుడు వచ్చినా వాటిని పెట్టేందుకు జాగా లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకైన గదుల్లో రేషన్‌షాపులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సన్నబియ్యం బస్తాలను షాపుల్లో నింపేశారు. వాటిని వాపసు తీసుకువెళ్లలేమని, వచ్చే నెల దాకా భద్రపర్చుకోవాల్సిందేనని పౌర సరఫరాల శాఖ అధికారులు సదరు రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎప్పటిలాగానే ఈ నెల కోటా కింద దొడ్డు బియ్యం పంపిణీ చేస్తామని, రెండు మూడు రోజుల్లో బియ్యం బస్తాలు వస్తాయని అధికారులు చెప్పారు.

సమన్వయం లేక సమస్య జఠిలంగా..

సన్నబియ్యం ఇవ్వకపోగా, దొడ్డు బియ్యం సరఫరా లేకపోవడంతో కార్డుదారులు తలలు పట్టుకుంటున్నారు. డీలర్లు ఏమి చెప్పాలో తెలియక సతమతం అవుతున్నారు. సమన్వయం లేక సమస్య జఠిలంగా మారిందని రేషన్ డీలర్లు వాపోతున్నారు. వాస్తవానికి హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నాయనే విషయం గత నెలలోనే తెలిసింది. కోడ్ అడ్డం వస్తుందని కూడా తెలుసు.. అయినా సరే పౌర సరఫరాల శాఖ నిర్లక్ష్యంతో కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయలేక, దొడ్డు బియ్యం తీసుకురాలేక నరకం అనుభవిస్తున్నారు.

ఖైరతాబాద్ సర్కిల్‌లో కార్డుల వివరాలు

మొత్తం రేషన్ షాపులు:	81
తెల్ల రేషన్ కార్డులు:	79,531
ఇటీవల కొత్తగా మంజూరైన కార్డులు:	2,897
అంత్యోదయ అన్న యోజన కార్డులు:	3,481
అన్నపూర్ణ కార్డులు:	1
కార్డుల్లో మొత్తం సభ్యుల సంఖ్య:	2,95,779
మంజూరైన సన్నబియ్యం:	18,19,011

ఫుట్‌పాత్‌లపై డబ్బాలను తొలగించాలని ఫిర్యాదు



ఫిలించాంబర్ వద్ద ఏర్పాటు చేసిన డబ్బా

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ ఫిలించాంబర్ వద్ద నుంచి కొత్త చెరువు వరకు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలంటూ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఏఎంహెచ్‌వో డాక్టర్ కేఎస్.రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రికి రాత్రే ఫిలించాంబర్ వద్ద ఓ డబ్బాను తీసుకొచ్చి పెట్టారని కొంత మంది జీహెచ్ఎంసీ ముసుగులో డబ్బాలు ఏర్పాటు చేసి దందాలు చేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ జామ్‌లతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో పాటు డబ్బాలు ఏర్పాటు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట జీఎంకాలనీకి చెందిన షేక్‌మునీర్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్–14లో బంజారా ప్యాలెస్ పాన్ మహల్‌ను నిర్వహిస్తున్నాడు. విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు బంజారాహిల్స్ పోలీసులు పాన్ మహల్‌పై దాడులు నిర్వహించారు. 140 ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైభవం.. నాటకోత్సవం

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం



సత్యహరిశ్చంద్ర నాటకంలో కళాకారుల అభినయం

ఫిలింనగర్: ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా ఫిలింనగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో రంగస్థల నాటకోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పొత్తూరి వెంకట సుబ్బారావు నేతృత్వంలో జరుగుతున్న ఈ నాటకోత్సవాల్లో రంగ స్థల కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని మంగళవారం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హైదరాబాద్ సురభి కళా నాట్యమండలి ఆధ్వర్యంలో చేసిన ఈ నాటక ప్రదర్శనలో హరి 1గా దేవనాథ్ సూరి, హరి 2గా సురభి నిఖిలేష్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకదా దుర్గా ప్రసాద్, కాల కౌశికగా దర్శి శ్రీనివాసరావు, శిశ్యగా నారాయణరావు నటించగా వీరికి హార్మోనియంపై సీహెచ్.నాగేశ్వర్‌రావు, నామా చంద్రబాబు నాయుడు, డోలక్‌తో రామకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్ అభినందించారు.

విద్యార్థుల ఉన్నతికే ప్రాధాన్యం



విద్యార్థుల తల్లిదండ్రులకు ఆన్‌లైన్‌లో ఓరియెంటేషన్ ప్రోగ్రాం

- ఆ బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదీ..
- అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహిస్తున్నాం
- జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మీ
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కొత్తగా పాఠశాలలో చేరిన నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆన్‌లైన్ ద్వారా ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మీ పాఠశాలలో ఉన్న అధునాతన సౌకర్యాలు, నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. పిల్లల అభివృద్ధి ఎక్కువ శాతం పాఠశాలల్లోనే జరుగుతుందన్నారు. ఇటు ఉపాధ్యాయులు అటు తల్లిదండ్రులు నిరంతరం వారిని పర్యవేక్షిస్తూ వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు. అలాగే జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, జిల్లా పరంగా విద్యార్థులు సాధించిన విజయాలు, పాఠశాల అవార్డులు, విద్యార్థుల ప్రతిభాపాటవాల గురించి తెలియజేశారు. సృజనాత్మకత పెంపొందించేందుకు పాఠశాలలో ఉన్న వివిధ రకాలైన ల్యాబ్స్ గురించి వివరించారు. అలాగే మన సంస్కృతి, నాగరికతలను పరిరక్షించేందుకు పాఠశాలలో జరుపుకునే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తెలియజేశారు. పిల్లలకు భాష మీద ప్రావీణ్యం, అందరి వద్ద ధైర్యంగా మాట్లాడే నైపుణ్యం పెంపొందించేందుకు ప్రతిభా దర్శన్ అనే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాంచనవలి తదితరులు పాల్గొన్నారు.

భవన యజమానులకు మేలు.. పాదచారులకు శాపం

- ఇష్టానుసారంగా మెట్రో రెయిలింగ్ తొలగింపు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- విచారణ జరపాలంటూ డిమాండ్



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–1లో మెట్రో ఫుట్‌పాత్ రెయిలింగ్‌ను తొలగిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–1లో మెట్రోరైల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నుంచి ఏవీస్ ఆస్పత్రి వైపు ఫుట్‌పాత్‌ను ఆనుకుని మెట్రో పాదచారుల భద్రత కోసం రెయిలింగ్ నిర్మించింది. అయితే కొందరు భవన యజమానులు రోడ్డు వైపు తమ గేట్లను ఏర్పాటు చేసుకునే క్రమంలో మార్కెట్ విలువను పెంచుకునేందుకు మెట్రో వేసిన రెయిలింగ్‌ను తొలగిస్తూ ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేస్తున్నారు. సోమవారం ఉదయం ఏవీస్ ఆస్పత్రి ముందు రెయిలింగ్‌ను తొలగిస్తుండగా మెట్రో ఇంజినీర్లకు ఫిర్యాదు అందింది. రెయిలింగ్‌ను ఎందుకు తొలగిస్తున్నారని, మెట్రో రైల్ డీఈ రాజీవ్‌రెడ్డిని ప్రశ్నించగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–5లో మెట్రో స్టేషన్ వద్ద కొంతమేర రెయిలింగ్‌ను నిర్మించాల్సి ఉందని, అందుకే ఇక్కడి నుంచి తొలగిస్తున్నామని జవాబు ఇచ్చారు. వాస్తవానికి ఒకసారి వేసిన రెయిలింగ్‌ను తొలగించడానికి వీల్లేదు. కొందరు భవన యజమానులకు లబ్ధి చేకూర్చేందుకే ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేస్తూ రెయిలింగ్‌ను తొలగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. తిరిగి రెయిలింగ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి అకారణంగా దాడి చేశాడని ఫిర్యాదు

బంజారాహిల్స్: ఓ గుర్తుతెలియని వ్యక్తి అకారణంగా తమను దూషించి దాడికి పాల్పడ్డాడంటూ ఓ ఎలక్ట్రీషియన్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–11లోని ఉదయనగర్‌లో నివసించే దీపక్‌దాస్(35) తన సోదరుడు పార్థసారథితో కలిసి ఉంటున్నాడు. వారి బాల్కనీలో వైరింగ్ వర్క్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వారి ఫ్లోర్‌కు వచ్చాడు. మూడో ఫ్లోర్‌లో వర్క్ ఉందంటూ రావాలని చెప్పాడు. తమకు పని ఉందని, కుదరదని చెప్పినప్పటికీ వారితో వాగ్వాదానికి దిగి అసభ్యపదజాలంతో దూషిస్తూ వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ వారి వద్దకు వచ్చి మరోసారి వాగ్వాదానికి దిగాడు. అనంతరం దీపక్‌దాస్‌ను తోసేయడంతో కింద పడిపోయాడు. ఈ క్రమంలో పేపర్ కటింగ్ బ్లేడ్‌పై పడటంతో గాయాలకు గురయ్యాడు. తనపై దాడికి పాల్పడ్డ గుర్తుతెలియని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రగడ్డ నుంచి మానసిక రోగి అదృశ్యం



ధీరజ్‌సింగ్(ఫైల్)

రహమత్‌నగర్: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చికిత్స పొందుతున్న ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ అదృశ్యమైన ఘటన బోరబండ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఉత్తర్ ప్రదేశ్ గోరక్‌పూర్ చెందిన ధీరజ్‌సింగ్(40) చంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ కార్యాలయంలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గత నెల 24న ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు చేర్పించారు. ఈ క్రమంలోనే సోమవారం ఆయన పారిపోయాడు. సీఆర్‌పీఎఫ్ అధికారుల ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ కార్యక్రమం

సనత్‌నగర్: టీపీసీసీ ఆధ్వర్యంలో ఏఐసీసీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట డివిజన్లలో మంగళవారం నిర్వహించారు. సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలను ప్రోత్సహించే ప్రమాణాన్ని స్వీకరించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలను పునరుద్ఘాటిస్తూ, రాజ్యాంగంపై నిబద్ధతను కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని తలపెట్టినట్లు కోట నీలిమా తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు హేమంత్ సింగ్, అనురాగ్, హనీఫ్, చిరంజీవి, రజనీకాంత్, ఎస్ఎఎస్ రావు, అబ్బాస్ షరీఫ్, విజయ్ ఎలీషా, సీనియర్ నేతలు, మహిళలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గడప లోపల కులం.. | గడప దాటితే అందరం సమానం



చింతల మల్లేశం గౌడ్‌కు వచ్చిన గౌరవ డాక్టరేట్ ప్రదర్శిస్తున్న సినీ నటుడు సుమన్

సినీ నటుడు తల్వార్ సుమన్

పంజగుట్ట: మన కులం గురించి మనం మాట్లాడకపోతే తల్లిదండ్రులను అవమానించినట్లే అని ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్ అన్నారు. అదే సమయంలో గడప లోపల కులం, గడప దాటితే అందరం ఒక్కటే అని దేశం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చింతల మల్లేశంగౌడ్‌కు జర్మనీ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ.. మల్లేశంకి గౌరవ డాక్టరేట్ ఇస్తే యావత్ గౌడ సమాజానికి గౌరవం ఇచ్చినట్లే అన్నారు. ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, సమాజానికి మంచి చేసేందుకు, హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. మల్లేశం వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని గౌడ కులస్తులు సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ఏరియాలో గౌడ కులస్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యమంత్రి ఒక్కసారి తమకు సమయం ఇస్తే సమస్యలు చెప్పుకుంటామని అన్నారు. సమావేశంలో వంగాల బాలరాజుగౌడ్, శ్రావణ్‌గౌడ్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

హిమాయత్‌నగర్: ఈ నెలలో జరగనున్న మహనీయుల జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. సమితి రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామితో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, 14న అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అందుకు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కార్యాచరణ చేపట్టాలని కోరారు. దేశం కోసం, తమ జాతి కోసం తమ మేధస్సును అంకితం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని నేటి తరం యువతకు తెలియజేయాలన్నారు.


సేవా దృక్పథం అభినందనీయం



భోజన పంపిణీ కేంద్రం వద్ద అన్నం తింటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

అమీర్‌పేట: సేవా దృక్పథం కలిగి ఉండడం అభినందనీయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మిత భోజన పంపిణీ, చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా మధ్యాహ్న మిత భోజనం పంపిణీ చేపడుతున్నారని, ఇందుకు సుమారు 250 మంది దాతలు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఇది నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పార్థసారథి, కౌన్సిల్ అధ్యక్షుడు దుబే, మాజీ అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, సహదేవ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు హనుమంత్ రావు, కట్ట బల్‌రాం, అశోక్ యాదవ్, నర్సింహ, కరుణాకర్‌రెడ్డి, గోపీలాల్ చౌహాన్, ప్రవీణ్‌రెడ్డి, ఖలీల్, వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెంచు కుటుంబాలకు గృహోపకరణ వస్తువుల పంపిణీ



గృహోపకరణ వస్తువులో చెంచులు, అధికారులు

సనత్‌నగర్: ట్రాన్స్‌కో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ క్లెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నల్లమల అడవుల్లోని అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ కొల్లం చెంచుపెంట గ్రామంలో మంగళవారం పర్యటించారు. వారి యోగక్షేమాలు, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే 20 కుటుంబాలకు గృహోపకరణ వస్తువులు, దుస్తులను అందజేశారు. శ్రీమాతా సేవా సమితి ప్రతినిధులు కుసుమ విజయ, ట్రాన్స్‌కో అధికారులు రాజశేఖర్, ఉద్యోగులు సుధాకర్‌రెడ్డి, అరుణ్ కుమార్, సర్వేశ్వర్, మారం శ్రీనివాస్, అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఆందోళనకు మణిశర్మ మద్దతు



బీఆర్‌ఎస్వీ నిరసనకు మద్దతు తెలుపుతున్న సంగీత దర్శకుడు మణిశర్మ

బంజారాహిల్స్: హెచ్‌సీయూలో జరుగుతున్న ఆందోళనలకు ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ మద్దతు తెలిపారు. ప్రభుత్వ దమనకాండను నిలిపివేయాలంటూ బీఆర్‌ఎస్వీ కార్యకర్తలు, నాయకులు మంగళవారం కేబీఆర్ పార్కు వద్ద ఆందోళన చేపట్టారు. ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందంటూ బీఆర్‌ఎస్వీ నాయకులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. వారి నిరసనకు సంగీత దర్శకుడు మణిశర్మ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మద్దతు తెలిపారు. హెచ్‌సీయూ అడవిని నరికితే హైదరాబాద్ ఊపిరి ఆగుతుందంటూ బీఆర్‌ఎస్వీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రావుల శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.పృథ్వీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యు.చంద్రమోహన్‌గౌడ్, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్ హఫీజ్ ఖాన్, విజయసారథి, సంయుక్త కార్యదర్శులుగా ఎ.విష్ణుకుమార్‌గౌడ్, మహ్మద్ సమీయుద్దీన్, కోశాధికారిగా ఎస్.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా సుకుమార్ ఫ్రాన్సిస్, నర్సుల్ హైదర్ మహ్మద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

కేబీఆర్ పార్క్ వాక్ వే ఆక్రమణ కూల్చివేత



కేబీఆర్ పార్కు బయట వాక్ వే కబ్జా కూలుస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వాక్ వే బయట మల్టీ లెవెల్ పార్కింగ్ కోసం నిర్మిస్తున్న భవనం పక్కన ఉన్న జీహెచ్‌ఎంసీకి చెందిన ప్రహరీని ప్రైవేట్ నిర్మాణ సంస్థ కూల్చివేయడంపై వాకర్స్ మండిపడుతున్నారు. వంద గజాలకుపైగా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని కొత్తగా ప్రహరీ నిర్మిస్తున్న విషయాన్ని కేబీఆర్ పార్కు వాకర్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆ ప్రహరీని కూల్చివేశారు. మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ కోసం 480 గజాల స్థలాన్ని దక్కించుకున్న నవనిర్మాణ అసోసియేట్ సంస్థ పక్కన ఉన్న స్థలాన్ని కూడా ఆధీనంలోకి తీసుకుంది. పైగా జీహెచ్‌ఎంసీ వాక్ వే ప్రహరీని కూల్చివేసి ముందుకు చొచ్చుకు రావడంపై వాకర్లు, సందర్శకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్ కోసం ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కూడా ప్రైవేట్ సంస్థకు అడ్డదారిలో కట్టబెడతారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సదరు నిర్మాణ సంస్థ వ్యవహారంపై అధికారులు ఎవరు నోరు మెదపకపోవడం గమనార్హం. స్థలం కేటాయింపునకు సంబంధించిన పంచనామా రిపోర్టు బయటపెట్టకుండా ఇష్టారాజ్యాంగా వ్యవహరించడమేంటని వాకర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలకు పుట్టినిల్లు వైఎంసీఏ



సమ్మర్ క్యాంపు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు బాబుమోహన్

రాంగోపాల్‌పేట్: క్రీడలకు వైఎంసీఏ పుట్టినిల్లు లాంటిదని సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మే 31 వరకు జరగనున్న సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత, విద్యార్థుల్లో క్రీడల్లో ఆసక్తిని పెంచేందుకే వైఎంసీఏ ఆవిర్భవించి ఎంతోమంది ఉత్తమ క్రీడాకారులను తయారు చేసిందని గుర్తుచేశారు. ఈనెల 26 నుంచి సమ్మర్ క్యాంపులు మొదలవుతాయని స్పోర్ట్స్, గేమ్స్, ఆర్ట్స్, మ్యూజిక్, లైఫ్ స్కిల్స్ లాంటి 24 అంశాల్లో శిక్షణ ఉంటుందని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జయకర్ డేనియల్ తెలిపారు. పిల్లలు మొబైల్స్‌లో గేమ్స్ లాంటి వాటికి కాకుండా క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎంసీఏ కార్యదర్శి లెనార్డ్ ప్రతినిధులు కల్యాణ్, సాల్మన్‌రాజు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవయవ మార్పిడికి..
నిమ్స్‌లో ప్రత్యేక విభాగం!

ప్రతిపాదన దశలోనే గుండె, కాలేయ మార్పిడి టవర్స్

- ప్రస్తుతం నిర్మాణ దశలో దశాబ్ది బ్లాక్
- ప్రత్యేక వైద్యవిభాగాలతో మరింతగా విస్తరణ



లక్డీకాపూల్: ప్రతిష్ఠాత్మకమైన నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) ప్రత్యేక విభాగాలతో విస్తరిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద రోగులకు అత్యాధునిక వైద్యసేవలను అందిస్తూనే ఎప్పటికప్పుడు ప్రత్యేక వైద్య విభాగాలను సైతం సమకూర్చుకుంటోంది. ఈ క్రమంలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సల విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు నిమ్స్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గుండె, కాలేయ మార్పిడి టవర్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలను రూపొందించింది. అయితే వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా నిమ్స్ ప్రతిపాదనల్లోనూ మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గుండె, కాలేయ మార్పిడి టవర్స్‌కు బదులుగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సల ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇప్పటికే నిమ్స్ మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌గా ఖ్యాతినార్జించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో కిడ్నీతోపాటు కాలేయం, గుండె, ఊపిరితిత్తులు వంటి అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 2 వేల వరకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగాయి. ఈ అవయవ మార్పిడుల చికిత్సలను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా నిర్వహించడంతోపాటు రోగులకు జీవితాంతం అవసరమయ్యే మందులను ఉచితంగా అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇటీవల దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా నిమ్స్ రోబోటిక్ పద్ధతిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేసిన సంగతి తెలిసిందే. న్యూరోసర్జరీ విభాగం ఏడాదికి 3,500 వెన్నెముక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే బీహెచ్‌ఈఎల్–జీఈ గ్యాస్ టర్బైన్ సంస్థ అందించిన అత్యాధునిక స్పైనల్ ఎండోస్కోపిక్ సర్జరీ సిస్టమ్ (ఆడి– ఆ్య)ని సొంతం చేసుకుంది.

చికిత్సలన్నీ ఉచితంగానే..

శస్త్ర చికిత్సలన్నింటినీ తక్కువ కోతతో నాణ్యమైన శస్త్రచికిత్సా విధానంతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నిమ్స్ నిర్వహిస్తోంది. మరోవైపు గుండె ఆపరేషన్లకు సంబంధించి యూఎస్, యూకే వైద్య సంస్థలు సైతం చేయూతనందిస్తుండటం గమనార్హం. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలతో రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో మరో 2 వేల పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక భవన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. 33 ఎకరాల్లో రూ.1,571 కోట్ల వ్యయంతో ఓపీ, ఐపీ, ఎమర్జెన్సీ సేవలకు ప్రత్యేకంగా మూడు బ్లాక్‌ల నిర్మాణాన్ని చేపట్టింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 8 అంతస్తుల్లో ఓపీ బ్లాక్‌ను, ఎమర్జెన్సీ సేవల కోసం ప్రత్యేకంగా 8 అంతస్తులతో బ్లాక్‌ను, ఇన్‌పేషంట్ల కోసం 13 అంతస్తులతో మరో బ్లాక్‌ను నిమ్స్ అధికారులు ఏర్పాటు చేయనున్నారు. కొత్త భవనంలో 30 ఆపరేషన్ థియేటర్లు, ఆక్సిజన్ సరఫరాతో 2 వేల పడకలు (1,200 ఆక్సిజన్ బెడ్లు, 500 ఐసీయూ బెడ్లు), ప్రత్యేక గది కావాలనుకునే రోగుల కోసం 300 పేయింగ్ రూమ్స్ వంటివి అందుబాటులోకి రానున్నాయి.

పెరుగుతున్న విభాగాలు..

నిమ్స్‌లో 33 స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. ఇటీవల అడ్వాన్స్‌డ్ పీడియాట్రిక్ న్యూరాలజీ అండ్ ఎపిలెప్సీ విభాగాన్ని సమకూర్చుకుంది. ఈ విభాగంలో అత్యాధునిక ఐసీయూ, హెచ్‌ఏఏ, అడ్వాన్స్ ఎపిలెప్సీ మానిటరింగ్ యూనిట్, పాలిస్కోనోగ్రఫీ, స్టీరియో ఈఈజీ తదితర పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. బ్లడ్ స్క్రీనింగ్ సురక్షిత రక్తాన్ని అందించేందుకు నాట్ (న్యూక్లియక్ యాసిడ్ ఆంప్లిఫికేషన్ టెక్నాలజీ) కోసం కసరత్తు చేస్తోంది. డయాలసిస్ రోగులకు సౌర విద్యుత్తుతో డయాలసిస్ సేవలను అందిస్తోంది. ప్రాజెక్ట్ గ్రీన్ డయాలసిస్ ఇనిషియేటివ్ పేరిట రోజుకు 200 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెళ్లను సమకూర్చుకుంది.

హెచ్‌సీయూ క్యాంపస్‌లో జింక మృత్యువాత

- జంగల్ క్లియరెన్స్ ఘటన వల్లేనని అంటున్న విద్యార్థులు



హెచ్‌సీయూలో మృతి చెందిన జింక

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఓ జింక మృత్యువాత పడింది. ఏబీవీపీ హెచ్‌సీయూ విభాగం అధ్యక్షుడు అనిల్‌కుమార్ మంగళవారం జింక మృతి వివరాలను వెల్లడించారు. క్యాంపస్‌లోని అటవీ ప్రాంతాన్ని తొలగించేందుకు ప్రభుత్వం రాత్రింబవళ్లు జేసీబీలతో చదును చేసే ప్రక్రియ చేపట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. జేసీబీల చప్పుళ్ళతోపాటు పొదలను తొలగిస్తుండటంతో కొత్త స్థావరాల కోసం జింకలు అటు, ఇటు పరుగెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఓ జింక ముఖానికి ఏదో బలంగా తగలడం, రక్తస్రావం కావడంతో అది మృత్యువాత పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జంతుజాలానికి రక్షణగా ఉన్న హెచ్‌సీయూ అటవీ ప్రాంతాన్ని సంరక్షించాలని హెచ్‌సీయూ విద్యార్థులు కోరారు.

గద్దర్‌పై కాల్పులెవరు జరిపారో తేల్చాలి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, బెల్లయ్య నాయక్, సూర్యకిరణ్ తదితరులు

- 6న 'ప్రశ్నించే గొంతులు– పాలకుల అణచివేత'పై సదస్సు

హిమాయత్‌నగర్: ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై ఎవరు కాల్పులు జరిపారో ప్రజా ప్రభుత్వం నిగ్గు తేల్చాలని గద్దర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. 1997లో గద్దర్‌పై కాల్పులు జరిగాయని, కానీ దోషులెవరనే విషయాన్ని అప్పటి ప్రభుత్వాలు తేల్చలేదని పేర్కొన్నారు. గద్దర్‌పై 1997 ఏప్రిల్ 6న కాల్పులు జరిపిన సందర్భంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రశ్నించే గొంతులు– పాలకుల అణచివేత' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోడ పత్రికను ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలసి సూర్యకిరణ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ తన మాటనే పాటగా మలిచిన గొప్ప కళాకారుడని కొనియాడారు. గద్దర్ పాట ప్రజల్లో చైతన్యం నింపి, ప్రభుత్వాలను కదిలించిందన్నారు. మలి దశ ఉద్యమాన్ని ఉరకలెత్తించిన ఘనత గద్దర్‌కే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, వినయ్ శంకర్, శ్రీరాములు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటం ఆవిష్కరణ

హిమాయత్‌నగర్ : కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంగా నామకరణ చేసిన నేపథ్యంలో ఆ ధీర మహిళ పోరాట జీవితాన్ని ప్రతిబింబించే విధంగా ఆమె నిలువెత్తు చిత్రపటాన్ని బుధవారం దర్బార్ హాల్లో ఆవిష్కరిస్తున్నట్లు రెవల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్(ఆర్‌డబ్ల్యూహెచ్‌ఐ) తెలిపింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.హరికాంత్, ఉపాధ్యక్షుడు కె.చరణ్, కార్యదర్శి డాక్టర్ సౌజన్య కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 2న ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్యధనంజయ, ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగరావు, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డబ్ల్యూహెచ్‌ఐ ప్రతినిధులు

ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. చాకలి ఐలమ్మ పోరాటం యావత్ ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆహర్నిశలు కృషి చేసిన ఆమె పోరాట స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నగరంలో నేడు

- ఫిలింనగర్‌లోని ఫిలిం చాంబర్ రామానాయుడు కళామండపంలో చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పద్య నాటక మహోత్సవంలో భాగంగా సురభి కళా నాట్యమండలి వారి సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.
- మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్ ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'కేర్'లో ఏఐ ఆధారిత నాన్ ఇన్వేసివ్ చికిత్స



కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత నాన్ ఇన్వేసివ్ చికిత్సను ప్రారంభించిన కేర్ ఆస్పత్రి వైద్యులు..

బంజారాహిల్స్: కేర్ హాస్పిటల్స్ జోగో హెల్త్‌తో కలిసి కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత నాన్ ఇన్వేసివ్ చికిత్సను ప్రారంభించింది. ఈ వినూత్న చికిత్స విధానాన్ని ప్రత్యేకంగా న్యూరో, యూరో, గ్యాస్ట్రో సమస్యల నివారణ కోసం రూపొందించారు. అమెరికాలో అభివృద్ధి చేసిన జోగో హెల్త్ సాంకేతికత, ప్రత్యేకమైన వేరియబుల్ ఎలక్ట్రోమయోగ్రఫీ సెన్సార్లు, కృత్రిమ మేధస్సు, తక్షణ బయో ఫీడ్‌బ్యాక్ ద్వారా నరాల పనితీరును మెరుగుపరిచేలా రూపొందించారు. ఈ సాంకేతికత ఇప్పటికే అమెరికా, కెనడా, ఆసియాలోని ప్రముఖ ఆస్పత్రుల్లో ఉపయోగంలో ఉంది. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ గ్రూప్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథూర్ మాట్లాడుతూ జోగో హెల్త్‌తో కలిసి పనిచేయడం వల్ల రోగులకు మెరుగైన చికిత్స అందించగలుగుతున్నామని, ఇది నాన్–ఇన్వేసివ్, అందుబాటులో ఉండే సమర్థవంతమైన చికిత్సా విధానమన్నారు. జోనల్ సీఈఓ బిజునాయర్ మాట్లాడుతూ కేర్ హాస్పిటల్‌లో తాము ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతలతో కూడిన వైద్యం రోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. జోగో హెల్త్ కృత్రిమ మేధస్సు ఆధారిత చికిత్సతో చికిత్సా విధానాల్లోనే కొత్త మార్పులు తీసుకువచ్చామన్నారు. ఇది శస్త్ర చికిత్సల అవసరాన్ని తగ్గించి, రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. జోగో హెల్త్ సహ వ్యవస్థాపకులు శివ నటరాజ్ మాట్లాడుతూ కేర్ హాస్పిటల్స్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. తమ సాంకేతికత ద్వారా రోగుల రికవరీ వేగంగా జరిగే అవకాశం ఉందన్నారు.

4 నుంచి 6వ తేదీ వరకు తెలంగాణ విత్తన పండుగ

పంజగుట్ట: విత్తనాలను కాపాడుకునేందుకు, విత్తనాల్లోని శాస్త్రీయత, రైతుల జ్ఞానాన్ని తెలుసుకునేందుకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత బీజ స్వరాజ్ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు తొలి తెలంగాణ వార్షిక విత్తన పండుగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామంలోని 'ద ఎర్త్ సెంటర్'లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సహజ సమృద్ధి వ్యవస్థాపకుడు కృష్ణప్రసాద్, ప్రజా విధాన నిపుణులు ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి, సీనియర్ సలహాదారు ఆర్.దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం విత్తన కంపెనీలు పెరిగినా విత్తనాల వైవిధ్యం తగ్గిపోతోందన్నారు. విత్తనాల వైవిధ్యం తగ్గడంతో ఆహారంలో పోషక విలువలు తగ్గిపోతున్నాయని, దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమయంలో విత్తనాలను కాపాడుకునేందుకు, సంప్రదాయ విత్తన వైభవాన్ని చాటేందుకు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు, రైతులను, పరిశోధకులను, పాలసీ మేకర్స్‌ను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఈ విత్తన పండగ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా రెండువందలకుపైగా కంపెనీలు, మహిళా గ్రూపులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ వర్గీకరణ ఉద్యమం

- మందకృష్ణకు పిడమర్తి సూచన



ఘట్‌కేసర్‌లో మిఠాయిలు పంచుతున్న పిడమర్తి రవి, మల్లేశ్ తదితరులు

ఘట్‌కేసర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కూడా ఉద్యమం చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. తెలంగాణలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి మండలికి ధన్యవాదాలు తెలుపుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మీసాల మల్లేశ్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదిగలకు 9.75 శాతం రిజర్వేషన్లు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీలో మందకృష్ణ వల్లే మాదిగలకు అన్యాయం జరిగిందన్నారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వర్గీకరణ విజయోత్సవాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, మల్లేశ్, రాందాసు, సురేశ్, నరసింహ, బాలయ్య, రాజేశ్, రాములు, గణేశ్, శ్రీను, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

గ్రూప్–1 ఫలితాలపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ తదితరులు

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

పంజగుట్ట: 'టీజీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షా పేపర్లు రీకౌంటింగ్ కాదు, రీ వాల్యుయేషన్ చేయాలి'అని పలువురు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఒక కమిటీ వేసి అవకతవకలను సరిచేయాలని, లేనిపక్షంలో అనర్హులు అధికారులు అవుతారని అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నేత రాకేష్‌రెడ్డి, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్ మాట్లాడుతూ రెండు సెంటర్ల నుంచి 70 మంది అభ్యర్థులు అర్హత సాధించడం, కొన్ని సెంటర్లల్లో 15 మంది కూడా అర్హత సాధించకపోవడం, రెండు ఇనిస్టిట్యూట్‌లో చదివిన వారే ఎక్కువగా అర్హత సాధించడం వంటివి ఎన్నో అనుమానాలకు తావిస్తున్నాయని అన్నారు. అగ్రకులాలకు చెందిన వారు ప్రతీ 18 మందిలో ఒకరు అర్హత సాధించడం, బీసీలు ప్రతీ 50 మందిలో ఒకరు, ఎస్సీలు 70 మందిలో ఒకరు, ఎస్టీలు 52 మందిలో ఒకరు అర్హత సాధించడంపట్ల కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తెలుగు మీడియం విద్యార్థులు టాప్ టెన్‌లో ఒక్కరు కూడా లేరని, తమకు ఎంతో నష్టం కలిగినట్లు వారు భావిస్తున్నారన్నారు. అన్యాయం జరిగిందని అభ్యర్థులు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నారని, ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు నోరు విప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు అభ్యర్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని, తెలంగాణ పోరాటాల గడ్డ అని, ఎవ్వరూ ఆత్మహత్య చేసుకోవద్దని అన్నారు.

క్రమశిక్షణ కోసమే
కొత్త నిబంధనలు



- ఓయూ ప్రతిష్ట పెంచేందుకే అంటున్న అధికారులు
- సదస్సుల నిర్వహణకు అనుమతి తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూను జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు సాధించి యూనివర్సిటీ ప్రతిష్ఠను మరింత పెంచేవిధంగా నూతన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు వర్సిటీలోని పాత విధానాల స్థానంలో విద్యార్థులు క్రమశిక్షణ పెంచేందుకు సరికొత్త పద్ధతులను అన్వేషించి అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. యూనివర్సిటీలు బోధన, పరిశోధనలతోపాటు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సింపోజియాలు, వర్క్‌షాపులు, గెస్ట్ లెక్చర్స్, స్మారక ఉపన్యాసాలు కార్యక్రమాలు నిత్యం జరుగుతుంటాయి. వాటిని నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించడంతోపాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విషయ పరిజ్ఞానం పెంపు, పరిశోధనాత్మక ఆలోచనలు పెరిగే విధంగా చేయడమే ధ్యేయమని అధికారులు అంటున్నారు. ఓయూ క్యాంపస్ కాలేజీలతోపాటు అనుబంధ నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్, జిల్లా పీజీ కాలేజీల్లో జరిగే కార్యక్రమాలపై తమకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో కొత్త కొత్త నిబంధనలు విధించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నూతన నిబంధనలు

సెంట్రల్ వర్సిటీలు, ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ తదితర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న నిబంధనలను ఓయూలో ప్రవేశపెట్టామని అధికారులు పేర్కొంటున్నారు. వాటి వివరాలు... సదస్సులను 45 నిమిషాలపాటు నిర్వహించాలని, కార్యక్రమాల ఇన్విటేషన్ కార్డులు, వాల్ పోస్టర్లలో అతిథుల పేర్లకు వీసీ అనుమతి తీసుకోవాలని, వేదికపైకి పరిమిత సంఖ్యలో అతిథులను ఆహ్వానించాలని, ఆహ్వానితుల పేర్లు, సమయం, వేదిక వంటి వివరాలు వీసీకి ముందుగానే తెలియచేయాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఓయూలో జరిగే అన్ని రకాల కార్యక్రమాల సమాచారాన్ని వర్సిటీ పబ్లిక్ రిలేషన్ అధికారి ద్వారానే జారీ చేయాలని సూచించారు. అయితే నూతన నిబంధనలపై మార్పులు, చేర్పులు చేయాలని పలువురు అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

సంపూర్ణ మార్పు కోసమే

ఓయూలో జరిగే సదస్సులు, ఇతర కార్యక్రమాలు మూస పద్ధతిలో జరుగుతున్నాయి. వాటిని సంపూర్ణంగా మార్చాలనే లక్ష్యంతో కొత్త నిబంధనలు ప్రవేశపెట్టాం. ఇష్టం వచ్చిన అతిథులను ఆహ్వానించి ఆర్భాటంతో హంగామా చేయకుండా విద్యార్థులకు సంబంధిత అంశంపై పరిజ్ఞానం పెంచేలా సదస్సుల నిర్వహణ ఉండాలి. నామ మాత్రంగా సెమినార్లు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తే వృథా అవుతుంది.

ఓయూ అధికారులు

కొత్త నిర్ణయాలను స్వాగతిస్తున్న



ఓయూలో అధికారికంగా జరిగే కార్యక్రమాలు, సదస్సులు క్రమశిక్షణతో జరగాలనే లక్ష్యంతో ఓయూ అధికారులు తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నాను. నామమాత్రంగా కాకుండా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేవిధంగా కార్యక్రమాలు, సదస్సుల నిర్వహణ ఉండాలి. అందుకు కొత్త నిబంధనలు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నా.

ఓరుగంటి కృష్ణ, రీసెర్చ్ స్కాలర్

చిన్న కార్యక్రమాలకు సడలింపు ఇవ్వాలి



కాలేజీ, ఆయా విభాగాల స్థాయిలో జరిగే వర్క్‌షాప్‌లు, గెస్ట్‌లెక్చర్స్, స్మారక ఉపన్యాసాలు తదితర చిన్న కార్యక్రమాలకు కూడా వీసీ అనుమతి తీసుకోవడం కష్టతరం. వీసీ అనుమతి కోసం వెళ్తే సమయానికి అందుబాటులో ఉండకపోవచ్చు. దాన్ని వల్ల కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.

డాక్టర్ రామకృష్ణ, గణితశాస్త్ర విభాగం

విద్యార్థులతో చర్చించాలి



ఓయూ అధికారులు తీసుకునే నిర్ణయాలు మంచివి అయినప్పుడు విద్యార్థులతో చర్చించాలి. సదస్సులు, ఇతర కార్యక్రమాల నిర్వహణ వల్ల విద్యార్థుల్లో న్యాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. అందుకోసం మితిమీరిన ఆంక్షలు విధించకుండా యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులకు సొంతగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలి.

కె.స్వాతి, పీజీ విద్యార్థిని

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 2, ఏప్రిల్, 2025



మైరా..

పాటరీ వర్క్‌షాప్

ఆర్ట్ లవర్స్ కోసం ఏప్రిల్ 6 వరకూ నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఆర్ట్ లవర్స్ కోసం ప్రత్యేకంగా పాటరీ వర్క్‌షాప్ ప్రారంభించింది మైరా స్టూడియో. బంజారాహిల్స్‌లోని స్టూడియో మైరా వేదికగా నేటి నుంచి ప్రారంభమయ్యే పాటరీ వర్క్‌షాపులో రంగులతో ప్రత్యేక కళాఖండాలను సృష్టించడానికి శిక్షణ అందించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు అవసరమైన మేకింగ్ మెటీరియల్ నిర్వాహకులే అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకూ కొనసాగనున్న ఈ వర్క్‌షాపులో ఐదేళ్లపైబడిన ఆర్ట్ లవర్స్ ఎవరైనా భాగస్వాములు కావచ్చని నిర్వాహకులు తెలిపారు. బుక్ మై షో ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అందుబాటులో ఉండే ఈ వర్క్‌షాపు వారంలోనూ, వారాంతాల్లోనూ ఉంటుంది.

హైదరాబాద్‌లో బెస్ట్..

ఇదే నా టేస్ట్..

నగరంలో బెస్ట్ సుషీ కోసం నా ఫ్రెండ్ రెస్టారెంట్‌కే వెళతా

- ★ మెస్ నుంచి స్పైస్ వరకు మరికొన్ని ఫేవరెట్ ప్రదేశాలూ ఉన్నాయి
- ★ నాకు ఇష్టమైన వంటకాలు, రెస్టారెంట్లు ఇవే
- ★ అభి'రుచుల'ను వెల్లడించిన జూనియర్ ఎన్టీఆర్



అంతర్జాతీయ స్థాయి సక్సెస్‌లు అందుకుంటున్న టాలీవుడ్‌కు కేంద్రబింధువు హైదరాబాద్. అలాంటి పరిశ్రమలో గ్లోబల్‌స్టార్స్‌గా పేరున్న అనేకమంది నటీ నటులకు మన నగరం నిలయం. అయితే ఢిల్లీకి రాజైనా అమ్మకి కొడుకే అన్నట్టు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉన్న టాలీవుడ్ స్టార్స్ కూడా నగరంలోని కొన్ని రుచులకు దాసులే. వారు తమ అభి'రుచుల్ని' సంతృప్తి పరచుకోడానికి నగరంలోని కొన్ని రెస్టారెంట్స్‌కి తరచూ రౌండ్స్ వేస్తుంటారు. అభిమానులకు చిక్కకుండా రహస్యంగా తమ టేస్ట్ బడ్స్‌ను శాంతింపజేస్తుంటారు. అదే విధంగా మన టాలీవుడ్ టాప్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్‌కి సైతం నగరంలో తనకు నచ్చిన, ఇష్టమైన వంటకాలు వడ్డించే రెస్టారెంట్స్ ఉన్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

గత నెల్లో దేవర చిత్రాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రమోట్ చేయడానికి జూనియర్ ఎన్టీఆర్ జపాన్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ చిత్రం అక్కడి థియేటర్లలో సందడి చేస్తోంది. మరోవైపు ఎన్టీఆర్ తిరిగి నగరానికి వచ్చేశారు. అయితే ఎన్టీఆర్ జపాన్ టూరుకు సంబంధించిన వీడియో ఫుటేజ్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. ఆ ఇంటర్వ్యూలో నగరంలో తాను ఇష్టపడే రెస్టారెంట్స్ రుచుల వివరాలు ఆయన వెల్లడించడమే ఇందుకు కారణం.

ఫ్రెండ్.. జపనీస్ ట్రెండ్..

నగరంలోని నాగ చైతన్య అక్కినేనికి చెందిన షోయు రెస్టారెంట్ ఎన్టీఆర్ ఎంచుకున్న మొదటి ఎంపిక. 'ఈ అద్భుతమైన కళాత్మక ప్లేస్ నా స్నేహితుడు నాగ చైతన్య సొంతం. ఈ ప్రదేశంలో కొన్ని అద్భుతమైన జపనీస్ వంటకాలు అందుబాటులో ఉన్నాయి. మరీ ముఖ్యంగా జపనీస్ వంటకమైన సుషీ అక్కడ సూపర్బ్. హైదరాబాద్‌లో జపనీస్ వంటకాలకు నేను జై కొట్టే ప్లేస్ అది. ఇది నిజంగా అంతర్జాతీయ వంటకాలకు కేరాఫ్' అంటూ ఎన్టీఆర్ కొనియాడారు.

మరికొన్ని ప్రదేశాలు..

జపనీస్ వంటకాలకు సంబంధించి తన ఫేవరెట్‌ను తెలియజేయడంతో పాటు అచ్చమైన హైదరాబాదీ వంటకాలకు సంబంధించి కూడా ఎన్టీఆర్ కొన్నింటిని పేర్కొన్నారు. తాను ఆస్వాదించే మరికొన్ని రుచుల కోసం.. పాతబస్తీలోని షాదాబ్, జూబ్లీహిల్స్‌లోని స్పైస్ వెన్యూ, తెలంగాణ స్పైస్ కిచెన్, పాలమూరు గ్రిల్, అమీర్‌పేట్‌లోని కాకతీయ డీలక్స్ మెస్ కూడా ఆయన ఎంచుకున్న నచ్చే రుచుల జాబితాలో ఉన్నాయి.



వేసవి విహారం..

జాతీయ, అంతర్జాతీయ పర్యటనలకు నగరవాసుల ఆసక్తి

- › పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా సంస్థల ప్యాకేజీలు
- › ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న మధ్య ఆసియా దేశాలు
- › హిమాచల్‌ప్రదేశ్, కూర్గ్, తదితర ప్రాంతాలకు సైతం డిమాండ్
- › ఇప్పటికే సర్వం సిద్ధం చేసిన ట్రావెల్స్ యాజమాన్యాలు

వేసవి విహారానికి నగరం సన్నద్ధమవుతోంది. నచ్చిన ప్రదేశాలను సందర్శించేందుకు పర్యాటక ప్రియులు ఇప్పటి నుంచే ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుంచి లక్షలాది మంది పర్యాటకులు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల సందర్శనకు బయలుదేరుతారు. కొందరు కుటుంబాలతో సహా కలిసి పర్యటిస్తే, మరికొందరు సోలో టూర్ల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మేరకు ట్రావెల్స్ సంస్థలు, పర్యాటక ఏజెన్సీలు పర్యాటకుల అభిరుచికి తగినవిధంగా విభిన్న వర్గాలకు చెందిన ప్యాకేజీలను అందజేస్తున్నాయి. జాతీయ పర్యటనల్లో ఎక్కువ మంది హిమాచల్‌ప్రదేశ్, సిమ్లా, ఊటీ, కూర్గ్ వంటి ప్రాంతాలను ఎంపిక చేసుకుంటుండగా, అంతర్జాతీయ పర్యటనల్లో ఇటీవల కాలంలో మధ్య ఆసియా ప్రత్యేక ఆకర్షణగా మారినట్లు టూరిజం సంస్థలు పేర్కొంటున్నాయి. తక్కువ బడ్జెట్‌లో యూరప్‌లో పర్యటించిన అనుభూతిని కలిగించే కజఖిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కిర్గిజిస్తాన్, తుర్కమెనిస్తాన్ తదితర దేశాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో




వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది చల్లటిప్రదేశాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఆ తరువాత ఆధ్యాత్మిక, చారిత్రక ప్రదేశాలకు సైతం డిమాండ్ ఉందని పర్యాటక సంస్థలు చెబుతున్నాయి. ఈ మేరకు హిమాచల్‌ప్రదేశ్, సిమ్లా, కర్ణాటకలోని హిల్‌స్టేషన్‌గా పేరొందిన కూర్గ్, తమిళనాడులోని ఊటీకి హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో బుకింగ్స్ వస్తున్నట్లు హిమాయత్‌నగర్‌కు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఆ తరువాత ప్రపంచ వారసత్వ ప్రదేశంగా పేరొందిన హంపి, విరూపాక్ష ఆలయం, విఠల ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలు. రాతి దేవాలయాలు, శిలలతో కూడిన శిల్పాలకు ప్రసిద్ధి చెందిన మహాబలిపురం. వారణాసి, అయోధ్య, ఢిల్లీ, జైపూర్ వంటి ప్రదేశాలకు సైతం ఎక్కువ మంది తరలి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అంచనా. ప్రైవేటు సంస్థలతో పాటు ఐఆర్‌సీటీసీ వంటి ప్రభుత్వరంగ సంస్థలు సైతం ప్రత్యేక ప్యాకేజీలతో ఆకట్టుకుంటున్నాయి.









ఏటా రెండు లక్షల మంది..

జాతీయ, అంతర్జాతీయ పర్యటనలకు ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది ప్రయాణికులు హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్తున్నట్లు అంచనా. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజూ సుమారు 15,000 మంది విదేశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వారిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం, బంధువుల వద్దకు వెళ్లేవాళ్లు కాకుండా కనీసం 5 వేల మంది పర్యాటకులు ఉన్నట్లు అంచనా. అలాగే దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక, పర్యాటక, చారిత్రక ప్రదేశాలకు వెళ్లేందుకు దక్షిణమధ్య రైల్వే ప్రతి సంవత్సరం ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ప్రతి రోజూ సుమారు 3 లక్షల మంది హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుండగా వారిలో 30 వేల మందికి పైగా కేవలం పర్యాటకప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లేవాళ్లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆహ్లాదం.. ఆనందం..

ఇటీవల కాలంలో మధ్య ఆసియా ప్రత్యేక ఆకర్షణగా మారింది. హైదరాబాద్ నుంచి వివిధ దేశాల పర్యటనలకు వెళ్లేవారిలో దుబాయ్, సింగపూర్, బ్యాంకాక్, మలేసియా తదితర దేశాల తరువాత మధ్య ఆసియా దేశాలకు ఎక్కువమంది వెళ్తున్నారు. కజికిస్తాన్‌లోని ఎత్తైన పర్వతాలు, రిసార్ట్‌లతో ఆకట్టుకునే ప్రాంతాలు, అమెరికాలోని గ్రాండ్ కాన్యన్‌ను తలపించే అందమైన ప్రాంతం చారిన్ కాన్యన్, ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన బైకనూర్ కాస్మోడ్రోమ్ వంటివి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఉజ్బెకిస్తాన్‌లోని పురాతన నగరాలు, మధ్యయుగపు ఇస్లామిక్ కట్టడాలతో నిండి ఉన్న బుఖారా, మౌసోలియమ్స్, ఖివా వంటి ప్రాంతాలను పర్యాటకులు ఎంపిక చేసుకుంటున్నారు. నగర పర్యాటకులను ఆకట్టుకుంటున్న మరో అందమైన దేశం అజర్‌బైజాన్. తక్కువ బడ్జెట్‌లో పర్యటించేందుకు అవకాశం ఉన్న ఈ దేశంలో రాజధాని బాకు ఆధునిక ఆర్కిటెక్చర్‌తో చారిత్రక ప్రదేశాలతో నిండి ఉంటుంది. షెకి మరో పురాతన నగరం. ఇది ప్యాలెస్‌ల నగరంగా పేరొందింది. అలాగే ప్రకృతి సౌందర్యం, పర్వతాలు, వినోదభరితమైన పార్కులతో కూడిన గాబాలా నగరం కూడా అజర్‌బైజాన్‌లోనే ఉంది.



నగరంలో ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. దీంతో వేడిని తట్టుకునేందుకు నగర వాసులు వివిధ రకాల పద్ధతులు పాటిస్తున్నారు.. ఇందులో భాగంగా ఏసీలు, కూలర్లు వంటివి లేకుండా ఉండలేని పరిస్థితి.. అయితే దీనికి భిన్నంగా వేడి నుంచి ఉపశమనం కోసం ప్రత్యామ్నాయ మార్గమైన మొక్కలను పెంచుతున్నారు. ఇంటి వాతావరణం చల్లబరిచేందుకు ఇదో చక్కటి మార్గమని నిపుణులు చెబుతున్నారు. నర్సరీల్లోనూ ఇటీవల కాలంలో ఇంటీరియర్ ప్లాంట్స్ అధిక మొత్తంలో అమ్ముడుపోతున్నాయని పలువురు నర్సరీల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇదే ట్రెండ్ అవ్వడంతో ఎక్కువ మంది ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని ఇంటీరియర్ డిజైనర్స్ సైతం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటీరియర్ ప్లాంట్స్ గురించిన మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో

వెచ్చదనం తగ్గించే పచ్చదనం



- ఇండోర్ ప్లాంట్స్‌తో ఎండకు చెక్
- ఆసక్తి కనబరుస్తున్న నగర వాసులు

ఇటు అందం.. అటు ఆరోగ్యం



వేసవి తాపానికి ఎండలు మాత్రమే ప్రధాన కారణం కాదు. పరిమితికి మించిన వాహనాల కాలుష్యం, పరిశ్రమలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల నుంచి వెలువడే కాలుష్యం వాతావరణాన్ని తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తున్నాయి. అయితే గతంలో ఇంటి వద్ద మొక్కల పెంపకం కొందరికి హాబీగా ఉండేది. ఇప్పుడు ఇదో ఫ్యాషన్‌లా మారింది. కొందరు అందానికి, మరి కొందరు ఆరోగ్యం కోసం పెంచుతుంటే, ఇంకొందరు తాము ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని లక్షలు వెచ్చించి ఇంపోర్టెడ్ మొక్కలను పెంచుతున్నారు. దీంతో బాల్కనీ, డోర్స్‌ముందు ఖాళీ ప్రదేశంలోనే మనీ ప్లాంట్స్ వంటివి పెంచుతున్నారు. ముఖ్యంగా గాలిలోని టాక్సిన్‌లను హరించే హెర్బల్ ప్లాంట్స్, ఆక్సిజన్ స్థాయిలను పెంచే అరుదైన మొక్కలు, ఆహ్లాదాన్ని అందించే అలంకరణ మొక్కలు ఎంపిక చేసుకుంటున్నారు. వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకునే సకులెంట్స్, డిజర్ట్ ప్లాంట్స్ పెంచుతున్నారు. మరికొందరు అరుదైన లక్షణాలున్న మొక్క జాతులు, నీటిలో పెంచే ఆక్వా ప్లాంట్స్, బోన్సాయ్ మొక్కలు, క్రీపర్స్, హ్యాంగింగ్స్ పెంచుతున్నారు.







వివిధ రకాల మొక్కలు..

మోస్టరైజమ్, పెడల్‌లీఫ్, ఫిలిడాంద్రమ్, రబ్బర్ ప్లాంట్, పీస్ లిల్లీస్ పెంచుకోవచ్చని నిపుణుల సూచన. ఇండోర్, ఔట్‌డోర్‌లోనూ పెరిగే మనీ ప్లాంట్, ఇంటి ముందు కానీ సూర్యరశ్మి పడే ఇంటిలోపలి వాతావరణంలో అడీనియం, అరేలియా, హెల్కోనియా, దురంతా, పెంటాస్, గ్లోరోఫైటమ్, గ్రోటాన్, పెనివత్, సైకస్ తదితర జాతి మెక్కలను పెంచుకోవచ్చు. విలాసవంతమైన ఇళ్లలో బర్డ్ ఆఫ్ ప్యారడైస్, మేరీ గోల్డ్‌లాంటి అరుదైన మొక్కలను పెంచుతున్నారు. నగర నలుమూలలా అన్ని రకాల మెక్కలు దొరికే నర్సరీలు అందుబాటులో ఉన్నాయి.



మహిళలకు డిజిటల్ స్కిల్స్..

సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ మహిళల సాధికారత కోసం పనిచేసే నాస్కామ్ ఫౌండేషన్ మహిళలకు డిజిటల్ స్కిల్స్‌లో శిక్షణ అందించేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. హెచ్‌ఎస్‌బీసీతో కలిసి 4వేల మంది మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, వ్యాపార దక్షత, ఇ-గవర్నెన్స్.. తదితర విషయాల్లో అవగాహన కల్పించనున్నామని, రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతోందని వివరించింది. 'డిజిటల్ ఎకానమీలో మహిళల పాత్ర విస్తరణ, మహిళా వ్యాపారుల సామర్థ్యాలను పెంపొందించడం' పేరిట ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొంది.

క్లుప్తంగా...

నేడు హస్తినలో బీసీల పోరుగర్జన

- మహాధర్నాకు హాజరుకానున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, సీఎం రేవంత్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల కులగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత ఇవ్వాలనే డిమాండ్లతో హస్తినలో బీసీ సంక్షేమ సంఘం మహాధర్నాకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా బుధవారం 'పోరుగర్జన' పేరుతో ఈ మహాధర్నాను బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు 26 పార్టీలకు చెందిన జాతీయ అధ్యక్షులు, వివిధ పార్టీల ఎంపీలు హాజరవుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. పోరుగర్జనను విజయవంతం చేసేందుకు ఢిల్లీకి 3 వేల మంది చేరుకున్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లును పార్లమెంట్ ఆమోదించకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని జాజుల హెచ్చరించారు.

అంబేడ్కర్ స్టేడియానికి నిధులివ్వండి

కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయకు బండి సంజయ్ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: 'ఖేలో ఇండియా' పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్‌తో కలిసి బండి సంజయ్.. కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్య, క్రీడల్లో కరీంనగర్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. అర్జున అవార్డు గ్రహీత మడాసు శ్రీనివాసరావు కరీంనగర్‌కు చెందినవారేనని చెప్పారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని 'ఖేలో ఇండియా' లేదా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల ద్వారా కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే అథ్లెట్ల కోసం సింథటిక్ ట్రాక్, రాత్రి వేళల్లో సాధన చేసేందుకు ఫ్లడ్ లైట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు.

నేడు సుప్రీంకోర్టులో ఫిరాయింపుల కేసు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్యే ఫిరాయింపులపై బుధవారం సర్వోన్నత న్యాయస్థానం విచారించనుంది. కారు గుర్తుపై గెలిచి.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు చేపట్టేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ జనవరి 10న సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 2న స్పీకర్ తరఫు న్యాయవాదుల వాదనలను వింటామని సుప్రీంకోర్టు గత విచారణ సందర్భంగా స్పష్టంచేసింది.

శ్రీరామనవమి శోభాయాత్రలో సీఎం పాల్గొనాలి

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: శ్రీరామనవమి శోభాయాత్రలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనాలని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ కోరారు. ఈ ఉత్సవాలపై పోలీసులు అనవసర రాద్ధాంతం చేయొద్దని సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్రకు పోలీసులు ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సీఎంకు.. రాజాసింగ్ లేఖ రాశారు. ఇటీవల పాతబస్తీలో ఎంఐఎం పార్టీ బహిరంగసభలో డీజే సౌండ్ సిస్టమ్ పెట్టినా పోలీసులు నోరు మెదపలేదన్నారు. తాను 15 ఏళ్లుగా శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నానని, ఇప్పటిదాకా ఇందులో ఒక్క సంఘటన కూడా జరగలేదని తెలిపారు. అయినప్పటికీ తనపై కేసులు పెడుతున్నారని, వాటికి భయపడకుండా గతంలో కంటే కూడా మరింత ఘనంగా శోభాయాత్ర నిర్వహిస్తానని ఆ లేఖలో రాజాసింగ్ పేర్కొన్నారు.

నేనే బీఎస్పీలోకి వద్దామనుకున్నా..

మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: 'ఒక దశలో నేనే బీఎస్పీలోకి వచ్చేద్దామనుకున్నా.. కానీ నువ్వు బీఎస్పీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నావు..' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.. ధర్మపురి నియోజకవర్గ బీఎస్పీ నేత విజయ్‌ను ఉద్దేశించి అన్నారు. మంగళవారం ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జన్మదిన వేడుకలను జగిత్యాలలో జీవన్‌రెడ్డి నివాసంలో నిర్వహించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన విజయ్‌ను ఉద్దేశించి 'కాంగ్రెస్‌లో ఏముందోయ్.. నేనే మీ పార్టీలోకి వచ్చేద్దామని అనుకున్న' అని జీవన్‌రెడ్డి అనడం చర్చనీయాంశంగా మారింది.



రాములోరి పెళ్లికి చల్లని ఏర్పాట్లు

నీటి తుంపర్ల నడుమ రామయ్య కల్యాణం

- మిథిలా స్టేడియంలో 'మిస్టింగ్' ఏర్పాట్లు
- భక్తులకు వేసవితాపాన్ని తీర్చేందుకు కలెక్టర్ యత్నం

భద్రాచలం రాములోరి కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని వేలాదిమంది భక్తులు కోరుకుంటారు. అయితే శ్రీరామనవమి వేసవికాలంలో రావడం.. మిథిలా స్టేడియంలో కల్యాణాన్ని చూసేవారు ఉక్కపోత, ఎండతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం సహజం. ఈ సమస్యను కొంతమేర పరిష్కరించేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్.. ఈ ఏడాది తొలిసారి ఓ ప్రయోగం చేస్తున్నారు. స్టేడియంలోని అన్ని సెక్టార్లలో మిస్టింగ్ ఫాగ్ (మంచు తుంపరలు) ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు చల్లటి ఉపశమనంతో రామయ్య కల్యాణాన్ని వీక్షించే అవకాశం లభిస్తుంది.

\- భద్రాచలం

ఫ్యాన్లు, కూలర్లు పెట్టినా..

మిథిలా స్టేడియంలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించే భక్తులకు ఉక్కపోత బాధలు తప్పించేందుకు వివిధ సెక్టార్లలో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేసినా వాటి నుంచి ఉపశమనం అంతంతమాత్రంగానే ఉండేది. దీంతో విసన కర్రలు, చేతి రుమాళ్లతో భక్తులు విసురుకుంటూ ఉండేవారు. ఈ ఇబ్బందులు పడలేక చిన్నారులు, వృద్ధులతో వచ్చేవారు కల్యాణానికి దూరంగా ఉన్న సందర్భాలు ఉన్నాయి. ఈ సమస్య నుంచి భక్తులను గట్టెక్కించేందుకు కలెక్టర్ తొలిసారిగా మిస్టింగ్ ఫాగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ విధానాన్ని ఎన్నికల ప్రచార సమయంలో లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన కేసీఆర్ బహిరంగసభ వద్ద, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మణుగూరులో జరిగిన సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన సమయంలో అమలు చేశారు. ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో కలెక్టర్ ఆ వివరాలు సేకరించి రామయ్య కల్యాణం, పట్టాభిషేకం వేడుకలకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

రెండెకరాల్లో ఏర్పాట్లు

కలెక్టర్ సూచనల మేరకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కంపెనీకి ఈ పనులు అప్పగించారు. మిథిలా స్టేడియంలోని రెండెకరాల స్థలంలో పది అడుగుల ఎత్తున సెక్టార్లలో పైపులు అమరుస్తున్నారు. రెండు మోటార్ల ద్వారా 20 వేల లీటర్ల కెపాసిటీ ఉన్న వాటర్ ట్యాంక్‌కు అనుసంధానం చేస్తారు. తద్వారా నీటిని తుంపర్లుగా మార్చి పైపుల ద్వారా సెక్టార్లకు పంపిస్తారు. గంటకు పది నిమిషాల పాటు ఇవి పనిచేస్తాయి. దీంతో వేడి తగ్గి చల్లగా ఉంటుందని, ఆ తర్వాత మరో పది నిమిషాలు.. ఇలా కల్యాణ ప్రక్రియ పూర్తయ్యే వరకు కొనసాగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దూరంగా ఉన్న సెక్టార్లకు సైతం కూలింగ్ వచ్చేలా వాటర్ ప్రెషర్ పనిచేసేలా పరికరాలు అమరుస్తామని చెప్పారు. షెడ్ల కింద సామాన్య భక్తులకు సైతం ఉపశమనం కలిగేలా పైప్‌లైన్లు అమర్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ మిస్టింగ్ పనులకు గురువారం ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.



స్టేడియంలో జరుగుతున్న పైపులైన్ల ఏర్పాటు పనులు



మిస్టింగ్ పనిచేసే విధానం (ఫైల్)

మాకూ మంత్రి ఇవ్వండి

కేబినెట్‌లో చోటు కోసం అధిష్టానానికి లేఖల రాయబారం

ఇప్పటికే మాదిగ, లంబాడా, రంగారెడ్డి జిల్లా నేతల లేఖలు

- తాజాగా వెలుగులోకి సీనియర్ నేత జానారెడ్డి లేఖ
- రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్యేల కోసం వినతి
- ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్.. నేడు వెళ్లనున్న డిప్యూటీ సీఎం
- రాహుల్‌గాంధీతో భేటీకానున్న సీఎం
- విస్తరణ ఉంటే ఈ వారంలో... లేదంటే వాయిదానే



సాక్షి, హైదరాబాద్: ఎడతెగని సస్పెన్స్‌గా మారిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశం ఆశావహులను ఒక్కచోట నిలువనీయటం లేదు. అమాత్య పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకొంటున్నారు. కొందరు నేతలు పార్టీ అధిష్టానానికి లేఖల ద్వారా విన్నపాలు చేసుకుంటున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలోనే ఢిల్లీ పెద్దలకు సామాజిక వర్గాలవారీగా ఎమ్మెల్యేలు లేఖలు రాశారు. తాజాగా పార్టీ సీనియర్ నేత కె.జానారెడ్డి రాసిన లేఖ కూడా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖ పార్టీలో చర్చకు దారితీసింది.

ఉమ్మడి జిల్లాలు.. సామాజిక వర్గాలు

రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. రెడ్డి సామాజిక వర్గానికి నాలుగు, బీసీలకు రెండు, మాల, మాదిగ, ఆదివాసీ వర్గాలకు ఒక్కోటి చొప్పున కేబినెట్ బెర్తులు లభించాయి. విస్తరణ జరిగితే బీసీ, రెడ్డి వర్గాలకు ఒకటి లేదా రెండు బెర్తులు ఇవ్వాలనే డిమాండ్ ఉంది. జనాభా ప్రాతిపదికన మాదిగ, లంబాడా వర్గాలకు చెరో బెర్తు ఇవ్వాలనే డిమాండ్ కూడా తెరపైకి వచ్చింది. బెర్తు దక్కని నాలుగు ఉమ్మడి జిల్లాల నేతల నుంచి కూడా కేబినెట్‌లో స్థానంపై చాలా ఆశలున్నాయి. ఒకరిద్దరు ఎమ్మెల్యేలకు అసెంబ్లీ ఎన్నికలకు ముందే అధిష్టానం మాట ఇచ్చిందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏ ప్రాతిపదికన కేబినెట్‌లో ఖాళీ బెర్తులు భర్తీ చేయాలి? ఎన్ని భర్తీ చేయాలన్న దానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. విస్తరణ వార్తల నేపథ్యంలో మాదిగ, లంబాడా వర్గాలతో పాటు రంగారెడ్డి జిల్లా నేతలు ఇప్పటికే అధిష్టానానికి లేఖలు రాశారు. ఒకరిద్దరికి మంత్రి పదవుల కేటాయింపులో కుటుంబ కథా చిత్రాలు కూడా నడుస్తున్నాయి.

ఉంటుందా... వాయిదానా?

ఇలాంటి పరిస్థితుల్లో అసలు కేబినెట్ విస్తరణ ఉంటుందా లేదా? అన్న అనుమానాలు రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ నెల 3 లేదా 4వ తేదీన విస్తరణ ఉంటుందని, మళ్లీ వాయిదా పడినా మరో వారం రోజుల్లో కచ్చితంగా విస్తరణ జరుగుతుందని ఢిల్లీ నుంచి సంకేతాలు అందుతున్నాయి. మరోవైపు కేబినెట్ విస్తరణ జరిగితే ఈ వారంలోనే ఉంటుందని, లేదంటే నిరవధికంగా వాయిదా పడినట్టేననే చర్చ కూడా కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతుండడం గమనార్హం.

ఢిల్లీకి వెళ్లిన సీఎం, నేడు వెళ్లనున్న డిప్యూటీ

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళ్లారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం వెళ్లనున్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని పార్లమెంటులో కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో వారు పాల్గొంటారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వాకిటి శ్రీహరి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రకాశ్‌గౌడ్, ఈర్లపల్లి శంకరయ్య తదితరులు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. ఈ ధర్నాకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూడా హాజరయ్యే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఢిల్లీలో రాహుల్‌ను సీఎం కలుస్తారని సమాచారం. రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఢిల్లీలోనే ఉన్నందున వారితో పార్టీ అధిష్టానం మరోమారు చర్చలు జరిపి, మంత్రివర్గ విస్తరణ ముహూర్తాన్ని ఫైనల్ చేస్తుందా? అనేది నేడో రేపో తేలనుంది.

మోదీ ఫొటో పెట్టాలనడం సరికాదు

బండి సంజయ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.ఎడవల్లి గ్రామంలో పేదలకు 6కిలోల సన్నబియ్యం సంచులు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠి

సాక్షి, యాదాద్రి, కనగల్: రేషన్ దుకాణాల్లో నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని బండి సంజయ్ జోక్ చేస్తున్నాడని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్రం ఏం ఇస్తుందని ప్రధాని ఫొటో రేషన్ దుకాణాల్లో పెట్టాలని ఆయన ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో, నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.ఎడవల్లి గ్రామంలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించారని, అందులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వాటా 13 శాతం ఉందన్నారు. మరి ఎయిర్‌పోర్టులో తెలంగాణ సీఎం ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బండి సంజయ్ చిల్లర రాజకీయం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాల సముదాయమే కేంద్రమని, రాష్ట్రాల నుంచి వచ్చే ఆదాయంతోనే కేంద్రం నడుస్తుందన్నారు. కేంద్రానికి తెలంగాణ రాష్ట్రం రూపాయి ఇస్తే.. 42 పైసలే వాపస్ ఇస్తున్నారని అన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు రూపాయి ఇస్తే.. 7 రూపాయలు తిరిగి ఇస్తున్నారని.. బండి సంజయ్ ఇది తెలుసుకోవాలన్నారు.

సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుంది..

సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవమని, ఇది చరిత్రలో నిలిచిపోయే పథకమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇస్తోందని, 20 లక్షల మంది పేర్లు రేషన్ కార్డులలో చేర్పించామని చెప్పారు. రూ.3 కోట్ల పది లక్షల మందికి సన్నబియ్యం ఇవ్వనున్నామని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, భువనగిరి కలెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ షురూ

రాష్ట్రవ్యాప్తంగా 7,619 దుకాణాల్లో బియ్యం తీసుకున్న లబ్ధిదారులు



మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీఎస్‌వో బ్రహ్మయ్య

సాక్షి, హైదరాబాద్: ఆహారభద్రత కార్డు కలిగిన వారికి రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసే కార్యక్రమం మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా జీహెచ్ఎంసీ పరిధిలో దొడ్డు బియ్యాన్నే పంపిణీ చేశారు. మిగతా జిల్లాల్లో సుమారు 40 శాతం వరకు రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ జరిగింది. కాగా మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారికంగా ప్రారంభించడానికి కొన్ని జిల్లాల్లో సన్న బియ్యం పంపిణీని బుధవారానికి వాయిదా వేశారు. అన్ని చౌకధరల దుకాణాలకు 50 శాతం మేర సన్నబియ్యాన్ని అందుబాటులో ఉంచినట్టు సీఎస్ శాంతికుమారి తెలిపారు. కాగా సన్న బియ్యం పంపిణీ తీరును మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

తొలిరోజు ఇలా..: రాష్ట్రంలో 17,311 చౌకధరల దుకాణాలు ఉండగా, అందులో 7,619 దుకాణాల్లో మంగళవారం ఏప్రిల్ కోటా బియ్యం పంపిణీ జరిగింది. ఇందులో హైదరాబాద్ జిల్లా పరిధిలోని 653 దుకాణాలకుగాను 485 దుకాణాల్లో దొడ్డు బియ్యాన్నే పంపిణీ చేయగా, మిగతా 7,134 దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేసినట్టు పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా తొలిరోజు 8.27 లక్షల మంది 18 వేల మెట్రిక్ టన్నుల మేర బియ్యం తీసుకున్నారు. ఇందులో హైదరాబాద్‌కు 1,000 టన్నుల మేర దొడ్డు బియ్యం పంపిణీ చేసినట్టు తెలుస్తోంది.

- నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించగా, హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.
- జగిత్యాల, నారాయణపేట, మెదక్, నాగర్‌కర్నూలు, పెద్దపల్లి, వనపర్తి, జిల్లాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు రాక బియ్యం పంపిణీ చేయలేదు.
- మంత్రులు, ఎమ్మెల్యేల సమాచారం లేక అక్కడక్కడ దుకాణదారులే కొంతమంది కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు.
- వరంగల్ తూర్పు, వికారాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగాం, నల్లగొండ జిల్లాల్లో అనధికారికంగా కొన్నిచోట్ల బియ్యం పంపిణీ జరిగినా, అధికారికంగా బుధవారం నుంచి ప్రారంభం కాబోతుంది.
- దేవరకొండలో నాలుగో తేదీన ప్రారంభించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులు వాట్సాప్ గ్రూపుల్లో బియ్యం పంపిణీ చేయొద్దని సూచించినట్టు తెలిసింది.

సన్నబియ్యంతో సంతోషం



దొడ్డు బియ్యంతో వండిన అన్నం తినడం చాలా కష్టంగా ఉండేది. ఒక్కోసారి అరిగేది కాదు. కడుపు నొప్పి కూడా వచ్చేది. ప్రభుత్వం పేదల బాధను అర్థం చేసుకొని సన్నబియ్యం అందించడం సంతోషంగా ఉంది. ఇప్పటి నుంచి మా ఇంట్లో సన్నబియ్యంతో అందరూ కడుపునిండా భోజనాలు చేస్తాం. – గొల్లపల్లి యశోద జనగామ జిల్లా

గంటసేపు ఎదురుచూసిన..



ఈ రోజు నుంచి సన్నబియ్యం ఇస్తారని చెప్పారు. నేను మా రేషన్‌షాపు దగ్గరకు వెళితే మూసి ఉంది. గంటసేపు అక్కడే ఎదురుచూసిన. ఎవరూ రాలేదు. ఎప్పటినుంచి బియ్యం ఇస్తారో ఎవరూ చెబుతలేరు.

– శైలమ్మ, శ్రీనగర్‌కాలనీ, నాగర్‌కర్నూల్

ఉదయం నుంచే బారులుదీరారు



కార్డుదారులు ఉదయం నుంచే రేషన్‌షాపుల వద్దకు బారులుదీరారు. బియ్యం తీసుకున్న పేదలు సంతోషంగా ఉన్నారు. సన్న బియ్యం పంపిణీతో సగటున ఒక్కో ఇంటికి రూ.1200 నుంచి రూ.1500లకు పైనే ప్రయోజనం చేకూరుతోంది.

– హిమబిందు, రేషన్‌డీలర్, నిజామాబాద్

త్వరలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభం

రాజ్యసభలో ప్రకటించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. దేశంలోనే అత్యాధునిక వసతులతో కూడిన ఎయిర్‌పోర్ట్‌ను వరంగల్‌లో నిర్మించనున్నట్లు తెలిపారు. మంగళవారం రాజ్యసభలో ఎయిర్‌క్రాఫ్ట్ వస్తువుల రక్షణ బిల్లు-2025పై జరిగిన చర్చలో వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేసిన ప్రస్తావనపై రామ్మోహన్ నాయుడు స్పందించారు. స్వాతంత్ర్యానికి ముందు వరంగల్ ఎయిర్‌పోర్ట్ దేశంలోనే అతిపెద్దదిగా ఉండేదని, అక్కడి నుంచి వాయుదూత్ విమానాలు కూడా పనిచేసేవన్నారు. వివిధ కారణాల వల్ల 1980లో వరంగల్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు ఆగిపోయాయని తెలిపారు. అప్పటి నుంచి వరంగల్ ఎయిర్‌పోర్ట్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్ చాలా ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాల్లో కూడా ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలున్నాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. అయితే ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు, భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

రైతులను ఇంకెన్ని సార్లు మోసం చేస్తావు రేవంత్‌రెడ్డి?

మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: మార్చి 31లోగా రైతు భరోసా డబ్బులు రైతులందరి ఖాతాల్లో వేస్తామని ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి తప్పారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను ఇంకెన్ని సార్లు మోసం చేస్తావు రేవంత్‌రెడ్డి? అని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం, మాటిచ్చి మోసం చేయడం, నాలుక మడతేయడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మాటలు ఘనంగా ఉంటే, చేతలు హీనంగా ఉన్నాయని హరీశ్ విరుచుకుపడ్డారు. సీఎం మాటలు నమ్మి ఉగాది రోజు ఆశగా ఎదురుచూసిన రైతులకు చేదు అనుభవమే ఎదురైందని ఆవేదన వ్యక్తంచేశారు. దసరా, సంక్రాంతి, ఉగాదికి ఇస్తామని ఊరించి ఉసూరుమనిపించారన్నారు. కేసీఆర్ నాట్ల సమయంలో రైతుబంధు ఇస్తే, రేవంత్‌రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా ఇవ్వడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు, అసెంబ్లీలో ప్రకటించినట్లు రైతులందరికీ రుణమాఫీ చేసేదాకా, రైతు భరోసా ఇచ్చే దాకా బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీని వెంటాడుతూనే ఉంటుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

యాదగిరిగుట్టకు వేద పాఠశాల మంజూరు

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి వేద పాఠశాల మంజూరైంది. యాదగిరిగుట్టకు పక్కనే ఉన్న పెద్దగుట్ట టెంపుల్ సిటీ స్థలంలో దీని నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకోసం 15 ఎకరాల స్థలం కేటాయించింది. సంబంధిత స్థలం పత్రాలను వైటీడీఏ సీఈఓ అశ్వినీయాదవ్ యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు. వేద పాఠశాల నిర్మాణానికి రూ.43.79 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఆశ్రమం తరహాలో వేద పాఠశాలను మూడు దశల్లో నిర్మించనున్నారు. మొదటి దశలో రూ.23.79 కోట్ల వ్యయంతో, రెండో దశలో రూ.10 కోట్లతో, మూడో దశలో రూ.10 కోట్లతో పూర్తి చేయనున్నారు. మొదటి దశ పనుల కోసం రూ.23.79 కోట్ల నిధులను కేటాయించారు. తమిళనాడులోని శ్రీ కంచి కామకోటి పీఠం, కాంచీపురం శృంగేరి పీఠం ఆధ్వర్యంలో వేద పాఠశాలను నిర్వహించనున్నారు. 2027 నాటికి వేదపాఠశాల నిర్మాణం పూర్తిచేయాలని భావిస్తున్నారు.

టికెట్ల పంచాయితీపై విజి'లెన్స్'

- ఉప్పల్ స్టేడియంలో మంగళవారం మొదలైన విజిలెన్స్ విచారణ
- హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులను ప్రశ్నించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)- ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య టికెట్ల పంపిణీలో ఏర్పడిన వివాదంపై విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ వివాదంపై దర్యాప్తు చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలోని నలుగురు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు కానిస్టేబుళ్ల విజిలెన్స్ బృందం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్యాప్తు కొనసాగించింది. హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రతినిధులను వేర్వేరుగా ప్రశ్నించి పలు వివరాలు సేకరించారు. ఐపీఎల్ నిర్వహణకు సంబంధించి హెచ్‌సీఏకు, సన్‌రైజర్స్‌కు మధ్య కుదుర్చుకున్న ఒప్పందాలు..2013 నుంచి ఐపీఎల్ నిర్వహణకు అనుసరిస్తున్న పద్ధతులు, టికెట్ల పంపిణీ, ఐపీఎల్ నిర్వహణ సమయంలో స్టేడియంలో ఏర్పాట్లలో ఎవరి పాత్ర ఏంటి? ఐపీఎల్ ఉచిత పాస్‌లకు సంబంధించి కేటాయింపులు.. తదితర అంశాలపై వివరాలు సేకరించారు. తొలుత హెచ్‌సీఏ సెక్రెటరీ దేవరాజు, జాయింట్ సెక్రెటరీ బస్వరాజు, ట్రెజరర్ సీజే శ్రీనివాస్‌లను ప్రశ్నించారు. ఆ తర్వాత ఎస్ఆర్‌హెచ్ సీఈఓ షణ్ముగం, ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్ సురేశ్‌ల నుంచి వివరాలు సేకరించారు. ఐపీఎల్ సమయంలో స్టేడియం నిర్వహణ ఎవరు చూస్తారు..? ఐపీఎల్ నిర్వహణకు సంబంధించి హెచ్‌సీఏకు ఎంత ఫీజు చెల్లిస్తున్నారు? టికెట్లను ఎవరెవరికి ఎంత శాతంలో ఇస్తుంటారు? ఫ్రాంచైజీకి స్టేడియంపై ఎలాంటి హక్కులు ఉంటాయి? టికెట్ల విషయంలో తలెత్తిన వివాదం ఏంటి? హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు బెదిరింపులకు సంబంధించి ఆధారాలు ఉన్నాయా?.. ఇలా పలు అంశాలపై ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధుల నుంచి విజిలెన్స్ అధికారులు సమాచారం సేకరించారు. ఐపీఎల్ నిర్వహణ, హెచ్‌సీఏ రోజువారీ కార్యకలాపాలు, స్టేడియం నిర్వహణకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను విజిలెన్స్ అధికారులు సేకరించారు. బుధవారం మరోమారు ఉప్పల్ స్టేడియానికి విజిలెన్స్ అధికారులు వెళ్లే అవకాశం ఉంది.



హైదరాబాద్ కె రన్నర్స్ గ్రూప్

కలిసి నడుద్దాం...

రోజూ వాకింగ్ చేస్తూ ఉంటే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని మనకు తెలిసిందే! వాకింగ్ చేసేవారు గ్రూప్‌గా కలిసి పర్యావరణ ఆరోగ్యాన్నీ బాగు చేద్దామనుకుంటే.. ఆ పనిని హైదరాబాద్ కె రన్నర్స్ గ్రూప్ మూడేళ్లుగా చేస్తోంది. ఈ గ్రూప్‌లో డాక్టర్లు, ఐటీ నిపుణులు, గృహిణులు సభ్యులుగా ఉన్నారు. వృత్తి, ఉద్యోగాలు, పిల్లల బాధ్యతలు నిర్వర్తిస్తూనే పర్యావరణ, ఆరోగ్య అవగాహననూ స్వచ్ఛందంగా కల్పిస్తూ ఎంతో మందికి స్ఫూర్తి కలిగిస్తున్నారు. పర్యావరణ హితం కోరేవారంతా తమతో కలిసి నడవచ్చు అంటూ చెబుతున్న ఈ గ్రూప్ సభ్యుల సూచనను మనమూ అమలుచేద్దాం...

విందు వినోదాలలో పాల్గొనడం మన చుట్టూ ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించుకోవడానికి. ఆ ఆనందంలో పర్యావరణానికి హాని చేస్తున్నామా అనే ఆలోచన చేయడమే కాదు మేలు కలిగే పనులనూ అమలులో పెట్టి చూపుతోంది కె రన్నర్ గ్రూప్. మూడేళ్లక్రితం ఇద్దరితో మొదలైన ఇప్పుడు 35 మందితో తమ చుట్టూ ఉన్నవారికి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తోంది. విందు కార్యక్రమాలలో యూజ్ అండ్ త్రోకు 'నో' చెబూతూ స్టీల్ ప్లేట్స్‌ను వెంట తీసుకెళుతున్నారు. వాకింగ్‌కి వెళుతూ రోడ్డు పక్కల పడి ఉన్న ప్లాస్టిక్‌ను సేకరించి, గార్బేజ్‌కు పంపిస్తున్నారు. వారాంతాల్లో చెరువులు, కోటలలో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. వీధుల్లో చేరే మూగజీవాలకు ఆహారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పనుల ఒత్తిడిలోనూ అనేక ప్రయోజనకర పనులను ఎంచుకుంటున్నారు.

వాకింగ్ చేస్తూ... ప్లాస్టిక్ సేకరిస్తూ...

మా గ్రూప్‌లో నలభై ఏళ్ల నుంచి అరవై ఏళ్ల వయసు వాళ్లున్నారు. ఎవరి కాలనీలలో వారు రోజూ వాకింగ్, రన్నింగ్ చేసినా ప్రతి నెలా అందరూ కలిసేలా కంటి ఆరోగ్యం, క్యాన్సర్ అవేర్‌నెస్, ఉమెన్ పవర్.. అంటూ రన్‌ని ఏర్పాటు చేస్తుంటాం. దీనిలో భాగంగానే మా చుట్టూ ఉన్నవారిలో ఆరోగ్య స్పృహ పెంచడం, ప్లాస్టిక్ ఫ్రీ జోన్స్‌ని చేయాలనుకున్నాం. అందుకే, రోజూ వాకింగ్ వెళ్లినా వెంట ఓ బ్యాగ్ తీసుకెళ్లి, పడేసిన ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ సేకరించి, ఒక చోట డంప్ చేస్తున్నాం. ఇటీవల భువనగిరి ఫోర్ట్, అక్కడి చెరువు వద్ద ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా చేయాలని సంకల్పించుకొని, వెళ్లి మా పనులు మొదలుపెట్టాం. రైతులు–వినియోగదారుల మధ్య దళారులు లేకుండా 35 కుటుంబాలకు నేరుగా కూరగాయలు, ఇతర ధాన్యం చేరేలా చూస్తున్నాం. ఇప్పుడు నేరుగా కష్టమర్లే రైతులు అడిగి, తమకు కావల్సినవి తెప్పించుకుంటున్నారు. రైతులు పువ్వులతో చేసిన ఆర్గానిక్ కలర్స్‌ని మా గ్రూప్ అంతా హోళీకి ఉపయోగించాం.



– శోభా కార్తీక్, కరాటే ఇన్‌స్ట్రక్టర్

పార్టీకి వెళితే... స్టీల్ ప్లేట్, స్పూన్

బయట పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి, మా గ్రూప్ సభ్యులు యూజ్ అండ్ త్రో వస్తువులు వాడవద్దని ముందే నిర్ణయించుకున్నాం. దీంతో నేను మా పాప కోసం కేక్ కొనడానికి బేకరీకి వెళ్లినా వెంట స్టీల్ బాక్స్ తీసుకెళతాను. ఏదైనా పార్టీకి వెళ్లినా స్టీల్ ప్లేట్, స్పూన్, టీ కప్పు వెంటే ఉంటుంది. ఇందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. చెప్పడమే కాదు చేసి చూపితేనే అందరూ ఈ పద్ధతిని అవలంబిస్తారు. కొత్తపేట రైతు మార్కెట్‌కి వెళ్లినప్పుడు అక్కడివాళ్లు టీ కోసం యూజ్ అండ్ త్రో కప్స్ ఎక్కువ వాడుతుండటం చూశాం. వాటిల్లో తాగడం ఆరోగ్యానికీ మంచిది కాదు. అందుకని, సిరామిక్ కప్పుల సెట్స్ తీసుకెళ్లి అక్కడి వర్కర్స్‌కి ఇచ్చి, ఎందుకు ప్లాస్టిక్ మంచిదో కాదో వివరించి వచ్చాం. మా రన్నర్స్ గ్రూప్‌లోని 28 మందిమి కలిసి ఇటీవల భువనగిరి కోట శుభ్రం చేయడానికి వెళ్లాం. అక్కడంతా రేపర్స్, పాలిథిన్ కవర్స్, ప్లాస్టిక్ బాటిల్స్... కనిపించాయి. మైక్రో ప్లాస్టిక్‌కి అయితే కొదవే లేదు. మేం కోట దిగి కిందకు వచ్చేసరికి వెంట తీసుకెళ్లిన బ్యాగులన్నీ నిండిపోయాయి. మా గ్రూప్‌లో జంతుప్రేమికులూ ఉన్నారు. వీధికుక్కలు దాడి చేస్తున్నాయని వాటిని కొట్టడం, చంపడం చేస్తుంటారు. వాటికి సరైన ఆహారం లేకనే అలా చేస్తుంటాయి. కారణాలు అన్వేషించాలి కానీ, చంపేస్తే ఎలా? అందుకే వాటికి కావల్సిన ఆహారం వండిపెట్టడం, అనారోగ్యంగా ఉన్నవాటికి చికిత్స అందించటం వంటివి గత పదేళ్లుగా చేస్తున్నాం. న్యూస్ పేపర్స్‌ని సేకరించి, స్కూల్ పిల్లల చేత బ్యాగులు చేయించి కూరగాయల మార్కెట్ దగ్గర కష్టమర్లకు ఇవ్వాలనే ప్లాన్ చేస్తున్నాం.



– శ్రావణి, ఆర్కిటెక్ట్

బంధుమిత్రులలోనూ అవగాహన



మా గ్రూప్‌లో మల్టీ టాస్కింగ్ చేస్తున్న లాయర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్లు, వివిధ రంగాలలో వర్క్ చేస్తున్నవారున్నారు. సిటీలో వివిధ చోట్ల నుంచి రన్‌లో పాల్గొనడానికి వచ్చే ఫ్రెండ్స్ ఉన్నారు. ప్రతిరోజూ వాకింగ్, రన్నింగ్‌కి కేటాయించే టైమ్, తీసుకోవాల్సిన హెల్తీ ఫుడ్ గురించి ఎవరి ఫిట్‌నెస్ బట్టి వారికి షెడ్యూల్ చేసుకుంటాం. నోబుల్ కాజెజ్ రన్స్ అన్నింటిలోనూ పాల్గొంటుంటాం. ఈ ప్రయోజనాలను మరికొందరికి అందించాలనే ఆలోచనతో బంధు, మిత్రులలోనూ, మా పిల్లలను కూడా రన్నర్స్ గ్రూప్‌లలో పాల్గొనేలా ఎంకరేజ్ చేస్తున్నాం. చుట్టూ ఉన్నవారిలో ఆరోగ్య అవగాహనతో ప్లాస్టిక్ ఫ్రీ జోన్స్ చేయాలనుకున్నాం. రన్ గ్రూప్ పార్టీలలో పర్యావరణ హితంగా ఏమేం చేయచ్చు అనే అంశాల మీద చర్చించుకొని, వారాంతాల్లో ఆ కార్యక్రమాలను నిర్వహిస్తుంటాం.

– డాక్టర్ శిరీష, గైనకాలజిస్ట్

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పింక్ ట్యాక్స్



షేమ్ షేమ్ పింక్ టాక్స్

పెంపకంలో.. అవకాశాల్లో.. వేతనాల్లో లింగ వివక్ష క్రిస్టల్ క్లియర్!

అది ధరల్లో కూడా ఉందన్న విషయం తెలుసా? అదీ స్త్రీ, పురుషులు ఇద్దరూ ఉపయోగించే ఒకే రకమైన వస్తువుల ధరల్లో! నిజం..!

కేవలం ప్యాకింగ్‌లో తేడా వల్ల పర్సనల్ హైజీన్, స్కిన్ కేర్ ప్రాడక్ట్స్ నుంచి దుస్తుల దాకా మగవాళ్ల కన్నా మహిళలు ఎక్కువ ధర చెల్లించి కొంటున్నారు. దీన్ని పింక్ టాక్స్ అంటున్నారు.

ఇద్దరూ వాడే ఒకేరకమైన ప్రాడక్ట్స్ మీద స్త్రీలు సగటున ఏడు శాతం అధికంగా చెల్లిస్తున్నారట. కేవలం పింక్ ప్యాక్‌లో ఉన్నందున రేజర్ బ్లేడ్స్ మీద 29 శాతం, బాడీ వాష్ మీద 16 శాతం ఎక్కువ వెచ్చిస్తున్నారట.

ఆ లెక్కన ఒకేరకమైన వస్తువులు,సేవల మీద పురుషుల కన్నా స్త్రీలు ఏడాదికి సగటున లక్ష రూపాయలు అధికంగా చెల్లిస్తున్నట్టు అంచనా. దీని మీద బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజూందార్ షా కూడా స్పందించారు. 'పింక్ టాక్స్ అనేది లింగ వివక్షకే పరాకాష్ఠ. దీన్ని మహిళలు తీవ్రంగా పరిగణించాలి. ధరల్లో వ్యత్యాసమున్న అలాంటి ప్రాడక్ట్స్‌ను కొనకుండా ఆ వివక్షను వ్యతిరేకించాలి' అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పింక్ టాక్స్ అనేది మహిళల మీద ఆర్థిక భారాన్ని మోపడమే కాదు సమాజంలో ఇప్పటికే ఉన్న వివక్షను బలపరచే ప్రమాదాన్నీ సూచిస్తోందంటున్నారు సామాజిక విశ్లేషకులు. మార్కెట్‌లో ఏ తీరైనా.. ధోరణి అయినా న్యాయమైన ధరతో పాటు జెండర్ ఈక్వాలిటీని ప్రమోట్ చేసేట్టుగా, వివక్షతో కూడిన సామాజిక నియమాలను సవాలు చేసేట్టుగా ఉండాలి తప్ప వివక్షను ప్రేరేపించేట్టుగా ఉండకూడదని చెబుతున్నారు. ఈ పింక్ టాక్స్‌ను సవాలు చేయడానికి మన దగ్గర ప్రత్యేకమైన చట్టం లేకపోయినప్పటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14.. రైట్ టు ఈక్వాలిటీ కింద కోర్టులో దావా వేయొచ్చు.

పేరెంటింగ్

మార్కులను కాదు పిల్లలను ప్రేమించండి

'డియర్ పేరెంట్స్.. ఇది పరీక్షల సమయం! మీ పిల్లల కన్నా మీరే ఎక్కువ ఆందోళనగా ఉండుంటారు.. వాళ్ల పరీక్షలు ఎలా రాస్తారో.. వందకు వంద మార్కులు తెచ్చుకుంటారో లేదో.. ఇంజినీరింగ్, మెడిసిన్‌కి ఎలిజిబుల్‌గా నిలబడతారో లేదో అని! రేపు పరీక్షలు రాయబోయే పిల్లల్లో ఒక మ్యుజీషియన్ ఉండొచ్చు.. వాడు కెమిస్ట్రీని పెద్దగా పట్టించుకోకపోవచ్చు. ఒక అథ్లెట్ ఉండొచ్చు.. ఆ అమ్మాయికి ఫిజిక్స్ కన్నా ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యం కావచ్చు. ఆర్టిస్ట్ ఉండొచ్చు.. ఆ స్టూడెంట్‌కి మ్యాథ్స్‌ని అర్థంచేసుకోవాల్సిన అవసరం లేకపోవచ్చు. ఆంత్రప్రెన్యూర్స్ ఉండొచ్చు.. వాళ్లకు హిస్టరీ, ఇంగ్లిష్ లిటరేచర్‌తో పనిలేకపోవచ్చు. మీ పిల్లలు మంచి మార్కులు తెచ్చుకుంటే చాలా సంతోషం. ఒక వేళ తెచ్చుకోకపోతే.. వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకండి. 'పర్లేదు..మళ్లీ పరీక్ష రాసుకోవచ్చులే' అంటూ అనునయించండి. ఆ ప్రేమతో వాళ్ల కలలను సాకారం చేసుకుంటారు. ఆ ధైర్యంతో వాళ్ల జీవితాన్ని గెలుస్తారు. ప్రపంచంలో కేవలం డాక్టర్లు, ఇంజినీర్లు మాత్రమే సంతోషంగా ఉంటారనే మైండ్‌సెట్‌ను మార్చుకోండి. మార్కులను కాకుండా పిల్లలను ప్రేమించండి.' ఇది ఒక ప్రిన్సిపల్ పేరెంట్స్‌కి రాసిన ఉత్తరం.



లీగల్

ప్రైవేటు స్కూళ్లకు సైతం గ్రాట్యుటీ చట్టం వర్తిస్తుంది!

నా పేరు జి.సుధీర్. నేను హైదరాబాద్ లో ఉంటాను. నేను ఒక కార్పొరేట్ విద్యా సంస్థలో గత పదిహేను సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. గత నెల (ఫిబ్రవరి 2025), మా హెడ్ నాకు వేరే బ్రాంచ్ కు బదిలీ చేశారు. కానీ నేనూ ఆ రోజు నుండి డ్యూటీ కి వెళ్ళడం లేదు. నా రాజీనామా కూడా ఇవ్వలేదు. నా చివరి జీతం (ఫిబ్రవరి నెల) పొందడానికి, పి.ఎఫ్., గ్రాట్యుటీ సెటిల్‌మెంట్ కోసం నేను ఏమి చేయాలి? దీనిపై లీగల్‌గా ప్రొసీడ్ అవ్వాలంటే ఎలా? సలహా ఇవ్వగలరు.

– జి. సుధీర్, హైదరాబాద్.

ప్రైవేటు స్కూలు అయినప్పటికీ గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ పొందడం అనేది మీ హక్కు. ప్రైవేటు స్కూళ్లకు గ్రాట్యుటీ చట్టం వర్తించదు అంటూ పలు స్కూళ్ల యాజమాన్యాలు చేసిన వాదనలను సుప్రీం కోర్టు 2022లో తిరస్కరించింది. కాబట్టి మీరు కూడా గ్రాట్యుటీకి అర్హులు. అయితే గ్రాట్యుటీ పొందాలి అంటే మీరు కనీసం ఐదు సంవత్సరాలు (లేదా 4 సంవత్సరాల 7 నెలల కన్నా ఎక్కువ) సదరు సంస్థలో పని చేసే ఉండాలి. అలా పని చేసి ఉంటే మీకు గ్రాట్యుటీ చట్టం నిర్ణయించిన కాల్కులేషన్ (జీతము X 15 రోజులు X పనిచేసిన వ్యవధి / 26) ఆధారంగా గ్రాట్యుటీ చెల్లించవలసి ఉంటుంది. మీరు పనిచేసిన స్కూలు వారికి లిఖితపూర్వకంగా రాజీనామా చేసి, మీకు రావలసిన పి.ఎఫ్., గ్రాట్యుటీ సెటిల్‌మెంట్ కోసం ఒక దరఖాస్తు కూడా జత చేయండి. వారు పరిష్కరించని పక్షంలో హైదరాబాదులోని గ్రాట్యుటీ కమిషనర్ /లేబర్ కమిషనర్‌ను సంప్రదించి ఒక దరఖాస్తు సమర్పించవలసి ఉంటుంది. అలాగే పి.ఎఫ్ కూడా ఇవ్వకపోతే, పి.ఎఫ్. కమిషనర్ వద్ద దరఖాస్తు/ఫిర్యాదు చేయవలసి ఉంటుంది. మీరు పని చేసిన స్కూలు వారికి నోటీసులు పంపించి వారి పక్షం కూడా విన్న తర్వాత మీకు రావలసిన బకాయిలు చెల్లించవలసినదిగా సదరు కమిషనర్లు ఆదేశాలు జారీ చేస్తారు. రెండు విభాగాల నుంచి కూడా మీకు సరైన ఉపశమనం లభిస్తుంది. న్యాయం జరుగుతుంది. ముందు మీరు స్కూల్‌కు రాజీనామా లేఖను అందజేయండి.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

ఇంటిప్స్

పాత్రలపై మొండి మరకలు పేరుకు పోయాయా?

- నిమ్మకాయ, ఉప్పు సహజ సిద్ధమైన క్లీనర్‌లుగా పని చేస్తాయి. ఇవి ఎలాంటి మరకలనైనా శుభ్రం చేయడానికి బాగా ఉపయోగపడతాయి. పాత్రపై పేరుకుపోయిన మొండి మరకలను పోగొట్టడానికి నిమ్మకాయ, ఉప్పుతో పేస్ట్ తయారు చేయాలి. ఒక నిమ్మకాయని సగానికి కోసి, ఒక సగంలో ఉప్పు వేసి పాత్రపై ఉన్న మరకపై బాగా రుద్దాలి. ఇలా చేస్తే పాత్రపై ఉన్న మరకలు పోతాయి. తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి.



వెనిగర్ ఒక పవర్ ఫుల్ క్లీనర్. ఇది పాత్రపై ఉండే మొండి మరకలను సులభంగా తొలగించడానికి సహాయపడుతుంది. ఒక పాత్రలో సమానంగా నీరు, వెనిగర్ నింపి కొన్ని గంటలు అలానే ఉంచండి. లేదంటే రాత్రంతా నానబెట్టండి. స్క్రబ్‌తో బాగా మరకలపై రుద్ది, తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. వెనిగర్‌లో ఉండే ఆమ్ల గుణాలు మరకను సులభంగా తొలగిస్తాయి.

బ్యూటిప్స్


కాంతివంతమైన కళ్లకోసం...



- కీరా, బంగాళదుంప రెండిటినీ జ్యూస్ చేసి, కాటన్‌ను గుండ్రంగా చేసుకుని ఆ జ్యూస్‌లోముంచి కళ్లపై పెట్టుకోవాలి. 15–20 నిమిషాల తర్వాత కాటన్ తీసేసి నీటితో కడిగేయాలి. తర్వాత బేబీ ఆయిల్‌ని కంటి చుట్టూ అప్లై చేయాలి. ఇలా చేస్తే అలసిన కళ్ళు తిరిగి కాంతివంతంగా మారతాయి.
- కనురెప్పలు పొడువుగా ఒత్తుగా పెరగాలంటే... ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు క్యాస్టర్ ఆయిల్‌ని అప్లై చేయాలి. రెప్పలు రాలిపోకుండా దృఢంగా అవుతాయి.
- కొబ్బరినూనెను మధ్యవేలితో తీసుకుని కంటి చుట్టూ గుండ్రంగా మసాజ్ చేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కంటి చుట్టూ ఉండే నల్లని వలయాలు పోతాయి.
- కంటి కింద చర్మం ఉబ్బెత్తుగా అవుతుంటే... బంగాళదుంపను గుండ్రంగా కోసి ఒక క్లాత్‌లో చుట్టి 15 నిముషాలపాటు కళ్ళపైన పెట్టుకోవాలి. ● నీటిలో కొంచె ఉప్పు కలిపి ఆ నీటితో కళ్ళను కడిగితే కళ్ళు నిర్మలంగా మారి, మెరుస్తాయి.
- టొమాటో రసం, నిమ్మరసం రెండిటినీ సమపాళల్లో కలిపి కంటి చుట్టూ అప్లై చేయాలి. 30 నిమిషాల తర్వాత చన్నీటితో ఓసారి, వేడినీటితో ఒకసారి కళ్ళను కడగాలి.

భాషకు రెండువైపులా పదును ఉంటుంది! అందుకే దాన్ని జెండర్ ఈక్వాలిటీతో న్యూట్రల్ చేద్దాం!

భాషలోనూ వివక్ష ఎందుకు?



చాలారోజుల కిందట ...

'అమెరికాలోని ఆడవాళ్లంతా జిడ్డుపాత్రలతో కుస్తీ పడుతున్నారు' అంటూ తన ప్రాడక్ట్ అయిన అంట్లు తోమే సబ్బు గురించి ఒక యాడ్ ఇచ్చింది ప్రాక్టర్ అండ్ గాంబుల్ సంస్థ. వెంటనే ఆ కంపెనీకి ఓ పదకొండేళ్ల అమ్మాయి నుంచి ఉత్తరం వచ్చింది.. 'భోజనం అందరికీ కావాలి, అంట్లతో కుస్తీ మాత్రం ఆడవాళ్లే పట్టాలి. మగవాళ్లెందుకు అంట్లు తోమకూడదు? దయచేసి మీ యాడ్‌లో అమెరికాలోని ఆడవాళ్లు అని తీసేసి అమెరికా ప్రజలు అని మార్చండి?' అని! ప్రాక్టర్ అండ్ గాంబుల్ తన తప్పు తెలుసుకుని 'అమెరికా ప్రజలు' అని మార్చుకుంది. ఆ ఉత్తరం రాసిన అమ్మాయెవరో కాదు.. మీడియా పర్సనాలిటీ, బ్రిటిష్ రాచకుటుంబం కోడలు మెఘన్ మార్కెల్.

ఈ మధ్య..

'మా సోషల్ బుక్‌లో ఒకచోట 'మ్యాన్ మేడ్ ఆర్ నేచురల్?' అని ఉంది. విమెన్ అని ఎందుకు లేదు? వాళ్లకు చేతకాదనా? మ్యాన్ లేదా ఉమన్ అనే బదులు ప్రజలు అనొచ్చు కదా? అబ్రహం లింకన్ కూడా ఆల్ మెన్ ఆర్ క్రియేటెడ్ ఈక్వల్ అన్నాడు. ప్రజలంతా సమానమే అనుంటే బాగుండేది కదమ్మా!' నిండా పదేళ్లు లేని ఓ చిన్నారి ఆలోచన!

సవరించుకోవాలి..

పై రెండు ఉదాహరణల్లోని విషయం.. భాషకూ జెండర్ ఈక్వాలిటీ ఉండాలనే! కొడుకు, కూతురు ఇద్దరూ సమానమనే ఎరుక పెంపకంతోనే మొదలవ్వాలని ఎలా అనుకుంటున్నామో.. భాష విషయంలోనూ అలాగే అనుకోవాలి. పనికి సామర్థ్యం, నిర్దేశిత అర్హతలు ప్రామాణికమవుతాయి కానీ స్త్రీ, పురుష జెండర్లు కావు కదా! ఆడవాళ్లు అల్లికలకే పరిమితమై పోవట్లేదు.. అంతరిక్షానికీ వెళ్తున్నారు. అందుకే తదనుగుణంగా భాషను సవరించుకోవాలి.

వాళ్లూ మినహాయింపు కారు..

జెండర్ స్పృహ ఉన్న రచయితలు, దర్శకులూ వాస్తవికత, రానెస్ పేరుతో స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరచే తిట్లన్నిటినీ రచనల్లో, సినిమాల్లో ఉపయోగిస్తున్నారు. అదేమంటే 'దాన్నెందుకు జెండర్ కోణంలోంచి చూస్తారు? కోపానికో.. ఆవేశానికో ఎక్స్‌ప్రెషన్‌గా చూడాలి కానీ' అంటూ బదులిస్తున్నారు. అలా స్త్రీల వ్యక్తిత్వాన్ని హననం చేసే మాటలను భావోద్వేగ వ్యక్తీకరణగా భాషలో సర్దేసి.. దాన్నో సాధారణ విషయంగా మన మెదళ్లకు తర్ఫీదునిచ్చిందీ పితృస్వామ్యమే! కానీ అవగాహన పెరుగుతున్న కొద్దీ ఆ ఆలోచనను మార్చుకోవలసిన .. ఆ భాషను సరిదిద్దుకోవలసిన అవసరాన్ని గ్రహించాలి. పనులు, వృత్తులకున్న పేర్ల నుంచే ఇది మొదలవ్వాలి. ఈ కసరత్తు వల్ల లైంగిక పరిభాష, స్త్రీల వ్యక్తిత్వాన్ని హననం చేసే భావోద్వేగ వ్యక్తీకరణలూ నెమ్మదిగా మెదళ్ల నుంచి డిలీట్ అవుతాయి.

దస్తావేజులు.. పాఠ్యపుస్తకాల్లోనూ..

ఈ విషయంలో పాశ్చాత్యదేశాల్లో కృషి జరుగుతోంది. ముఖ్యంగా ఇంగ్లిష్‌లో! ఎయిర్ హోస్టెస్‌ని ఫ్లయిట్ అటెండెంట్‌గా, మ్యాన్.. ఉమన్ అనే పదాలను పర్సన్‌గా, బాలుడు.. బాలికను చైల్డ్‌గా, వెయిటర్.. వెయిట్రస్‌ను సర్వర్‌గా, యాక్టర్.. యాక్ట్రెస్‌ను పెర్‌ఫార్మర్‌గా.. ఇంకా ఫైర్‌ఫైటర్, పోలీస్ ఆఫీసర్ వంటి ఎన్నో జెండర్ న్యూట్రల్ పదాలను ఉపయోగిస్తున్నారు.ఇంకో అడుగుముందుకేసి జెండర్‌ను కేవలం స్త్రీ, పురుషులకే పరిమితం చేయకుండా మిగిలిన ఐడెంటిటీలనూ కలుపుకుంటూ అతడు, ఆమెకు బదులు they అనే పదాన్ని వాడుకలోకి తెచ్చుకున్నారు. స్కాండినేవియన్ దేశాలు సహా జర్మనీ, పోర్చుగల్, నెదర్లాండ్స్ లాంటి యూరోపియన్ దేశాలైతే అధికారిక వ్యవహారాలు, దస్తావేజులు, పాఠ్యపుస్తకాల్లోనూ జెండర్ న్యూట్రల్ లాంగ్వేజ్‌ను ప్రోత్సహిస్తున్నాయి.

చట్టాలు కూడా

ప్రగతిశీల దేశాలు కొన్ని లింగ వివక్షను రూపుమాపేందుకు థర్డ్ జెండర్‌నీ కలుపుకుంటూ జెండర్ న్యూట్రల్ లాంగ్వేజ్‌ను ప్రోత్సహించే చట్టాలనూ తెచ్చుకున్నాయి. ఆ జాబితాలో అమెరికా (ట్రంప్ వచ్చాక మార్పు వచ్చి ఉండొచ్చు), కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా వంటి దేశాలున్నాయి. ఇదివరకు స్త్రీకి చదువు లేదు. ఇంటిపట్టునే ఉండేది కాబట్టి ఆ పనులు ఆడవాళ్లకే పరిమితమై వాటి పరిభాష అంతా స్త్రీ లింగంలోనే స్థిరపడింది. ఇప్పుడు మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమంగా రాణిస్తున్నారు. వాళ్ల పనికి గుర్తింపు, గౌరవ మర్యాదలు కావాలి. ఆ ప్రయత్నంలో తొలి అడుగు భాషదే. స్త్రీ, పురుష సమానత్వ ప్రయాణంలోని ప్రతి మార్పునూ గమనిస్తూ తదనుగుణంగా భాషను దిద్దుకోవాలి.

– సరస్వతి రమ, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

భాషకూ జెండర్‌కూ సంబంధం ఉంది

భాషకు, జెండర్‌కు ఉన్న సంబంధాన్ని సామాజిక శాస్త్రం, సాంస్కృతిక సిద్ధాంతాలు, భాషాశాస్త్రం, స్త్రీవాద కోణాల నుంచి చూడవచ్చు. విశ్లేషించవచ్చు. దీనిపై 1970ల నుంచే పాశ్చాత్య దేశాల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. నిత్యజీవితంలో భాషను జెండర్‌ను నిర్దేశిస్తూ కాక, జెండర్ న్యూట్రల్‌గా వాడడానికి అవకాశం ఉందా అన్నది ఇటీవల మనదేశంలోనూ జరుగుతున్న చర్చ. పనిగట్టుకుని స్త్రీ అని చెప్పాలా లేక ఆ హోదా, ఆ పదవి, ఆ స్థానం మాత్రమే చెప్పి, అందులో ఉన్నది స్త్రీ అయినా, పురుషుడైనా సమానమేనని ధ్వనించేలా పదప్రయోగం ఉండాలా అన్నది దీని సారాంశం. ఫలితంగా తెలుగులో అధ్యక్షుడు, అధ్యక్షురాలు అనకుండా 'అధ్యక్షులు' అని, మేనేజింగ్ డైరెక్టర్‌ని కార్యనిర్వహణాధికారి అంటే చాలనే అవగాహనకు వచ్చేశాం. మంత్రి, ఆచార్య, గురువు అనే పదాలనూ ఇద్దరికీ వాడుతున్నాం. చెప్పొచ్చేదేంటంటే భాషకూ జెండర్‌కూ సంబంధం ఉంది. స్త్రీలు మొరటుగా మాట్లాడినా, బూతులు వాడినా వెంటనే గగ్గోలవుతుంది. పురుషుడి దుర్భాషలను సహజంగా తీసుకునే అలవాటు ఇంకా పోలేదు. ఇవన్నీ స్త్రీవాద విమర్శలో చర్చించాల్సిన విషయాలు.



– సి. మృణాళిని, రచయిత

అనాగరికులుగా పరిగణిస్తారు..



మా ఫినిష్ భాష స్వతహాగా జెండర్ న్యూట్రల్ భాష. స్త్రీ, పురుషులిద్దరికీ ఒకే సర్వనామం ఉంటుంది. చిన్నా, పెద్ద అనే తేడా కూడా లేకుండా అందరికీ ఒకే రకమైన సంబోధన ఉంటుంది. తెలుగులో స్త్రీకి ఇది, అది అనే పదాలున్నట్టు మా భాషలో లేవు. అందుకే స్త్రీ వ్యక్తిత్వాన్ని కించపరచే మాటలు ఉండవు. ఎప్పుడైనా ఎవరినోటి నుంచైనా అలాంటి ఇంగ్లిష్ మాటలు వినిపిస్తే వాళ్లను అనాగరికులుగా పరిగణిస్తారు.

– ముచ్చర్ల రైతా ప్రదీప్,
ఆంత్రప్రెన్యూర్ (తెలుగు వ్యక్తిని పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో ఉంటున్న ఫిన్లండ్ వనిత)



తొలి రౌండ్‌లోనే లక్ష్య చహర్ ఓటమి

వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌ను భారత్ పరాజయంతో ప్రారంభించింది. బ్రెజిల్‌లోని ఫాజ్ డు ఇగువాకు నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల 80 కేజీల విభాగంలో భారత బాక్సర్ లక్ష్య చహర్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. బ్రెజిల్ బాక్సర్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత వాండర్లీ పెరీరాతో జరిగిన బౌట్‌లో లక్ష్య చహర్ 0–5తో ఓడిపోయాడు. 150 పాయింట్లకుగాను పెరీరాకు 149 పాయింట్లు... లక్ష్య చహర్‌కు 135 పాయింట్లు లభించాయి. వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ నుంచి పది మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.



ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్: నాలుగో స్థానంలో అర్జున్

అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) తాజా ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత స్టార్ ఇరిగేశి అర్జున్ నాలుగో స్థానానికి చేరుకున్నాడు. గత నెలలో అర్జున్ ఐదో ర్యాంక్‌లో ఉన్నాడు. ప్రస్తుతం అర్జున్ ఖాతాలో 2782 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. మరోవైపు ప్రపంచ చాంపియన్, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 2787 రేటింగ్ పాయింట్లతో మూడో ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
బెంగళూరు	2	2	0	4	2.266
పంజాబ్	2	2	0	4	1.485
ఢిల్లీ	2	2	0	4	1.320
గుజరాత్	2	1	1	2	0.625
ముంబై	3	1	2	2	0.309
లక్నో	3	1	2	2	-0.150
చెన్నై	3	1	2	2	-0.771
హైదరాబాద్	3	1	2	2	-0.871
రాజస్తాన్	3	1	2	2	-1.112
కోల్‌కతా	3	1	2	2	-1.428

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

పంజాబ్ ఫటాఫట్



172 పరుగుల లక్ష్యాన్ని 16.2 ఓవర్లలో ఛేదించిన పంజాబ్ కింగ్స్

- లక్నో సూపర్ జెయింట్స్‌పై 8 వికెట్లతో ఘనవిజయం
- ప్రభ్‌సిమ్రన్ సింగ్ మెరుపులు
- రాణించిన అర్ష్‌దీప్, శ్రేయస్ అయ్యర్

ప్రభ్‌సిమ్రన్

లక్నో: కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆధ్వర్యంలో ఐపీఎల్ 18వ సీజన్‌లో అడుగు పెట్టిన పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో విజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయాన్ని అందుకుంది. 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 177 పరుగులు సాధించి గెలిచింది. 171 వద్ద స్కోరు సమమైనపుడు లక్నో బౌలర్ అబ్దుల్ సమద్ వేసిన బంతిని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (30 బంతుల్లో 52 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) సిక్స్‌గా మలిచి పంజాబ్ కింగ్స్‌ను విజయతీరానికి చేర్చాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బంతుల్లో 69; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) లక్నో బౌలర్ల భరతం పట్టి మెరుపు అర్ధసెంచరీతో అలరించాడు. ప్రభ్‌సిమ్రన్ అవుటయ్యాక వచ్చిన నేహల్ వధేరా (25 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడటంతో పంజాబ్ ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని అందుకుంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు సాధించింది. అర్ష్‌దీప్ సింగ్ (3/43) మూడు కీలక వికెట్లు పడగొట్టగా... మ్యాక్స్‌వెల్, ఫెర్గూసన్, యాన్సెన్, చహల్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. లక్నో జట్టుకు ఆశించిన ఆరంభం దక్కలేదు. పవర్‌ప్లే ఆరు ఓవర్లు ముగిసేసరికి లక్నో టాప్-3 బ్యాటర్లను కోల్పోయింది. మిచెల్ మార్ష్ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరగ్గా... పంత్ 2 పరుగులతో నిరాశపరిచాడు. క్రీజులో నిలదొక్కుకున్న దశలో మార్క్‌రమ్‌ను ఫెర్గూసన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత పూరన్ (30 బంతుల్లో 44; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుశ్ బదోని (33 బంతుల్లో 41; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఆటతో లక్నో స్కోరు 100 దాటింది. చివర్లో సమద్ (12 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించడంతో లక్నో జట్టు ప్రత్యర్థికి గౌరవప్రద లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేజింగ్‌లో ఆరంభంలోనే ఆర్య వికెట్ కోల్పోయినా పంజాబ్ వెనక్కి తగ్గలేదు. లక్నో బౌలర్లపై ప్రభ్‌సిమ్రన్, అయ్యర్ ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగెత్తించారు. ముఖ్యంగా ప్రభ్‌సిమ్రన్ కళ్లు చెదిరే షాట్‌లతో అలరించాడు. శార్దుల్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో 4,6 కొట్టిన ప్రభ్‌సిమ్రన్... రవి బిష్ణోయ్ వేసిన ఆరో ఓవర్లో 4,4,6తో మెరిశాడు. అదే జోరులో 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్‌లో 11వ ఓవర్ తొలి బంతికి ప్రభ్‌సిమ్రన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. దిగ్వేశ్ వేసిన బంతిని డీప్ మిడ్‌వికెట్ వైపు ప్రభ్‌సిమ్రన్ షాట్ ఆడగా... ఆయుశ్ బదోని క్యాచ్ తీసుకొని బౌండరీ లైను వద్ద బ్యాలెన్స్ కోల్పోయి బంతిని గాల్లోకి విసిరాడు. డీప్ స్క్వేర్ లెగ్ వద్ద నుంచి వచ్చిన రవి బిష్ణోయ్ గాల్లో ఉన్న బంతిని పట్టుకోవడంతో ప్రభ్‌సిమ్రన్ పెవిలియన్ చేరుకున్నాడు. ప్రభ్‌సిమ్రన్ వెనుదిరిగాక వచ్చిన నేహల్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో పంజాబ్ 17వ ఓవర్లోనే విజయాన్ని అందుకుంది.



ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (బి) ఫెర్గూసన్ 28; మిచెల్ మార్ష్ (సి) యాన్సెన్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; నికోలస్ పూరన్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) చహల్ 44; రిషభ్ పంత్ (సి) చహల్ (బి) మ్యాక్స్‌వెల్ 2; ఆయుశ్ బదోని (సి) మ్యాక్స్‌వెల్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 41; డేవిడ్ మిల్లర్ (సి) ప్రభ్‌సిమ్రన్ సింగ్ (బి) యాన్సెన్ 19; అబ్దుల్ సమద్ (సి) ఆర్య (బి) అర్ష్‌దీప్ సింగ్ 27; శార్దుల్ ఠాకూర్ (నాటౌట్) 3; అవేశ్ ఖాన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–1, 2–32, 3–35, 4–89, 5–119, 6–166, 7–167. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–43–3, ఫెర్గూసన్ 3–0–26–1, మ్యాక్స్‌వెల్ 3–0–22–1, మార్కో యాన్సెన్ 4–0–28–1, స్టొయినిస్ 2–0–15–0, యుజువేంద్ర చహల్ 4–0–36–1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) శార్దుల్ ఠాకూర్ (బి) దిగ్వేశ్ రాఠి 8; ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) రవి బిష్ణోయ్ (బి) దిగ్వేశ్ రాఠి 69; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 52; నేహల్ వధేరా (నాటౌట్) 43; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (16.2 ఓవర్లలో 2 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–26, 2–110. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 3–0–39–0, అవేశ్ ఖాన్ 3–0–30–0, దిగ్వేశ్ రాఠి 4–0–30–2, రవి బిష్ణోయ్ 3–0–43–0, మణిమారన్ సిద్ధార్థ్ 3–0–28–0, అబ్దుల్ సమద్ 0.2–0–6–0.

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X గుజరాత్
వేదిక: బెంగళూరు
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అంతర్జాతీయ హాకీకి వందన గుడ్‌బై

భారత్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రీడాకారిణిగా ఘనత



న్యూఢిల్లీ: భారత్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా హాకీ ప్లేయర్‌గా గుర్తింపు పొందిన వందన కటారియా అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఉత్తరాఖండ్‌కు చెందిన 32 ఏళ్ల వందన భారత్ తరఫున 320 మ్యాచ్‌లు ఆడి 158 గోల్స్ సాధించింది. తన 15 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో వందన పలుమార్లు భారత విజయాల్లో ముఖ్యపాత్ర పోషించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులో... 2016 రియో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ భారత జట్టులో వందన సభ్యురాలిగా ఉంది. 'బరువెక్కిన హృదయంతో నేను అంతర్జాతీయ హాకీ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నానని ప్రకటిస్తున్నా. నాలో ఇంకా ఆడే సత్తా లేదనిగానీ, నాలో ఆడాలనే కోరిక తగ్గిపోయిందనిగానీ వీడ్కోలు నిర్ణయం తీసుకోలేదు. కెరీర్‌పరంగా ఉన్నతస్థితిలో ఉన్నపుడే అంతర్జాతీయస్థాయిలో ఆటకు గుడ్‌బై పలకాలని భావించా. అయితే హాకీ ఇండియా లీగ్‌లో శ్రాచి రార్ బెంగాల్ టైగర్స్ క్లబ్ జట్టుకు ఆడతా. నేనీ స్థాయికి చేరుకోవడానికి వెన్నంటే నిలిచి ప్రోత్సహించిన వారందరికీ ధన్యవాదాలు' అని వందన వ్యాఖ్యానించింది. 2009లో భారత సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన వందన 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 'హ్యాట్రిక్' సాధించింది. తద్వారా ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ నమోదు చేసిన తొలి భారతీయ హాకీ క్రీడాకారిణిగా ఘనత వహించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి 2021లో 'అర్జున అవార్డు'... 2022లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న వందన వరుసగా మూడు (2014లో కాంస్యం, 2018లో రజతం, 2022లో కాంస్యం) ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో స్నేహిత్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ అద్భుత పురోగతి సాధించాడు. గతవారం చెన్నైలో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ లెవెల్ టోర్నీలో స్నేహిత్ క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. ఈ ప్రదర్శనతో అతను తన కెరీర్‌లో తొలిసారి టాప్-100లోకి వచ్చాడు. మంగళవారం విడుదల చేసిన పురుషుల సింగిల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో స్నేహిత్ ఏకంగా 34 స్థానాలు ఎగబాకి 89వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీ రెండో రౌండ్‌లో స్నేహిత్ ప్రపంచ 29వ ర్యాంకర్ యుకియా ఉడా (జపాన్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత దిగ్గజం, ఐదుసార్లు ఒలింపియన్ ఆచంట శరత్ కమల్‌పై గెలిచి పెను సంచలనం సృష్టించాడు. 'నా తాజా ప్రపంచ ర్యాంక్‌తో ఎంతో సంతోషంగా ఉన్నా. ఈ ఏడాదిలోపు టాప్-100లోకి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దానిని మూడు నెలల్లోపే అందుకున్నా. ఇక టాప్-50లోకి రావడమే నా తదుపరి లక్ష్యం' అని అంతర్జాతీయస్థాయిలో భారత్ తరఫున డజనుకంటే ఎక్కువ పతకాలు సాధించిన స్నేహిత్ వ్యాఖ్యానించాడు. మరోవైపు చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీలో సెమీ ఫైనల్ చేరి కాంస్య పతకాన్ని నెగ్గిన గుజరాత్ ప్లేయర్ మానవ్ ఠక్కర్ కూడా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను సాధించాడు. మానవ్ 16 స్థానాలు మెరుగుపర్చుకొని 47వ ర్యాంక్‌లో నిలిచి భారత నంబర్‌వన్ అయ్యాడు. భారత్‌కే చెందిన హర్మీత్ దేశాయ్ 68వ ర్యాంక్‌లో, మనుష్ షా 73వ ర్యాంక్‌లో నిలిచారు. చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీతో అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన శరత్ కమల్ 80వ ర్యాంక్‌లో నిలిచాడు.

సాక్షి సినిమా

తమన్నా స్పెషల్ రైడ్



స్పెషల్ సాంగ్స్ చేయడంలో హీరోయిన్ తమన్నా సమ్‌థింగ్ స్పెషల్. హీరోయిన్‌గా చేస్తూనే, మరోవైపు వీలైనప్పుడల్లా స్పెషల్ సాంగ్స్ చేస్తుంటారు తమన్నా. ఇలా కెరీర్‌లో ఇప్పటికే పదికి పైగా ప్రత్యేక పాటల్లో నటించారీ బ్యూటీ. అయితే రజనీకాంత్ 'జైలర్'లో 'కావాలయ్యా...', రాజ్‌కుమార్ రావు-శ్రద్ధా కపూర్ 'స్త్రీ 2'లో 'ఆజ్ కా రాత్' సాంగ్స్‌లో తమన్నా నెక్ట్స్ లెవల్ పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఇక తాజాగా అజయ్ దేవగన్ 'రైడ్ 2' సినిమాలో తమన్నా ఓ స్పెషల్ సాంగ్ చేయనున్నారని బాలీవుడ్ టాక్. అంతేకాదు... ఈ స్పెషల్ సాంగ్‌లో తమన్నాతో పాటు యో యో హనీ సింగ్ కూడా ఉంటారట. ఇంకా 'ఆజ్ కీ రాత్..' పాటకు కొరియోగ్రఫీ చేసిన విజయ్ గంగూలీయే 'రైడ్ 2'లోని స్పెషల్ సాంగ్‌కూ కొరియోగ్రఫీ చేయనున్నారట. రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో రూపొందుతున్న 'రైడ్ 2' మూవీ త్వరలో రిలీజ్ కానుంది. 2018లో వచ్చిన 'రైడ్'కి సీక్వెల్‌గా 'రైడ్ 2' రూపొందుతోంది.

మ్యాడ్ స్క్వేర్‌లో వినోదమే స్టార్


- నిర్మాత నాగవంశీ

''మ్యాడ్ స్క్వేర్'లో మంచి వినోదం ఉంది. ఈ చిత్రం రెండు ఏరియాల్లో మినహా మిగతా అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అయ్యింది. ఆ రెండు ఏరియాల్లో కూడా 90 శాతం బ్రేక్ ఈవెన్ అయింది. 4 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 70 కోట్ల గ్రాస్ వసూలు చేసింది'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మార్చి 28న విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో నాగవంశీ మాట్లాడుతూ– ''హైప్‌తో ఆడటానికి 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం 'బాహుబలి, కేజీఎఫ్, పుష్ప' వంటి సినిమాల తరహా సీక్వెల్ కాదు (2023లో వచ్చిన 'మ్యాడ్'కు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రూపొందింది). ఈ సినిమాలో వినోదమే స్టార్. విడుదలైన నాలుగైదు రోజుల్లోనే మా డిస్ట్రిబ్యూటర్స్ అందరూ లాభాల బాట పట్టడం హ్యాపీగా ఉంది. ఇక మా నిర్మాణ సంస్థలోని అల్లు అర్జున్–త్రివిక్రమ్‌గార్ల కాంబినేషన్‌లో మైథలాజికల్ ఫిల్మ్ అక్టోబరులో ప్రారంభమవుతుంది. రవితేజగారి 'మాస్ జాతర' సినిమాను జూలైలో రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం. 'మ్యాజిక్' సినిమాను జూన్ లేదా జూలైలో విడుదల చేస్తాం. సూర్యగారి 'రెట్రో'ని తెలుగులో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాం. మే 1న ఈ సినిమా విడుదల కానుంది. విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'ను మే 30న రిలీజ్ చేస్తాం'' అని తెలిపారు.

రెండు నెలలుగా పైరసీ సమస్య పెరిగింది. అయితే ఈసారి కొన్ని విషయాలు గమనించాం. ఓవర్సీస్‌లో సినిమా ప్రదర్శనకు కొన్ని దేశాల్లో సినిమా సెన్సార్ కావాలి. ఆ సెన్సార్ కోసం 'మ్యాడ్ స్క్వేర్' కాపీ ఇచ్చాం. ఆ కాపీ పైరసీగా రిలీజైంది. 'గేమ్ చేంజర్'కీ ఇలానే ఓవర్సీస్ సెన్సార్ కాపీ రిలీజైంది. ఈ రెండు సినిమాల విషయంలో ఈ అంశాలను గమనించాం. ఈ విషయంపై అక్కడి డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడాలి. ఇక థియేటర్‌లో పైరసీ అయితే ఏం చేయలేం. ఈ పైరసీ విషయమై ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజుగారితో చర్చించాలి. ప్రభుత్వాలను సంప్రదించి, ఏదైనా చేయాలి. లేకపోతే ఇంకా డ్యామేజ్ జరుగుతుంది.

కౌంట్‌డౌన్ స్టార్ట్


నాని

నాని హీరోగా నటించిన తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటించారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న విడుదల కానుంది. సరిగ్గా ఈ మూవీ విడుదలకు 30 రోజులు ఉండటంతో 30 డేస్ కౌంట్ డౌన్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''పవర్‌ఫుల్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. ఈ చిత్రంలో నాని ఫెరోషియస్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందిన ఈ సినిమా ఆడియన్స్‌కు సరికొత్త అనుభూతిని అందించేలా ఉంటుంది. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'ప్రేమ వెల్లువ...' పాటకు అద్భుతమైన స్పందన లభించింది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్.

ఆరోగ్యకరమైన హాస్యంతో...

''సారంగపాణి జాతకం'లో నాన్ తెలుగు యాక్టర్లు లేరు. అందరూ తెలుగువారు నటించిన పరిపూర్ణమైన తెలుగు సినిమా ఇది. ఎవరి డబ్బింగ్ వాళ్లే చెప్పుకున్నారు. హీరోయిన్ అయిన తెలుగమ్మాయి రూపా కొడువాయూర్ చక్కగా నటించింది'' అని డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ చెప్పారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ– ''జెంటిల్‌మన్, సమ్మోహనం' చిత్రాల తర్వాత కృష్ణప్రసాద్ కాంబినేషన్లో 'సారంగపాణి జాతకం' నాకు మూడో సినిమా. ఆయన నన్ను నమ్ముతారు. ఆ నమ్మకం ఇద్దరి మధ్య కొనసాగుతోంది. అన్ని వయసుల వారికి వినోదాన్ని అందించే ఆరోగ్యకరమైన హాస్యభరిత సినిమా ఇది. ఈ సినిమా చూసేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల కళ్లకు, చెవులకు చేతులు అడ్డు పెట్టాల్సిన అవసరం లేదు'' అన్నారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''ఇది జాతకాల మీద తీసిన సినిమా. నేను భగవంతుణ్ణి, జాతకాలని నమ్ముతాను. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వపడుతున్నాను'' అని చెప్పారు. ''ఇంద్రగంటిగారి దర్శకత్వంలో నటించాలన్న నా కల 'సారంగపాణి జాతకం'తో నెరవేరింది'' అన్నారు ప్రియదర్శి. ''ఇంద్రగంటిగారి సినిమాలో నటించడం నాకు ఎప్పుడూ స్పెషల్'' అన్నారు శ్రీనివాస్ అవసరాల. ''నాకు ఇష్టమైన డైరెక్టర్ ఇంద్రగంటిగారు అని ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. ఊహించని విధంగా ఆయన సినిమాలో నటించే చాన్స్ రావడం చాలా సంతోషాన్ని కలిగించింది'' అని పేర్కొన్నారు రూపా కొడువాయూర్. సినిమాటోగ్రాఫర్ పీజీ విందా, నటీనటులు సమీరా భరద్వాజ్, నివితా మనోజ్, అశోక్‌కుమార్, ప్రదీప్, వడ్లమాని శ్రీనివాస్ మాట్లాడారు.


రూపా కొడువాయూర్, ప్రియదర్శి

ఆద్యంతం సస్పెన్స్


'ఫ్రై డే' పోస్టర్

వికాస్ వశిష్ఠ, రోహిత్ బొడ్డపాటి, దియారాజ్, ఇనయా సుల్తానా, రిహానా హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఫ్రై డే'. ఈశ్వర్ బాబు ధూళిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. కేసనకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ కథతో 'ఫ్రై డే' నిర్మించాం. ప్రేక్షకుల్ని ఆద్యంతం ఆకట్టుకునేలా ఈశ్వర్ రూపొందించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సినిమాని రిలీజ్ చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమేరా: పృథ్వీ.

ట్రైలర్ చాలా బాగుంది - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

శ్రీహర్ష, కషికా కపూర్ జంటగా నటించిన చిత్రం 'ఎల్.వై.ఎఫ్' (లవ్ యువర్ ఫాదర్). దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు, సింగర్ ఎస్పీ చరణ్ ప్రధాన పాత్ర పోషించారు. పవన్ కేతరాజు దర్శకత్వం వహించారు. కిశోర్ రాఠీ, మహేష్ రాఠీ, ఎ. రామస్వామి రెడ్డి, ఎ. చేతన్ సాయిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని వీక్షించి, తొలి టిక్కెట్‌ని కొనుగోలు చేసిన అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ– ''ఎల్.వై.ఎఫ్' ట్రైలర్ చాలా బాగుంది. తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపొందినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వారణాసిలోని కాశీ విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.


కిషన్ రెడ్డితో 'ఎల్.వై.ఎఫ్' దర్శక-నిర్మాతలు

హారర్ ఆహ్వానం


'అమరావతికి ఆహ్వానం' పోస్టర్

శివ కంఠంనేని, ఎస్తర్, ధన్యా బాలకృష్ణ, సుప్రిత, అశోక్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ మూవీ 'అమరావతికి ఆహ్వానం'. జీవీకే దర్శకత్వంలో కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఒక మంచి హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను అలరించేలా ఈ మూవీ కథనం ఉంటుంది. హారర్ మూమెంట్స్, థ్రిల్లింగ్ సీన్స్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: పద్మనాభన్ భరద్వాజ్, కెమేరా: జె. ప్రభాకర్ రెడ్డి.

ప్రేక్షకులు థ్రిల్ అవుతారు - నిర్మాత సాయి అభిషేక్



నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ఎమోషనల్ థ్రిల్లర్ లవ్ స్టోరీ ఫిల్మ్ '28 డిగ్రీస్ సెల్సియస్'. 'పొలిమేర' ఫేమ్ నిర్మాత డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలోని ఈ తొలి చిత్రాన్ని సాయి అభిషేక్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సాయి అభిషేక్ మాట్లాడుతూ– ''ఈ సినిమాను 2017లో ఆరంభించాం. 2020 మేలో రిలీజ్ ప్లాన్ చేశాం. కానీ కరోనా పరిస్థితుల వల్ల రిలీజ్ కాలేదు. ఓటీటీ ఆఫర్స్ వచ్చినా, ఈ ప్లాట్‌ఫామ్‌కి ఇంత డిమాండ్ ఏర్పడుతుందని అప్పుడు మేం ఊహించలేకపోయాం. అయినా... ఈ సినిమాను మేం థియేట్రికల్ రిలీజ్ కోసం తీశాం. ఫైనల్‌గా ఈ చిత్రాన్ని వంశీ నందిపాటిగారు రిలీజ్ చేస్తున్నారు. '28 డిగ్రీస్ సెల్సియస్' ఓ ఇంటెన్స్ లవ్‌స్టోరీ. నవీన్‌చంద్ర, షాలినీ చక్కగా నటించారు. హీరోయిన్ హెల్త్ కండిషన్ వల్ల 28 డిగ్రీస్ సెల్సియస్‌లోనే ఆమె ఉండాల్సి ఉంటుంది. ఈ పరిస్థితులను ఆ జంట ఎలా అధిగమించింది? అన్నదే ఈ చిత్రకథ. ఈ మూవీ డిఫరెంట్ జానర్స్‌తో సాగుతుంది. చివరి 30 నిమిషాలు హైలైట్‌గా ఉంటుంది. ఆడియన్స్ థ్రిల్ అవుతారు. ఇక ఈ మూవీ చిత్రీకరణను వైజాగ్‌లో మొదలుపెట్టాం. తొలి రోజే నా కాలు ఫ్రాక్చర్ అయ్యింది. అయినా షూటింగ్ ఆపలేదు. జార్జియాలో చిత్రీకరించేందుకు చాలా కష్టపడ్డాం. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఈ సినిమాను పూర్తి చేశాం'' అని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,390	76,025
నిఫ్టీ ▽	354	23,166

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,310	△	10
డోజోన్స్	41,813	▽	188
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,635	△	52
డాక్స్	22,520	△	376
షాంఘై	3,348	△	13
నికాయ్	35,624	△	7

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.64	87.32
£	బ్రిటన్ పౌండ్		107.74	112.62
€	యూరో		90.10	94.47
¥	జపాన్ ఎన్ (100)		46.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		51.08	55.90
S$	సింగపూర్ డాలర్		61.29	65.95
SAR	సౌదీ రియాల్		21.89	23.45
UAE D	యూఏఈ దిర్హామ్		22.38	24.16
¥	చైనా యువాన్		10.88	12.70



క్రాష్ మార్కెట్

దలాల్ స్ట్రీట్‌కు ‘లిబరేషన్ డే’ ఫీవర్

- రూ.3.5 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ 1,390 పాయింట్ల పతనం
- 23,200 స్థాయి దిగువకు నిఫ్టీ
- ప్రతీకార సుంకాల అమలు భయాలతో భారీ అమ్మకాలు
- 2025–26 ఆర్థిక సంవత్సరానికి నష్టాలతో స్వాగతం

ముంబై: అమెరికా ‘లిబరేషన్ డే’ అనిశ్చితి తారస్థాయికి చేరుకోవడంతో మంగళవారం దలాల్ స్ట్రీట్ దాదాపు 2% క్షీణించింది. ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాల విధింపు అమలు రోజు ఏప్రిల్ 2ను డొనాల్డ్ ట్రంప్ ‘అమెరికా లిబరేషన్ డే’గా అభివర్ణించారు. క్రూడాయిల్ ధరలు అయిదు వారాల గరిష్టానికి చేరుకోవడం, భారత ఈక్విటీ మార్కెట్ మార్చిలో భారీ ర్యాలీ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం తదితర అంశాలూ ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,390 పాయింట్లు క్షీణించి 76,025 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 354 పాయింట్లు పతనమై 23,166 వద్ద స్థిరపడింది. కొత్త ఆర్థిక సంవత్సరం(2025–26) తొలిరోజున స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు... ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల ప్రభావంతో రోజంతా నష్టాలతో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,503 పాయింట్లు క్షీణించి 75,912 వద్ద, నిఫ్టీ 383 పాయింట్లు పతనమై 23,136 వద్ద కనిష్టాలు తాకాయి.

- టెలికమ్యూనికేషన్, ఆయిల్‌అండ్‌గ్యాస్ మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లలో భారీ విక్రయాలు జరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1% నష్టపోయింది. స్మాల్‌క్యాప్ సూచీ స్వల్పంగా 0.07 శాతం లాభపడింది. సూచీల వారీగా రియల్టీ 3%, కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ 2.50%, ఫైనాన్షియల్ సర్వీసెస్ 2%, బ్యాంకెక్స్ 1.50 శాతం నష్టపోయాయి.
- సూచీల 2% మేర పతనంతో మంగళవారం రూ.3.5 లక్షల కోట్లు ఆవిరైపోయాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.409.43 లక్షల కోట్లు(4.78 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది.
- వొడాఫోన్ ఐడియా షేరు 19% లాభపడి రూ.8.10 వద్ద స్థిరపడింది. స్పెక్ట్రమ్ వేలం బకాయిలు రూ.36,950 కోట్ల బదులుగా ఈక్విటీల రూపంలో వాటాను తీసుకునేందుకు కేంద్రం అంగీకరించిందంటూ వీఐ ఆదివారం ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. దీంతో వీఐలో కేంద్రం వాటా 48.99 శాతానికి చేరనుంది. ఇంట్రాడేలో 26% ఎగసి రూ.8.56 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.9,210 కోట్లు పెరిగి రూ.57,828 కోట్లకు చేరింది.
- సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లలో ఇండస్‌ఇండ్ 5%, జొమాటో 0.27% మాత్రమే లాభపడ్డాయి. అత్యధికంగా హెచ్‌సీఎల్ టెక్ 4%, బజాజ్‌ఫిన్‌సర్వ్ 3.50%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.35%, బజాజ్ ఫైనాన్స్3%, ఇన్ఫోసిస్ 3% నష్టపోయాయి.



ఫార్మాకు చేదు మందు?

- అమెరికా టారిఫ్‌లు వడ్డిస్తే దేశీ ఫార్మాకు సవాళ్లు
- గ్లాండ్ ఫార్మా, జైడస్ తదితర సంస్థలపై ప్రభావం
- అటు యూఎస్‌ఏలో ఔషధాల రేట్లకు రెక్కలు
- మినహాయింపుల కోసం చర్చలపై ఆశలు

సాక్షి బిజినెస్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలపై ఇతరత్రా రంగాల్లాగే భారత ఫార్మా కంపెనీలకూ టెన్షన్‌గానే ఉంది. ఎందుకంటే మన ఫార్మా కంపెనీల ఎగుమతుల్లో దాదాపు మూడో వంతు వాటా అమెరికాదే ఉంటోంది. గత ఆర్థిక సంవత్సరం ఆ దేశానికి భారత ఫార్మా ఎగుమతులు 16 శాతం పెరిగి దాదాపు 9 బిలియన్ డాలర్లకు చేరాయి. అక్కడి నుంచి దిగుమతయ్యే ఔషధాలు సుమారు 800 మిలియన్ డాలర్లే. అమెరికాకు మన చౌక ఔషధాల అవసరం ఎంత ఉందో, మనకూ కీలకమైన అమెరికా మార్కెట్ అవసరం అంతగానూ ఉందని పరిశీలకులు చెబుతున్నారు. దీంతో సుంకాల వడ్డింపనేది ఎవరికి లాభదాయకం, ఎవరికి నష్టదాయకమనే దానిపై చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గతంలోలాగే ఫార్మా మీద టారిఫ్‌పై ఇరు దేశాలు మళ్లీ సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు. అమెరికా హెల్త్‌కేర్ వ్యవస్థలో మన జనరిక్స్‌కి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మినహాయింపుల కోసం భారత్ ప్రయత్నించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశాయి.

సవాళ్ల మధ్య అవకాశాలు..

వాస్తవానికి చైనాలాంటి దేశాలపై ప్రధాన దృష్టితో టారిఫ్‌లను ప్రతిపాదించినప్పటికీ అమెరికాకు అత్యధికంగా ఎగుమతి చేస్తున్న మన ఫార్మాపైనా ప్రభావం పడుతుందనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా నుంచి ఔషధాల దిగుమతులపై భారత్ 10% సుంకాల వరకు విధిస్తుండగా, మన ఎగుమతులపై అక్కడ టారిఫ్‌లు లేవు. ఒకవేళ ప్రతీకారంగా మనలాగే టారిఫ్ విధించినా సుమారు 10% స్థాయిలోనే ఉంటుందని భావిస్తున్నారు. గ్లాండ్ ఫార్మా, అరబిందో, డాక్టర్ రెడ్డీస్, జైడస్, లుపిన్ లాంటి ఫార్మా కంపెనీల ఆదాయాల్లో అమెరికా వాటా సుమారు 50–37% వరకు ఉండటంతో వాటిపై టారిఫ్‌ల ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని అంచనా. ఒకవేళ భారాన్ని కస్టమర్లకు బదలాయించకపోతే వివిధ కంపెనీల స్థూల లాభంపై సుమారు 12% వరకు ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అదే 50% బదలాయిస్తే, ఇది 7% దాకా ఉండొచ్చు. మొత్తం మీద ఆదాయనష్టంతో పాటు మిగతా దేశాలతో పోటీపడి మార్కెట్‌ను నిలబెట్టుకోవడం కష్టంగా మారుతుంది. దేశీ ఫార్మాకు కాస్త కలిసి వచ్చే అంశాలూ ఉన్నాయి. అమెరికా మీదే ఆధారపడకుండా మన కంపెనీలు ఇతర మార్కెట్లకూ విస్తరించవచ్చు. అలాగే, అంతర్జాతీయంగా ఇతర దేశాల కంపెనీలతో దీటుగా పోటీపడేలా ఆర్‌అండ్‌డీ సామర్థ్యాలను పెంచుకోవచ్చు.

అమెరికాపై ఎఫెక్ట్ ..

ఫార్మా దిగుమతులపై టారిఫ్‌లతో అమెరికాకూ కొన్ని ప్రతికూలతలు తప్పవు. భారతీయ జనరిక్స్‌పై సుంకాల వడ్డింపు వల్ల, ఫార్మా కంపెనీలు ఔషధాల రేట్లను పెంచితే, అమెరికా వినియోగదారులకు మందుల ఖర్చులు పెరిగిపోతాయి. ఇక, మన ఫార్మాపై అమెరికా భారీగానే ఆధారపడుతోంది. టారిఫ్‌లతో సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడి, ఔషధాలకు కొరత నెలకొనవచ్చు. ఫలితంగా పేషెంట్లకు చికిత్స విషయంలో సమస్యలు ఏర్పడవచ్చు. అటు అమెరికాకూ కొన్ని సానుకూలాంశాలు ఉన్నాయి. టారిఫ్‌తో ఇతర దేశాల ఫార్మా కంపెనీలు అమెరికాలోనూ తయారీ కార్యకలాపాలు చేపట్టే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో, దేశీయంగా తయారీకి, ఉపాధి కల్పనకు ఊతమిస్తుంది. అలాగే దిగుమతి చేసుకునే ఔషధాల నాణ్యతపరమైన సవాళ్లకు చెక్ పెట్టేలా, దేశీయంగా తయారీ ప్రమాణాలపై అమెరికా మరింత నియంత్రణ సాధించవచ్చు.

యూపీఐ లావాదేవీలు @ రూ.24.77 లక్షల కోట్లు

మార్చి నెలలో సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలు ఎప్పటికప్పుడు సరికొత్త గరిష్టాలకు చేరుతున్నాయి. మార్చి నెలలో రూ.24.77 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు నమోదైనట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. విలువ పరంగా ఇది సరికొత్త నెలవారీ గరిష్ట రికార్డు. ఫిబ్రవరిలో నమోదైన రూ.21.96 లక్షల కోట్లతో పోల్చితే విలువ పరంగా 12.7% వృద్ధి నమోదైంది. 2024 మార్చిలో యూపీఐ లావాదేవీల విలువ రూ.19.78 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. మార్చి నెలలో రోజువారీ సగటు యూపీఐ లావాదేవీల విలువ రూ.79,903 కోట్లుగా నమోదైంది.

జీఎస్‌టీ వసూళ్ల రికార్డు

- మార్చిలో రూ.1.96 లక్షల కోట్లు
- రెండో అత్యధిక నెలవారీ గరిష్టం



న్యూఢిల్లీ: మార్చి నెలకు జీఎస్‌టీ వసూళ్లు బలంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెల గణాంకాలతో పోల్చి చూస్తే 10 శాతం పెరిగి రూ.1.96 లక్షల కోట్లుగా ఉన్నాయి. జీఎస్‌టీ మొదలైన తర్వాత రెండో నెలవారీ గరిష్ట ఆదాయం ఇదే కావడం గమనార్హం. 2024 ఏప్రిల్ నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లు ఇప్పటి వరకు నెలవారీ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిగా ఉంది. దేశీ విక్రయ లావాదేవీల రూపంలో ఆదాయం 8.8 శాతం పెరిగి రూ.1.49 లక్షల కోట్లుగా ఉంది. దిగుమతి చేసుకున్న ఉత్పత్తులపై జీఎస్‌టీ 13.56 శాతం వృద్ధితో రూ.46,919 కోట్లకు చేరింది. స్థూలంగా చూస్తే సెంట్రల్ జీఎస్‌టీ కింద రూ.38,145 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ కింద రూ.49,891 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ కింద రూ.95,853 కోట్లు, సెస్సు రూపంలో రూ.12,253 కోట్లు చొప్పున మార్చిలో వసూలైంది. ఇక మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) స్థూల జీఎస్‌టీ వసూళ్లు రూ.22.08 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023–24తో గణాంకాలతో పోల్చి చూస్తే 9.4 శాతం పెరిగింది.

‘సాక్షి ప్లస్’ ఈ–పేపర్‌లో ..
లిస్టింగ్‌కు కంపెనీల క్యూ | మిశ్రమంగా వాహన విక్రయాలు

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

ఎయిమ్స్ బీబీనగర్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. బీబీనగర్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్‌లో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చైర్మన్, రిక్రూట్‌మెంట్ సెల్, ఎయిమ్స్ బీబీనగర్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(హెచ్‌ఎంఆర్), తెలంగాణ–508126 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.04.2025.
» **వెబ్‌సైట్:** https://aiimsbibinagar.edu.in

బీడీఎల్, హైదరాబాద్‌లో 75 అప్రెంటిస్‌లు

బీడీఎల్, హైదరాబాద్ కంచన్‌బాగ్ యూనిట్‌లోని వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 75.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు –38, డిప్లొమా అప్రెంటిస్‌లు–37.
» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, డీసీసీపీ.
» **అర్హత:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు బీఈ/బీటెక్, డిప్లొమా అప్రెంటిస్‌కు డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.04.2025
» **వెబ్‌సైట్:** https://bdl-india.in

ఎన్‌సీఆర్‌టీసీలో 72 పోస్టులు

నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌సీఆర్‌టీసీ) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 72.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–16, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)–16,జూనియర్ ఇంజనీర్(మెకానికల్)–03, జూనియర్ ఇంజనీర్(సివిల్)–01, ప్రోగ్రామింగ్ అసోసియేట్–04, అసిస్టెంట్(హెచ్‌ఆర్)–03, అసిస్టెంట్(కార్పొరేట్ హాస్పిటాలిటీ)–01, జూనియర్ మెయింటెయినర్(ఎలక్ట్రికల్)–18, జూనియర్ మెయింటెయినర్(మెకానికల్)–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్, ఐటీ, కంప్యూటర్స్), బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, డిగ్రీ(హోటల్ మేనేజ్‌మెంట్), ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ ఇంజనీర్, ప్రోగ్రామింగ్ అసోసియేట్‌కు రూ.22,800 నుంచి రూ.75,850, అసిస్టెంట్‌కు రూ.20,250 నుంచి రూ.65,500, జూనియర్ మెయింటెయినర్‌కు రూ.18,250 నుంచి రూ.59,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2025
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** మే 2025.
» **వెబ్‌సైట్:** https://ncrtc.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

డిప్లొమా కోర్సులకు కేరాఫ్ పాలిసెట్

పదో తరగతి తర్వాత ఇంజనీరింగ్, టెక్నికల్ కోర్సుల్లో చేరి సత్వర ఉపాధి పొందాలనుకునే వారికి చక్కటి మార్గం.. పాలిటెక్నిక్ డిప్లొమా! ఆయా డిప్లొమా కోర్సులు పూర్తయ్యాక సంబంధిత రంగాల్లో ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అంతేకాకుండా ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు. అందుకే పదో తరగతి తర్వాత ఎక్కువ మంది పాలిటెక్నిక్ కోర్సులను ఎంచుకుంటున్నారు. తాజా తెలంగాణలో టీజీ పాలిసెట్-2025 (పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నోటిఫికేషన్ విడుదలైంది !! ఈ నేపథ్యంలో.. టీజీ పాలిసెట్ వివరాలు, పరీక్ష విధానం, డిప్లొమా కోర్సులు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



» తెలంగాణలో టీజీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ విడుదల
» ఇంజనీరింగ్, అగ్రి, వెటర్నరీ, హార్టికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం
» మే 13న టీజీ పాలిసెట్ పరీక్ష

తాజాగా 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్స్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పాలిసెట్ ర్యాంకు ద్వారా మూడేళ్లు, రెండేళ్ల వ్యవధిలోని వివిధ డిప్లొమా కోర్సుల్లో చేరొచ్చు.

ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు

ఇంజనీరింగ్, టెక్నికల్ విభాగాల్లో ఆయా బ్రాంచ్‌లలో మూడేళ్ల డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. ముఖ్యంగా సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెన్స్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఈఈఈ, ఈసీఈ, ఈఐఈ, సీఎస్‌ఈ, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, హోమ్ సైన్స్, మెటలర్జికల్, కెమికల్, ప్రింటింగ్, ప్యాకేజింగ్, ఏఐ–ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్‌డేటా, సైబర్–ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, లెదర్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి.

అగ్రి అనుబంధ డిప్లొమాలకూ

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లొమా, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు; అదేవిధంగా మూడేళ్ల వ్యవధిలోని డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో పాలిసెట్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని రెండేళ్ల యానిమల్ హజ్బెండరీ పాలిటెక్నిక్ కోర్సు,అదే విధంగా కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయ పరిధిలోని రెండేళ్ల డిప్లొమా ఇన్ హార్టికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి కూడా పాలిసెట్ ర్యాంకునే పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు

- పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. 2025లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ డిప్లొమా కోర్సుల అభ్యర్థుల వయసు 2025, డిసెంబర్ 31 నాటికి 15–22 ఏళ్ల మధ్య ఉండాలి.

150 మార్కులకు పరీక్ష

- తెలంగాణ పాలిసెట్‌ను నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ (60 ప్రశ్నలు–60 మార్కులు), ఫిజిక్స్ (30 ప్రశ్నలు–30 మార్కులు), కెమిస్ట్రీ (30 ప్రశ్నలు–30 మార్కులు); బయాలజీ (30 ప్రశ్నలు–30 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు రెండున్నర గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షను పెన్–పేపర్ విధానంలో నిర్వహిస్తారు.
- అగ్రి అనుబంధ కోర్సుల్లో చేరాలనుకునే వారు కచ్చితంగా బయాలజీ విభాగం ప్రశ్నలకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- ఫలితాల ప్రకటనలో ఎంపీసీ ర్యాంకు, ఎంబైపీసీ ర్యాంకు పేరుతో రెండు వేర్వేరుగా ర్యాంకులు ప్రకటిస్తారు.
- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష రాసిన వారికి ఎంపీసీ ర్యాంకులను; ఇంజనీరింగ్, అగ్రి కోర్సుల అభ్యర్థులకు ఎంబైపీసీ ర్యాంకులను కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఏప్రిల్ 19
- **టీజీ పాలిసెట్ పరీక్ష తేదీ:** 2025, మే 13
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://polycet.sbtet.telangana.gov.in/#!/index

టీఎస్ - పాలిసెట్ ముఖ్యాంశాలు

- మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ నిర్వహణ.
- అగ్రి, అనుబంధ డిప్లొమాలకు కూడా పాలిసెట్ ర్యాంకే ప్రామాణికం.
- డిప్లొమా పూర్తి చేసుకున్నాక ఉపాధి, ఉన్నత విద్య అవకాశాలు.
- పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయిలో నెలకు రూ.20 వేల వరకు వేతనంతో కొలువులు.
- ఈ–సెట్‌లో ర్యాంకు ఆధారంగా నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం.

పాలిసెట్‌లో మంచి ర్యాంకు సాధించడానికి.. అభ్యర్థులు నాలుగు విభాగాల్లోని కీలకాంశాలపై దృష్టి సారించాలి.

మ్యాథమెటిక్స్

పదో తరగతి పుస్తకాల్లోని ప్రతి చాప్టర్‌ను చదివి.. వాటికి సంబంధించిన ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించాలి. పాఠ్యపుస్తకంలోని ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు,సంభావ్యత,సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలపై పట్టు సాధించాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.

కెమిస్ట్రీ

ఆమ్లాలు, క్షారాలు,లవణాలు, పరమాణు నిర్మాణం, పి–బ్లాక్ ఎలిమెంట్స్, పీరియాడిక్ టేబుల్, మూలకాల వర్గీకరణ, అయొనైజేషన్ ఎనర్జీ, ఎలక్ట్రోనెగెటివిటీ, మెటాలిక్, నాన్–మెటాలిక్ ప్రాపర్టీస్, కెమికల్ బాండింగ్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ మెటలర్జీ, కార్బన్ కాంపౌండ్స్ తదితర ముఖ్యమైన యూనిట్లలోని అన్ని అంశాలను చదవాలి.

ఫిజిక్స్

ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కర్బన సమ్మేళనాలపై దృష్టిపెట్టాలి. అదే విధంగా మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

బయాలజీ

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కుల కోసం అన్వయ దృక్పథం పెంచుకోవాలి. పదో తరగతి చాప్టర్స్ లోని ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి. ఆయా చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

ఆటిజం.. అర్థం చేసుకుందాం



కోపగించుకోవద్దు.. వేరుగా చూడొద్దు

సుధ (పేరు మార్చాం) ఇద్దరు పిల్లల తల్లి. పిల్లలకు ఏడాదిన్నర వయసు నుంచి మారాం చేసినా, అన్నం తినకపోయినా సెల్ ఫోన్‌లో వీడియోలు పెట్టి చూపించడం అలవాటు చేసింది. ఐదేళ్ల వయసుకు వచ్చినా ఇద్దరు పిల్లలకు మాటలు సరిగా రాలేదు. ఎవరు ఏం చెప్పినా అర్థం చేసుకునే పరిస్థితి లేదు. వైద్యులను సంప్రదిస్తే ఆటిజం అని చెప్పారు.

రాజ్యలక్ష్మికి నెలలు నిండకుండానే ముగ్గురు పిల్లలు పుట్టారు. ఇద్దరు కుమారుల్లో ఒకరికి రెండేళ్లు వచ్చే వరకు నడక రాలేదు. వైద్యుల వద్దకు వెళ్లగా ఆటిజం ఉన్నట్టు తేల్చారు. రెండో బాబుకు సమస్య పాక్షికంగా ఉన్నట్టు చెప్పారు.



ఇదో జబ్బు అని చెప్పలేం. బుద్ధి మాంద్యతా అంటే అదీ కాదు. మానసిక వైకల్యం అనీ అనలేం. ఏదో పెద్ద లోపంగా పరిగణించలేం. ప్రత్యేకంగా మందులంటూ ఏమీ లేవు. ఎందువల్ల దీని బారిన పడతారనే దానికి స్పష్టమైన కారణాలూ ఇప్పటివరకు తెలియవు. థెరపీలు, తల్లిదండ్రులకు అవసరమైన కౌన్సెలింగ్ మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం. అదే ఆటిజం (సాధారణ పిల్లల్లా లేకపోవడం). ఇది చిన్న పిల్లల్ని పీడించే ఓ రుగ్మత..ఓ సమస్య అని మాత్రమే చెప్పగలమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆటిజంతో బాధ పడుతున్న కొందరిలో తెలివితేటలు (ఇంటెలిజెన్స్ కోషియంట్- ఐక్యూ) ఒకింత ఎక్కువగా ఉండటం గమనార్హం. కాగా ఇలాంటివారిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోపగించుకోవడం కానీ వేరుగా చూడడం కానీ చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లల్లో ఉండాల్సిన సహజ చురుకుదనం లేమి కారణంగా తల్లిదండ్రులను ఎంతో వేదనకు గురిచేసే ఆటిజంపై 'సాక్షి' ప్రత్యేక కథనం మీ కోసం.. **:: సాక్షి, స్పెషల్ డెస్క్ ::**

ఏంటీ ఆటిజం..?

ఇది నాడీ వ్యవస్థకు సంబంధించిన రుగ్మత. అంటే న్యూరలాజికల్ డిజార్డర్‌గా భావించవచ్చు. అంతేగానీ ఓ జబ్బుగా పరిగణించడానికి వీల్లేదు. ఒకే రకమైన/నిర్దిష్ట లక్షణాలుండవు. ఏ ఇద్దరు పిల్లల్లోనూ ఒకేలా ఉండవు. లక్షణాల విస్తృతి చాలా ఎక్కువ. అందుకే దీనిని స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన రుగ్మత) లేదా ఆటిజమ్ స్పెక్ట్రమ్ అని చెబుతుంటారు.

ఎలాంటి లక్షణాలుంటాయి?

- ➜ చూడటానికి సాధారణ పిల్లల్లాగే కన్పిస్తుంటారు. కానీ..
- ➜ వయసుకు తగిన వికాసం లోపించిందా? అన్పించవచ్చు.
- ➜ సాధారణ చిన్నారుల్లా ప్రతిస్పందించకపోవచ్చు. పేరు పెట్టి పిలుస్తున్నా పలుకకపోవచ్చు.
- ➜ ఇతరులతో సమాచారం పంచుకోవడం (కమ్యూనికేషన్‌లో ఇబ్బంది), సంభాషించడంలో ఇబ్బంది పడుతుండొచ్చు. ఎదుటివారి కళ్లలో కళ్లు కలిపి చూస్తూ మాట్లాడలేరు. ఎంత పిలిచినా పలకకుండా వినికిడి లోపం ఏదైనా ఉందేమో అనిపించేలా ప్రవర్తిస్తారు.
- ➜ దాదాపు 25 శాతం మంది చిన్నారులు మాటల్ని సరిగా పలుకలేరు. మాటలు రావడంలో ఆలస్యం అవుతుంది.
- ➜ ఏదో లోకంలో ఉన్నట్టుగా ఉంటుండొచ్చు లేదా పలికిన మాటే పదే పదే పలుకుతూ ఉండవచ్చు.
- ➜ యాస్పర్జస్ డిజార్డర్ ఉన్న పిల్లల్లో తెలివితేటలు ఒకింత ఎక్కువగా ఉండి, కొన్ని పనుల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు.
- ➜ కుదురుగా ఉండకుండా ఎప్పుడూ పరుగెడుతూ, గెంతుతూ ఉంటారు.
- ➜ నీట్‌గా ఉండకపోవడం. చక్కగా డ్రెస్ చేసుకోడానికి, సమయానికి హెయిర్ కట్ చేయించుకోడానికి నిరాకరించడం.
- ➜ చేసిన పనులే పదే పదే చేస్తుండటం (రిపిటేటివ్ బిహేవియర్). కొత్త పనులపై ఆసక్తి చూపకపోవడం. ఎప్పుడూ తమకు ఇష్టమైన ఆట వస్తువునో మరొకటో పట్టుకుని ఉండటం.
- ➜ గోడలపై ఉన్న సున్నం నాకడం లేదా తినడానికి యోగ్యం కాని పదార్థాలను తినడానికి యత్నించడం (పేపర్లు, షర్ట్ కాలర్ వంటి వాటిని నోట్లో పెట్టుకుని తినడానికి ప్రయత్నించడం లాంటి డిజార్డర్లు).
- ➜ పిల్లలు సాధారణంగా చేసే గీతలు గీయడం, రాయడం, కత్తెర వంటి పనిముట్లను ఉపయోగించడం, నమలడం కూడా సరిగా చేయకపోవడం
- ➜ సంతోషం, బాధ వంటి భావనలను త్వరగా అర్థం చేసుకోలేరు. వాటిని అర్థమయ్యేలా చెప్పలేరు.
- ➜ తలను గోడకు లేదా నేలకేసి బాదుకోవడం, ఇతరులను బలంగా ఢీకొట్టడం, వస్తువులను విసిరేయడం వంటి దురుసు ప్రవర్తనలు కనబరచడం.

టీకాలతో ఆటిజం రాదు

టీకాల కారణంగా ఆటిజం వస్తుందనేది కేవలం ఒక అపోహ మాత్రమే. టీకాలకూ, ఆటిజంకు సంబంధం లేదు. పిల్లలందరికీ ఏ వయసులో ఇప్పించాల్సిన టీకాలు యథావిధిగా ఆ వయసులో ఇప్పించాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

3 స్థాయిల్లో ఆటిజమ్

పిల్లల్లో కనిపించే లక్షణాల తీవ్రత ఆధారంగా దీనిని ప్రధానంగా మూడు స్థాయిలుగా విభజించారు.

1. **మైల్డ్ ఆటిజం:** పిల్లల వికాసం తక్కువగా (30% వరకు) ప్రభావితం అవుతుంది.
2. **మాడరేట్ ఆటిజం :** వీరిలో వికాసం 30% నుంచి 60% లోపు ప్రభావితమవుతుంది.
3. **సివియర్ ఆటిజం:** వికాసం చాలా ఎక్కువగా ప్రభావితమవుతుంది. అంటే 60 శాతానికి పైగా.

ఏం చేయాలి మరి..?

దీనిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాలి. పిల్లల్లో సమస్యను గుర్తించిన వెంటనే చికిత్సకు తీసుకెళ్లాలి. ఎంత త్వరగా చికిత్స చేయిస్తే అంత త్వరగా సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. 2 ఏళ్ల వయస్సు లోపు గనుక గమనిస్తే సులభంగా బయటపడే చాన్స్ ఉంటుందని అంటున్నారు. ఆటిజం లక్షణాలు కనబరచే పిల్లలకు.. కొన్ని నిర్దిష్టమైన ప్రశ్నలూ సమాధానాల ఫార్మాట్‌లో నిర్వహించే పరీక్షల ద్వారా సమస్యను నిర్ధారించవచ్చు. ఈ జబ్బు ఉన్నవారిలో ఫిట్స్ వంటి న్యూరలాజికల్ సమస్యలు ఉన్నప్పుడే ఎమ్మారై, ఈఈజీ, మెటబాలిక్ డిజార్డర్ స్క్రీనింగ్ వంటివి అవసరం.

ఎలాంటి మందులూ లేవు..

ఈ రుగ్మతకు ఎలాంటి మందులూ లేవు. విటమిన్లు, గ్లూటెన్ ఫ్రీ, కేసిన్ ఫ్రీ డైట్ల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ఫిట్స్ లేదా ఇతర తీవ్రమైన ప్రవర్తనకు సంబంధించిన మార్పులు (బిహేవియరల్ ఛేంజెస్) ఉన్నప్పుడు మాత్రమే మందులు వాడాల్సి ఉంటుంది.

ఆ అధ్యయనాల్లో

దేశంలో ఆటిజంతో బాధపడే చిన్నారుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ), ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం.. తొమ్మిదేళ్ల వయస్సులోపు చిన్నారుల్లో 1 నుంచి 1.5 శాతం పిల్లలు ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. ఇది ఆందోళన కలిగించే అంశమని ఐఏపీ స్పష్టం చేస్తోంది. తెలంగాణలో ఎంతమంది ఉంటారనే దానిపై గణాంకాలు అందుబాటులో లేవు. అయితే తెలంగాణలో 0–9 ఏళ్ల వయస్సు చిన్నారులు 60 లక్షల వరకు ఉంటారని అర్థ గణాంక శాఖ నివేదికను బట్టి తెలుస్తోంది. ఇందులో ఒక శాతాన్ని లెక్కిస్తే 60 వేల మంది, 1.5 శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే 90 వేల మంది వరకు చిన్నారులు ఈ సమస్యతో ఇబ్బంది పడుతూ ఉండొచ్చు. సాధారణంగా ఈ సమస్య మగపిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ఆటిజంలోని రెట్స్ డిజార్డర్ అనే అరుదైన రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

ఎందుకు ఇలాంటి సమస్యలు?

ఆటిజంకు కారణాలు తెలుసుకోడానికి ఇప్పటికీ పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ నిర్దిష్టమైన కారణాలేమీ ఇంకా తెలియరాలేదు. అయితే కొన్ని అధ్యయనాల్లో ఆటిజంకు గురికావడానికి కారణాలను కొంతవరకు తెలుసుకున్నారు. అవి...

- కొంతమేరకు జన్యుపరమైన కారణాల వల్ల దీని బారిన పడుతున్నారు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు, మెదడులో స్రవించే సెరటోనిన్, డోపమిన్ వంటి రసాయనాలు సంబంధిత అంశాల్లో లోపాల వల్ల..
- బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లి జెస్టేషనల్ డయాబెటిస్‌కు, హార్మోన్ల అసమతుల్యతకు లోను కావడం, గర్భధారణకు ముందు ఏవైనా వైరల్ ఇన్ఫెక్షన్లకు గురికావడం, తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనుకావడం వల్ల..
- గర్భంతో ఉన్నప్పుడు వాడిన, వాడకూడని కొన్ని మందుల వల్ల..

నేర్చుకోవడానికి సంబంధించి కొన్ని సమస్యలు

ఈ చిన్నారుల్లో నేర్చుకోవడానికి సంబంధించి రకరకాల సమస్యలు కనిపించవచ్చు. వాటిల్లో కొన్ని..

- ➜ జ్ఞానేంద్రియాల నుంచి లభ్యమయ్యే సమాచారాన్ని సరిగా విశ్లేషించుకోలేకపోవడం (సెన్సరీ ప్రాసెసింగ్ డిజార్డర్ – ఎస్‌పీడీ).
- ➜ నేర్చుకునే ప్రక్రియ సరిగా జరగకపోవడం (లెర్నింగ్ డిజార్డర్-ఎల్‌డీ).
- ➜ కొంతమంది చిన్నారుల్లో ప్రవర్తనకు సంబంధించిన రుగ్మతలు (బిహేవియరల్ డిజార్డర్స్) ఉంటాయి. అంటే నలుగురితో కలవలేరు. అకారణంగా ఏడుస్తూ ఉంటారు.
- ➜ కొందరిలో ఆటిజంతో పాటు మూర్ఛ వంటి నాడీ సంబంధిత రుగ్మతలుండవచ్చు.

రకరకాల థెరపీలతోనే చికిత్స

చిన్నారుల వ్యక్తిగత లక్షణాలూ, భావోద్వేగ పరమైన అంశాలను బట్టి న్యూరో స్పెషలిస్టులు, సైకాలజిస్టులు, స్పీచ్ థెరపిస్టులు, బిహేవియరల్ థెరపిస్టులు ఇలా అనేక మంది స్పెషలిస్టుల సహాయంతో, సెన్సరీ ఇంటిగ్రేషన్ థెరపీ వంటి ప్రక్రియలతో సమీకృత చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇలాంటి పిల్లలకు అవసరమైన విద్య అందించడం కోసం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సికింద్రాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్'(ఎన్‌ఐఈపీఐడీ) వంటి సంస్థలు కృషి చేస్తున్నాయి. ఈ చిన్నారుల కనీస స్వావలంబన కోసం పలు సామాజిక సంస్థలు, ఎన్జీవోలు కూడా పనిచేస్తున్నాయి. అటిజమ్ ఇటీవలి కాలంలో ప్రధాన సమస్యగా మారుతోంది. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులు కావడం, పిల్లలతో గడిపే తీరిక లేకపోవడం, ఎక్కువగా స్క్రీన్‌కు అడిక్ట్ కావడం వంటివి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు.

పుట్టగొడుగుల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్స్...

ఆటిజంకు థెరపీ పేరిట నగరాల్లో ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగుల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లు, చైల్డ్ రిహాబిలిటేషన్ సెంటర్లు వెలుస్తున్నాయి. వీటి నిర్వాహకులు అర్హత కలిగిన థెరపిస్టులు కాకపోయినా..కేవలం ఆయాలను నియమించుకుని ఇలాంటి సెంటర్లు నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని ఎన్‌జీవో సంస్థలు నిబద్ధతతో పనిచేస్తుంటే.. కొందరు పూర్తిస్థాయి వ్యాపారంలా నిర్వహిస్తున్నారు. ఒక్కో పిల్లాడిపై నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టి సారించకపోవడం, నిర్వహణ, నియంత్రణ లేకపోవడం వల్ల స్పీచ్ థెరపీ కేంద్రాలు ఇష్టానుసారం వెలుస్తున్నాయి. ఒక ఆసుపత్రి ఏర్పాటు చేయాలంటే ఆసుపత్రి భవనం, అందులో అర్హతగల డాక్టర్లు, నర్సులు, ఆయాలు, పడకలు తదితర సౌకర్యాలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉంటాయి. కానీ ఈ పునరావాస కేంద్రాలకు ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడం గమనార్హం.

కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు..

- ✔ ఆటిజం ఒక వైకల్యంగా గుర్తింపు..
- ✔ పునరావాస కేంద్రాలు నడిపించే ఎన్జీవోలకు ఆర్థిక సాయం
- ✔ వైకల్యంతో బాధపడేవారికి సంబంధించిన హక్కుల చట్టాన్ని వీరికి కూడా వర్తింపచేయడం ద్వారా విద్యలో, పునరావాసంలో సహాయం
- ✔ ఆటిజం బాధితులకు ఉన్నత విద్య అభ్యాసానికి ఆర్థికసాయం
- ✔ వీరికి యూనిక్ డిజెబిలిటీ (విశిష్ట వైకల్యం) గుర్తింపు కార్డు ఇవ్వడం
- ✔ రూ 2.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించడం
- ✔ ఆటిజం తగ్గింపునకు అవసరమైన పరికరాలు కొనుగోలుకు ఆర్థిక సాయం.. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్వయం ఉపాధికి రుణాలు మంజూరు, నైపుణ్య శిక్షణ.
- ✔ ప్రాంతాల వారీగా సంగీత, నృత్య కచేరీలు ఏర్పాటు
- ✔ రాష్ట్రంలో ఇప్పటివరకు ఆటిజంతో బాధపడుతున్న వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు లాంటి చర్యలు చేపట్టక పోవడం గమనార్హం.

ప్రవర్తనకు అనుగుణంగా మందులు ఇవ్వడమే...



డా. చంద్రశేఖర్ రెడ్డి
సీనియర్ న్యూరో ఫిజీషియన్

ఆటిజంకు ఎలాంటి మందులూ అందుబాటులో లేవు. విటమిన్లు, గ్లూటెన్ ఫ్రీ, కేసిన్ ఫ్రీ డైట్లు వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. వీళ్లలో ఫిట్స్ (మూర్ఛ) వంటి అనుబంధ సమస్యలు లేదా ఇతర తీవ్రమైన ప్రవర్తనకు సంబంధించిన మార్పులు (బిహేవియరల్ ఛేంజెస్) ఉన్నప్పుడు వాటికి సంబంధించి మాత్రమే మందులు వాడాల్సి ఉంటుంది.

బుద్ధిమాంద్యం అనే అపోహ ఉంది



డా.ప్రభ్‌జ్యోత్ కౌర్
సీనియర్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్

ఆటిజం అంటే అది ఒక రకమైన బుద్ధిమాంద్యత అని కొందరు అపోహ పడుతుంటారు. చాలా కేసుల్లో మిగతా అందరు పిల్లల్లా అందరితోనూ కమ్యూనికేట్ చేయలేకపోవడమే వీరిలో ఉండే లోపం. నిజానికి చాలామంది నార్మల్ చిన్నారుల కంటే చాలా ఎక్కువ ఐక్యూను ప్రదర్శించేవారూ ఈ పిల్లల్లో ఉంటారు. మెదడు వికాసం లేకపోవడం అన్నది.. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్న దాదాపు మూడోవంతు పిల్లల్లో మాత్రమే ఉంటుంది. వీరి విషయంలో ఏ అంశంలో వికాసం కొద్దిగా ఆలస్యం జరుగుతోందో ఆ అంశంలో శిక్షణ ఇస్తే వాళ్లు నార్మల్ పిల్లల్లానే పెరగగలుగుతారు.

ఎంత త్వరగా సమస్య గుర్తిస్తే అంత మంచిది



పి. హారికారెడ్డి
బిహేవియర్ అనలిస్ట్, యాధా ఏబీఏ సెంటర్, అత్తాపూర్, హైదరాబాద్

ఆటిజం ఫలానా కారణం వల్ల వస్తుందని చెప్పలేం. ఎలా వస్తుంది, ఎందుకు వస్తుంది అనే ప్రశ్నలకు సమాధానాలను పరిశోధకులు ఇంకా అన్వేషిస్తూనే ఉన్నారు. అయితే ఆటిజం పిల్లలను గుర్తించి, వారికి సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన ప్రయోజనాలను పొందవచ్చు. ఈ సమస్య పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ఉంది. పట్టణాల్లో తమ పిల్లలకు ఆటిజం సమస్య ఉందని తెలిస్తే పరువు పోతుందేమో అనుకునేవారూ ఉన్నారు. పిల్లలు చూడటానికి బాగానే ఉన్నారు కదా, మనస్తత్వంలో మార్పు అందే వస్తుందిలే అని సరిపెట్టుకునేవారూ ఉన్నారు. కానీ, ఆటిజం సమస్య ఉన్న పిల్లలను చాలా జాగ్రత్తగా డీల్ చేయాల్సి ఉంటుంది. వారికి అర్థమయ్యే విధంగా ఒక్కో అంశాన్ని పరిచయం చేయాలి. అందుకు చాలా ఓర్పు, శిక్షణ ఇచ్చే టీచర్లు అవసరం. ప్లే స్కూల్స్, ప్రైమరీ స్కూళ్ల నుంచే అవగాహన తరగతులు నిర్వహించాలి. టీచర్లు, తల్లిదండ్రులూ ఈ సమస్యను ఎంత త్వరగా గుర్తించి, శిక్షణ ఇస్తే అంత మంచిది.

ఓపికగా నేర్పాలి



డాక్టర్ వై.ప్రదీప్
చిన్న పిల్లల వైద్యులు, డైక్ సెంటర్ తిరుపతి

ఆటిజం అనేది న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్. దీని బాధిత పిల్లల్లో కమ్యూనికేషన్ సమస్య ఉంటుంది. సమస్య ఉన్న పిల్లల్లో స్టీరియోటైపిక్ బిహేవియర్ (ఒకే పనిని పదేపదే చేయడం) ఉంటుంది. ఇలాంటివారిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోపగించుకోవడం, వేరుగా చూడడం చేయకూడదు. ఇతరులతో ఎలా మాట్లాడాలి, ప్రవర్తించాలో ఓపికగా నేర్పాలి.



జీబ్లీ ఇమేజ్.. పర్సనల్ డ్యామేజ్?

- వ్యక్తిగత ఫొటోలు ఏఐకి ఇవ్వటం ప్రమాదమంటున్న నిపుణులు
- డేటా చౌర్యం, వేధింపులకు కారణం అవుతుందని హెచ్చరిక

జీబ్లీ ఇమేజ్.. ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇమేజ్ టూల్. ప్రముఖ సంస్థ ఓపెన్ ఏఐ తన చాట్‌జీపీటీ ఏఐ టూల్ ద్వారా తీసుకొచ్చిన ఈ జీబ్లీ ఇమేజ్ క్రియేషన్ టూల్‌ను పిల్లల నుంచి ప్రముఖులు, దేశాధినేతల వరకు తెగ వాడేస్తున్నారు. ఎక్స్ గ్రోక్, గూగుల్ జెమినీ ఏఐ టూల్స్ కూడా జీబ్లీ చిత్రాలను అందిస్తున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఏఐ జనరేటెడ్ జీబ్లీ ఆర్ట్‌వర్క్ చిత్రాలు సోషల్‌మీడియాను ముంచెత్తుతున్నాయి. కానీ, ఇది యూజర్ల వ్యక్తిగత గోప్యతకు తీవ్ర విఘాతం కలిగించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



గ్రాంట్ స్లాటన్ కుటుంబ జీబ్లీ ఇమేజ్

ఏమిటీ జీబ్లీ?

చాట్‌జీపీటీ, గ్రోక్, జెమినీ అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఇమేజ్ జనరేటివ్ ఆర్ట్‌వర్క్ ఇది. ముఖ్యంగా చాట్‌జీపీటీలో బాగా పాపులర్ అయ్యింది. మన సొంత ఫొటోలు లేదంటే మనకు ఇష్టమైన ఏ ఇతర ఫొటోలైనా చాట్‌జీపీటీలో అప్‌లోడ్ చేసి జీబ్లీ స్టైల్ ఇమేజ్ కావాలని అడిగితే వెంటనే చూడముచ్చటైన చిత్రాన్ని అందిస్తుంది. మనకు ఏ విధమైన చిత్రం కావాలో సూచనలు ఇచ్చినా అలాంటి చిత్రాన్ని సృష్టించి ఇస్తుంది.

సమస్య ఏమిటి?

జీబ్లీ ఇమేజ్ కోసం మనం ఫొటో ఇస్తున్నామంటే మన వ్యక్తిగత ఫొటోలను ఏఐ టూల్ తన ఇష్టంవచ్చినట్లు వాడుకొనేందుకు ఒప్పుకుంటున్నట్లు లెక్క. మనమిచ్చే ఫొటో ఆధారంగా జీబ్లీ ఇమేజ్‌ను సృష్టించిన తర్వాత ఏఐ టూల్ ఒరిజినల్ ఫొటోను తన డేటా బేస్ నుంచి తొలగించదు. దానిని సదరు కంపెనీ ఏఐ శిక్షణ కోసమో, మరే ఇతర అవసరాలకైనా వాడుకొనే అవకాశం ఉంది. అప్పుడు మనకు తెలియకుండానే మన వ్యక్తిగత సమాచారం, ఫొటోలు దుర్వినియోగం కావచ్చని టెక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- మీ వ్యక్తిగత ఫొటోలు ఒకసారి ఏఐ టూల్‌కు షేర్ చేశారంటే ఇక మీరు వాటిపై నియంత్రణ కోల్పోయినట్లే. ఆ ఫొటోలతో ఏఐ ట్రైనింగ్‌తోపాటు ఏ రకంగానైనా వాడుకొనేందుకు ఆ కంపెనీకి అవకాశం ఇచ్చినట్లే. అది డేటా చౌర్యం ప్రమాదానికి దారితీస్తుంది. ఆ ఫొటోలు, కంటెంట్‌తో మిమ్మల్ని అప్రతిష్టపాలు చేయటానికి, వేధింపులకు గురిచేయటానికి కూడా అవకాశం ఉందని ప్రముఖ డేటా సెక్యూరిటీ సంస్థ ప్రొటాన్ హెచ్చరించింది.
- 'ప్రస్తుతం ఎక్కడ చూసినా జీబ్లీ స్టైల్ ఏఐ ఆర్ట్ చిత్రాలే కనిపిస్తున్నాయి. కానీ, దీనివల్ల కొన్ని ప్రమాదాలు కూడా ఉన్నాయి. మీ చిత్రాలు, ఆలోచనలను ఏఐ టూల్స్‌లో అప్‌లోడ్ చేయటం వల్ల డేటా చౌర్యంతోపాటు మీ ఉనికి (లొకేషన్) సదరు సంస్థ చేతుల్లోకి వెళ్తుంది. ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన అత్యంత సున్నిత డేటా కూడా మీ చేయిదాటిపోతుంది. జీబ్లీ ఇమేజ్ జనరేషన్ ఉచితమే కావచ్చు. కానీ, అది మీ జీవితం (డేటా) విలువ కూడా అవుతుంది. అది మీకు సమ్మతమే అయితే ఇబ్బంది లేదు. అప్రమత్తంగా ఉండటం ఎందుకైనా మంచిది.'

- ఎలీ ఫారెల్ కింగ్‌స్లే, బ్రిటిష్ టెక్ నిపుణురాలు.

జీబ్లీ స్టైల్‌కు ఆద్యుడెవరు?

జీబ్లీ ఆర్ట్ ఇమేజెస్‌కు ఆద్యుడెవరు అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ చిత్రాలు అచ్చం జపనీస్ యానిమేటర్ హయావో మియాజాకీ సృష్టించిన ఆర్ట్‌వర్క్‌లాగే ఉన్నాయి. అయితే, ఈ ఏఐ జీబ్లీ చిత్రాన్ని తొలిసారి పొందింది మాత్రం అమెరికాలోని సియాటిల్ నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రాంట్ స్లాటన్. 2023 డిసెంబర్‌లోనే ఈయన ఓపెన్ ఏఐ డాల్-ఈ టూల్‌ను వాడి తన కుటుంబ జీబ్లీ ఇమేజ్‌ను సృష్టించాడు.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం। 2-4-2025

ఓరుగల్లు సిగలో లోహవిహంగ నగ

- మామునూరు విమానాశ్రయ పనులు ప్రారంభించేందుకు ఏఏఐ సన్నద్ధం
- 1930లోనే మామునూరులో ఎయిర్‌పోర్టు..
- 1981 తర్వాత మూసివేత
- తెలంగాణలో రెండో విమానాశ్రయంగా మళ్లీ పునరుద్ధరణ
- పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య, పర్యాటక, ఐటీ, వైద్య, విద్యారంగాలకు ఊతం
- అభివృద్ధి చెందిన నగరాల జాబితాలోకి వరంగల్


1981 వరకు మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్, పార్కింగ్ చేసిన ప్రాంతం


1966 జూన్ 24న మామునూరు ఎయిర్‌పోర్టులో దిగుతున్న అప్పటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, ఏపీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ మామునూరు విమానాశ్రయానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయి. సుమారు 44 ఏళ్ల క్రితం మూతపడిన ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగిరేందుకు కార్యాచరణ సిద్ధమైంది. ఈ విమానాశ్రయం పునరుద్ధరణతో హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోనే అతి పెద్ద నగరంగా పేరున్న వరంగల్ అభివృద్ధిలో మరింత ప్రగతి సాధించనుంది. కాకతీయ మెగా జౌళిపార్క్, ఐటీ పరిశ్రమలు ఏర్పడటం.. యునెస్కోతో రామప్ప అంతర్జాతీయ పర్యాటక కేంద్రం కావడం .. ఇలా ఒక్కొక్కటిగా వస్తున్న ప్రాజెక్టులు ఓరుగల్లు ప్రతిష్టను పెంచుతున్నాయి. సుమారు 44 ఏళ్ల తర్వాత తెలంగాణలో రెండో ప్రాంతీయ విమానయాన కేంద్రంగా రూపుదిద్దుకోబోతుండగా.. భవిష్యత్ అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.

అర్థ శతాబ్దం, ఆకాశయానం...

1930లో మామునూరు ప్రాంతంలో నిర్మించిన ఈ విమానాశ్రయం, నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆధ్వర్యంలో ప్రారంభం కాగా.. సోలాపూర్ వ్యాపార అభివృద్ధి, సిర్పూర్ కాగజ్‌నగర్ కాగిత పరిశ్రమ, వరంగల్ అజంజాహీ మిల్స్ అవసరాలకు సేవలు అందించేది. 1981 వరకు.. సుమారు అర్థశతాబ్దం అనేక మంది ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు తమ పర్యటనలకు ఈ విమానాశ్రయాన్ని ఉపయోగించుకున్నారు. ఇండో–చైనా యుద్ధ సమయంలో ఢిల్లీ విమానాశ్రయాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్న సమయంలో కూడా, ఈ విమానాశ్రయం ప్రయాణికులకు సేవలు అందించింది. అయితే 1981లో వివిధ కారణాలతో ఈ విమానాశ్రయం మూత పడింది. మళ్లీ తెరిచేందుకు ప్రయత్నాలు జరిగినా ఫలితం లేకపోగా.. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు లైన్‌క్లియర్ అయ్యింది. ఇంతకాలం అడ్డంకిగా ఉన్న హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహించే జీఎంఆర్ గ్రూప్ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్‌ఓసీ) ఇవ్వడంతో మార్గం సుగమం అయ్యింది. పునరుద్ధరణకు విమానాశ్రయం డీపీఆర్‌ను సిద్ధం చేసే పనిలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిమగ్నమైంది.

కొత్త ఎయిర్‌పోర్టులో ఇవీ..

ఎయిర్‌బస్ ఎ–320, బోయింగ్ బీ–737 వంటి వైడ్–బాడీ విమానాలను ఉంచడానికి కొత్త రన్‌వే నిర్మించనున్నారు. విమానాశ్రయాన్ని సిగ్నల్ టవర్, భద్రతా వ్యవస్థలు, ఇతర కీలకమైన మౌలిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేస్తారు. ఈ విమానాశ్రయం ప్రారంభంలో ముంబై, ఢిల్లీ, తిరుపతి, బెంగళూరు, విజయవాడ వంటి నగరాలకు దేశీయ మార్గాలను అందిస్తుంది. భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా ఈ విమానాశ్రయం చివరికి అంతర్జాతీయ ప్రయా ణికులు, కార్గో సేవలను అందిస్తుంది. కాగా, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం వల్ల ఇతర జాతీయ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుల కనెక్టివిటీ, తద్వారా ఆర్థిక వృద్ధికి అవకాశాలు మెండు. రద్దీగా ఉండే హైదరాబాద్ నగరంపై ఒత్తిడిని తగ్గించడానికి కూడా వరంగల్‌ను అభివృద్ధి చేయడం ఒక మార్గంగా ప్రభుత్వాలు భావి స్తున్నాయి. అంతేగాకుండా వరంగల్ చారిత్రక ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి, స్థిరమైన అభివృద్ధి సాధనకు ప్రభుత్వం వరంగల్‌ను సుందర నగరం (స్మార్ట్‌సిటీ), హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ ఆగ్మెంటేషన్ యోజన (హృదయ్) వంటి పథకాల అమలు.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), కాకతీయ యూనివర్సిటీ (కేయూ), కాళోజీ హెల్త్ యూనివర్సిటీ (కేఎన్‌ఆర్)లున్న వరంగల్‌లో విద్య, వైద్యం, ఐటీ, పరిశ్రమల రంగాల అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్ మరింత దోహదపడుతుంది.

ముస్ముందు ఎన్నో ప్రయోజనాలు..

వచ్చే 20 ఏళ్లలో మామునూరు విమానాశ్రయం తెలంగాణలో ఒక ముఖ్యమైన విమానయాన కేంద్రంగా మారడంతోపాటు.. వరంగల్, సమీప ప్రాంతాల్లో పెట్టుబడులను పెంచుతుంది. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, మద్రాస్ మహానగరాల్లో ఉన్న కంపెనీలు తమ బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు ఉపయోగంగా ఉంటుంది. మహానగరాలతో పోల్చుకుంటే లివింగ్ కాస్ట్ ఇక్కడ తక్కువగా ఉండడం వల్ల ఐటీ ఉద్యోగులు ఇక్కడికి వచ్చే అవకాశాలు ఉంటాయి. గుజరాత్‌లోని రాజ్‌కోట్ వరంగల్ పట్టణం కంటే చిన్నది. అయినప్పటికి అక్కడ ఎయిర్‌పోర్టు ఉండడం వల్ల పట్టణానికి చుట్టూ స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటయ్యాయి. అదే విధంగా ముంబై, గుజరాత్, కోల్‌కతా, కోయంబత్తూరు లాంటి నగరాలకు చెందిన వస్త్ర పరిశ్రమలకు చెందిన వారు ఇక్కడ ఇండస్ట్రీలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. వరంగల్ చారిత్రాత్మకంగా గుర్తింపు పొందడంతోపాటు రామప్ప, మేడారం, లక్నవరం , తాడ్వాయి అభయారణ్యం ఉన్నందున టూరిజం పెరుగుతుంది. దేశ విదేశాలకు చెందిన పర్యాటకులు ఇక్కడకు వచ్చి సందర్శించే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన వేలాది మంది స్థానికులు విద్య, ఉద్యోగాల పరంగా అనేక దేశాల్లో ఉంటున్నారు. వారు తక్కువ సమయంలో వచ్చివెళ్లేందుకు ఎయిర్‌పోర్టు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాకుండా హోటళ్లు, ఇతర సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. వరంగల్ కాటన్, చిల్లీస్‌కు గుర్తింపు పొందినందున ఎయిర్‌పోర్టు ఉంటే ఫుడ్ ఆధారిత కంపెనీలు ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి.




మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు కేటాయించిన స్థలం, ఏర్పాటు చేసిన ఏఏఐ బోర్డు, ఇతరులకు ప్రవేశం లేకుండా ఏర్పాటు చేసిన గేటు

మామునూరు ఎయిర్‌పోర్టుతో మహర్దశ



హైదరాబాద్ తర్వాత వరంగల్‌లో ఐటీ సెక్టార్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వస్తున్నందున పలు కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. ఎయిర్‌పోర్టు ప్రారంభమైతే ఎంతో బిజీగా ఉండే ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు, ఇంటర్నేషనల్ సెక్టార్లకు చెందిన సీఈవోలు వచ్చి పోయేందుకు అనుకూలం. అందువల్ల ఇక్కడ కంపెనీలు పెట్టే అవకాశాలు ఉంటాయి. వరంగల్ కాటన్, చిల్లీస్‌కు గుర్తింపు పొందినందున ఎయిర్‌పోర్టు ఉంటే ఫుడ్ ఆధారిత కంపెనీలు ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ తదితర ఉత్పత్తులు అంతర్జాతీయంగా ఎగుమతులు అయ్యేందుకు అవకాశాలు కూడా ఉన్నాయి.

– బొమ్మినేని రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు, వరంగల్ కామర్స్ ఆఫ్ ఇండస్ట్రీ, తెలంగాణ రాష్ట్ర కాటన్ వెల్ఫేర్ అసోసియేషన్

మెడికల్ ఎమర్జెన్సీ, పరిశోధనలకు అవకాశం..



వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ రాకతో విద్యార్థులకు ఏరోనాటికల్ విభాగంలో నూతన ఆవిష్కరణ లకు, పరిశోధనలకు అనువైన అవకాశం లభిస్తుంది. వ్యాపార, వాణిజ్య, రియల్ ఎస్టేట్, టూరిజం రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లేందుకు ప్రయాణసమయాన్ని ఆదా చేసుకోవచ్చు. విపత్తు, ఆపద సమయాల్లో మెడికల్ ఎమర్జెన్సీని త్వరితగతిన అందించవచ్చు.

– పి.రామ్‌లాల్, ప్రొఫెసర్, ఎన్‌ఐటీ, వరంగల్

ఐటీ సంస్థలు ఎక్కువగా వస్తాయి..



మామునూర్‌కు ఎయిర్‌పోర్టు రావడం వల్ల ఐటీ సంస్థలు వరంగల్‌కు రావడానికి అవకాశం ఉంది. దీంతో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరగనున్నాయి. గతంలోకన్నా ఎక్కువగా ఐటీ సంస్థలు రావడానికి అవకాశాలు పెరగనున్నాయి. వరంగల్ ఉమ్మడి జిల్లా యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– దార ధనుంజయ్, ఐటీ ఉద్యోగి, మడికొండ, గ్రేటర్ వరంగల్

నిట్ 'దాసా' విద్యార్థులకు ప్రయాణం ఈజీ..



ఎన్‌ఐటీ వరంగల్‌లో విద్యనభ్యసిస్తున్న డైరెక్ట్ అడ్మిషన్ ఆఫ్ స్టూడెంట్స్ అబ్రోడ్ స్కీం (దాసా) విద్యార్థులు తమ గమ్యాన్ని చేరేందుకు మంచి అవకాశం. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లకుండా మామునూర్‌లో ప్రారంభమయ్యే విమానాశ్రయం నుంచి ప్రయాణ అవకాశం పొందవచ్చు. వరంగల్ నగరాన్ని ఆర్థికంగా ఉన్నతస్థాయిలోకి చేర్చేందుకు ఉపయోగపడుతుంది. యువత ఉపాధికల్పనకు తోడ్పడుతుంది.

– మహ్మద్ శార్‌జిల్, ఎంబీఏ విద్యార్థి, ఎన్‌ఐటీ, వరంగల్

పర్యావరణ అనుమతులే బొగ్గు ఉత్పత్తికి అడ్డంకి

- లక్ష్యం 72 మిలియన్ టన్నులు..బొగ్గు ఉత్పత్తి 69 మిలియన్ టన్నులు
- అనుమతులు రాక ప్రారంభం కాని మూడు కొత్త గనులు
- లక్ష్యానికి చేరువగా వచ్చి ఆగిన సింగరేణి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి పర్యావరణ అనుమతులు సింగరేణికి ప్రధాన అడ్డంకిగా మారాయి. గడిచిన రెండేళ్లుగా లక్ష్యానికి చేరువగా వచ్చినా, టార్గెట్ రీచ్ కాలేకపోతోంది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా లక్ష్యానికి అడుగుదూరంలో సింగరేణి ఆగిపోయింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2025 మార్చి 31 నాటికి 69 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి సాధించింది. నిర్దేశిత లక్ష్యంలో 96 శాతమే చేరుకుంది. సంస్థ పరిధిలో 11 ఏరియాలు ఉండగా, ఇందులో ఇల్లెందు, మణుగూరు, ఆర్జీ –1, ఆర్జీ –3 ఏరియాలు లక్ష్యానికి మించి ఉత్పత్తి సాధించాయి. అడ్రియాల, మందమర్రి, భూపాలపల్లి ఏరియాలు లక్ష్యానికి చాలా దూరంలో నిలిచాయి. మిగిలిన చోట 90 శాతానికి మించి బొగ్గును కార్మికులు వెలికితీశారు.

18.50 మిలియన్ టన్నుల లోటు..

సింగరేణి సంస్థ పరిధిలో 22 భూగర్భ, 18 ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నాయి. ఇవి కాకుండా 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో ఒడిశాలో నైనీ (10 మిలియన్ టన్నులు), కొత్తగూడెంలో వీకే మెగా ఓసీ (6 మిలియన్ టన్నులు), ఇల్లెందులో రొంపేడు ఓసీ (2.5 మిలియన్ టన్నులు) గనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ మూడు గనుల మొత్తం ఉత్పత్తి లక్ష్యం 18.50 మిలియన్ టన్నులు. అయితే వీటికి పర్యావరణ అనుమతులు రాకపోవడంతో గడిచిన రెండేళ్లుగా ఈ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి జరగలేదు. కానీ ప్రతీ ఏడాది టార్గెట్‌లో ఈ మూడు గనులను కూడా సింగరేణి చేర్చుతోంది. వీటిని మినహాయిస్తే వాస్తవంగా సాధించాల్సిన లక్ష్యం 63.50 మిలియన్ టన్నులు కాగా 69 మిలియన్ టన్నుల మేరకు ఉత్పత్తి జరిగింది. అనుమతులు రాని కొత్త గనులను మినహాయిస్తే సింగరేణి 108.66 శాతం ఉత్పత్తి చేసినట్టయింది.

ఏరియా	లక్ష్యం (టన్నుల్లో)	సాధించిన ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	1,49,50,000	1,38,00,000	96
ఇల్లెందు	41,30,000	42,75,274	104
మణుగూరు	1,27,00,000	1,26,91,098	100
బెల్లంపల్లి	38,50,000	37,50,000	97
మందమర్రి	34,60,000	27,11,295	78
శ్రీరాంపూర్	63,10,000	57,86,282	92
రామగుండం- 1	49,40,000	49,64,515	100
రామగుండం- 2	98,70,000	97,77,936	99
రామగుండం-3	62,50,000	65,11,243	104
అడ్రియాల	5,20,000	4,09,643	79
భూపాలపల్లి	49,60,000	37,02,292	75

ప్రణాళికాయుతంగా..

ఉత్పత్తి లక్ష్యం చేరుకునేందుకు సింగరేణి యాజమాన్యం ప్రణాళికాయుతంగా అడుగులు వేసింది. సింగరేణికి సేవలు అందిస్తున్న ప్రైవేట్ కంపెనీలతో పోటీపడేలా సంస్థ పరిధిలో ఉన్న యంత్రాల సగటు పనిగంటలు పెంచడంపై దృష్టి పెట్టారు. ప్రతీరోజు ఓవర్ బర్డెన్ 17 లక్షల క్యూబిక్ మీటర్లు, 2.6 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగేలా జాగ్రత్త పడ్డారు. కార్మికులకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు సైతం ఇచ్చారు. దీంతో 18.50 మిలియన్ టన్నుల లోటు ఉన్నా, సింగరేణి లక్ష్యానికి చేరువగా వచ్చింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో అయినా కొత్త గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ఉజ్వల భవిష్యత్–ఉద్యోగుల పాత్ర



ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచేందుకు గతేడాది చివరి నుంచి ఉజ్వల భవిష్యత్–ఉద్యోగుల పాత్ర అనే క్యాంపెయిన్ చేశాం. అది మంచి ఫలితాలు ఇచ్చింది. సంస్థ పరిధిలో దుబారా వ్యయాన్ని తగ్గించాం. గతేడాదితో పోల్చితే ఈసారి లాభాలు పెరుగుతాయి. ఈ వేసవిలో నైనీ, వీకే ఓసీలు ప్రారంభమవుతాయి.

– ఎన్.బలరాంనాయక్, సీఎండీ



అమ్మా నీకు నేనున్నా..

తల్లికి నాలుగేళ్ల బాలుడి సేవలు

జగిత్యాల: జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ తల్లికి చిన్నారి అందిస్తున్న సేవలను చూసి అక్కడున్న వారు చలించిపోయారు. ఆదిలాబాద్ జిల్లా పెద్దూరు మండలం ఎలగడపకు చెందిన రాజేందర్, జ్యోతి దంపతులు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో కూలీ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. జ్యోతి అనారోగ్యం బారిన పడటంతో రాజేందర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. రాజేందర్ వెళ్లిపోవడంతో ఆమెకు సేవలు చేసే వారు లేరు. నాలుగేళ్ల కొడుకు ఆమె దగ్గరే ఉంటూ భోజనం తినిపిస్తూ.. కాళ్లు ఒత్తుతూ ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఆ బాలుడిని చూసినవారు శభాష్ అని మెచ్చుకుంటున్నారు.



మానవత్వం పంచుతున్న చేతులు

వేములవాడలో 1,439 రోజులుగా పేదలకు అన్నదానం

వేములవాడ: ఫొటో చూస్తుంటే ఇది సామాజిక సేవకు ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది. చొక్కాలు ధరించిన వ్యక్తులు రోడ్డుపై ఉన్న వృద్ధులు, అభాగ్యులకు ఫ్రీగా భోజనం అందజేస్తున్నారు. పండుగలున్నా వదులుకుని రాజన్న ఆలయ పరిసరాల్లోని పేదలకు 1,439 రోజులుగా ఉచితంగా అన్నం అందజేస్తున్నారు. కరోనా సమయంలో ఏర్పడిన మై వేములవాడ వాట్సాప్ గ్రూప్ ఓ ట్రస్టుగా ఏర్పడి విరాళాలు పోగుచేసి ఇలా నిత్యం అన్నదానం చేస్తూ తమలోని సేవానిరతిని ప్రదర్శిస్తున్నారు. భోజనం పంపిణీ అనేది ఆకలితో ఉన్న నిరుపేదలకు ఉచితంగా అందించే ఒక గొప్ప కార్యక్రమం. సహాయ హృదయంతో, స్వచ్ఛందంగా ఈ సేవలో పాల్గొంటున్నట్లు సంతోషంగా చెబుతున్నారు. భోజనాలు స్వీకరిస్తున్న వారి దుస్తులు, శరీర ఆకృతులు చూస్తే వారు దైనందిన జీవన పోరాటంలో ఉన్నవారిగా చెప్పుకోకతప్పదు. ఇలాంటి కార్యక్రమం మానవత్వాన్ని, పరస్పర సహాయాన్ని, సేవా స్ఫూర్తిని పెంచుతోంది. ఆకలితో ఉన్నవారికి భోజనం ఇవ్వడం కేవలం ఆహారాన్ని అందించడం మాత్రమే కాదు.. అది ప్రేమ, శ్రద్ధ, మానవత్వాన్ని పంచుకోవడం. సమాజంలో ఎవరో ఒకరు సహాయం చేయకపోతే, ఎంతో మంది ఆకలితో ఉంటారనేది నిజం. మనం చేసే చిన్న సహాయం కూడా ఒకరి జీవితాన్ని మారుస్తుందనేది సామాజిక ధర్మం.

అగ్రవర్ణ పాలకులు అణచివేస్తున్నారు

బీసీ ఆజాదీ సత్యాగ్రహ దీక్షలో సూరజ్ మండల్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని అగ్రవర్ణ పాలకులు బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని బీపీ మండల్ మనువడు, ప్రొఫెసర్ సూరజ్ మండల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరూ అడగకముందే అగ్రవర్ణాల్లోని పేదలకు మోదీ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లను కల్పించిందని విమర్శించారు. మంగళవారం జంతర్‌మంతర్‌లో బీసీ ఆజాదీ జేఏసీ ఆధ్వర్యంలో జక్కని సంజయ్ నేత అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి హాజరై సూరజ్ మండల్ సంఘీభావం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రప్రభుత్వం వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపీ రాజారాం సింగ్ తదితరులు హాజరై మద్దతు ప్రకటించారు. బీసీల హక్కుల సాధన కోసం దేశవ్యాప్త పోరాటాన్ని ముమ్మరం చేస్తామన్నారు. కాగా, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర పటేల్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా పోలీసులు అరెస్టు చేశారు.

నేటి నుంచి కాంగ్రెస్ 'అభియాన్' యాత్రలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ ఏఐసీసీ అధ్యక్షుడై వందేళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాలను చేపడుతున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో కమిటీ, 2 నియోజకవర్గాలకు ఒక కోఆర్డినేటర్‌ను నియమించామని, డీసీసీ అధ్యక్షులు కోఆర్డినేటర్లుగా గ్రామస్థాయిలో అభియాన్ కార్యక్రమాలను చేపడతారని పేర్కొన్నారు. బుధవారం నుంచి అభియాన్ పాదయాత్రలు ప్రతి మండలంలో, డివిజన్లలో ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డెయిరీ సహకార సంఘాలకు రూ.155.97 కోట్లు

కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని డెయిరీ సహకార సంఘాలకు డెయిరీ అభివృద్ధి పథకాల కింద గత మూడు సంవత్సరాలలో (2021–22, 2022–23, 2023–24) కేంద్ర పశుసంవర్థక, పాడిపరిశ్రమ శాఖ రూ.155.97 కోట్లు విడుదల చేసిందని కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ తెలిపారు. కాగా కేంద్రం విడుదల చేసిన నిధుల్లో తెలంగాణ ప్రభుత్వం రూ.148.98 కోట్లు (96 శాతం) వినియోగించిందని మంగళవారం కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లోక్‌సభలో సమాధానం ఇచ్చారు.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 3,036.40 కోట్ల ప్రాజెక్ట్ వ్యయంతో 9 ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులు, 7 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ప్రాజెక్టులను కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆమోదించిందని ఎంపీలు సురేశ్ షెట్కార్, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీకే అరుణలు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి జార్జ్ కురియన్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

కేంద్ర ఫెసిలిటేటర్‌గానే వ్యవహరిస్తుంది..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 9లోని ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్ల విభజన, షెడ్యూల్ 10 సంస్థల విభజన, చట్టంలో ఎక్కడా పేర్కొనని సంస్థల ఆస్తుల విభజనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక సూచన స్వీకరించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లో ఎక్కడా పేర్కొనని షెడ్యూల్ 9 కంపెనీలు/కార్పొరేషన్లు, షెడ్యూల్ 10 శిక్షణా సంస్థలు/కేంద్రాలు, సంస్థల ఆస్తులు, అప్పుల విభజనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మంగళవారం లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. అంతేగాక రెండు రాష్ట్రాలకు సంబంధించిన ద్వైపాక్షిక సమస్యలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మాత్రమే పరిష్కరించుకోవచ్చని.. పరస్పర అవగాహనతోనే వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా వ్యవహరించాలన్న కేంద్ర ప్రభుత్వ విధానం స్థిరంగా ఉందన్నారు.

వేసవితాపం నుంచి ఉపశమనం



వేసవి తాపం నుంచి శరీరాన్ని చల్లబరచుకునేందుకు తాటిముంజెలు ఒక మంచి ఆహారం. వేసవి వచ్చిందంటే చాలు పల్లె, పట్నం తేడా లేకుండా ప్రజలు తాటి ముంజెల కోసం ఎదురుచూస్తుంటారు. నెల్లూరు జెండా వీధిలో నగరవాసులు తాటిముంజెలు కొనుగోలుచేస్తున్న దృశ్యం
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఆటవిడుపు



ఒంటిపూట బడులు కావడంతో సాయంత్రం పూట పిల్లలు ఆడుకునేందుకు ఇలా నదిబాట పట్టారు. విజయవాడలోని కృష్ణలంక సమీపంలో కృష్ణానదిలో ఇలా కాంక్రీట్‌తో చిన్న క్రికెట్ పిచ్ తయారు చేసుకుని ఆడుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పరీక్షలైపోయాయ్..



పదోతరగతి పరీక్షలు మంగళవారం పూర్తికావడంతో విద్యార్థులు సంతోషంగా చిందులు వేశారు. విజయవాడలోని పటమట హైస్కూల్‌లో పరీక్ష రాసి వచ్చిన విద్యార్థులు ఆనందంతో గంతులు వేస్తున్న దృశ్యం – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

గంగవరం పోర్టులో రెండు లోకో ట్రైన్లు ప్రారంభం



పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో మంగళవారం అదనంగా రెండు లోకో ట్రైన్లను ప్రవేశపెట్టారు. దీంతో నౌకాశ్రయ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు నౌకాశ్రయం నుంచి ర్యాక్ హ్యాండ్లింగ్ సామర్థ్యం కూడా మెరుగుపడనుంది. ఈ పోర్టు మౌలిక సదుపాయాలను భావి అవసరాలకు తగినట్టుగా ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నారు. గంగవరం పోర్టు స్థిరంగా మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్గో నిర్వహణ పరంగా కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సందర్భంగా పోర్టు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ పోర్టులో కొత్తగా రెండు లోకో ట్రైన్లను ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. పోర్టు ద్వారా గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలను దిగుమతిదారులకు కల్పిస్తున్నట్లు తెలిపారు.

రామతీర్థం రాములోరికి 6న మంత్రి కొండపల్లి చేతులు మీదగా పట్టువస్త్రాలు

సాక్షి, అమరావతి: శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 6వ తేదీన విజయనగరం జిల్లా నెలిమర్ల మండలం రామతీర్థంలోని శ్రీరామాలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామివారికి మంత్రి కొండలపల్లి శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ కార్యదర్శి వి. వినయ్‌చంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి గొంతు కోసిన జనసేన కార్యకర్త

సోమందేపల్లి: శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన డ్రామా వద్ద నితీష్ అనే యువకుడిపై ఈదుళబలాపురానికి చెందిన జనసేన కార్యకర్త విక్రాంత్ కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. గంజాయి మత్తులో ఉన్న విక్రాంత్ కత్తితో గొంతుకోసి, వీపుపై కూడా పొడవడంతో నితీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అడ్డొచ్చిన మరో యువకుడి చేతి వేళ్లకు కత్తి తగలడంతో అతను కూడా గాయపడ్డాడు. ఉద్దేశపూర్వకంగానే జనసేన కార్యకర్త తమపై దాడిచేసినట్లు బాధితులు చెబుతున్నారు. గత కొంతకాలంగా మండలంలో విచ్చలవిడిగా గంజాయి సరఫరా అవుతుండడంతో యువత దానికి బానిస అవుతున్నారు. కొంతమందిని గుర్తించి ఇటీవలే పోలీసులు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

కార్మిక ప్రజా సంఘాల జేఏసీ నేతలు

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా కార్మిక వర్గం సిద్ధంగా ఉందని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ కామ్రేడ్ సీహెచ్ నరసింగరావు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరానికి నేటితో 4 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అర్థ నగ్న ప్రదర్శనతో అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ రక్షిస్తామని చెబుతూ దానిని పూర్తిగా ప్రైవేటీకరణ చేసేందుకు శర వేగంగా అడుగులు వేస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాంచాలని అడుగుతుంటే ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని పెద్ద ఎత్తున సంబరాలు చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను ఏ ఒక్కరిని తొలగించినా సహించేది లేదన్నారు.

రూ.45 లక్షలకు పైగా నష్టపోతున్నా




ఈ రైతు పేరు అవర్ని అనిల్‌కుమార్. ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాయన్నపాలేనికి చెందిన ఈయన 150 ఎకరాలను కౌలుకు తీసుకుని.. ఎకరాకు రూ.1.40 లక్షల చొప్పున కౌలు చెల్లిస్తూ కోకో సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.40 వేల చొప్పున పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3.50 క్వింటాళ్ల చొప్పున కోకో గింజల దిగుబడి వచ్చింది. అన్ సీజన్(వర్షాకాలం)లో తీసిన పంటను కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. బతిమాలుకుంటే కిలోకు రూ.200-250 మించి ధర ఇచ్చేది లేదంటున్నారు. గతేడాది ఇదే సమయంలో సీజన్, అన్ సీజన్‌తో సంబంధం లేకుండా కిలో గింజలకు రూ.1,050 చొప్పున ధర దక్కింది. ఈ ఏడాది అమాంతం ధర తగ్గిపోవడంతో ఎకరాకు రూ.30 వేల చొప్పున మొత్తంగా తాను రూ.45 లక్షల మేర నష్టపోతున్నట్టు రైతు అనిల్‌కుమార్ ఘొల్లుమంటున్నారు. కోకో గింజల్ని కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధరల్ని దారుణంగా తగ్గించేయడంతో కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందుతున్నారు.



చాక్లెట్ పంట.. ధరలేక తంటా





సాక్షి, అమరావతి: చాక్లెట్ పంట అన్నదాతకు చేదును పంచుతోంది. కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో గింజల ధరల్ని అమాతం తగ్గించేయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం కంపెనీలకు కొమ్ముకాస్తూ తమని పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలో 1.12 లక్షల ఎకరాల్లో కోకో తోటలు ఉండగా.. ఎకరాకు 3-4 క్వింటాళ్ల చొప్పున ఏటా 12 వేల టన్నుల గింజల దిగుబడి వస్తోంది. ఇందులో 80 శాతం గింజల్ని క్యాడ్బరీ, మిగిలింది నెస్లే, క్యాంప్కో, లోటస్ తదితర కంపెనీలు సేకరిస్తున్నాయి. కోకో పంటకు నవంబర్ నుంచి జూన్ వరకు సీజన్. జూలై నుంచి అక్టోబర్ వరకు అన్ సీజన్. దిగుబడిలో రెండొంతులు సీజన్‌లోనూ, ఒక వంతు అన్ సీజన్‌లోనూ చేతికొస్తుంది. గతంలో సీజన్, అన్ సీజన్ అనే తేడా లేకుండా గింజలన్నింటినీ ఒకే రీతిలో అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కంపెనీలు కొనుగోలు చేసేవి. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

గతేడాది కిలో గింజల ధర రూ.1,050

గతేడాది ఇదే సమయంలో కిలో కోకో గింజలకు రూ.1,050 ధర లభించింది. ఈ ఏడాది కంపెనీలు సిండికేట్‌గా మారి అనూహ్యంగా ధరలు తగ్గించేయడంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో గింజల ధర రూ.770కి పైగా పలుకుతుండగా, కంపెనీలు మాత్రం నాణ్యమైన (ప్రీమియం) గింజలకు సైతం రూ.400-450 మధ్య చెల్లిస్తున్నాయి. అన్‌సీజన్ గింజల్ని కొనేందుకు కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు కిలో రూ.200-250 మధ్య కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రస్తుతం కోతకు వచ్చిన సీజన్ పంటకు సైతం కంపెనీలు గిట్టుబాటు ధర చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. కోతకు సిద్ధంగా ఉన్న పంట కాకుండా రైతుల వద్ద దాదాపు 1,500 టన్నులకు పైగా కోకో గింజల నిల్వలున్నాయి.

దిగుమతుల వల్లే..

ఈ ఏడాది చాక్లెట్ కంపెనీలు విదేశాల నుంచి కోకో గింజలు, పొడి, బటర్ దిగుమతి చేసుకోవడంతో ఇక్కడి రైతులు పండించిన పంటకు డిమాండ్ లేకుండాపోయింది. కోకో రైతుల్లో అత్యధికులు కౌలుదారులే. ఎకరాకు రూ.1.10 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు కౌలు చెల్లిస్తుంటారు. తెగుళ్లు, చీడపీడలు, యాజమాన్య పనుల కోసం ఏటా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెడుతుంటారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక సతమతమవుతున్న రైతులు కంపెనీల మాయాజాలం వల్ల తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. సీజన్, అన్‌సీజన్‌తో సంబంధం లేకుండా అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కోకో గింజల్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. ప్రభుత్వం జోక్యం చేసుకుని కంపెనీల మాయాజాలాన్ని అడ్డుకోవాలని ఏపీ కోకో రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని కోకో రైతులకూ వర్తింప చేయాలని కోరారు. కోకో రైతులను ఆదుకోకపోతే ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



“ప్రభుత్వం స్పందించడం లేదు”

ఎకరాకు రూ.1.40 లక్షల చొప్పున చెల్లించేలా 60 ఎకరాలను కౌలుకు తీసుకుని కోకో సాగు చేస్తున్నా. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. అన్‌సీజన్‌కు సంబంధించి 7 టన్నుల గింజలు ఉండగా.. కిలో రూ.330 చొప్పున 2.50 టన్నులు అమ్మాను. మిగిలిన 4.50 టన్నులు అమ్ముదామంటే కొనేవారు లేదు. సీజన్‌కు సంబంధించి 7 టన్నుల గింజల్ని కిలో రూ.550 చొప్పున కొన్నారు. ఇంకా 4 టన్నులు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు కిలో రూ.450కు మించి కొనలేమని చెబుతున్నారు. మరో రెండు టన్నుల వరకు పంట రావాల్సి ఉంది. ఈ ఏడాది పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించడం లేదు. లీజుకు చెల్లించిన మొత్తం నష్టపోయినట్టే. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఏమాత్రం స్పందించలేదు.

– మారంపూడి సురేష్, కొండలరావుపాలెం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా

బతుకుబాటలో పూలవాన!

'మొక్క'వోని దీక్షతో కోరుమిల్లివాసుల శ్రమ
నగరాల్లో నర్సరీల నిర్వహణలో 400 కుటుంబాలు
40 ఏళ్లుగా ఇదే వ్యాపారం



హైదరాబాద్ రహదారి వద్ద కోరుమిల్లి వాసుల నర్సరీ

కపిలేశ్వరపురం: ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. కోరుమిల్లి గ్రామానికి మొక్కల వ్యాపారం ప్రత్యేకత. 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన కొందరు బతుకు తెరువు కోసం చేసిన అన్వేషణ అనేక కుటుంబాల వారి జీవితంలో స్థిరత్వానికి బాట వేసింది. ఇంటికిద్దరు చొప్పున పదిమందితో బృందంగా ఏర్పడి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తదితర సుదూర ప్రాంతాల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని నగర, పట్టణ ప్రాంతాలకెళ్లినప్పుడు ఏదో ఒకచోట కోరుమిల్లివాసులు ఎదురవుతారంటే అతిశయోక్తికాదు. నర్సరీల నిర్వహణలో దేశవ్యాప్తంగా పేరుతెచ్చుకున్న కోరుమిల్లి వాసుల జీవన విధానంపై కథనం.

ఆత్మ విశ్వాసంతో సాగితే అంతా మంచే జరిగింది

కోరుమిల్లి వాసులు ఏళ్ల తరబడి గోదావరి లంకల్లో కూరగాయలు, ఉద్యాన పంటలు సాగు చేశారు. గ్రామంతోపాటు, సమీప ర్యాంపుల్లో ఇసుక లోడింగ్ చేయడంలో కోరుమిల్లి గ్రామస్తులకు ప్రత్యేక పేరుంది. ఎంత కష్టపడినా ఆదాయం అంతంత మాత్రంగా ఉన్న నేపథ్యంలో 1985లో కొంతమంది కొబ్బరి మొక్కలను వాహనాల్లో తరలించి శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల్లో విక్రయించడం ప్రారంభించారు. అప్పట్లో ప్రారంభమైన ఆ ప్రక్రియ కాస్తా నేడు నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటికొక నర్సరీ పనికి వెళ్లేలా ప్రేరణ కల్పించింది. ఊరు కాని ఊరులో నర్సరీల నిర్వహణ నల్లేరు మీద నడక కాదు. పట్టణాల్లోని రహదారుల వెంబడి ఖాళీ స్థలాల్లో రేకులు, ఆకులు, టార్పాలిన్‌లతో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకొంటారు. సంవత్సరాలు తరబడి అవే వారికి ఆవాసం. తెలంగాణలోని హైదరాబాద్ ఎల్‌బీ నగర్ నుంచి పఠాన్ చెరువు వరకూ మూడు కిలోమీటర్ల దూరంలో సుమారు 100 వరకు నర్సరీలున్నాయి. కోరుమిల్లికి చెందిన 500 మంది ఆ నర్సరీల్లో పనిచేస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్రలలో దాదాపు మరో 300 మంది పనిచేస్తున్నారు.

విక్రయించే ప్రధాన మొక్కలు ఇవే..

పూల మొక్కలతో పాటు కొబ్బరి, సపోటా, బత్తాయి, నారింజ, మామిడి, నిమ్మ, దానిమ్మలతో పాటు బోన్సాయి, క్రోటన్స్ వంటి మొక్కలను కూడా విక్రయిస్తుంటారు. ఇంటీరియర్ డికరేషన్, నివాస ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, సొంత పొలాల్లో పెంచుకునేందుకు కొనుగోలు చేస్తుంటారు. గులాబి, తులసి, చామంతి, మందారం మొక్కలను కుండీల్లో అమర్చి పెంచుకుంటారు.



మొక్కల తరలింపు, విక్రయాలు ఇలా...

1985లో గ్రామానికి చెందిన పదిమంది కడియం నర్సరీలో మొక్కలను లోడు చేసుకుని ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయగరంలలో విక్రయించడంతో గ్రామంలో మొక్కల వ్యాపారం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన యువకులు 2005 నుంచి హైదరాబాద్‌లో నర్సరీల నిర్వహణను కొనసాగిస్తున్నారు. నగరవాసుల నాడి పట్టిన కోరుమిల్లి వాసులు వ్యవసాయ పనులను వీడి క్రమంగా నర్సరీలవైపు మళ్లారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని మాణ్యం, బెంగళూరు, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రలోని నెల్లూరు, గుంటూరు, విశాఖపట్టణం, విజయవాడ, ఒంగోలు ప్రాంతాల్లో మొక్కలను విక్రయిస్తున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్రలకు పాలకొల్లు నుంచి తీసుకెళ్లి కొబ్బరి మొక్కలను విక్రయిస్తుంటారు. కడియం, పూణేల నుంచి ఇండోర్, క్రోటన్స్ మొక్కలను, బెంగళూరు నుంచి గులాబి మొక్కలను ఖరీదు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు.



శ్రీ నూకాలమ్మకు విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని శ్రీ నూకాలమ్మ అమ్మవారి 61వ ఉగాది వార్షిక జాతర మహోత్సవంలో 8వ రోజైన మంగళవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సామూహిక కుంకుమ పూజా కార్యక్రమం వేదోక్తంగా జరిగింది. సాయంత్రం ఏడు గంటల నుంచి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తిప్పాభట్ల వెంకట రామకృష్ణచే ఆలయ విశిష్టతపై ప్రత్యేక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.



6 నుంచి రఘునాథస్వామి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని గొల్లపల్లిలో వేంచేసియున్న శ్రీ రఘునాథస్వామి వారి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలను ఈ నెల 6వ తేదీ నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లూరి సతీష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 6న ఉదయం 9 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయడం జరుగుతుందని, 9న రాత్రి 9 గంటలకు రఘునాథస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కళ్యాణమహోత్సవం అనంతరం స్వామి వారిని అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ పండుగ

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ నిర్వహించి మంగళవారం నాటికి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పలువురు పీటలపై కూర్చుని పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్ : ఏలూరు జిల్లా ముదినేపల్లిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రైల్వే ఉద్యోగాల ఉచిత శిక్షణకు 5న ప్రవేశ పరీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్: రైల్వే శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు రామ్ కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు గ్రూప్-డీ పరీక్షల ద్వారా వివిధ పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఈనెల 5న రెండు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయాలతో పాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు.

సాగుబడి
రేవతి కార్తె: మార్చి 31 నుంచి

అగ్గిని తట్టుకునే 'అగవె'!


కొత్త పంట





అగవె.. చాలా అరుదైన ఎడారి మొక్క.
మంటలకు తట్టుకొని నిలబడగలిగే అరుదైన లక్షణం గల ఎడారి పంట ఇది.
కలబంద మొక్క మాదిరిగా కనిపించే అగవే చాలా ఎత్తుగా ఎదుగుతుంది.
అగవె మట్టల నుంచి నార తీసి, తాళ్లు అల్లే సంప్రదాయం ఉంది. 'నార కలబంద' అని పేరుంది.
తీవ్ర వేడి పరిస్థితుల్లోనూ మనుగడ సాగిస్తుంది. పశుగ్రాసంగా పనికొస్తుంది.
వాతావరణం నుంచి కార్బన్ డయాక్సయిడ్‌ను గ్రహించి భూమిలో స్థిరీకరించటం ద్వారా భూతాపాన్ని తగ్గిస్తుంది. నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందిస్తుంది.
దీని మట్టల పైపొర చాలా దృఢంగా, బూడిద పూసినట్లు ఉండటం వల్ల మంటలను కూడా తట్టుకోగలుగుతుంది. అందువల్ల, అగవే తోటలకు నిప్పు భయం ఉండదు.
ఉద్యాన తోటల మధ్యలో అక్కడక్కడా కొన్ని వరుసలు అగవే మొక్కలు నాటుకుంటే నిప్పు భయం నుంచి తోటలను కొంతమేరకైనా కాపాడుకోవచ్చు.

275కు పైగా రకాలు

అగవె సక్యులెంట్ ప్లాంట్. అంటే, గాలి నుంచి తేమను గ్రహించి తన ఆకుల్లో దాచుకోగలిగే ఎడారి మొక్క. ఐదారు అడుగుల ఎత్తుకు పెరిగే అగవె జాతులు కూడా ఉన్నాయి. బహుళ ప్రయోజనకారి అయిన అగవె తోటలు అమెరికా ఖండం అంతటా వ్యాపించి ఉన్నప్పటికినీ.. మెక్సికోలో ఎక్కువ. మన దేశంలోనూ అగవె మొక్కలు మెట్ట ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటాయి. ముఖ్యంగా ఎడారి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. 275కు పైగా అగవె పంట రకాలున్నాయి. ఇందులో ఎ. సిసాలన, ఎ. కంటల, ఎ.అమెరికానా వంటి అగవె రకాలు భారత దేశంలో అందుబాటులో ఉన్నాయని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం పదేళ్ల క్రితమే ప్రకటించింది. దీని సాగు పద్ధతులను కూడా ప్రామాణీకరించింది. అయినా, ఇప్పటికీ అగవె మనం ఉపయోగించుకోలేకపోయిన పంటగానే మిగిలిపోయింది.

దైవమిచ్చిన పంట!

మెక్సికోలో పురాతన కాలం నుంచే అజ్‌టెక్ ప్రజలు అగవెను దైవమిచ్చిన పంటగా భక్తితో సాగు చేసుకొని ఉపయోగించుకుంటున్నారని చరిత్ర చెబుతోంది. మాయాహూఎల్ అనే దేవత తమకు ప్రసాదించిన తేనె అగవె మట్టల నుంచి తీసినదేనని వారు నమ్ముతారు. ఇప్పుడు దీన్ని ఒక పారిశ్రామిక పంటగా, ఆదాయ వనరుగా కూడా చూస్తున్నారు. అనేక ఆల్కహాల్ ఉత్పత్తులతో పాటు.. షుగర్, సిరప్ వంటి ఆహారోత్పత్తులు, సహజ నార ఉత్పత్తుల తయారీకి.. పశుగ్రాసంగా కూడా అగవె పంటను ఉపయోగిస్తున్నారు. యాంటీఆక్సిడెంట్లు, సపోనిన్లు వంటి ఆరోగ్యకర ఉత్పత్తులను కూడా ఇటీవల అగవె నుంచి ఇటీవల సంగ్రహిస్తున్నారు. దీంతో ఇది బహుళ ప్రయోజనకారి అయిన పారిశ్రామిక పంటగా మారింది. భూతాపోన్నతి పెచ్చుమీరుతున్న ఈ దశలో ఈ ఎడారి పంట మరింత ప్రాచుర్యంలోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తీవ్ర నీటి ఎద్దడిని తట్టుకునే స్వభావం వల్ల లాండ్‌స్కేపింగ్‌లో కొన్ని రకాల అగవె మొక్కలను కంచెలుగా పెంచుతుండటం నగరాల్లోనూ కనిపిస్తోంది.

వంద కోట్ల అగవె ప్రాజెక్టు

అగవె జాతి మొక్కల పెంపకం వల్ల ప్రజలకే కాకుండా పర్యావరణానికీ గొప్ప మేలు జరుగుతుందని నమ్మే 'రీజెనరేషన్ ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల అగవె మొక్కలు నాటాలన్న బృహత్ సంకల్పం తీసుకుంది. ద బిలియన్ అగవె ప్రాజెక్ట్‌లో భాగంగా మెక్సికోలోని గ్వానాజువాటో ఎడారి ప్రాంతంలో పర్యావరణంలో అద్భుత మార్పులు తేగల అగవె తోటలు నాటుతున్నారు.

అగవె మొక్కలతో పాటు వాటి పక్కనే నత్రజనిని గాలిలో నుంచి గ్రహించి భూమిలో స్థిరీకరించే పజేసే జాతుల చెట్లను నాటడం, పశువులను ఈ తోటల్లో తగుమాత్రంగా మేపుతూ ఉండటం ద్వారా ఆ ఎడారి ప్రాంతాన్ని తిరిగి పచ్చని ప్రాంతంగా మార్చటం ఈ ప్రాజెక్టు లక్ష్యం. తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల్లో, నిస్సారమైన భూముల్లో అధికంగా పశుగ్రాసాన్ని పెద్ద మొత్తంలో సాగు చేయటం అగవె ద్వారానే సాధ్యమని ఈ సంస్థ తెలిపింది. అగవె మట్టలను గుజ్జులాగా చేసి, కొన్ని రోజులు గాలి తగలకుండా మగ్గబెడితే అద్భుతమైన పశుగ్రాసంగా పనికి వస్తుంది. తీవ్ర కరువు ప్రాంతాల్లో పశువులను ఇది కష్టకాలంలో రక్షిస్తుందని చెబుతున్నారు.

సరికొత్త తోటల నమూనా

అగవెతో మెట్ట ప్రాంతాల్లో సాగు చేయదగిన సరికొత్త తోటల (ఆగ్రోఫారెస్ట్రీ) నమూనాను రీజనరేషన్ ఇంటర్నేషనల్ రూపొందించింది. హెక్టారుకు 1600–2500 మొక్కల్ని వత్తుగా నాటాలి. వీటి మధ్యలో వేగంగా పెరిగే, పశువులు తినే ఆకులుండే దీర్ఘకాలిక ద్విదళ జాతి చెట్ల జాతి (గ్లైరిసీడియా (గిరిపుష్పం), తుమ్మ వంటి) మొక్కల్ని 500 వరకు నాటాలి.

అగవె మొక్కలు 3 ఏళ్లు పెరిగిన తర్వాత నుంచి 5–7 ఏళ్ల పాటు ఈ చెట్ల మట్టలను (ఆకులను) కోసుకోవచ్చు. గట్టిగా ఉండే ఈ మట్టలను చాప్ కట్టర్ వంటి యంత్రంతో గుజ్జులాగా తరగాలి. ప్లాస్టిక్ బక్కెట్లు/ డ్రమ్ముల్లో ఈ గుజ్జును నింపి, మూత పెట్టి, 30 రోజులు మాగ బెట్టాలి. దీనితో పాటు.. గ్లైరిసీడియా/ అడవి తుమ్మ/సర్కారు తుమ్మ వంటి ద్విదళ జాతి చెట్ల కాయలు, ఆకులను 20% వరకు కలిపి గుజ్జుగా చేసి కలిపితే ప్రొటీన్లు కూడా సమృద్ధిగా దొరుకుతాయి. ఈ విధంగా సహజ సిద్ధమైన కూడిన పశువుల దాణా అతి తక్కువ ఖర్చుతో తయారవుతుంది. 8–10 ఏళ్ల తర్వాత అగవె చెట్టు పువ్వు పూసి చనిపోతుంది. ఆ దశలో చెట్టు కాండం నుంచి ఆల్కహాల్ ఉత్పత్తుల తయారీకి వినియోగించవచ్చు. ఈ అగవె తోటలో పశువులను మేపుకుంటూనే, పశువుల దాణాను కూడా తయారు చేసుకోవచ్చు. ఎడారి ప్రాంత రైతులకు అగవె తోటలు ఆర్థికంగానే కాకుండా పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేస్తాయని రీజెనరేషన్ ఇంటర్నేషనల్ స్పష్టం చేస్తోంది. ఇది మన దేశంలోనూ దక్షిణాదిలో మెట్ట ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే అగ్రోఫారెస్ట్రీ నమూనాగా చెప్పవచ్చు.

'అగవె'నే ఎందుకు?

- భూతాపం పెచ్చు మీరిన తర్వాత అడవుల్లో కార్చిచ్చులు మరీ ఎక్కువైపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి. వేలాది ఎకరాల్లో అడవులు దగ్ధమైపోతున్నాయి. అంతర్జాతీయంగా కార్చిచ్చుల నుంచి పచ్చని చెట్లను, తోటలను రక్షించుకోవటానికి మధ్యలో అక్కడక్కడా అగవే మొక్కలు నాటుకోవటం ఒక వినూత్న పరిష్కార మార్గంగా ముందుకు వస్తోంది.
- అగవె మట్టలు(ఆకులు) మందంగా, బూడిద పూసినట్లు ఉండి, వేడిని తట్టుకునేలా ఉంటాయి. సులువుగా నిప్పంటుకోవటానికి అవకాశం ఉండదు.
- అగవె మొక్క తన ఆకుల్లో చాలా నీటిని నిల్వ చేసుకుంటుంది. అందువల్ల వాటికి అంత సులువుగా నిప్పంటుకోదు. ఈ కారణంగా మంటలను అవతలి ప్రాంతానికి వ్యాపింపజేయకుండా అడ్డుకునే తత్వం అగవె మొక్కలకు వచ్చింది.
- అగవె చెట్టు వేర్లు ఎంత విస్తారంగా భూమిలోకి విస్తరించి ఉంటాయంటే.. ఇతరత్రా చెట్లన్నీ అగ్నికి ఆహుతైపోయినా ఇవి మాత్రం నిలబడే ఉంటాయి.





ఎకరానికి 30-40 టన్నుల మట్టల దిగుబడి

మన దేశంలో ఎ. సిసలన, ఎ. కంటల, ఎ. అమెరికానా రకాల అగవె మొక్కలు ఉన్నాయి. నీరు నిల్వ ఉండని, ఎర్ర గరప నేలల్లో బాగా పెరుగుతుందని అగవె పంటపై పరిశోధన చేసిన తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆకు ముక్కలను లేదా పిలకలను నాటుకోవాలి. ఆకు ముక్కల్ని నర్సరీలో 9–12 అంగుళాల వరకు పెంచి, 2×2 మీటర్ల దూరంలో, వర్షాకాలంలో నాటుకోవాలి.

మూడేళ్ల తర్వాత నుంచి ఆకుల దిగుబడి వస్తుంది. మీటరు కన్నా ఎక్కువ పొడవు పెరిగిన ఆకులను కత్తిరించాలి. ప్రతి మొక్కా ఏడాదికి 40-50 ఆకుల దిగుబడిని 8 ఏళ్ల వరకు ఇస్తుంది. ఈ మట్టల్లో నార/పీచు రకాన్ని బట్టి 2.5-4.5% వరకు ఉంటుంది. అగవె సిసలన రకంలో 4.5% నాణ్యమైన నార ఉంటుంది. మూడేళ్లు గడచిన తర్వాత ఎకరానికి 30-40 టన్నుల మట్టల దిగుబడి వస్తుంది. పదేళ్ల నాటి అంచనాల ప్రకారం.. ఎకరానికి రూ. 2 వేల నికారాదాయం వస్తుంది. పొలాల చుట్టూ కంచె పంటగా అగవెను నాటుకున్నా.. ఇందులో 25% నికరాదాయం వస్తుంది. యంత్రంతో నార తీసి, నీటితో శుద్ధిచేసి, ఎండబెట్టి బేళ్లుగా కట్టి అమ్మాలి. ఎండగా ఉన్న రోజే నార తియ్యాలి. మట్టలను కోసిన రెండు రోజుల్లోగా తీస్తేనే నాణ్యమైన నార వస్తుంది. పాల తెలుపు నుంచి బంగారు పసుపు రంగుల్లో ఈ నార ఉంటుందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం పేర్కొంది. అగవెను పశు దాణా ఉత్పత్తి గురించి మెక్సికో రైతులు ఎక్కువగా చెబుతుంటే.. తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం మాత్రం నార కోసం అని మాత్రమే చెబుతోంది. అందుకే దీనికి నార కలబంద అని పేరొచ్చినట్టుంది. ఏదేమైనా బంజర్లు, ఎడారి ప్రాంతాల్లో అగవెతో కూడిన కొత్త రకం ఆగ్రోఫారెస్ట్రీ తోటల సాగుపై ప్రభుత్వ రంగ పరిశోధకులు దృష్టి సారిస్తే వర్షాధార ప్రాంత రైతులకు, పర్యావరణానికీ మేలు కలుగుతుంది.

ఒక మొక్కకు టన్ను పశువుల దాణా!

అగవె మొక్కలు గాలికి, ఎండకు, వానకు పెరుగుతాయి. నిర్వహణ అతి సులభం. బాగా పెరుగుతుంది. ఒక్కో చెట్టు 8–10 ఏళ్లు బతుకుతుంది. ఈ కాలంలో ఒక టన్ను బరువైన మట్టలను అందిస్తుంది. ఈ చెట్లను ఇతర ద్విదళ చెట్లతో కలిపి పెంచితే ఎడారి ప్రాంతం కూడా ఆకుపచ్చగా మారుతుంది. భూమి సారవంతమవుతుంది. వాన నీరు అక్కడికక్కడే భూమిలోకి బాగా ఇంకుతుంది. వాతావరణంలోని కార్బన్ డయాక్సయిడ్‌ను భారీగా గ్రహించి భూమిలో స్థిరీకరించడానికి అగవె తోటలు దోహదపడతాయి. ఈ ప్రయోజనాల రీత్యా ప్రపంచ వ్యాప్తంగా వంద కోట్ల అగవె మొక్కలు నాటాలని ద బిలియన్ అగవె ఉద్యమాన్ని రీజనరేటివ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రారంభించింది. విరాళాలు, ప్రభుత్వ, ప్రజల పెట్టుబడులతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఈ సంస్థ తలపెట్టింది.



నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

విద్యుత్తు లేకుండా ఆకుకూరలను 36 గంటలు నిల్వ ఉంచే బాక్స్!

దైనందిన ఆహారంలో ఆకుకూరలకు ఉన్న ప్రాధాన్యత తెలియనిది కాదు. అయితే, నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రజలు, చిల్లర వర్తకులు ఆకుకూరలను రెండో రోజు వరకు నిల్వ ఉంచడానికి నానా తిప్పలు పడుతూ ఉంటారు. అయితే, బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) శాస్త్రవేత్తలు ఈ సమస్యకో పరిష్కారం కనుగొన్నారు. దాని పేరే అర్క హై హుమిడిటీ స్టోరేజ్ బాక్స్.

- సాధారణంగా 24 గంటల్లోనే ఆకుకూరలు వాడిపోయి పాడైపోతుంటాయి. అయితే, అర్క హై హుమిడిటీ స్టోరేజ్ బాక్స్‌లో పెడితే 36 గంటల పాటు తాజాగా ఉంటాయి. ఈ బాక్స్‌ను గది ఉష్ణోగ్రత(26–28 డిగ్రీల సెల్షియస్, 52% గాలిలో తేమ)లో ఉంచి, అందులో ఆకుకూరలు పెట్టి మూత వేస్తే చాలు.
- విద్యుత్తు అవసరం లేదు. రిఫ్రిజిరేషన్ చేయనవసరం లేకుండానే అర్క హై హుమిడిటీ స్టోరేజ్ బాక్స్‌లో ఉంచితే చాలు.. ఆకుకూరలు 36 గంటలు తాజాగా ఉంటాయి.
- కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే రిటైల్ షాపులకు, సూపర్ మార్కెట్లకు, తోపుడు బండ్లు/ ఆటోలపై కూరగాయలు అమ్మే వ్యాపారులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.
- అర్క హై హుమిడిటీ స్టోరేజ్ బాక్స్‌లో పరిశుభ్రమైన స్థితిలో ఆకుకూరలను తాజాదనం కోల్పోకుండా నిల్వ ఉంచుకోవ్చు. ఇతర వివరాలకు... 77608 83948 info@bessthort.in



● టెక్నాలజీ

పుట్టగొడుగుల్ని ఇంటికి తెచ్చే ట్రైసైకిల్!

తాజా పుట్టగొడుగులను నగర, పరిసర ప్రాంతాల వినియోగదారులకు వారి ఇంటి దగ్గరకే తీసుకెళ్లి అందించే లక్ష్యంతో సౌర విద్యుత్తుతో పుట్టగొడుగులను ఉత్పత్తి చేసే ట్రైసైకిల్ సాంకేతికతను బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) రూపొందించింది. వేరే చోట పుట్టగొడుగులను పెంచి, తీసుకెళ్లి విక్రయించడటం వల్ల అవి తాజాదనాన్ని కోల్పోతుంటాయి. కోసిన తర్వాత వినియోగదారులకు చేరటం ఆలస్యమైతే రెండు, మూడు రోజుల్లో పుట్టగొడుగులు రంగు మారి వృథా అయ్యే పరిస్థితి ఉంటుంది. ఈ సమస్యను అధిగమించటంతో పాటు పౌష్టికాహారాన్ని ప్రజలకు తాజాగా అందించటం ద్వారా ఉపాధి పొందగోరే యువతకు ఆదాయ వనరుగా ఈ మష్రూమ్ సోలార్ ట్రైసైకిల్ సాంకేతికతను ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు రూపొందించారు.

పెరట్లో, మేడపైన కొద్ది ఖాళీలోనే అవుట్‌డోర్ సోలార్ మష్రూమ్ ప్రొడక్షన్ యూనిట్‌ను ఇంతకుముందే ఐఐహెచ్ఆర్ రూపొందించింది. ఈ యూనిట్‌లో పెరిగిన పుట్టగొడుగులతో కూడిన గ్రోబాగ్స్‌ను సోలార్ ట్రైసైకిల్‌లోకి మార్చుకొని... వినియోగదారుల ఇళ్ల దగ్గరకు తీసుకు వెళ్లి విక్రయించడానికి ట్రైసైకిల్ ద్వారా అవకాశం కలిగిస్తోంది. తద్వారా పోషకవిలువలతో కూడిన పుట్టగొడుగులను ప్రజల దైనందిన ఆహారంలో భాగం చేసుకోగలుగుతారని ఐఐహెచ్ఆర్ ఆశిస్తోంది.

ఈ ట్రైసైకిల్ ఛాంబర్ 1.5×1×1 మీటర్ల సైజులో ఉంటుంది. అల్యూమినియం ఫ్రేమ్‌లలో పుట్టగొడుగులు పెరిగే బ్యాగులను అమర్చుకోవచ్చు. గాలి ఆడటం కోసం, పురుగులు, ఈగలు వాలకుండా నైలాన్ 40 మెష్‌ను, గోనె సంచులను చుట్టూతా ఏర్పాటు చేశారు. కిలో/2 కిలోల పుట్టగొడుగులతో కూడిన 36 బ్యాగ్‌లు ఇందులో పెట్టుకోవచ్చు. 30 వాట్స్ డిసి మిస్టింగ్ డయాఫ్రం పంప్ నిరంతరం గోనె సంచులపై నీటి తుంపర్లను చల్లుతూ చల్లబరుస్తూ ఉంటుంది. ఇది విద్యుత్తుతో లేదా సౌర విద్యుత్తుతో నడుస్తుంది. 300 వాట్స్ ప్యానల్, ఇన్వర్టర్, 12వి స్టోరేజ్ బ్యాటరీ, టైమర్ ఇందులో అమర్చారు. ట్రైసైకిల్‌కి 48వి, 750 వాట్స్ డిసి గేర్‌డ్ మోటార్ అమర్చారు. వోల్టేజి కంట్రోలర్, సౌర విద్యుత్తును నిల్వ చేయటానికి 24ఎహెచ్ లిథియం అయాన్ బ్యాటరీని అమర్చారు. ఇతర వివరాలకు.. ఐఐహెచ్ఆర్ మష్రూమ్ లాబ్ (బెంగళూరు) – 070909 49605.





బిజినెస్ రీల్

అన్‌లిమిటెడ్ నుంచి కొత్త కలెక్షన్లు

న్యూఢిల్లీ: అగ్రగామి ఫ్యాషన్ దుస్తుల సంస్థ అన్‌లిమిటెడ్ పండుగ సందర్భంగా కొత్త కలెక్షన్లు తీసుకొచ్చింది. టీ షర్టులు, కార్గోస్, కాలర్ టీ షర్టులు, కుర్తాలు, సల్వార్ షూట్స్, టాప్స్ తదితర తాజా ఫ్యాషన్ మోడళ్లను అందుబాటు ధరలకే అందిస్తుంది. రూ.3,000 కొనుగోలుపై రూ.99లకే ఇయర్‌బర్డ్స్ లేదా ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను, రూ.6000 షాపింగ్‌పై రూ.99లకే 3పీస్ క్యాసరోల్‌ను పొందవచ్చు.

బిర్లాన్యూ రూ. 1,300 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: సీకే బిర్లా గ్రూప్‌లో భాగమైన నిర్మాణ రంగ మెటీరియల్స్ సొల్యూషన్స్ విభాగం బిర్లాన్యూ వచ్చే 3–4 ఏళ్లలో అమ్మకాలను రెట్టింపు చేసుకోవాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా రూ. 1,200 కోట్లు – రూ. 1,300 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ అవంతి బిర్లా తెలిపారు. అలాగే, అధిక వృద్ధి సాధన దిశగా ఇతర సంస్థలను కొనుగోలు చేసే అవకాశాలనూ పరిశీలిస్తున్నట్లు వివరించారు. పైపులు, నిర్మాణ రంగంలో ఉపయోగించే రసాయనాల వ్యాపార విభాగాలు కీలక వృద్ధి చోదకాలుగా ఉంటాయని, అంతర్జాతీయ ఇంటీరియర్స్ బ్రాండ్ పారాడోర్ వ్యాపారం కూడా వచ్చే మూడు, నాలుగేళ్లలో రెట్టింపు కాగలదని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కంపెనీ గతేడాదే పైపులు, ఫిట్టింగ్స్ తయారీ సంస్థ క్రెస్టియా పాలిటెక్‌తో పాటు దాని నాలుగు అనుబంధ సంస్థలను రూ. 265 కోట్లకు కొనుగోలు చేసింది.

ఏబీసీఎల్‌లో ఆదిత్య బిర్లా ఫైనాన్స్ విలీనం

న్యూఢిల్లీ: పూర్తి అనుబంధ సంస్థ ఆదిత్య బిర్లా ఫైనాన్స్‌ను విలీనం చేసుకునే ప్రక్రియ పూర్తయినట్లు ఆదిత్య బిర్లా క్యాపిటల్ (ఏబీసీఎల్) వెల్లడించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాల మేరకు ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లవుతుందని పేర్కొంది. ఆదిత్య బిర్లా ఫైనాన్స్‌ను మాతృ సంస్థలో విలీనం చేయాలని గతేడాది మార్చిలో నిర్ణయం తీసుకున్నారు. విలీన సంస్థకు ఎండీ, సీఈవోగా విశాఖ మూల్యే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రాకేశ్ సింగ్ వ్యవహరిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-4-2025

విశాఖ	440–00
చిత్తూరు	520–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	450–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	682.7	5.06
TRENT	5,568.10	4.56
JIOFIN	230.94	1.51
BAJAJ-AUTO	7,975.00	1.22
HEROMOTOCO	3,767.00	1.18

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,534.50	-3.64
BEL	290.9	-3.47
BAJAJFINSV	1,941.90	-3.26
HDFCBANK	1,769.90	-3.19
HINDALCO	663.5	-2.78

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,612
ఎన్ఎస్ఈ	85,431
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,73,526
ఎఫ్ఐఐ	- 5,902
డీఐఐ	+ 4,322

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.20	$ 71.48
బ్రెంట్	74.50	$ 74.77

లిస్టింగ్‌కు కంపెనీల క్యూ

- సెబీకి 5 సంస్థల ప్రాస్పెక్టస్‌లు దాఖలు
- జాబితాలో ఆనంద్ రాఠీ షేర్, ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్
- రన్వాల్ ఎంటర్‌ప్రైజెస్
- జైన్ రిసోర్స్ రీసైక్లింగ్, ప్రోజీల్ గ్రీన్

గతేడాది చివర్లో మందగించిన ప్రైమరీ మార్కెట్ మళ్లీ జోరందుకుంటోంది. కొద్ది రోజులుగా పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి వరుసగా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేస్తున్నాయి. తాజాగా 5 కంపెనీలు లిస్టింగ్ బాట పట్టాయి. వివరాలు చూద్దాం..



న్యూఢిల్లీ: ఇటీవల పలు కంపెనీలు లిస్టింగ్‌కు క్యూ కడుతున్నాయి. దీంతో ప్రైమరీ మార్కెట్ మళ్లీ ఊపందుకుంటోంది. తాజాగా ఆనంద్ రాఠీ గ్రూప్ బ్రోకరేజీ సంస్థ ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఈ బాటలో ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, రన్వాల్ ఎంటర్‌ప్రైజెస్, జైన్ రిసోర్స్ రీసైక్లింగ్, ప్రోజీల్ గ్రీన్ ఎనర్జీ సైతం ప్రాథమిక పత్రాలను దాఖలు చేశాయి.

రూ. 745 కోట్లు

గతేదాది డిసెంబర్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌ను సెబీ జనవరిలో తిప్పి పంపిన నేపథ్యంలో ఆనంద్ రాఠీ షేర్ మరోసారి సవరించిన ప్రాథమిక పత్రాలను సెబీకి దాఖలు చేసింది. వీటి ప్రకారం తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ. 745 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. నిధుల్లో రూ. 550 కోట్లు దీర్ఘకాలిక మూలధన పెట్టుబడులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ఆనంద్ రాఠీ బ్రాండుతో బ్రోకింగ్, మార్జిన్ ట్రేడింగ్, ఫైనాన్షియల్ ప్రొడక్టుల పంపిణీ తదితర ఫైనాన్షియల్ సరీ్వసులు అందిస్తోంది. 2024 సెప్టెంబర్30కల్లా ఆరు నెలల్లో రూ. 442 కోట్ల ఆదాయం, రూ. 64 కోట్ల నికర లాభం సాధించింది.

రూ. 2,000 కోట్లు

ఐపీవో ద్వారా నాన్‌ఫెర్రస్ మెటల్ ప్రొడక్టుల తయారీ సంస్థ జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ రూ. 2,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూకింద రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 1,500 కోట్ల విలువైన వాటాలను ప్రస్తుత ఇన్వెస్టర్లు, ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. నాన్‌ఫెర్రస్ మెటల్ రద్దు రీసైక్లింగ్ ద్వారా కంపెనీ అలాయ్, కాపర్ ఇన్‌గాట్స్, అల్యూమినియం అలాయ్స్ తదితర ప్రొడక్టులను రూపొందిస్తోంది. ఐకాన్ స్క్వేర్‌తో భాగస్వామ్యంతో షార్జాలో గోల్డ్ రిఫైనింగ్ యూనిట్‌ను నెలకొల్పుతోంది.

రూ. 1,000 కోట్లు

ఐపీవోలో భాగంగా రియల్టీ రంగ సంస్థ రన్వాల్ ఎంటర్‌ప్రైజెస్ తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. నిధుల్లో రూ. 200 కోట్లు రుణ చెల్లింపులకు, మరో రూ. 450 కోట్లు అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను భవిష్యత్ రియల్టీ ప్రాజెక్టుల కొనుగోలుకి వెచ్చించనుంది. 2024 సెప్టెంబర్30కల్లా ఆరు నెలల్లో దాదాపు రూ. 271 కోట్ల ఆదాయం, రూ. 25 కోట్లకుపైగా నికర లాభం సాధించింది.

రూ. 600 కోట్లు

క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్ సర్వీసులందించే ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ లిమిటెడ్ మళ్లీ ఐపీవోకు వస్తోంది. దీనిలో భాగంగా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. కంపెనీ ఇంతక్రితం 2021 సెప్టెంబర్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పటికీ లిస్టింగ్‌కు వెళ్లలేదు. ఈక్విటీ నిధుల్లో రూ. 481 కోట్లు క్లౌడ్ కంప్యూటింగ్ ఇనస్టలేషన్‌సహా, డేటా సెంటర్ల కోసం పరికరాల కొనుగోళ్లకు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. నెక్స్‌డిగ్ నివేదిక ప్రకారం దేశీయంగా కమ్యూనిటీ క్లౌడ్ సర్వీసులను ప్రవేశపెట్టిన తొలి కంపెనీ ఈఎస్‌డీఎస్‌కాగా.. 2024 సెప్టెంబర్30కల్లా ఆరు నెలల్లో దాదాపు రూ. 172 కోట్ల ఆదాయం, రూ. 24 కోట్ల నికర లాభం సాధించింది.

రూ. 700 కోట్లు

పునరుత్పాదక ఇంధన సొల్యూషన్స్ ప్రొవైడర్ ప్రోజీల్ గ్రీన్ ఎనర్జీ ఐపీవో ద్వారా రూ. 700 కోట్ల సమీకరించే యోచనలో ఉంది. దీనిలో భాగంగా రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు, ప్రస్తుత షేర్‌హోల్డర్లు మరో రూ.350 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ.250 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ.19.53 కోట్లు అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

ఇండిక్యూబ్ ఐపీవోకు ఓకే

- సెబీ గ్రీన్ సిగ్నల్
- 2 ప్రాస్పెక్టస్‌లు వెనక్కి



క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఐపీవో చేపట్టేందుకు మేనేజ్‌డ్ వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ కంపెనీ ఇండిక్యూబ్ అనుమతి పొందింది. ఈ బాటలో ఆగ్రోకెమికల్ సంస్థ జీఎస్‌పీ క్రాప్ సైన్స్, ఎఫ్ఎంసీజీ కంపెనీ గణేశ్ కన్జూమర్ ప్రొడక్ట్స్ నిధుల సమీకరణకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డిసెంబర్‌లో దరఖాస్తు చేసిన ఈ 3 కంపెనీలు ఉమ్మడిగా రూ. 1,260 కోట్లకుపైగా సమీకరించే వీలున్నట్లు తెలుస్తోంది. అయితే ఎడిల్‌వీజ్ అనుబంధ సంస్థ ఈఏఏఏ ఇండియా ఆల్టర్నేటివ్స్ లిమిటెడ్, నీల్‌కాంత్ రియల్టర్స్ ప్రాస్పెక్టస్‌లను సెబీ తిప్పి పంపింది. మరోపక్క జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్, అన్లాన్ హెల్త్‌కేర్ దరఖాస్తులను వెనక్కి తీసుకుంది.

రూ. 850 కోట్లు

ఐపీవోలో భాగంగా ఇండిక్యూబ్ రూ. 750 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. తద్వారా రూ. 850 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ నిధుల్లో రూ. 427 కోట్లు పెట్టుబడి వ్యయాలకు, రూ. 100 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. జీఎస్‌పీ క్రాప్ సైన్స్ ఐపీవోలో భాగంగా రూ. 280 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 60 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ నిధుల్లో రూ. 200 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. ఐపీవోలో భాగంగా గణేశ్ కన్జూమర్ రూ. 130 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.24 కోట్ల షేర్లను ప్రమోటర్లు, వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

మిశ్రమంగా వాహన విక్రయాలు

- నెమ్మదించిన మారుతీ, హ్యుందాయ్ సేల్స్
- ఎంఅండ్ఎం, టాటా మోటార్స్ అమ్మకాల్లో వేగం



న్యూఢిల్లీ: స్వల్ప డిమాండ్, నిల్వల సర్దుబాటులో భాగంగా డీలర్లకు సరఫరా తగ్గడంతో మార్చిలో మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్స్ దేశీయ వాహన విక్రయాలు క్షీణించాయి. మరోవైపు ఎస్‌యూవీ మోడళ్లకు డిమాండ్ కొనసాగడంతో మహీంద్రాఅండ్‌మహీంద్రా, టాటా మోటార్స్ వాహన విక్రయాల్లో వృద్ధి నమోదైంది.

- మారుతీ సుజుకీ దేశీయంగా క్రితం నెలలో 1,50,743 వాహనాలు విక్రయించింది. గత ఏడాది మార్చిలో అమ్ముడైన 1,52,718 వాహనాలతో పోలిస్తే 1% తక్కువ. కాగా ఆర్థిక సంవత్సరం 2024–25(ఎఫ్‌వై 25)లో దేశీయంగా మొత్తం 17,60,767 ప్యాసింజర్ వాహనాలు అమ్మింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 17,59,881 యూనిట్లుగా ఉంది.
- హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయ వాహన విక్రయాలు 53,001 యూనిట్ల నుంచి 2% క్షీణించి 51,820కు వచ్చి చేరాయి. ఇక ఎఫ్‌వై 25లో దేశీయంగా 5,98,666 వాహనాలు అమ్మింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 6,14,721 యూనిట్లుగా ఉంది.
- ఎస్‌యూవీలకు డిమాండ్ లభించడంతో ఎంఅండ్ఎం మార్చి దేశీయ అమ్మకాల్లో 18% వృద్ధి నమోదై 48,048 యూనిట్లకు చేరాయి. ఎఫ్‌వై25లో దేశీయంగా 5,51,487 ప్యాసింజర్ వాహనాలు విక్రయించింది. ఎఫ్‌వై 2024లో అమ్ముడైన 4,59,877 వాహనాలతో పోలిస్తే ఇవి 20% అధికం.
- టాటా మోటార్స్ మొత్తం వాహన విక్రయాలు 3% పెరిగి 51,872 యూనిట్లకు చేరుకున్నాయి. ఎఫ్‌వై 25లో ప్యాసింజర్ వాహన విక్రయాల్లో 3% క్షీణత నమోదై 5,56,263 యూనిట్లకు దిగి వచ్చాయి.
- ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మార్చి నెలలో 23,430 వాహనాలను విక్రయించినట్లు వాహన్ డేటాలో వెల్లడైంది. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల నుంచి మంచి డిమాండ్ కారణంగా విక్రయాలు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది. తన జెన్3 వాహనాల డెలివరీలను మార్చి నుంచి ప్రారంభించింది. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెంచి ఏప్రిల్ నుంచి వేగవంతమైన డెలివరీలు అందిచనున్నట్లు ఓలా తెలిపింది.

మార్చిలో ఎగుమతులతో కలిపి కంపెనీల వాహన విక్రయాలు

కంపెనీ	2025	2024	వృద్ధి /క్షీణత
మారుతీ	1,92,984	1,87,196	3%
హ్యుందాయ్	67,320	65,601	3%
టాటా మోటార్స్	90,500	90,822	(-0.3)
ఎంఅండ్ఎం	34,934	26,024	34 %
టయోటా కిర్లోస్కర్	30,043	27,180	11 %
కియా ఇండియా	25,525	21,400	19%
ఎంజీ మోటార్	5,500	5,050	9 %
హోండా కార్స్	7,228	7,071	2%
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటార్స్	4,14,687	4,00,120	17%
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,01,021	75,551	34%
సుజుకీ మోటార్	1,25,930	1,03,669	11%
వాణిజ్య వాహనాలు			
మహీంద్రా ట్రాక్టర్స్	24,060	22,736	6%

రూ.61.74 లక్షల కోట్లకు విదేశీ రుణాలు

- 2024 డిసెంబర్ చివరికి చేరిక
- కేంద్ర ఆర్థిక శాఖ త్రైమాసిక నివేదిక

న్యూఢిల్లీ: భారత్ విదేశీ రుణాలు (అంతర్జాతీయ మార్కెట్ నుంచి రుణాలు, ఇతర రూపాల్లో సమీకరించినవి) 2024 డిసెంబర్ చివరికి 717.9 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.61.74 లక్షల కోట్లు) చేరాయి. 2023 డిసెంబర్ చివరికి ఇవి 648.7 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన 'క్వార్టర్లీ ఎక్స్‌టర్నల్ డెట్' నివేదికలోని గణాంకాలను పరిశీలించగా.. 2024 సెప్టెంబర్ చివరికి ఇవి 712.7 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు తెలుస్తోంది. అంటే అంతక్రితం త్రైమాసికంతో పోల్చి చూస్తే 0.7 శాతం.. ఏడాది క్రితం ఇదే కాలంతో పోల్చి చూస్తే 10 శాతం అధికమయ్యాయి. జీడీపీలో విదేశీ రుణాలు డిసెంబర్ చివరికి 19.1 శాతానికి చేరాయి. 2024 సెప్టెంబర్ చివరికి 19 శాతంగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా రూపాయితోపాటు ఇతర ప్రధాన కరెన్సీలతో డాలర్ బలపడడం విదేశీ రుణ భారం విలువ పెరిగేందుకు దారితీసింది.

డాలర్ మారకంలో 54.8 శాతం..

యూఎస్ డాలర్ మారకంలోని బకాయిలు మొత్తం విదేశీ రుణాల్లో 54.8 శాతంగా ఉన్నాయి. ఆ తర్వాత రూపాయి మారకంలో విదేశీ రుణాలు 30.6 శాతంగా ఉంటే, జపాన్ యెన్ మారకంలో 6.1 శాతం, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) రూపంలో 4.7 శాతం, యూరో మారకంలో 3 శాతం చొప్పున ఉన్నాయి. మొత్తం విదేశీ రుణాల్లో నాన్ ఫైనాన్షియల్ కార్పొరేషన్స్‌కు సంబంధించి 36.5 శాతం మేర ఉన్నాయి. ఆ తర్వాత డిపాజిట్ స్వీకరించే కార్పొరేషన్లకు సంబంధించి 27.8 శాతం, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 22.1 శాతం, ఇతర ఆర్థిక సంస్థలకు సంబంధించి 8.7 శాతం చొప్పున ఉన్నాయి. విదేశీ మారకంలో చెల్లించాల్సిన మొత్తం బకాయిల్లో రుణాల రూపంలో 33.6 శాతం ఉంటే, కరెన్సీ, డిపాజిట్ల రూపంలో 23.1 శాతం, ట్రేడ్ క్రెడిట్, అడ్వాన్స్‌ల రూపంలో 18.8 శాతం, డెట్ సెక్యూరిటీల రూపంలో 16.8 శాతం చొప్పున ఉన్నాయి.

360 వన్‌కు సీసీఐ గ్రీన్‌సిగ్నల్

ఏపీఐ హోల్డింగ్స్‌లో వాటా కొనుగోలుకి ఓకే

న్యూఢిల్లీ: డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ ఏపీఐ హోల్డింగ్స్‌లో 360 వన్, క్లేపాండ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ సంయుక్త వాటాల కొనుగోలు ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) తాజాగా అనుమతించింది. అనుబంధ సంస్థలు అక్సెమెడ్, ఫార్మ్‌ఈజీ, డోకన్, థైరోకేర్, రిటైలియో ద్వారా ఏపీఐ హోల్డింగ్స్ హెల్త్‌కేర్ సర్వీసులు అందిస్తోంది. తప్పనిసరిగా మార్పిడికి లోనయ్యే ఏపీఐ హోల్డింగ్స్ క్లాస్ బి ప్రిఫరెన్స్ షేర్ల కొనుగోలుకి 360 వన్‌ను సీసీఐ అనుమతించింది. ఎంఈఎంజీ ఫ్యామిలీ ఆఫీస్ ఎల్ఎల్‌పీ నుంచి వీటిని సొంతం చేసుకోనుంది. క్లేపాండ్ క్యాపిటల్ సైతం ఎంఈఎంజీ నుంచి మార్పిడికి వీలయ్యే ప్రిఫరెన్స్ షేర్లను సొంతం చేసుకునేందుకు ఓకే చెప్పింది.

కాగ్నిజెంట్ గ్లోబల్ హెడ్‌గా శైలజ జోస్యుల



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్ దిగ్గజం కాగ్నిజెంట్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ సర్వీస్ లైన్ గ్లోబల్ హెడ్‌గా శైలజ జోస్యుల నియమితులయ్యారు. కంపెనీ అంతర్జాతీయ జీసీసీ ప్రణాళికల అమలుకు ఆమె తోడ్పడనున్నారు. గతంలో కాగ్నిజెంట్‌లో ఆరేళ్ల పని చేసిన శైలజ, కొద్ది విరామం తర్వాత తిరిగొచ్చారు. ఆర్థిక సేవల మార్కెట్లో ఆమెకు అపార అనుభవం ఉందని కాగ్నిజెంట్ అమెరికాస్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి తెలిపారు.

అంకుర హాస్పిటల్ రూ. 165 కోట్లు సమీకరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ అంకుర హాస్పిటల్ తాజాగా రూ. 165 కోట్ల నిధులు సమకూర్చుకుంది. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు వ్యూహాత్మక పెట్టుబడుల రూపంలో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ కృష్ణప్రసాద్ వున్నం తెలిపారు. మహిళలు, శిశువులకు వైద్య సేవలను మరింతగా విస్తరించేందుకు ఇవి ఉపయోగపడగలవని ఆయన పేర్కొన్నారు. అలాగే దేశవ్యాప్తంగా కీలక నగరాల్లో అధునాతన ఆసుపత్రులను నెలకొల్పేందుకు కూడా తోడ్పడగలవని వివరించారు.

ఎక్స్‌పీరియన్ హైదరాబాద్ జీఐసీ విస్తరణ..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డేటా, టెక్నాలజీ దిగ్గజం ఎక్స్‌పీరియన్, హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ని (జీఐసీ) మరింతగా విస్తరించింది. గతానికన్నా రెట్టింపు ఆఫీస్ స్పేస్‌తో 85,000 చ.అ. విస్తీర్ణంలో ఈ కేంద్రం ఏర్పాటైనట్లు సంస్థ సీఈవో (టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఇన్నోవేషన్) అలెగ్జాండర్ లింట్నర్ తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రోడక్టులు రూపొందించేందుకు, నిరంతరాయంగా సర్వీసులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సెంటర్ ప్రధానంగా ఫిన్‌టెక్, అనలిటిక్స్, మోసాల నివారణ వంటి అంశాలకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెడుతుంది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ రూ. 700 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంటైనర్ గ్లాస్‌ల తయారీ సంస్థ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ కొత్త ప్లాంటు ఏర్పాటు కోసం రూ. 700 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. మధ్యప్రదేశ్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఎండీ సందీప్ సోమాని తెలిపారు. ఈ ప్లాంటు రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 500 టన్నులుగా ఉంటుందని, దీనితో తమ తయారీ సామర్థ్యం సుమారు 25 శాతం పెరుగుతుందని వివరించారు. ఫార్మా, బెవరేజెస్ తదితర రంగాల కోసం ఉత్పత్తులు తయారు చేసే ఈ ప్లాంటు, 24 నెలల్లో అందుబాటులోకి రాగలదని చెప్పారు.

'క్విక్' నిధుల రికార్డ్

- మార్కెట్ ర్యాలీతో క్విప్ ఇష్యూలకు కంపెనీల క్యూ
- 2024–25లో రూ. 1.33 లక్షల కోట్ల సమీకరణ



ముంబై: దేశీ కార్పొరేట్లు అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం భారీగా నిధులు సమీకరించాయి. ప్రధానంగా దేశీ స్టాక్ మార్కెట్ల దూకుడు ప్రభావంతో 2024–25లో 85 కంపెనీలు రూ.1,33,251 కోట్లు సమకూర్చుకున్నాయి. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. అంతక్రితం ఏడాది(2023–24)లో 64 కంపెనీలు క్విప్ ద్వారా అందుకున్న రూ.71,306 కోట్లతో పోలిస్తే ఇవి 87 శాతం వృద్ధికావడం గమనార్హం! ప్రైమ్ డేటాబేస్ గణాంకాల ప్రకారం ఈక్విటీ మార్కెట్ దన్నుతో కంపెనీలు బ్యాలెన్స్ షీట్‌ను పటిష్టపరచుకోవడంతోపాటు.. విస్తరణకు అవసరమైన నిధులను సమకూర్చుకున్నాయి. వెరసి గతేడాది అటు విలువలోనూ, ఇటు సంఖ్యలోనూ దేశీ కార్పొరేట్లు క్విప్ నిధులలో సరికొత్త రికార్డుకు తెరతీసినట్లు జేఎమ్ ఫైనాన్షియల్ ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ నేహా అగర్వాల్ పేర్కొన్నారు.

క్విక్‌గా..

లిస్టెడ్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు వేగవంతంగా పెట్టుబడులను సమకూర్చుకునేందుకు క్విప్ మార్గాన్ని ఎంచుకుంటాయి. ప్రధానంగా సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపుల ద్వారా నిధులు సమీకరించే సంగతి తెలిసిందే. ఇందుకు సెబీ తదితర మార్కెట్ నియంత్రణ సంస్థలకు ముందస్తుగా దరఖాస్తు చేయవలసిన అవసరంలేకపోవడంతో లిస్టెడ్ కంపెనీలు ఆసక్తి చూపుతుంటాయని విశ్లేషకులు వివరించారు. గతేడాది ప్రధానంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్స్, ఆటోమొబైల్స్, యుటిలిటీస్, రియల్ ఎస్టేట్ రంగాల కంపెనీలు అధికంగా క్విప్ చేపట్టాయి. నిధుల సమీకరణకు ఈక్విటీ ప్రధాన వనరుగా మారడంతో లిస్టెడ్ కంపెనీలు క్విప్‌నకు ఆసక్తి చూపినట్లు నిపుణులు తెలియజేశారు. తద్వారా వృద్ధి, విస్తరణ, ఇతర కంపెనీల కొనుగోళ్లు తదితరాలకు నిధులను వెచ్చించనున్నట్లు తెలియజేశారు.

జేఎమ్ జోరు

క్విప్ నిధుల సమీకరణలో డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంత గ్రూప్, ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో అగ్రస్థానంలో నిలిచాయి. గత ఆర్థిక సంవత్సరంలో రెండు కంపెనీలు విడిగా రూ.8,500 కోట్లు చొప్పున సమీకరించాయి. ఈ బాటలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ. 8,373 కోట్లు, వరుణ్ బెవరేజెస్ రూ. 7,500 కోట్లు, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ రూ. 6,438 కోట్లు, గోద్రేజ్ ప్రాపర్టీస్ రూ. 6,000 కోట్లు, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ రూ. 5,000 కోట్లు చొప్పున అందుకున్నాయి.

పీఎస్‌యూలు

గతేడాది క్విప్ ద్వారా పీఎస్‌యూ బ్యాంకులు పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యుకో, ఐఓబీ, సెంట్రల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ సైతం ఉమ్మడిగా రూ.14,000 కోట్లకు పైగా సమీకరించాయి. అంతేకాకుండా జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రీట్, టొరెంట్ పవర్, భారత్ ఫోర్జ్ సైతం క్విప్ మార్గాన్ని ఎంచుకున్నాయి. అత్యధిక క్విప్‌ల నిర్వహణ ద్వారా జేఎమ్ ఫైనాన్షియల్ ప్రధాన పాత్ర పోషించింది. ప్రైమ్ డేటాబేస్ వివరాల ప్రకారం ఫిబ్రవరివరకూ చూస్తే జేఎమ్ 15 ఇష్యూలను నిర్వహించింది. తద్వారా 4.5 బిలియన్ డాలర్లు(రూ. 38,693 కోట్లు) సమీకరణలో సహకారం అందించింది. ప్రస్తుత ఆ ర్థిక సంవత్సరం(2025–26)లో క్విప్‌లు, ఐపీవోల ద్వారా రూ. 3 లక్షల కోట్లకుపైగా నిధుల సమీకరణకు వీలున్నట్లు దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ అసోసియేషన్(ఏఐబీఐ) అంచనాల వేయడం విశేషం!

సింధు తర్వాత ఎవరు?



- సింగిల్స్‌లో కళ తప్పుతున్న భారత బ్యాడ్మింటన్
- అందనంత దూరంలో ఆశాకిరణాలు
- అలసత్వంతో వెటరన్ ప్లేయర్లు



మాళవిక




అనుపమ

సాక్షి క్రీడా విభాగం

భారత బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే దిగ్గజం. తదనంతరం ఎన్నో ఏళ్ల తర్వాత తెలుగు తేజం పుల్లెల గోపీచంద్ ఆ స్థానాన్ని భర్తీ చేశాడు. వీళ్లిద్దరు పురుషుల కేటగిరీలో లెజెండ్స్! కానీ అమ్మాయిల విభాగంలో మాత్రం స్టార్లు, విజేతలంటూ ఎవరూ లేరు. మళ్లీ గోపీచంద్ తనకెంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చిన 'ఆట'కు తిరిగివ్వాలనే లక్ష్యంతో కోచ్‌గా మారాక భారత బ్యాడ్మింటన్ 'కోర్టు'లో రాణులు వెలుగులోకి వచ్చారు. అతను సానబెట్టిన సైనా నెహ్వాల్ ఓ వెలుగు వెలిగింది. ఎన్నో ఏళ్లుగా మహిళల సింగిల్స్‌లో ఉనికి లేని భారత్‌కు ఘనవిజయాలు, ఒలింపిక్ పతకం తెచ్చిపెట్టింది. ఆమె ఆడుతుండగానే పీవీ సింధు దూసుకొచ్చింది. సింధుది గోపీచంద్ స్కూలే (కోచింగ్). ఆమె అచిరకాలంలోనే సైనాను మరిపించింది. బ్యాడ్మింటన్‌లో మురిపించింది. దేశాన్ని గర్వపడేలా చేసింది. ప్రపంచ చాంపియన్‌షిప్, ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్, ఒలింపిక్స్ క్రీడల్లో రజతం, కాంస్యం ఇలా ఒకటేమిటి అన్నింటా సింధు మార్కు కనబడింది. అయితే కొంతకాలంగా సింధు ఆటతీరు గాడి తప్పింది. గాయాలు వెన్నంటి వైఫల్యాలతో గత రెండు సీజన్లు సింధుకు కలిసి రాలేదు. సింధు అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో ఇంకొన్నాళ్లు కొనసాగుతుంది. కానీ తర్వాతే భారత బ్యాడ్మింటన్‌లో సింధు వారసురాలు కనబడటం లేదు. దీంతో సమీప భవిష్యత్తులో మహిళల సింగిల్స్‌లో ఆశాకిరణం ఫలానా అనే వారు లేక ప్రభ కోల్పోయే ప్రమాదంలో పడింది. ఈ ప్రమాద ఘంటికలు 2025 సీజన్ ప్రారంభంలోనే మోగాయి. ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీ (కింగ్‌డావో-చైనా)లో చివరి నిమిషంలో గాయంతో సింధు వైదొలగగా... బరిలోకి దిగిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్‌తోనే సరిపెట్టుకుంది. పురుషుల, మహిళల సింగిల్స్‌లలో నిలకడలేని ప్రదర్శనతో భారత్ మూల్యం చెల్లించుకుంటోంది. ఒక్క పురుషుల డబుల్స్‌లోనే ఆంధ్రప్రదేశ్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ తన భాగస్వామి చిరాగ్ షెట్టితో కలిసి స్థిరంగా రాణిస్తున్నాడు. వీళ్లైతే విజయం (పతకం) లేదంటే రన్నరప్... ఇదీ కుదరకపోతే కనీసం సెమీఫైనల్ వరకైనా భారత ఆశల పల్లకిని మోసుకెళ్తున్నాడు.



ఆకర్షి



అన్మోల్

ఎంతో ఎత్తుకు ఎదిగినట్లే ఎదిగి...

క్రికెట్ మతమైన భారత్‌లో, ఘనచరిత్ర కలిగిన హాకీ, పతకాలపై గురి పెట్టే షూటింగ్‌లతో పాటు బ్యాడ్మింటన్ కూడా పతకాలు తెచ్చే ప్రముఖ క్రీడాంశమైంది. 2012 నుంచి భారత షట్లర్లు వరుసగా మూడు ఒలింపిక్ పతకాలు సాధించారు. లండన్ (2012)లో సైనా... 'రియో'లో (2016)... 'టోక్యో'లో (2020) సింధు పతకాలు పట్టుకొచ్చారు. దీంతో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ, రజత, కాంస్యాలకు లెక్కేలేదు. ఒలింపిక్ నుంచి ఒలింపిక్ కాలచక్రంలో మిన్నంటే ప్రదర్శనతో షట్లర్లు వెలుగులీనారు. కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ ఇలా వచ్చిన వారే. పతకం తేలేకపోయినా పురుషుల్లో లక్ష్య సేన్, మహిళల్లో సింధు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. కానీ తదుపరి ఒలింపిక్స్‌లో ఈ అర్హత ముచ్చట కూడా దక్కేలా కనబడటం లేదు. ఎందుకంటే శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్‌లలో పదును తగ్గింది. మ్యాచ్‌లు గెలిచే సత్తా కరువైంది. మహిళల సింగిల్స్‌లో సింధుకు ఇటు ఆటతీరులో నిలకడ లేదు! అటు ఫిట్‌నెస్‌లో స్థిరత్వం లేదు. దీంతో కొత్త ఒలింపిక్ సైకిల్‌లో వీళ్లెవరూ ముందుకెళ్లే షట్లర్లు కానేకారని స్పష్టంగా అర్థమవుతోంది.

ఏమిటీ పరిస్థితి... ఎందుకీ దుస్థితి!

శ్రీకాంత్, ప్రణయ్‌లు వెటరన్ ప్లేయర్లు కావడంతో సహజంగా వయసు పైబడిన ఛాయలు వారిని వెనక్కి లాగుతున్నాయి. కానీ లక్ష్యసేన్ తన కెరీర్ ఆరంభంలోనే సంచలన విజయాలతో ఔరా అనిపించాడు. కానీ కొన్నాళ్లుగా అలసత్వమో... అనాసక్తినో తెలియదు కానీ ఆశించిన స్థాయి ఆటతీరే కనబరచడం లేదు. ఇది భారత పతకాలపై పెను ప్రభావం చూపుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో సింధు ఎన్నో సాధించింది. దేశానికి ఎంతో పేరు తెచ్చింది. కానీ ఆమె తర్వాత కోర్ గ్రూపులో ఉండే కొదమ సింహాలను మాత్రం భారత బ్యాడ్మింటన్ రంగం తయారు చేయలేకపోయింది. నిజం చెప్పాలంటే డబుల్స్ ప్రాధాన్యం వల్ల సింగిల్స్ స్టార్లు కరువైనట్లు ర్యాంకింగ్స్ ద్వారా స్పష్టమవుతోంది. పురుషుల డబుల్స్‌లో పదో ర్యాంక్‌తో సాత్విక్-చిరాగ్ జోడీ, మహిళల డబుల్స్‌లో తొమ్మిదో ర్యాంక్‌తో గాయత్రీ-ట్రెసా జాలీ జోడీ టాప్-10లో ఉన్నాయి. కానీ **సింగిల్స్‌లో సింధు (17), మాళవిక బన్సోడ్ (23),** అనుపమ ఉపాధ్యాయ్ (44), రక్షిత శ్రీ (45), ఆకర్షి కశ్యప్ (48), ఉన్నతి హుడా (55), తస్నిమ్ మీర్ (63), అన్‌మోల్ ఖరబ్ (67)... లక్ష్య సేన్ (18), ప్రణయ్ (29), కిరణ్ జార్జి (36), ప్రియాన్షు రజావత్ (38), ఆయుశ్ శెట్టి (44), సతీశ్ కుమార్ కరుణాకరన్ (47), తరుణ్ మన్నేపల్లి (53), కిడాంబి శ్రీకాంత్ (54), శంకర్ ముత్తుస్వామి (59)ల ర్యాంక్‌లు సమీప భవిష్యత్తులో భారత బ్యాడ్మింటన్‌కు ఎదురయ్యే సవాళ్లను కళ్లకు కడుతున్నాయి. నంబర్‌వన్ ర్యాంక్ దేవుడెరుగు... అసలు టాప్-10లో **నిలువగలిగే ప్లేయరే కనిపించడం లేదు. కానీ... కాం**పిటీటివ్ బెంచ్ (పోటీల్లో సత్తాచాటే బెంచ్)ను ముందుచూపుతో తయారు చేయడంలో భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నిర్లక్ష్యం కనబడుతోంది.

కిం కర్తవ్యం?


తదుపరి లాస్ ఎంజెలిస్ (2028) ఒలింపిక్స్ సైకిల్ మొదలైంది. తాజా పరిణామాలు, నిరాశాజనక ప్రదర్శనలు, వస్తోన్న ఫలితాలపై 'బాయ్' వెంటనే దృష్టి పెట్టాలి. అంటే విశ్వక్రీడలకు ఇంకా మూడేళ్ల సమయం వుంది. ఈ లోపు కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ తదితర **ఈవెంట్లెన్నో జరుగుతాయి. ఈ నేపథ్యంలో 'బాయ్'**గానీ, 'సాయ్'గానీ ఇప్పుడే మేల్కొవాలి. ఒలింపిక్స్ మిషన్‌కు ఓ విజన్‌తో పని చేయాలి. బాగా ఆడే షట్లర్లు ఎందుకిలా అయ్యారో సమీక్షించాలి. వర్ధమాన షట్లర్లను గుర్తించి ఆర్థిక అండదండలు అందించాలి. కేంద్ర క్రీడా శాఖ 'టాప్స్'లా 'బాయ్' కూడా సానుకూల దృక్పథంతో తమ ప్లేయర్లకు ఇంటా బయటా కోచింగ్‌కు, కోచ్‌లకు పెద్ద ఎత్తున వెచ్చించాలి. ఓ క్రమపద్ధతిలో లక్ష్యాలను పెట్టుకొని ఫలితాల కోసం కష్టపడితే పరిస్థితిలో మార్పు రావొచ్చు.

రిత్విక్ జోడీకి నిరాశ



సాక్షి, హైదరాబాద్: భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీకి వరుసగా మూడో టోర్నీలోనూ నిరాశ ఎదురైంది. ఫిబ్రవరిలో సాంటియాగో ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన రిత్విక్ ఆ తర్వాత పోటీపడ్డ మూడు టోర్నీలలో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. అమెరికాలో జరుగుతున్న హ్యూస్టన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో కొలంబియాకు చెందిన నికోలస్ బరియంతోస్‌తో జతకట్టి ఆడిన రిత్విక్ తొలి రౌండ్‌లో నిష్క్రమించాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో రిత్విక్ చౌదరీ-బరియంతోస్ ద్వయం 5-7, 4-6తో మార్సెలో జోర్మన్-రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బరియంతోస్ ఐదు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. తొలి రౌండ్‌లో ఓడిన రిత్విక్-బరియంతోస్‌లకు 3,700 డాలర్ల (రూ. 3 లక్షల 15 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

పుణేరి పల్టన్ స్థానంలో కోల్‌కతా థండర్‌బ్లేడ్స్



న్యూఢిల్లీ: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (టీటీ) లీగ్‌లో కొత్త ఫ్రాంచైజీ చేరింది. గత ఏడాది ఆరో సీజన్ ముగిసిన తర్వాత పుణేరి పల్టన్ ఈ లీగ్ నుంచి వైదొలిగింది. పుణేరి పల్టన్ స్థానంలో కొత్తగా కోల్‌కతా థండర్‌బ్లేడ్స్ జట్టు చేరింది. ఈ ఏడాది మే 29 నుంచి జూన్ 15వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో జరిగే ఏడో సీజన్‌లోనూ ఎనిమిది జట్లు పోటీపడతాయి. కోల్‌కతా ఫ్రాంచైజీకి సహ యజమానులుగా యూనీకాప్స్ గ్రూప్, ఎంవికాస్ గ్రూప్‌లు ఉన్నాయి. మాజీ ప్లేయర్ అన్షుల్ గార్గ్ కోల్‌కతా ఫ్రాంచైజీకి టీమ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తాడు. బెంగళూరు స్మాషర్స్ ఫ్రాంచైజీ తమ పేరును మార్చుకుంది. ఏడో సీజన్‌లో బెంగళూరు జట్టు పుణే జాగ్వార్స్ పేరుతో ఆడుతుంది.

కునెమన్‌కు శుభవార్త

- తొలిసారి క్రికెట్ ఆస్ట్రేలియా కాంట్రాక్ట్ జాబితాలో చోటు
- కొన్‌స్టాస్, వెబ్‌స్టార్‌లకు కూడా అవకాశం

మెల్‌బోర్న్: ఇటీవల సందేహాస్పద బౌలింగ్ శైలి నుంచి క్లీన్‌చిట్ పొందిన ఆస్ట్రేలియా ఎడంచేతి వాటం స్పిన్నర్ మాథ్యూ కునెమన్ మరో శుభవార్త విన్నాడు. 2025-2026 సీజన్‌కుగాను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించిన 19 మంది కాంట్రాక్ట్ క్రికెటర్ల జాబితాలో కునెమన్‌కు తొలిసారి చోటు లభించింది. ఈ ఏడాది ఆరంభంలో భారత్‌తో జరిగిన బోర్డర్-గావాస్కర్ సిరీస్ ట్రోఫీలో ఆకట్టుకున్న స్యామ్ కొన్‌స్టాస్, ఆల్‌రౌండర్ వెబ్‌స్టర్‌లకు కూడా తొలిసారి కాంట్రాక్ట్‌లను దక్కించుకున్నారు. శ్రీలంకతో శ్రీలంక గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో కునెమన్ కీలకపాత్ర పోషించాడు. కునెమన్ మొత్తం 16 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు గెల్చుకున్నాడు. అయితే కునెమన్ బౌలింగ్ శైలి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బౌలింగ్ నియామవళికి లోబడి లేదని ఆరోపణలు వచ్చాయి. దాంతో ఐసీసీ ఆదేశంతో కునెమన్ తన బౌలింగ్ శైలిని పరీక్షించుకున్నాడు. పరీక్షల అనంతరం కునెమన్ బౌలింగ్ శైలి సరిగ్గానే ఉందని నివేదిక రావడంతో ఐసీసీ అతడికి క్లీన్‌చిట్ ఇచ్చింది. రెండు నెలల విరామం తర్వాత ఆస్ట్రేలియా మళ్లీ బిజీబిజీ కానుంది. జూన్ చివర్లో వెస్టిండీస్‌లో పర్యటించనున్న ఆస్ట్రేలియా అక్కడ మూడు టెస్టులు, ఐదు టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. అంతకుముందు జూన్ 11 నుంచి లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా జట్టుతో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.



2025-2026 సీజన్‌కు ఆస్ట్రేలియా కాంట్రాక్ట్ క్రికెటర్ల జాబితా: ప్యాట్ కమిన్స్, నాథన్ ఎలీస్, కామెరాన్ గ్రీన్, జోష్ హాజల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇన్‌గ్లిస్, ఉస్మాన్ ఖ్వాజా, స్యామ్ కొన్‌స్టాస్, మాథ్యూ కునెమన్, లబుషేన్, నాథన్ లయన్, మిచెల్ మార్ష్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, లాన్స్ మోరిస్, మాథ్యూ షార్ట్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, వెబ్‌స్టర్, ఆడమ్ జంపా.

ప్రాంజల ఓటమి

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ50 మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ యడ్లపల్లి ప్రాంజల పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. బురుండిలో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రాంజల మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో 1-6, 6-3, 2-6తో సహియా బెరెకొచియా (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది. ఈ ఏడాది ప్రాంజల ఆడిన ఐదు టోర్నీల్లోనూ తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయింది. న్యూఢిల్లీ, పుణేలలో జరిగిన టోర్నీలలో ప్రాంజల క్వాలిఫయింగ్ దశలోని తొలి రౌండ్‌లో ఓటమి చెందగా... అహ్మదాబాద్, బురుండిలలో జరిగిన టోర్నీలలో మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో నిష్క్రమించింది. బురుండిలోనే జరుగుతున్న ఐదో టోర్నీలోనూ ప్రాంజల తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది.

'ఒలింపిక్ పతకం గెలిచుంటే బాగుండేది'

- క్రీడల్లో రాణించాలంటే తల్లిదండ్రుల మద్దతు కీలకం
- కుటుంబం వెన్నంటే ఉంటే ఏదైనా సాధ్యమే
- భారత హాకీ స్టార్ వందన కటారియా మనోగతం

న్యూఢిల్లీ: ఏ ఆటలోనైనా... ఏ స్థాయి ప్లేయర్‌కైనా... అంతిమ లక్ష్యం ఒలింపిక్ పతకం సాధించడమే... అయితే అందరికీ ఒలింపిక్ పతకాన్ని అందుకునే భాగ్యం ఉండదు. ఎంత సత్తా ఉన్నా... జట్టు క్రీడలో సమన్వయం కొరవడితే ఫలితాలు తారుమారు అవుతాయి... లక్ష్యానికి చేరువై దూరమైపోతారు. భారత సీనియర్ హాకీ స్టార్ వందన కటారియా కెరీర్‌లోనూ ఇలాగే జరిగింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో వందన సభ్యురాలిగా ఉన్న భారత జట్టు త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది. బ్రిటన్ జట్టుతో జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో టీమిండియా 3-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఈ కీలక మ్యాచ్‌లో వందన ఒక గోల్ కూడా చేసింది. అంతకుముందు దక్షిణాఫ్రికాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో వందన 'హ్యాట్రిక్' కూడా సాధించింది. మంగళవారం అంతర్జాతీయ హాకీకి గుడ్‌బై చెప్పిన వందన తన కెరీర్‌లో ఒలింపిక్ పతకం లేకపోవడం లోటుగా ఉండిపోతుందని, టోక్యోలో కాంస్యం సాధించి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించింది. 'నేను హరిద్వార్‌లో హాకీ స్టిక్ పట్టుకునే సమయానికి ఆడపిల్లలు ఇంటి గడప దాటకూడదనే అభిప్రాయం ఉండేది. వందనను హాకీ ఆడేందుకు ఇంటి బయటకు ఎందుకు పంపిస్తున్నావని మా నాన్నను ఇంటి చుట్టుపక్కల వాళ్లు చాలాసార్లు ప్రశ్నించారు. కానీ వారి మాటలను ఆయన పట్టించుకోలేదు. నాకంటే ముందుగానే మా ఇద్దరు అక్కలు రీనా, అంజలి హాకీ ఆడేవారు. నేను ఖోఖోను ఎక్కువ ఇష్టపడేదాన్ని. కొన్ని రోజులు గడిచాక నేను కూడా హాకీవైపు మళ్లాను. మాకెంతో మద్దతు ఇచ్చిన నాన్న టోక్యో ఒలింపిక్స్‌కు కొన్ని రోజుల ముందు కన్ను మూశారు. నాన్న మరణం నన్ను కుంగదీసినా కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఆత్మవిశ్వాసంతో టోక్యోకు వెళ్లాను. కుటుంబసభ్యుల మద్దతు ఉంటే ఏ రంగంలోనైనా అనుకున్నది సాధించడం సాధ్యమే' అని 32 ఏళ్ల వందన తెలిపింది. 'అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలకాలన్న నిర్ణయం హఠాత్తుగా తీసుకోలేదు. చాలా మంది జూనియర్ ప్లేయర్లు తెరపైకి వస్తున్నారు. ఇప్పటికే 15 ఏళ్లుగా భారత జట్టుకు ఆడుతున్నాను. జూనియర్లకు కూడా అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయం తీసుకున్నాను' అని వందన వ్యాఖ్యానించింది. ఇప్పటికిప్పుడు భవిష్యత్ ప్రణాళికల గురించి ఆలోచించలేదని... అయితే తనకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన హాకీకి తప్పకుండా సేవలు అందిస్తానని వందన తెలిపింది.



2021లో అప్పటి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేతుల మీదుగా 'అర్జున అవార్డు' అందుకుంటూ...



2023లో ఆసియా చాంపియన్స్ ట్రోఫీతో వందన కటారియా



ఐస్‌లాండ్‌లో మళ్లీ బద్దలైన అగ్ని పర్వతం

లండన్: అట్లాంటిక్ సముద్ర ద్వీప దేశం ఐస్‌లాండ్‌లో మరోసారి అగ్ని పర్వతం బద్దలైంది. రెక్జానెక్ ద్వీపకల్పంలోని గ్రిండావిక్ పట్టణ సమీపంలోని అగ్ని పర్వతం నుంచి భారీగా లావా, పొగలు చిమ్ముతుండటంతో మంగళవారం అధికారులు అక్కడున్న 40 నివాసాలను ఖాళీ చేయించారు. ఐస్‌లాండ్‌లో అతిపెద్ద పర్యాటక ఆకర్షణగా ఉన్న బ్లూ లగూన్ జియోథర్మల్ స్పాను మూసివేశారు. దాదాపు 800 ఏళ్ల పాటు నిద్రాణంగా ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా లావా పెల్లుబకడంతో గతేడాదే ఇక్కడున్న వారందరినీ వేరే చోటుకు తరలించారు. ఉదయం 6.30 గంటలకు లావా ప్రవాహం మొదలై గ్రిండావిక్‌కు ఉత్తరంగా ఏర్పాటు చేసిన రక్షణ బారియర్‌ను దాటుకుని 500 మీటర్ల పొడవున ప్రవహిస్తోందని వాతావరణ విభాగం తెలిపింది. ఉత్తర అట్లాంటిక్‌లోని అగ్ని పర్వతాలకు కేంద్రమైన ప్రాంతంలో ఐస్‌లాండ్ ఉంది. 2010లో ఇక్కడి అగ్ని పర్వతం విస్ఫోటంతో భారీగా వాతావరణంలోకి వెదజల్లిన బూడిద మేఘాలు కొన్ని నెలలపాటు అట్లాంటిక్ మీదుగా విమాన ప్రయాణాలకు అంతరాయం కలిగించాయి.

అత్యంత తీవ్ర ప్రభావిత జిల్లాలు ఆరు మాత్రమే

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వామపక్ష తీవ్రవాదంపై భద్రతా బలగాల పోరు కీలక దశకు చేరుకుందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. మావోయిస్ట్ కార్యకలాపాలతో తీవ్రంగా ప్రభావితమైన జిల్లాలు ప్రస్తుతం దేశంలో ఆరు మాత్రమే ఉన్నాయని తెలిపారు. 'మోదీ ప్రభుత్వం మావోయిజంపై కఠినమైన విధానాలను అవలంభిస్తోంది. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపాలని నిర్ణయించుకుంది. దేశంలో వామపక్ష తీవ్రవాదంతో ప్రభావితమైన 38 జిల్లాలుండగా ఇందులో అత్యంత తీవ్రంగా ప్రభావితమైన జిల్లాల సంఖ్య 12 నుంచి 6కి తగ్గింది'అని అమిత్‌షా మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు. ఇవి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్, కాంకేర్, నారాయణ్‌పూర్, సుక్మా, జార్ఖండ్‌లోని వెస్ట్ సింగ్భుమ్, మహారాష్ట్రలోని గడ్చి రోలి అని తెలిపారు. మావోయిజం సమస్యాత్మకంగా ఉన్న ఆరు జిల్లాలు.. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, ఒడిశాలోని కలహండి, కంధమాల్, మల్కాన్‌గిరి అని ఆయన వివరించారు. మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నామని, ప్రత్యేక ప్రాజెక్టులను కూడా ఈ జిల్లాల్లో అమలు చేస్తున్నామని తెలిపారు.

ఏనుగు-డ్రాగన్ 'ట్యాంగో' చేయాలి

భారత్-చైనా కలిసికట్టుగా పనిచేయాలి
- చైనా అధినేత జిన్‌పింగ్ పిలుపు
- భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలకు 75 ఏళ్లు



బీజింగ్: భారత్, చైనా దేశాలు కలిసికట్టుగా పని చేయాలని చైనా అధినేత జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి లక్ష్యాల సాధనకు మనమంతా చేతులు కలపాలని సూచించారు. ప్రాథమిక ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏనుగు-డ్రాగన్ కలిసి 'ట్యాంగో'డ్యాన్స్ చేయాలని ఆకాంక్షించారు. భారత్-చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మొదలై 75 ఏళ్లవుతున్న సందర్భంగా భారత్‌కు ఆయన మంగళవారం శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు దేశాల నడుమ ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జిన్‌పింగ్ ఒక సందేశం పంపించారు. భారత్, చైనాలు ప్రాచీన నాగరికతలు కలిగిన దేశాలని గుర్తుచేశారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యదేశాలుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆధునీకరణ ప్రయత్నాల్లో ఇరుదేశాలూ ఇప్పుడు కీలకమైన దశలో ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు జిన్‌పింగ్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. వ్యూహాత్మక పరస్పర విశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవడానికి, భారత్-చైనా సరిహద్దుల్లో శాంతిని నెలకొల్పడానికి భారత్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కీలక రంగాల్లో పరస్పర సహకారం మరింత వృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. జిన్‌పింగ్ సందేశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిస్పందించారు. స్థిరమైన స్నేహ సంబంధాలు, ద్వైపాక్షిక భాగస్వామ్యం మన రెండు దేశాలతోపాటు మొత్తం ప్రపంచానికి మేలు చేస్తాయని వివరించారు. భారత్-చైనా సంబంధాలను మరింత ఉన్నత స్థానానికి చేర్చడానికి ఈ సందర్భాన్ని ఒక అవకాశంగా ఉపయోగించాలని పేర్కొన్నారు. మరోవైపు చైనా ప్రధాని లీ ఖెకియాంగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

వివాదాస్పద పాస్టర్‌కు జీవిత ఖైదు


చండీగఢ్: 2018నాటి రేప్ కేసులో పంజాబ్‌కు చెందిన వివాదాస్పద పాస్టర్‌కు మొహాలీలోని కోర్టు జీవిత ఖైదు, రూ.లక్ష జరిమానా విధించింది. 'ఏసు ఏసు ప్రాఫెట్'గా చెప్పుకునే భజీందర్ సింగ్‌ను మార్చి 28వ తేదీన దోషిగా ప్రకటించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి విక్రాంత్ కుమార్ మంగళవారం శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించారు. తీర్పును పంజాబ్ హరియాణా హైకోర్టు సవాల్ చేస్తామని భజీందర్ సింగ్ లాయర్ హెచ్ఎస్ ధనోవా తెలిపారు. మన్సా జైలులో ఉన్న భజీందర్ సింగ్‌ను మంగళవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య కోర్టుకు తీసుకువచ్చారు. తీర్పుపై బాధితురాలు హర్షం ప్రకటించారు. ఏడేళ్ల తర్వాత ఎట్టకేలకు తనకు న్యాయం దొరికిందన్నారు. విదేశాలకు తీసుకెళ్తానని మాయమాటలు చెప్పి మొహాలీలోని సొంతింటికి తీసుకెళ్లి తనపై పాస్టర్ బజీందర్ అత్యాచారానికి ఒడిగట్టడంతోపాటు వీడియో తీశాడని ఓ మహిళ 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. చెప్పినట్లుగా చేయకుంటే వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడని తెలిపింది. ఈ మేరకు జకీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. బజీందర్ సింగ్‌పై 22 ఏళ్ల మరో మహిళ చేసిన ఫిర్యాదు మేరకు కపుర్తలా పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. పాస్టర్ బజీందర్ సింగ్ వాగ్వాదం సందర్భంగా ఓ మహిళపై చేయిచేసుకున్నట్లుగా ఉన్న ఓ వీడియో బయటకు రావడంతో మొహాలీ పోలీసులు మరో కేసు బుక్ చేశారు. ఈ ఆరోపణలను బజీందర్ సింగ్ నిరాధారాలంటూ తోసిపుచ్చాడు. 2012 నుంచి క్రైస్తవ బోధకుడిగా చెలామణీ అవుతున్న బజీందర్ సింగ్‌కు జలంధర్ జిల్లా తాజ్‌పూర్, మొహాలీలోని మజ్రిలో ఇతడు చర్చ్ ఆఫ్ గ్లోరీ అండ్ విజ్‌డమ్ పేరుతో చర్చిలున్నాయి. బజీందర్ నిర్వహించే సభలకు పెద్ద ఎత్తున జనం హాజరవుతుంటారు. వివిధ రకాలైన రుగ్మతలను ఇతడు నయం చేస్తారని నమ్ముతారు. ప్రాఫెట్ బజీందర్ సింగ్ పేరుతో ఉన్న యూట్యూబ్ చానెల్‌లో ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంటారు. చానెల్‌కు 37 లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్లున్నారు.

తుషార్ గాంధీ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సబర్మతి ఆశ్రమం ఆధునీకరణ పథకాన్ని వ్యతిరేకిస్తూ మహాత్మా గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఈ పిటిషన్ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పిటిషన్ దాఖలు చేయడంలో రెండేళ్లకుపైగా జాప్యం చేశారని పేర్కొంది. అహ్మదాబాద్‌లో 1917లో గాంధీజీ నెలకొల్పిన సబర్మతి ఆశ్రమాన్ని ఆధునీకరించడమే లక్ష్యంగా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు గుజరాత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, దీన్ని వ్యతిరేకిస్తూ తుషార్ గాంధీ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆధునీకరణ వల్ల ఆశ్రమ సహజ స్వరూపం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఆయన పిటిషన్‌ను 2022లో హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో సైతం ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది.

అంతరిక్షం నుంచి ఇండియా అద్భుతం

ఎన్నో అందమైన దృశ్యాలు కనిపించాయి
- హిమాలయాల మీదుగా వెళ్తున్నప్పుడు విల్మోర్ ఫొటోలు తీశారు
- భారత్‌ను తప్పకుండా సందర్శిస్తా
- అంతరిక్ష ప్రయోగాల గురించి సంభాషిస్తా
- అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ వెల్లడి
- ఐఎస్ఎస్ నుంచి తిరిగివచ్చిన తర్వాత తొలిసారిగా మీడియా సమావేశం



జాన్సన్ స్పేస్‌సెంటర్‌లో మీడియా సమావేశంలో సునీత, నిక్ హేగ్, బుచ్ విల్మోర్

న్యూఢిల్లీ: అంతరిక్షం నుంచి భారతదేశం అద్భుతంగా కనిపించిందని భారత మూలాలున్న అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్(59) చెప్పారు. తన తండ్రి మాతృదేశమైన భారత్‌ను తప్పకుండా సందర్శిస్తానని తెలిపారు. అంతరిక్ష పరిశోధనల గురించి భారతీయులతో చర్చిస్తానని అన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తొమ్మిది నెలల తర్వాత మార్చి 18వ తేదీన క్షేమంగా భూమిపైకి తిరిగి వచ్చిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ తొలిసారిగా సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఐఎస్ఎస్‌లో తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ''అంతరిక్షం నుంచి ఇండియాను చూడడం గొప్ప అనుభవం. అక్కడి నుంచి ఇండియా చాలా అద్భుతంగా కనిపించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ప్రయాణిస్తూ హిమాలయ పర్వతాల మీదుగా వెళ్లినప్పుడల్లా బుచ్ విల్మోర్ నమ్మశక్యంకాని ఆ అందమైన చిత్రాలను కెమెరాలో బంధించారు. అవి ఎంతో అద్భుతంగా ఉన్నాయి. భారతదేశం మీదుగా తూర్పు నుంచి పశ్చిమం వైపు ప్రయాణిస్తున్నప్పుడు ఎన్నో అందమైన దృశ్యాలు కనిపించాయి. గుజరాత్, ముంబై సముద్ర తీరాల్లో చేపల వేట సాగించే పడవలు కనువిందు చేశాయి. పెద్ద నగరాల్లో విద్యుత్ దీపాల కాంతి మిరుమిట్లు గొలిపింది. రాత్రిపూట అంతరిక్షం నుంచి ఇండియాను చూడడం ఎంతో బాగుంది. పగటిపూట కూడా ఇండియా వీక్షించడం చక్కటి అనుభవం'' అని సునీతా విలియమ్స్ సంతోషం వ్యక్తంచేశారు. సరిగ్గా 41 ఏళ్ల క్రితం స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ సైతం ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తం చేయడం గమనార్హం. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా ఆయన రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే. అంతరిక్షంలో ఉన్న రాకేశ్ శర్మను అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ఇండియా ఎలా కనిపిస్తోంది? అని అడగ్గా, 'సారే సహా సే అచ్చా' అంటూ ఆయన బదులిచ్చారు.

ఇండియాలో స్పైసీ ఫుడ్ రుచి చూద్దాం

భారత్‌ను సందర్శించాలన్న బలమైె ఆకాంక్షను సునీతా విలిమయ్స్ వ్యక్తంచేశారు. తన తండ్రి సొంత దేశాన్ని సందర్శించడం తనకు ఎంతో ఆనందం కలిగిస్తుందని అన్నారు. అంతరిక్ష పరిశోధనల గురించి భారతీయులతో సంభాషిస్తానని చెప్పారు. యాక్సియోమ్ మిషన్-4(ఏఎక్స్-4)లో భాగంగా భారతీయుడు, మిషన్ పైలట్ సుభాంశు శుక్లా త్వరలో అంతరిక్షంలోకి వెళ్తుండడం తనకు ఉత్కంఠ కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆయనను ఎప్పటికైనా కలుస్తానని తెలిపారు. తామిద్దరం తమ అనుభవాలను భారతీయులకు తెలియజేస్తామని వ్యాఖ్యానించారు. భారత్ చాలా గొప్పదేశమని ఉద్ఘాటించారు. అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ ముందంజలో ఉండడం గొప్ప విషయమని అన్నారు. మమ్మల్ని కూడా మీతోపాటు ఇండియాకు తీసుకెళ్తారా? అని సహచర వ్యోమగామి బుచ్ విల్మోర్ ప్రశ్నించగా, సునీతా విలియమ్స్ నవ్వేశారు. తప్పకుండా తీసుకెళ్తానని బదులిచ్చారు. ఇండియాలో స్పైసీ ఫుడ్ రుచి చూద్దామని అన్నారు. అంతరిక్షంలో భారరహిత స్థితిలో 286 రోజులు గడిపిన సునీత, విల్మోర్ ప్రస్తుతం భూవాతావరణానికి అలవాటు పడే ప్రయత్నంలో ఉన్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన ఏఎస్‌సీఆర్ నిపుణులు రూపొందించిన 45 రోజుల రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్‌ను వారు పాటిస్తున్నారు. భూవాతావరణంలో సాధారణ స్థితికి రావడానికి నిపుణుల పర్యవేక్షణలోనిర్దేశిత ప్రోటోకాల్‌ను అనుసరిస్తున్నామని సునీతా విలియమ్స్ వెల్లడించారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం

సునీతా విలియమ్స్ తండ్రి దీపక్ పాండ్య ఇండియాలోని గుజరాత్‌లో జన్మించారు. 1958లో అమెరికా వెళ్లారు. క్లీవ్‌లాండ్‌లో వైద్య విద్య అభ్యసించారు. అక్కడే స్థిరపడ్డారు. దీపక్ పాండ్య, ఉర్సులిన్ బోనీ పాండ్య దంపతులకు సునీతా విలియమ్స్ 1965లో జన్మించారు. మైఖేల్ జె.విలియమ్స్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. ఐఎస్ఎస్ నుంచి సునీతా విలియమ్స్‌తోపాటు తిరిగివచ్చిన మొత్తం నలుగురు వ్యోమగాములను భారత్‌లో పర్యటించాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానించిన సంగతి తెలిసిందే. సునీతతోపాటు బుచ్ విల్మోర్, నిక్ హేగ్, అలెక్సాండర్ గోర్బనోవ్ స్పేస్ఎక్స్ క్రూ-9 మిషన్‌లో భూమిపైకి తిరిగివచ్చారు.

యూనుస్ వ్యాఖ్యలపై విమర్శల వెల్లువ

గువాహటి/ఇంఫాల్: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనుస్ భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలపై పార్టీలకతీతంగా నేతలంతా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేశారు. చైనా పర్యటన సందర్భంగా యూనుస్ ఈశాన్య రాష్ట్రాలపై పలు వ్యాఖ్యలు చేశారు. '' సెవన్ సిస్టర్స్‌గా పిలిచే 7 ఈశాన్య రాష్ట్రాలకు సముద్రమార్గం లేదు. సముద్ర తీరమున్న బంగ్లాదేశ్ ఒక రకంగా ఈ ఏడు రాష్ట్రాలకు సాగర రక్షకుడిగా ఉంది. ఈ ప్రాంతానికి సముద్రమార్గం లేకపోవడం చైనాకు ఒక సువర్ణావకాశం. ఈ ప్రాంతంపై చైనా తన ఆర్థిక సత్తాను చాటొచ్చు. ఇక్కడ విస్తరించి, ఉత్పత్తులు తయారుచేసి మార్కెటింగ్ చేసుకోవచ్చు'' అని అన్నారు. దీంతో పార్టీలకతీతంగా ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ''చైనాతో దోస్తీకి అర్రులు చాచే యూనుస్ ఏ అర్హతతో ఈశాన్య రాష్ట్రాల ప్రస్తావన తెస్తారు?'' అని నేతలు మండిపడ్డారు. త్రిపురలో ముఖ్యమైన తిప్రా మోతా పార్టీ చీఫ్, రాజవంశీకుడు ప్రద్యోత్ దేబర్మా మాణిక్య ఘాటుగా స్పందించారు. '' ఇరుకైన చికెన్ నెక్ కారిడార్‌లో భారత సైన్యం మోహరింపు, పటిష్టమైన భద్రతపై దృష్టిపెట్టంతోపాటు ఈసారి ఏకంగా బంగ్లాదేశ్‌ను నిలువుగా చీల్చి ఈశాన్య రాష్ట్రాలకు సముద్రమార్గాన్ని ఏర్పాటుచేయాలి. అసలు 1947 బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నౌకాశ్రయం మన చేతికొచ్చినా త్యజించడం ఆనాడు చేసిన పెద్ద తప్పు'' అని ప్రద్యోత్ అన్నారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సైతం ఆగ్రహం వ్యక్తంచేశారు. తీవ్ర పరిణామాలు ఊహించకుండా ఏదిపడితే అది మాట్లాడొద్దని యూనుస్‌కు మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ హితవుపలికారు. '' భారత విదేశాంగ విధానం ఈ స్థాయికి దిగజారడం శోచనీయం. ఏ దేశం విమోచన కోసం భారత్ పోరాడింతో ఇప్పుడు అదే దేశం శత్రుదేశంతో చేతులు కలపడం దారుణం'' అని అస్సాం జాతీయ పరిషత్(ఏజేపీ)అధ్యక్షుడ, జోర్హాట్ ఎంపీ లురిన్ జ్యోతి గొగోయ్ అన్నారు. భారత విదేశాంగ విధానం ఎంత బలహీనపడిందో యూనుస్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శించింది.

గ్యాస్ పైప్‌లైన్ పేలి 145 మందికి గాయాలు

కౌలాలంపూర్: గ్యాస్ లైన్ పగిలి భారీగా మంటలు ఎగసిపడిన ఘటనలో 145 మంది గాయపడ్డారు. ఈ ఘటన మలేసియా రాజధాని కౌలాలంపూర్ శివారులోని నివాసప్రాంతంలో చోటుచేసుకుంది. మంటలను ఆర్పివేసేందుకు అగ్ని మాపక సిబ్బందికి కొన్ని గంటలు పట్టింది. ప్రభుత్వ రంగ పెట్రోనాస్‌కు చెందిన గ్యాస్ పైప్ పగలడంతో 20 అంతస్తుల ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడగా, ఆ ప్రాంతంలో భారీ గొయ్యి ఏర్పడింది. క్షతగాత్రుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో 67 మంది, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 37 మంది చేరారు. అత్యధికులకు తీవ్రగాయాలైనట్లు అధికారులు చెప్పారు. మంటల కారణంగా 190 నివాసాలు, 148 కార్లు దెబ్బతిన్నాయన్నారు. ఘటనా స్థలిలోని చుట్టుపక్కలున్న 290 మీటర్ల దూరంలోని నివాసాల్లోకి ఇప్పటికీ వెళ్లే పరిస్థితులు లేవని తెలిపారు. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు వివరించారు.

తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు

తైపీ: తైవాన్ ఎప్పటికీ తమదేనంటున్న డ్రాగన్ దేశం చైనా మంగళవారం ఆ ద్వీపాన్ని చుట్టుముట్టి భారీగా సైనిక విన్యాసాలకు తెరతీసింది. అధికారిక స్వాతంత్ర్యం కోసం చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా తాము సమ్మతించబోమంటూ మరోసారి గట్టి హెచ్చరికలు పంపింది. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల మధ్యలో తమ దీవిని 19 చైనా యుద్ధ నౌకలు చుట్టుముట్టాయని తైవాన్ రక్షణ విభాగం తెలిపింది. షాండోంగ్ విమాన వాహక నౌకల శ్రేణి తమ గగనతల రక్షణ జోన్ లోపలికి ప్రవేశించిందని వివరించింది. ఈ విన్యాసాల్లో త్రివిధ దళాలు పాల్గొంటున్నాయని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) ఈస్టర్న్ థియేటర్ కమాండ్ ప్రతినిధి షి యి చెప్పారు. విన్యాసాలకు ఎటువంటి పేరు పెట్టలేదు, ముందుగా తైవాన్‌కు నోటీసులు కూడా ఇవ్వలేదు అని ఆయన తెలిపారు. స్వతంత్ర తైవాన్ వాదాన్ని గట్టిగా బలపరుస్తున్న లాయ్ చింగ్-టె వైఖరిపై చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తీవ్ర అసహనంతో ఉన్నట్లు పరిశీలకులు చెబుతున్నారు. కాగా, చైనా చర్యలు ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు ప్రమాదకరంగా మారాయని తైవాన్ అధ్యక్ష కార్యాలయం వ్యాఖ్యానించింది. చైనా ఇటీవల దక్షిణ చైనా సముద్రంతోపాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, జపాన్, దక్షిణకొరియా సమీపంలోనూ ఎటువంటి నోటీసులు లేకుండానే విన్యాసాలు చేపట్టింది. దీంతో, ఆయా దేశాలు పౌర విమాన సర్వీసులను దారి మళ్లించాల్సి వచ్చింది. చైనా తరచుగా తైవాన్ జలాల్లోకి యుద్ధ విమానాలను, యుద్ధ నౌకలను పంపించడం సాధారణమైపోయింది. ఇటీవలి కాలంలో సైనిక విన్యాసాలను తీవ్రతను సైతం పెంచింది. విన్యాసాల మాటున తమపై ఏదో ఒకరోజు ఆకస్మిక దాడికి పాల్పడే అవకాశాలు ఉన్నాయని తైవాన్ ప్రభుత్వం అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ప్రజాస్వామ్య తైవాన్ రక్షణకు అవసరమైతే జోక్యం చేసుకోవాలన్నది అమెరికా విధానంగా ఉంది. తైవాన్‌ను దృష్టిలో ఉంచుకునే ఈ ప్రాంతంలోని ఫిలిప్పీన్స్, కొరియా, జపాన్ తదితర దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలను ఏర్పాటు చేయడంతో పాటు ఒప్పందాలను సైతం కుదుర్చుకుంది. అయితే, డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక మారిన విధానాలు, పరిస్థితుల నేపథ్యంలో ఈ విధానానికి అమెరికా ఏమేరకు కట్టుబడి ఉంటుందో తెలియాల్సి ఉంది.

ప్రార్థనాస్థలాల చట్టంపై పిల్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: 1947 ఆగస్టు 15వ తేదీన ఉన్న మత పరమైన ప్రదేశాలను యథాతథంగా కొనసాగించాలన్న ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-1991లోని నిబంధన చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఈ విషయమై న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ వేసిన ప్రధాన పిటిషన్ సహా ఆరు అర్జీలు ఇప్పటికే తమ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ఈ పిటిషన్లతోపాటే విచారించాలంటూ న్యాయ విద్యార్థి నితిన్ ఉపాధ్యాయ్ చేసిన వినతిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం తిరస్కరించింది. అయితే, మధ్యంతర పిటిషన్ వేసేందుకు అంగీకరించింది. ప్రార్థనా స్థలం మతపరమైన లక్షణాన్ని నిర్ధారించడానికి తగిన ఆదేశాలు జారీ చేసేలా కోర్టులను అనుమతించాలని పిటిషనర్ కోరారు. 1991 చట్టాన్ని సవాల్ చేస్తూ అందిన పిటిషన్లపై ఏప్రిల్‌లో త్రిసభ్య ధర్మాసనం విచారిస్తుందని సుప్రీంకోర్టు ఇప్పటికే ప్రకటించింది.

ప్రాజెక్టుల్ని అడ్డుకుంటే అభివృద్ధి ఎలా?

ఎన్‌జీవోను నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని జయక్వాడీ డ్యామ్ వద్ద తలపెట్టిన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న ప్రభుత్వేతర సంస్థ(ఎన్జీవో)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా ప్రతి ప్రాజెక్టునూ అడ్డుకుంటూ ఉంటే దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించింది. ఈ సంస్థను ఎవరు స్థాపించారు, నిధులెక్కడివి, పర్యావరణ పరిరక్షణలో మీకున్న అనుభవం ఏమిటి..అంటూ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం 'కహార్ సమాజ్'అనే ఆ ఎన్జీవోను నిలదీసింది. అక్కడ పక్షుల సంరక్షణ కేంద్రం, పర్యావరణ జోన్ ఉన్నందున ప్రాజెక్టు కారణంగా జీవావరణం దెబ్బతింటుందని పిటిషనర్ చేసిన వాదనను ధర్మాసనం పట్టించుకోలేదు. సౌర విద్యుత్ ప్రాజెక్టును కూడా అడ్డుకుంటున్నారంటే, మీలోనే సమస్య ఉందంటూ వ్యాఖ్యానించింది. ప్రాజెక్టుకు అనుమతిస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ 2024లో ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమంటూ ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

మర్యాదపూర్వకంగా నడుచుకుంటా

సుప్రీంకోర్టుకు రణ్‌వీర్ అలహాబాదియా వినతి

న్యూఢిల్లీ: ఇకపై షోలలో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తానంటూ పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అలహాబాదియా మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపాడు. తనపై నమోదైన కేసు విచారణలో పోలీసులకు సహకరిస్తానని కూడా తెలిపాడు. సీనియర్ అడ్వొకేట్ అభినవ్ చంద్రచూడ్ మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనానికి ఈ విషయం తెలిపారు. పాస్‌పోర్టును కోర్టుకు అందజేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. అలహాబాదియా వృత్తిలో భాగంగా ఇతర దేశాలకు వెళ్లి వివిధ రకాలైన వ్యక్తులతో ఇంటర్వ్యూలు చేయాల్సి ఉంటుందని, పలు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ఎంతో అవసరమైన పాస్‌పోర్టును సరెండర్ చేయడం అలహాబాదియా జీవనోపాధిని దెబ్బతీయడమే అవుతుందని వివరించారు. అతడు విదేశాలకు వెళ్లే పక్షంలో దర్యాప్తునకు అంతరాయం కలుగుతుందని ధర్మాసనం పేర్కొంది. ఎప్పటిలోగా ఈ కేసు విచారణ పూర్తవుతుందో తెలపాలని మహారాష్ట్ర, అస్సాం ప్రభుత్వాల తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించింది. రెండు వారాల్లోగా దర్యాప్తు పూర్తయ్యే అవకాశముందని ఆయన తెలపగా..ఆ తర్వాతే పాస్‌పోర్టును ఇస్తామని ధర్మాసనం తెలిపింది. సమయ్ రైనా నడిపే యూట్యూబ్ షో 'ఇండియాస్ గాట్ లేటెంట్'లో తల్లిదండ్రులు, సెక్స్ గురించి అభ్యంతరకరంగా చేసిన వ్యాఖ్యలపై కేసులు నమోదవడం తెల్సిందే.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు.. నలుగురు మృతి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌పై మంగళవారం ఉదయం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్య విభాగం తెలిపింది. గాజాలోని హమాస్‌కు సాయమందిస్తున్న హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్ సభ్యుడే లక్ష్యంగా ఈ దాడి జరిపినట్లు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించుకుంది. మృతుల్లో హెజ్‌బొల్లా నేత హస్సన్ బదెర్, అతడి కుమారుడు అలీ ఉన్నారని ఓ అధికారి చెప్పారు. మిగతా మృతులు వీరి పొరుగింట్లో ఉండే వారన్నారు. దాడిలో ధ్వంసమైనట్లుగా చెబుతున్న మూడంతస్తుల భవనం ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. గతేడాది నవంబర్‌లో హెజ్‌బొల్లాతో కుదిరిన కాల్పుల ఒప్పందం తర్వాత మొట్టమొదటిసారిగా శుక్రవారం బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇజ్రాయెల్ దాడులను లెబనాన్ ప్రభుత్వం అడ్డుకోలేకుంటే తాము ఇతర మార్గాల్లో స్పందిస్తామని లెబనాన్‌లోని హెజ్‌బొల్లా నేత షేక్ నయీమ్ కస్సెమ్ అంటున్నారు.

జనగణనతో పాటు కులగణన చేపట్టాలి

రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో జనగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. జాప్యానికి స్వస్తి పలికి జనగణనతో పాటు కులగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కచ్చితమైన, విశ్వసనీయ జనాభా గణాంకాలు లేకుండానే ఏకపక్షంగా విధాన నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇది అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభ ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. మన ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి కాలానుగుణంగా వైద్య పరీక్షలు అవసరమైనట్లే, జనాభా గణన కూడా దేశానికి అవసరమని గాంధీజీ చెప్పినట్లు గుర్తుచేశారు. రెండో ప్రపంచ యుద్ధం, 1971-72లో జరిగిన భారత్-పాకిస్తాన్ యుద్ధ సమయంలోనూ జనగణనను నిర్వహించగా.. ప్రస్తుతం ప్రభుత్వం ఈ ప్రక్రియను నిరవధికంగా జాప్యం చేస్తోందని తప్పుపట్టారు. సాధారణ జన గణనతో పాటు కులగణన సైతం జరగాలన్నారు. ఎస్సీ, ఎస్టీల డేటాను సేకరించినప్పుడు ఇతర కులాల గణాంకాలను ఎందుకు సేకరించకూడదని ప్రశ్నించారు. వినియోగదారుల సర్వే, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే, కార్మిక శక్తి సర్వే, జాతీయ ఆహార భద్రతా చట్టం, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం వంటి అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు జనగణన డేటాపై ఆధారపడి ఉన్నాయని మల్లికార్జున ఖర్గే వివరించారు.

ఢిల్లీ మంత్రిపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఢిల్లీ న్యాయ మంత్రి కపిల్ మిశ్రాకు ఢిల్లీ కోర్టులో చుక్కెదురైంది. 2020లో ఈశాన్య ఢిల్లీ ప్రాంతంలో జరిగిన అల్లర్లలో కపిల్ మిశ్రా ప్రమేయముందన్న ఆరోపణలపై కేసు నమోదు చేయాలని రౌస్ అవెన్యూ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా మౌఖిక ఆదేశాలిచ్చారు. యమునా విహార్ వాసి మహ్మద్ ఇల్యాస్ వేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు విన్న మేజిస్ట్రేట్ చౌరాసియా నేరం జరిగినట్లుగా చెబుతున్న ప్రాంతంలో కపిల్ మిశ్రా ఉన్నట్లుగా ప్రాథమిక రుజువులున్నాయన్నారు. ఏప్రిల్ 16 కల్లా దీనిపై దర్యాప్తు పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. డీసీపీ వేద్ ప్రకాశ్ కూడా అదే సమయంలో అక్కడే ఉన్నట్లు తెలుస్తున్నందున అనంతరం ఆయన్నూ విచారించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. నైతిక బాధ్యత వహిస్తూ కపిల్ మిశ్రా రాజీనామా చేయాలన్నారు. ఢిల్లీ అల్లర్లకు కారకుడని రుజువులున్నందున కపిల్ మిశ్రాను పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో పౌరసత్వ చట్టంపై 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్లలో 53 మంది చనిపోగా పదుల సంఖ్యలో జనం గాయపడటం తెల్సిందే.

జాతీయరహదారులపై పెరిగిన టోల్ చార్జీలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జాతీయ రహదారులపై సగటున 4 నుంచి 5 శాతం టోల్ చార్జీలను పెంచినట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) మంగళవారం ప్రకటించింది. సవరించిన నూతన టోల్ చార్జీలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చినట్లు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ సీనియర్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలకు వేర్వేరుగా పెరిగిన టోల్ చార్జీల ధరల పట్టికలను ఎన్‌హెచ్ఏఐ నోటిఫై చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణానికి అనుగుణంగా టోల్ చార్జీలను పెంచినట్లు అధికారి తెలిపారు. ప్రతి ఏడాది సవరించిన చార్జీలను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే అమలుచేస్తున్నారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై 855 చోట్ల వాహనదారుల నుంచి టోల్ ఫీజులను వసూలుచేస్తున్నారు.

గ్రామాధికారుల పదవులను ఎప్పుడు రద్దు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

పంచాయతీరాజ్ సంస్కరణల అమలులో కేరళ మొదటి స్థానంలో ఉంది. కర్ణాటక, సిక్కిం రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టంతో పంచాయతీరాజ్ వ్యవస్థను మూడు అంచెలుగా మార్చారు. ఈ చట్టం అమలు తీరును పరిశీలించడానికి బి.ఎస్. రమాదేవి అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. బిహార్ పంచాయతీరాజ్ వ్యవస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను అధ్యయనం చేయడానికి పలు కమిటీలు ఏర్పాటు చేశారు. అందులో ముఖ్యమైనవి..

పురుషోత్తం పాయి కమిటీ (1963), ఎం.టి రాజ్ కమిటీ (1968), జలగం వెంగళరావు కమిటీ (1968), నరసింహం కమిటీ (1971), బీపీఆర్ విఠల్ కమిటీ (1991), నాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి డి.కె. సమరసింహారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ (1991). 'గ్రామ సర్పంచ్‌ను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి, పంచాయతీ సమితీలకు పరోక్ష ఎన్నికలు జరగాలి, గ్రామ పంచాయతీలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి, రాష్ట్ర స్థాయిలో ఆర్థిక సంఘాన్ని' ఏర్పాటు చేయాలని సి. నరసింహం కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

పంచాయతీరాజ్‌లో కింది స్థాయి వ్యవస్థ గ్రామ పంచాయతీ. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు కావాల్సిన కనీస జనాభా 500మంది. ఐటీడీఏ ప్రాంతాల్లో 250 మంది ఉంటే గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయొచ్చు.వార్షికాదాయం రూ. 60 వేలు ఉంటే నోటిఫైడ్ గ్రామ పంచాయతీ, అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న వాటిని నాన్-నోటిఫైడ్ గ్రామ పంచాయతీలుగా పేర్కొంటారు.243వ రాజ్యాంగ అధికరణం.. పంచాయతీరాజ్ వ్యవస్థను గ్రామం, గ్రామ పంచాయతీ, మాధ్యమిక స్థాయి, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ అని నిర్వచిస్తుంది.

గ్రామసభ

గ్రామసభలో గ్రామంలోని ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. ఈ సభ సంవత్సరానికి రెండుసార్లు సర్పంచ్ అధ్యక్షతన సమావేశమవుతుంది. గ్రామసభ స్విట్జర్లాండ్‌లోని 'ల్యాండ్స్ గమండ్'ను పోలి ఉంటుంది. ఏడాదికి రెండు సార్లు గ్రామ సభ నిర్వహించకుంటే సర్పంచ్ పదవి ఖాళీగా ఉందని ప్రకటించవచ్చు. గ్రామంలోని 50 శాతం మంది ఓటర్లు లేదా జనాభాలో పది శాతం ప్రజలు కోరితే గ్రామ సభ నిర్వహించాలి.

గ్రామసభ విధులు

- గ్రామపంచాయతీలో అభివృద్ధి పథకాలలబ్ధిదారుల గుర్తింపు.
- పంచాయతీ 'ఆడిట్' (తనిఖీ) నివేదికలను ఆమోదించడం.
- గ్రామీణాభివృద్ధికి నూతన ప్రణాళికల రూపకల్పన
- పన్ను బకాయిదారుల జాబితా ప్రకటించడం

కౌన్సిల్

గ్రామ పంచాయతీకి కౌన్సిల్ శాసనపరమైన విభాగం. కౌన్సిల్‌లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు సభ్యులుగా ఉంటారు. వార్డు సభ్యులు నెలకోసారి సమావేశం కావాలి. గరిష్ఠంగా 90 రోజుల్లో సమావేశం నిర్వహించాలి. సభ్యులు మూడు నెలల్లో ఒక్కసారైన హాజరు కాకుంటే సభ్యత్వం కోల్పోతారు. గ్రామ పంచాయతీలో కనిష్ట సభ్యుల సంఖ్య అయిదు. గరిష్ట సభ్యుల సంఖ్య 21. పంచాయతీ జనాభా ఆధారంగా వార్డు సభ్యుల సంఖ్యను నిర్ణయిస్తారు.

జనాభా	వార్డు సభ్యుల సంఖ్య
300	5
300-500	7
500-1500	9
1500- 3000	11
3000- 5000	13
5000 - 10,000	15
10,000-15000	17
15,000 పైనా	19 నుంచి 21

గ్రామ కార్యదర్శి

గ్రామ సచివాలయ వ్యవస్థను 2002 జనవరి 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పాలనా అధిపతిగా కార్యదర్శి వ్యవహరిస్తారు. గ్రామ పంచాయతీ సమావేశాల అజెండాను సర్పంచ్‌తో సంప్రదించి రూపొందిస్తాడు. గ్రామ పంచాయతీ వార్షిక బడ్జెట్‌ను రూపొందించి పంచాయతీ సభ్యుల పరిశీలనకు పంపుతాడు. గ్రామసభల సమావేశాల తీర్మానాల అమలుకు చర్యలు తీసుకుంటాడు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆస్తులపై అతడికి పూర్తి నియంత్రణ అధికారం ఉంటుంది.



గ్రామ పంచాయతీ విధులు

11వ షెడ్యూల్‌లో పొందుపర్చిన 29 అంశాలకు సంబంధించిన విధులను గ్రామ పంచాయతీ నిర్వహిస్తోంది. గ్రామ పంచాయతీ విధులు రెండు రకాలు.

అవి..

1.ఆవశ్యక విధులు, 2.వివేచానాత్మక విధులు.

ఆవశ్యక విధులు

- రహదారులు, భవనాలు, పబ్లిక్ టాయిలెట్లు, బావులు, చెరువుల నిర్మాణం, మరమ్మతులు.
- శ్మశాన వాటికల నిర్వహణ
- జనన మరణాల నమోదు
- అంటువ్యాధుల నివారణ, చికిత్స.
- కంపోస్ట్ ఎరువుల తయారీ
- పశుక్షేత్రాల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, మురుగు కాల్వల నిర్మాణం, నిర్వహణ, బందెల దొడ్ల నిర్మాణం, వివాహాల రిజిస్ట్రేషన్, రాష్ట్ర శాసనసభ సూచించిన ఇతర విధులు.

వివేచనాత్మక విధులు

- సమాజాభివృద్ధి పనుల కోసం స్వచ్ఛంద, శ్రమదాన శిబిరాల నిర్వహణ.
- విశ్రాంతి గృహాల నిర్మాణం, నిర్వహణ.
- ప్రాథమిక పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాలు, మందిరాలు, పార్కులు, మార్కెట్ స్థలాల నిర్మాణం, నిర్వహణ.
- ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ.
- భూ సంస్కరణల అమలు.
- ఆధునిక సేద్య పద్ధతులపై ప్రచారం.
- ధాన్యాగారాలు, గిడ్డంగుల నిర్మాణం.
- వికలాంగులు, అనాథలు, వ్యాధి గ్రస్తులకు చేయూతనివ్వడం
- వ్యాయామశాలల స్థాపన, ఆటస్థలాలు, సంతలు, జాతరలు, ఉత్సవాల నిర్వహణ, నిరుద్యోగ గణాంకాల నమోదు, విపత్తు సహాయక చర్యలు, రక్షణ ఏర్పాట్లు
- సహకార సంఘాలకు తోడ్పాటు.

గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులు

- కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసులపై కేంద్ర ప్రభుత్వం అందించే గ్రాంట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు.
- పన్నుల ద్వారా వచ్చే ఆదాయం (ఇంటిపన్ను, ఆస్తుల బదిలీ పన్ను, ప్రకటనలపై పన్ను, వృత్తి పన్ను, జంతువులపై పన్ను, దుకాణాలపై పన్నులు మొదలైనవి)
- మూలధనంపై వచ్చే ఆదాయం (విశ్రాంతి భవనాలు, ఖాళీ స్థలాలు, మార్కెట్లపై వచ్చే అద్దె మొదలైనవి)

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు? (ఎస్ఐ - 2012)
   ఎ) మార్చి-28 బి) అక్టోబర్ -24
   సి) ఆగస్టు-24 డి) ఏప్రిల్ - 24
2. భారతదేశంలోని మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు ఏ ఎన్నికల్లో కేటాయించారు? (ఎక్సైజ్ కానిస్టేబుల్ - 2013)
   ఎ) గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు
   బి) విధానసభ సి) విధాన మండలి
   డి) పైవన్నీ

సమాధానాలు: 1) డి 2) ఎ

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో నగర స్థానిక సంస్థలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ?
   ఎ) 64వ సవరణ బి) 72వ సవరణ
   సి) 73వ సవరణ డి) 74వ సవరణ
2. పంచాయతీరాజ్ సంస్థలను పటిష్టం చేసినందుకు 2012 ఏప్రిల్ 24న ఏ రాష్ట్రం ఉత్తమ రాష్ట్ర అవార్డు పొందింది?
   ఎ) ఉత్తరప్రదేశ్ బి) సిక్కిం
   సి) బిహార్ డి) గుజరాత్
3. గ్రామ సర్పంచ్‌ను ఎలా ఎన్నుకుంటారు?
   ఎ) ప్రజలు ప్రత్యక్షంగా..
   బి) వార్డు సభ్యులు కలిసి
   సి) కలెక్టర్ నియమిస్తాడు
   డి) ఏదీకాదు
4. జిల్లా పరిషత్‌లో ఉండే స్థాయీ సంఘాల సంఖ్య?
   ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
5. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
   ఎ) గుజరాత్ బి) రాజస్థాన్
   సి) బిహార్ డి) ఆంధ్రప్రదేశ్
6. పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి వీటిలో దేన్ని 73వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదించలేదు?
   ఎ) పంచాయతీరాజ్ సంస్థల్లో 33.33 శాతం సీట్లు మహిళా అభ్యర్థులకు కేటాయించాలి
   బి) పంచాయతీరాజ్ సంస్థల్లో వనరుల కోసం రాష్ట్రాలు ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తాయి
   సి) పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే పదవులు కోల్పోతారు
   డి) రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థను రద్దు చేస్తే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలు జరపాలి
7. గ్రామీణ సమాజానికి అత్యధిక అధికారాలు ఎవరి కాలంలో ఉండేవి?
   ఎ) చోళులు బి) బ్రిటిష్
   సి) పాండ్య డి) మొగలులు
8. భారతదేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించిన కమిటీ?
   ఎ) అశోక్ మెహతా కమిటీ
   బి) విఠల్ కమిటీ
   సి) జి.వి.కె.రావు కమిటీ
   డి) బల్వంతరాయ్ మెహతా కమిటీ
9. రాష్ట్ర ఆర్థిక (ఫైనాన్స్) సంఘాన్ని నియమించేది ఎవరు?
   ఎ) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   బి) ప్రధానమంత్రి సి) రాష్ట్ర ప్రభుత్వం
   డి) భారత ఆర్థిక (ఫైనాన్స్) సంఘం
10. భారత రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీకి ఎన్ని కార్యాత్మక విధులుంటాయి?
    ఎ) 27 బి) 28 సి) 29 డి) 30
11. గ్రామాధికారుల పదవులను ఎప్పుడు రద్దు చేశారు?
    ఎ) 1983 డిసెంబర్ బి) 1984 మార్చి
    సి) 1984 జనవరి డి) 1985 మార్చి
12. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు?
    ఎ) మూడో భాగం బి) 21వ భాగం
    సి) 9వ భాగం డి) 8వ భాగం
13. మండల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసిన కమిటీ?
    ఎ) అశోక్ మెహతా కమిటీ
    బి) బల్వంతరాయ్ మెహతా కమిటీ
    సి) నరసింహన్ కమిటీ
    డి) వెంగళరావు కమిటీ
14. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేసిన మొదటి రాష్ట్రం?
    ఎ) బిహార్ బి) హర్యానా
    సి) ఢిల్లీ డి) ఆంధ్రప్రదేశ్
15. భారత రాజ్యాంగంలోని 243 అధికరణను ప్రభుత్వం సవరించదానికి ప్రయత్నిస్తుంది. ఈ అధికరణం ఏ అంశానికి సంబంధించింది?
    ఎ) ప్రాథమిక విద్య
    బి) గ్రామీణ ఉద్యోగ హామీ చట్టం
    సి) పంచాయతీరాజ్ విధానం
    డి) పార్లమెంట్‌లో మహిళలకు రిజర్వేషన్

సమాధానాలు

1) డి; 2) బి; 3) ఎ; 4) డి; 5) బి; 6) సి; 7) ఎ; 8) డి; 9) సి; 10) సి; 11) సి; 12) సి; 13) ఎ; 14) ఎ; 15) సి.

మూత్రపిండాల అధ్యయనాన్ని ఏమంటారు?

జీవుల దేహంలోని మలిన పదార్థాలను బయటికి పంపడాన్నే విసర్జన అంటారు. మానవుడిలో ఒక జత మూత్ర పిండాలు ఉంటాయి. వీటి అధ్యయనాన్ని నెఫ్రాలజీ అంటారు. ఒక వ్యక్తి రోజుకు సుమారు 1 నుంచి1.5 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. మానవ శరీరంలో అవయవ మార్పిడి చేసిన మొదటి అవయవం 'మూత్రపిండం'. కృత్రిమ అవయవాల అధ్యయనాన్ని బయోనిక్స్ అంటారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

విసర్జన వ్యవస్థ

శరీరంలో జీవక్రియల ఫలితంగా ఏర్పడిన నీరు, కార్బన్ డై ఆక్సైడ్, నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలను దేహం నుంచి బయటకు పంపడాన్ని విసర్జన అంటారు. విసర్జన క్రియను అధ్యయనం చేసే శాస్త్రం యూరాలజీ. మానవుడిలో ఒక జత మూత్రపిండాలు విసర్జన క్రియను నిర్వర్తిస్తాయి. మూత్ర పిండాలు విసర్జనతో పాటు రక్తం, కణజాలాల ద్రవాభిసరణ పీడనం, అయాన్లను సమతుల్యం చేస్తాయి.

విసర్జన పద్ధతులు - జీవుల రకాలు

అమ్మోనోటెలిక్ జీవులు: అమ్మోనియాను విసర్జించే జీవులను అమ్మోనోటెలిక్ జీవులు అంటారు. దీని విష స్వభావం అధికంగా ఉంటుంది. **ఉదా:** అమీబా, హైడ్రా, అస్థి చేపలు, డిప్నాయ్ చేపలు, రొయ్యలు, పీతలు, నత్త, ఆల్చిప్ప, చిరుకప్ప, సముద్ర క్షీరదాలు (డాల్ఫిన్స్, తిమింగలం)

యూరికోటెలిక్ జీవులు: యూరికామ్లాన్ని విసర్జిస్తాయి. విషస్వభావం చాలా తక్కువ. నీటికొరత ఉండే ఎడారి జీవుల్లో ఈ విధానం కనిపిస్తుంది. **ఉదా:** కీటకాలు (ఆర్థోపొడ) సరీసృపాలు (బల్లి, పాము, తొండ, మొసలి, తాబేలు), పక్షులు. కప్ప సుప్తావస్థ దశలో యూరికామ్లాన్ని విసర్జిస్తుంది.

యూరియోటెలిక్ జీవులు: యూరియాను విసర్జిస్తాయి. **ఉదా:** మంచినీటి చేపలు, వాన పాము, ఉభయచరాలు (ప్రౌఢకప్ప), క్షీరదాలు (మానవుడు). మొదటిసారి కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం 'యూరియా'. దీని రసాయన నామం 'కార్బమైడ్'

మానవ విసర్జన వ్యవస్థ

మానవుడి విసర్జన వ్యవస్థలో జత మూత్రపిండాలు, జత మూత్ర నాళాలు, మూత్రాశయం, ప్రసేకం ఉంటాయి. పక్షుల్లో మూత్రాశయం ఉండదు. విసర్జక వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యం రక్తం, శరీర ద్రవాల అయాన్ల సమతాస్థితిని కాపాడటం. ద్వితీయ కర్తవ్యం నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల విసర్జన.

మూత్ర పిండాలు (కిడ్నీలు)

- మూత్ర పిండాల అధ్యయనాన్ని నెఫ్రాలజీ అంటారు.
- మూత్ర పిండాలు చిక్కుడు గింజ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో ఉంటాయి.
- కాలేయం వల్ల ఎడమ మూత్ర పిండం కంటే కుడి మూత్రపిండం కొద్దిగా దిగువన అమరి ఉంటుంది.
- మూత్ర పిండాలు 120 నుంచి 170 గ్రాముల బరువుంటాయి. ఇవి వెన్నెముకకు ఇరువైపులా, పృష్ఠ శరీర కుడ్యాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి.
- మూత్ర పిండాలకు హృదయం నుంచి వృక్క ధమని రక్తాన్ని సరఫరా చేస్తుంది.
- మూత్ర పిండాల నుంచి హృదయానికి రక్తాన్ని తీసుకుపోయే సిరను వృక్కసిర అంటారు.
- నిలువుకోతలో మూత్ర పిండం వెలుపలి భాగాన్ని వల్కలం (కోర్టెక్స్), లోపలి భాగాన్ని దవ్వ అంటారు.
- మూత్రపిండం పుటాకార అంచులో ఉండే నొక్కును నాభి అంటారు.
- నాభి ద్వారా వృక్కసిర, మూత్రనాళాలు బయటకు వస్తాయి.
- మూత్ర పిండాల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు మూత్రనాళికలు (నెఫ్రాన్లు)

విసర్జక అవయవాలు	జీవులు
1. సంకోచ రిక్తికలు	ప్రొటోజోవా జీవులు (అమీబా, పారమీషియం)
2. జ్వాలా కణాలు (ఫ్లేమ్‌సెల్స్)	ప్లాటి హెల్మింథిస్ జీవులు (బద్దెపురుగు, టేప్ వార్మ్)
3. వృక్కాలు	అనిలెడ (వానపాము, జలగ)
4. మాల్ఫీజియన్ నాళికలు	ఆర్థ్రోపొడ (బొద్దింక, ఈగ)
5. హరిత గ్రంథులు	ఆర్థ్రోపొడ (రొయ్యలు, పీతలు)
6. కోక్సల్ గ్రంథులు	ఆర్థ్రోపొడ (తేలు)
7. కీబర్స్ అవయవం	మొలస్కా (నత్తలు)
8. బొజానస్ అవయవం	మొలస్కా (ఆల్చిప్ప)
9. మూత్రపిండాలు (కిడ్నీ)	చేప, ఉభయ చరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు

Table title: విసర్జక అవయవాలు - రకాలు

మూత్రనాళికలు (నెఫ్రాన్లు)

ఒక్కో మూత్ర పిండంలో 12 లక్షల (1.2 మిలియన్లు) నెఫ్రాన్లు ఉంటాయి. ప్రతి నెఫ్రాన్ (మూత్ర నాళిక)లో రెండు భాగాలుంటాయి. అవి.

ఎ) భౌమన్స్ గుళిక

బి) నాళికా భాగం.

భౌమన్స్ గుళిక: ఇది ఒక గిన్నెవంటి భాగం. వృక్క ధమని మూత్రపిండంలోకి ప్రవేశించి అనేక ధమనికలుగా విభజన చెందుతుంది. భౌమన్ గుళికలోకి ఒక అభివాహి ధమనిక ప్రవేశించి అనేక రక్త కేశనాళికలుగా చీలి, రక్త కేశనాళికాగుచ్ఛాన్ని ఏర్పరుస్తుంది. దీనిలోని సూక్ష్మ రంధ్రాల ద్వారా రక్తంలోని నీరు, మలినాలు భౌమన్స్ గుళికలోకి చేరుతాయి. ఈ వడబోతను సూక్ష్మగాలనం (ఆల్ట్రాఫిల్టరేషన్) అంటారు. భౌమన్స్ గుళికలో రక్తంలోని మలినాలు ఫిల్టరై ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది. దీనిలో గ్లూకోజ్, కొన్ని క్లోరైడ్లు, విటమిన్లు ఉంటాయి.

నాళికాభాగం: ఇది భౌమన్స్ గుళిక వెనకభాగం. దీనిలో మూడు ఉప భాగాలు ఉన్నాయి.

ఎ) సమీప సంవళిత నాళం: ఇది ముడతలు పడి ఉంటుంది. దీనిలో 60 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది.

బి) హెన్లీ శిక్యం: ఇది తలపిన్ను / సి ఆకారంలో ఉంటుంది. ఇందులో 20 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది

సి) దూరాగ్రసంవళిత నాళం: దీనిద్వారా 15 శాతం నీరు పునః శోషణం అవుతుంది.

- రక్తం వడపోతలో రెండు మూత్ర పిండాల్లో నిమిషానికి 125 మి.లీ, రోజుకు 180 లీటర్ల మూత్రం ఏర్పడుతుంది. ఇందులో 178.5 లీటర్ల మూత్రం పునఃశోషణం చెందుతుంది. రోజుకు 1.5 లీటర్ల మూత్రం విసర్జితమవుతుంది.

3. **మూత్రాశయం**

- మూత్రనాళాల నుంచి మూత్రం మూత్రాశయంలోకి చేరి అక్కడ నిల్వ ఉంటుంది. మూత్రాశయం నుంచి ప్రసేకం ద్వారా మూత్ర విసర్జన జరుగుతుంది. పెద్దవారిలో మూత్రవిసర్జన నియంత్రిత చర్య కాని చిన్న పిల్లల్లో అనియంత్రిత చర్య.

మూత్రం (యూరిన్) లక్షణాలు

ఒక వ్యక్తి రోజుకు సుమారు 1 నుంచి 1.5 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. మూత్రంలో 96 శాతం నీరు, 2 శాతం యూరియా, 2 శాతం అకర్బన పదార్థాలుంటాయి.మానవుడు మూత్రం ద్వారా రోజుకు సుమారు 25 నుంచి 30గ్రాముల యూరియా విసర్జిస్తాడు.

యూరోక్రోమ్ అనే వర్ణద్రవ్యం వల్ల మూత్రం లేత పసుపు రంగులో ఉంటుంది. మూత్రం కొద్దిగా ఆమ్ల స్వభావంలో ఉంటుంది. దీని పీహెచ్ '6'. మానవుడి మూత్రంలో 'సి' విటమిన్ ఉంటుంది. మూత్రం శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉంటే యూరియా 'అమ్మోనియా' అనే విష పదార్థంగా మారుతుంది. అమ్మోనియా వల్ల మూత్రానికి ఘాటైన వాసన వస్తుంది. విసర్జితమైన మూత్రం కొంత సమయానికి వాసన వస్తుంది. మూత్రంలో గ్లూకోజ్, సోడియం ఉండవు. మధుమేహ వ్యాధిగ్రస్తుల మూత్రంలో గ్లూకోజ్ ఉంటుంది.

విసర్జనలో ఇతర అవయవాల పాత్ర

మూత్రపిండాలతో పాటు ఊపిరితిత్తులు, కాలేయం,చర్మం కూడా వ్యర్థ పదార్థాలను విసర్జిస్తాయి.

1. **ఊపిరితిత్తులు:** రోజుకు 18 లీటర్ల కార్బన్ డై ఆక్సైడ్, 300 నుంచి 500 మి.లీ. తేమను బయటకు పంపుతాయి
2. **కాలేయం:** ఇది మానవ శరీరంలో అతిపెద్ద గ్రంథి. ఇది వయసు మళ్లిన ఎర్రరక్త కణాలను విచ్ఛిన్నం చేసి హీమోగ్లోబిన్‌ను బైల్ వర్ణకాలుగా మారుస్తుంది.
3. **చర్మం:** చర్మంలోని స్వేద గ్రంథులు చెమట రూపంలో మలినాలను విసర్జిస్తాయి. మానవుడి స్వేదంలో నీరు, లవణాలు (ఉప్పు/ సోడియం క్లోరైడ్), కొవ్వులు, కొద్దిగా యూరియా ఉంటాయి.

కృత్రిమ మూత్ర పిండం:

- మూత్రపిండాలు పనిచేయని వారిలో రక్తంలోని మలినాలను తొలగించడానికి ఉపయోగించే యంత్రమే కృత్రిమ మూత్రపిండం (డయాలైజర్). దీన్ని విలియం కోల్ఫ్ కనుగొన్నారు. దీన్ని ఆవిష్కరించిన రోజు మార్చి 13ను ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. డయాలసిస్ చేయడానికి 2-6 గంటలు పడుతుంది.

మూత్రపిండాల మార్పిడి:

- మూత్రపిండాలు పూర్తిగా పనిచేయని వ్యక్తికి దాత నుంచి సేకరించిన కిడ్నీని అమర్చడాన్నే ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు.
- మానవ శరీరంలో అవయవ మార్పిడి చేసిన మొదటి అవయవం 'మూత్రపిండం'. కృత్రిమ అవయవాల అధ్యయనాన్ని బయోనిక్స్ అంటారు.

మూత్రపిండాల్లో రాళ్లు: కాల్షియం ఆక్సలేట్ (ఎక్కువ మొత్తం), కాల్షియం ఫాస్ఫేట్, యూరియాతో ఏర్పడిన స్ఫటికాలను కిడ్నీ స్టోన్స్ అంటారు. వీటి వల్ల నెఫ్రాన్లు నశించి మూత్ర విసర్జన సమయంలో నొప్పి వస్తుంది.

మూత్ర పరీక్ష - విశ్లేషణ: మూత్రం క్లినికల్ డయాగ్నసిస్ ద్వారా రోగ నిర్ధారణ చేస్తారు. కొన్ని పరీక్షలు...

1. గ్లైకోస్యూరియా అంటే మూత్రంలో గ్లూకోజ్ ఉండటం (డయాబెటీస్ మిలిటస్ వ్యాధి).
2. కీటోన్యూరియా (మూత్రంలో కీటోన్ దేహాలు ఉంటాయి)
3. హిమటూరియా (మూత్రంలో రక్తం)
4. ఆల్కిప్టాన్యూరియా (నలుపురంగు మూత్ర విసర్జన, ఇది జన్యుసంబంధ వ్యాధి)
5. ఎన్యూరియా (మూత్రపిండాల్లో మూత్రం ఏర్పడకపోవడం)
6. నెఫ్రోసిస్ (హై బీపీ ఉన్న వారి మూత్ర పిండాల్లోని నెఫ్రాన్లు చితికిపోతాయి).
7. ఆల్బ్యుమ్యూరియా (మూత్రంలో ప్రొటీన్లు ఉంటాయి)
8. వృక్కకాల్క్యులీ (మూత్రపిండంలో రాళ్లు)
9. డయాబెటీస్ ఇన్‌సిపిడస్: అధిక మూత్ర విసర్జన (డై యూరియా).
10. హెచ్.సి.జి. లేదా గ్రావెడిక్స్ టెస్ట్ : హ్యూమన్ క్రానిక్ గోనాడోట్రోపిక్ హార్మోన్. గర్భిణుల మూత్రంలో ఈ హార్మోన్ ఉంటుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో విసర్జన క్రియతో సంబంధం లేని అవయవం ఏది?
   1) స్వేద గ్రంథి 2) మూత్రపిండం
   3) ఊపిరితిత్తులు 4) లాలాజల గ్రంథులు
2. మొదటిసారి కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం?
   1) మీథేన్ 2) బెంజీన్
   3) గ్లూకోజ్ 4) యూరియా
3. యూరియా రసాయన నామం?
   1) క్లోరో ఈథేన్ 2) ఎన్యూరిన్
   3) నైట్రిన్ 4) కార్బమైడ్
4. ఆరోగ్యవంతమైన వ్యక్తి మూత్రంలో గ్లూకోజ్ శాతం ఎంత?
   1) 0.1 శాతం 2) 2 శాతం
   3) 95 శాతం 4) 0 శాతం
5. మూత్రం పసుపు రంగులో ఉండటానికి కారణమైన పదార్థం?
   1) ఆల్బుమిన్ 2) సల్ఫర్
   3) యూరోక్రోమ్ 4) లెగ్ హీమోగ్లోబిన్
6. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం ఏది?
   1) పంచదార 2) గ్లూకోజ్
   3) క్రియాటిన్ 4) ప్రొటీన్
7. అప్పుడే విసర్జించిన మూత్రానికి ఎలాంటి వాసన ఉండదు. కానీ విసర్జించిన కొద్దిసేపటి తర్వాత మూత్రానికి ఘాటైన వాసన ఎందుకు వస్తుంది?
   1) యూరియా అమ్మోనియాగా తిరిగి యూరియాగా మారే వలయ చర్యల ద్వారా
   2) బ్యాక్టీరియా ప్రభావంతో యూరియా అమ్మోనియాగా మారడం వల్ల
   3) మూత్రంలోని యూరియా,యూరికామ్లంగా మారడం
   4) యూరియా, యూరికామ్లం, క్రియాటిన్ అమ్మోనియాగా మారడం
8. మానవుడి మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండే పదార్థం?
   1) కాల్షియం ఆక్సలేట్
   2) సోడియం ఎసిటేట్
   3) మెగ్నీషియం ఫాస్ఫేట్
   4) పైవన్నీ
9. చక్కెర వ్యాధిగ్రస్తుడి మూత్ర నమూనాలో ఉండేది?
   1) లాక్టోజ్ 2) మాల్టోజ్
   3) గ్లూకోజ్ 4) సుక్రోజ్

సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 4 5) 3 6) 3 7) 2 8) 1 9) 3

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశ ప్రధాన నదీ వ్యవస్థ

భారతదేశంలో నదీ వ్యవస్థను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

1) జీవ నదీ వ్యవస్థ
2) వర్షాధార నదీ వ్యవస్థ

ఈ రెండు నదీ వ్యవస్థల వల్ల భారతదేశానికి వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా, రవాణా పరంగా చాలా ప్రయోజనాలున్నాయి.

జీవ నదీ వ్యవస్థ

వీటినే హిమాలయన్ నదులు అని కూడా అంటారు. సంవత్సరం పొడవునా నీటి ప్రవాహం ఉన్న నదులను 'జీవనదులు' అంటారు. వర్షాకాలంలోని వర్షపు నీరు, ఇతర కాలాల్లో పర్వత శిఖరాల్లోని మంచు కరగడం వల్ల ఈ నదులు ఎల్లప్పుడూ ప్రవహిస్తూ ఉంటాయి. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, వీటి ఉపనదులు జీవ నదులుగా ఉన్నాయి.

- **సింధూనది:** ఇది 'టిబెట్' హిమాలయాల్లోని 'మానస సరోవరం' పశ్చిమ వైపున 5180 మీ. ఎత్తయిన కైలాస శిఖరాల్లో జన్మిస్తోంది. టిబెట్, భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తోంది. దీని మొత్తం పొడవు 2880 కి.మీ. భారతదేశంలో 709 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ నది భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఈ రాష్ట్రం నుంచి పాకిస్థాన్‌లోకి ప్రవేశించి, ఆ దేశంలో ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తోంది. చివరకు పాకిస్థాన్‌లోని 'కరాచి' వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రధానంగా లద్దాక్, బలిస్థాన్ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. దీని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి. వీటిలో అతి పెద్ద ఉపనది సట్లెజ్.
- **గంగా:** ఇది భారతదేశంలో ప్రవహిస్తున్న నదుల్లో అత్యంత పొడవైంది. ఉత్తరాఖండ్ హిమాలయాల్లో గంగోత్రి హిమానీనదం వద్ద జన్మిస్తున్న అలకనంద, భగీరథ అనే రెండు పాయలు కొంత దూరం ప్రవహించి 'దేవ ప్రయాగ' వద్ద కలిసి 'గంగానది' ఏర్పడుతోంది. దీని మొత్తం పొడవు 2525 కి.మీ. దీని పరీవాహక ప్రాంతం సుమారు 8,61,404 చ.కి.మీ. విస్తరించి ఉంది.

ఈ నది భారతదేశంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తూ బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీన్ని బంగ్లాదేశ్‌లో 'పద్మా నది' అని, బ్రహ్మపుత్రా నదితో కలిసిన తర్వాత 'మేఘన' అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ద్వారా దీని నీటిని హుగ్లీనదికి మళ్లిస్తున్నారు. దీని ప్రధాన ఉప నదులు- యమున, కోసీ, రామ్‌గంగా, గోమతి, బాగ్రా, గండక్, మహానందా, సోన్. దక్షిణ దిశ నుంచి వచ్చి గంగానదిలో కలిసే ఏకైక ఉపనది సోన్. మిగితావన్నీ హిమాలయాల నుంచి వచ్చి గంగానదిలో కలుస్తున్నాయి.

- **యమునా:** ఇది గంగానది ఉపనదులన్నింటిలో పెద్దది. ఇది 'యమునోత్రి' హిమానీనదం వద్ద పుట్టి 'అలహాబాద్' దగ్గర గంగానదితో కలుస్తుంది. చంబల్, బెట్వా, కెన్ దీని ఉపనదులు.
- **బ్రహ్మపుత్ర:** ఇది టిబెట్ హిమాలయాల్లోని 'మానస సరోవరం' తూర్పు వైపున జన్మిస్తోంది. టిబెట్, భారత్, బంగ్లాదేశ్ ద్వారా 2900 కి.మీ. దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో కలుస్తోంది.

ఈ నది భారత్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించిన వెంటనే 'షియాంగ్' అనే నదితో కలిసి కొంత దూరం ప్రయాణించి 'దిహంగ్' అనే ప్రదేశం వద్ద దిహంగ్, లోహిత నదులతో కలుస్తోంది. అసోంలో 'తీస్టా' ఉపనదిని కలుపుకొని బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తోంది. చివరగా గంగానదితో కలిసి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదిని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. టిబెట్‌లో - సాంగ్‌పో లేదా త్సాంగ్‌పో అని పిలుస్తున్నారు. 'స్వచ్ఛమైన' అని దీని అర్థం. అరుణాచల్ ప్రదేశ్‌లో 'దిహంగ్' అని, బంగ్లాదేశ్‌లో 'జమునా' అని పిలుస్తున్నారు.

మగవారి పేరుతో పిలుస్తున్న భారతదేశ ఏకైక నది బ్రహ్మపుత్ర. దీని ఉపనదులు తీస్టా, షియాంగ్, దిహంగ్, లోహిత. గంగా, బ్రహ్మపుత్ర నదులు సముద్రంలో కలిసేచోట ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన 'సుందర్‌బన్ డెల్టా'ను ఏర్పరుస్తున్నాయి.

వర్షాధార నదీ వ్యవస్థ

వర్షాకాలం మాత్రమే నీటి ప్రవాహం కలిగి ఉండటం వల్ల వీటిని 'వర్షాధారిత నదులు' అంటారు. వీటినే 'ద్వీపకల్ప నదులు' అని కూడా అంటారు.

వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

పశ్చిమం వైపునకు ప్రవహిస్తున్న నదులు: సబర్మతి, నర్మదా, తపతి, మహి మొదలైనవి.

- **నర్మదానది:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న నదుల్లో అతి పొడవైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'అమర్‌కంటక్' ప్రాంతంలో పుట్టి వింధ్య, సాత్పుర పర్వత శ్రేణుల మధ్య 1312 కి.మీ. ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. భారతదేశంలో 'పగులు లోయ'లో ప్రవహిస్తున్న అతి పొడవైన నది నర్మద.

దీని ప్రధాన ఉపనదులు షార్, బర్హానర్, బుంజర్, షక్కర్, కోలర్, బుర్నా, హీరాన్. ఈ నది ప్రవాహ మార్గంలో రెండు ప్రధాన జలపాతాలున్నాయి. అవి: కపిల ధారా, ధూన్‌ధర్. దీని పరీవాహ ప్రాంతం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో (87 శాతం), మిగి లింది మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉంది.

- **తపతి:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న వాటిలో రెండో అతిపెద్ద నది. ఇది మధ్యప్రదేశ్ లోని 'బిటువల్' జిల్లాలోని 'ముల్టాయి' వద్ద పుట్టి 724 కి.మీ. పొడవున సాత్పురా - అజంతా పర్వత శ్రేణుల మధ్య ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. పూర్ణానది, గిర్నా, బోరి, కీప్ర, సిప్రా, సుకీ, అమరావతి దీని ఉపనదులు.

తూర్పు వైపునకు ప్రవహిస్తున్న నదులు: వీటిలో ముఖ్యమైనవి గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, పెన్నా.

ద్వీపకల్ప పీఠభూమి తూర్పువైపునకు వాలి ఉండటంతో దీనిలోని నదులు అధికభాగం తూర్పుదిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

- **గోదావరి:** భారతదేశంలో గంగానది తర్వాత రెండో అతిపెద్ద నది గోదావరి. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది. దీన్ని 'దక్షిణ గంగా', 'దక్షిణ గంగోత్రి', 'వృద్ధ గంగా' అని కూడా అంటారు. ఈ నది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో 'నాసిక్ త్రయంబకం' వద్ద జన్మిస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ద్వారా సుమారు 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. మంజీరా, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, వార్ధా మొదలైనవి దీని ఉపనదులు. ఇది నిర్మల్ జిల్లాలోని 'బాసర' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది.
- **కృష్ణానది:** ఇది మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లోని 'మహాబలేశ్వరం' వద్ద పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది. 1440 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇది దక్షిణ భారతదేశంలో రెండో అతి పెద్దనది. ఈ నది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం 'తంగడి' వద్ద తెలంగాణ రాష్ట్రం లో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసల దీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. తుంగభద్ర, కోయన, పాలేరు, దిండి, మూసీ, భీమా, మున్నేరు, ఘటప్రభ మొదలైనవి దీని ఉపనదులు.
- **కావేరి:** ఇది కర్ణాటకలోని 'కూర్గ్' జిల్లాలో 'బ్రహ్మగిరి' కొండల్లో జన్మించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా సుమారు 805 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. తమిళనాడులోని కావేరి పట్టణం ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. హేమావతి, లోకపావని, షింషా, ఆర్కావతి, లక్ష్మణ తీర్థ, భవాని మొదలైనవి దీని ఉపనదులు. ఇది తమిళనాడులో అతి ప్రధానమైన నది.
- **పెన్నా:** ఇది కర్ణాటకలోని మైసూరు వద్ద 'నందిదుర్గ' కొండల్లో పుట్టి అనంతపురం జిల్లా హిందూపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'ఊటుకూరు' వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. జయమంగళి, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ఉపనదులు.
- **మహానది:** ఇది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒడిశా ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీని పొడవు 857 కి.మీ. దీని ఉపనదులు- మండ్, షియోనాథ్, లేవ్, ఇబ్, హస్‌డియో.



గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అత్యంత పొడవైన నది ఏది?
   1) గంగా 2) నర్మదా
   3) కృష్ణా 4) గోదావరి
2. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది మొదట ఎక్కడ ప్రవేశిస్తుంది?
   1) అరుణాచల్ ప్రదేశ్
   2) త్రిపుర 3) అస్సాం
   4) మేఘాలయ
3. దక్షిణ గంగా అని ఏ నదికి పేరు?
   1) కృష్ణా 2) గోదావరి
   3) తుంగభద్ర 4) పెన్నా
4. ఏ నదీ సమూహం టిబెట్‌లో ప్రారంభ మూలాన్ని కలిగి ఉంది?
   1) బ్రహ్మపుత్ర, గంగా, సట్లెజ్
   2) గంగా, సట్లెజ్, యమున
   3) చినాబ్, రావి, సట్లెజ్
   4) బ్రహ్మపుత్ర, ఇండస్, సట్లెజ్
5. సాత్పురా, వింధ్య శ్రేణుల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
6. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) సుభ్ర 2) భగీరథి
   3) రూప్ నారాయణ్
   4) పద్మ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. కొంకణ్ తీరం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) కేరళ 4) మహారాష్ట్ర
2. అత్యధిక సంఖ్యలో సరస్సులు, లాగూన్‌లను కలిగి ఉన్న తీర ప్రాంతం ఏది?
   1) కేరళ తీరం 2) తమిళనాడు తీరం
   3) ఒడిశా తీరం 4) గుజరాత్ తీరం
3. అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) పశ్చిమ బెంగాల్ 4) మణిపూర్
4. శ్రీహరికోటలోని 'సతీష్‌ధావన్' రాకెట్ ప్రయోగ కేంద్రం ఏ సరస్సులో విస్తరించి ఉంది?
   1) చిలుకా సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) వెంబనాడ్ సరస్సు
5. పగులులోయ ద్వారా ప్రవహిస్తున్న నది?
   1) గంగా 2) నర్మదా
   3) బ్రహ్మపుత్ర 4) గోదావరి
6. టిబెట్‌లో 'త్సాంగ్‌పో' అని ఏ నదిని పిలుస్తారు?
   1) సింధూ 2) బ్రహ్మపుత్ర
   3) గంగా 4) గండక్
7. గంగానది ఉపనదుల్లో ఉత్తరానికి ప్రవహించేది?
   1) కోసి 2) ఘాగ్ర
   3) సోన్ 4) గండక్
8. కిందివాటిలో పశ్చిమానికి ప్రవహించే నది?
   1) గోదావరి 2) చంబల్
   3) మహానది 4) నర్మదా
9. ఒడిశా రాష్ట్రంలో డెల్టాను ఏర్పరిచే నది?
   1) సువర్ణరేఖ 2) మహానది
   3) కావేరి 4) నర్మదా
10. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) కోసి 2) హుబ్లీ
    3) దామోదర్ నది 4) గంగానది
11. బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) దామోదర్ 2) కోసి
    3) బ్రహ్మపుత్ర 4) వైతరణి
12. కృష్ణా - గోదావరి నదుల మధ్య విస్తరించిన సరస్సు ఏది?
    1) పులికాట్ 2) కొల్లేరు
    3) చిలుకా 4) అష్టముడి
13. గంగానది ఉపనదుల్లో కెల్లా అతిపెద్దది?
    1) చంబల్ 2) ఘాగ్ర
    3) కోసి 4) యమునా
14. కపిలధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) యమునా 2) నర్మదా
    3) గోదావరి 4) కావేరి
15. అలకనంద, భాగీరథిలు ఎక్కడ కలుస్తాయి?
    1) రుద్ర ప్రయాగ్ 2) దేవ ప్రయాగ్
    3) రిషికేష్ 4) ప్రయాగ్
16. నర్మదా నది ఎక్కువ భాగం ఏ రాష్ట్రం ద్వారా ప్రవహిస్తుంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) మధ్యప్రదేశ్ 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 3;
5) 2; 6) 2; 7) 3; 8) 4;
9) 2; 10) 3; 11) 2; 12) 2;
13) 4; 14) 2; 15) 2; 16) 3.

The scheme has fallen out due to..



BANK EXAMS

General English

Directions (Q. 1-10):
In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/phrase in each case and mark your answer.

Though most of us know him _____ (1) for his inventions, Thomas Alva Edison was first and _____ (2) a telegraph operator. Born humbly in Ohio, U.S.in 1847, he was the seventh _____ (3) last child of Samuel Ogden Edison. At the _____ (4) age of nineteen he moved to Kentucky, where he worked in night shifts. He was _____ (5) with a lead-acid battery when he spilled Sulfuric acid onto the floor it ran between the floorboards and onto his boss's desk below. The next morning Edison was ____ (6). He was ___ (7) about reading and experimenting. One of his mentors during those early years was a fellow telegrapher and inventor named Franklin Leonard Pope, who allowed the ____(8) youth to live and work in the basement of his home. The invention that first gained him notice was the phonograph in 1877. This ___ (9) was so unexpected by the public at large as to appear almost ___ (10).

1. (1) except (2) best (3) hardly (4) greatly (5) sometimes
2. (1) previous (2) only (3) foremost (4) above (5) lastly
3. (1) between (2) before (3) with (4) and (5) of
4. (1) elder (2) early (3) delicate (4) old (5) tough
5. (1) set (2) establish (3) working (4) shared (5) purchase
6. (1) fired (2) send (3) showed (4) followed (5) take
7. (1) fame (2) character (3) passionate (4) defeat (5) poor
8. (1) poverty (2) worry (3) problem (4) conflict (5) impoverished
9. (1) accomplishment (2) well (3) fine (4) leading (5) excellent
10. (1) partly (2) wisely (3) rarely (4) magical (5) almost

Directions (Q. 11-20):
*Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.*

The joy of discovery is a very real **incentive** to research, despite the rareness of its realization. It is on error to suppose that the scientist is unemotional, or could succeed if he were. The error has arisen through a misconception. The absolute necessity that a scientist's findings shall not be changed from **objective** truth in response to emotional urges of any kind does not result in his becoming a particularly unemotional person: whether a discoverer or anyone else is pleased with a discovery has no effect on its validity. 'I have been working like a madman at Drosera' wrote Darwin to Sir J.D. Hooker in reference to his study of insectivorous plants and a few days later, to the geologist, Lyell 'at the present moment I care more about Drosera that the origin of all the species in the world---- I am **frightened** and **astounded** at my results'. Kropotkin once wrote, 'There are not many joys in human life equal to the **joy** of the sudden birth of a generalization ---He who has once in this life experienced this joy of scientific creation will never forget it.'

11. The author of the passage counters the misconception that a scientist is unemotional by pointing out that
    1) the objectivity of a scientist cannot make emotional compromises
    2) even such a great scientist as Darwin cared so much for Drosera
    3) he has capacity to react to emotional appeals made by others
    4) he considers scientific discovery equal to the joy of creation
    5) he has no capacity to react to emotional appeals made by others
12. In this passage the author tells us that scientific research leads one to
    1) rare discoveries
    2) success, sometimes
    3) sure success
    4) finding the objective truth
    5) funding rarity
13. Darwin's letter to Lyell reveals to us that he
    1) attached greater importance to his discovery of insectivorous pants than to his discovery of the origin of the species
    2) used to get deeply involved in whatever research, big or small, he had on hand at a given point of time
    3) was rather uncertain about his success in his research on insectivorous plants
    4) was worried that insectivorous plants would destroy all species of insects
    5) was sure of success
14. The findings of scientific researchers
    1) are universally welcome
    2) result in robbing the researcher of all emotions
    3) are objective in nature
    4) have universal validity
    5) no relation to present
15. Kropotkin says about the unforgettable experience
    1) joy of scientific creation
    2) remember the experience
    3) sorrows of human life
    4) generalized observations
    5) astounding facts

Directions (Q. 16-18):
*Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in **bold** as used in the passage.*

16. ASTOUNDED
    1) amazed 2) scared
    3) rescued 4) worked
    5) furnished
17. JOY
    1) ecstasy 2) wander
    3) murmur 4) jump 5) leap
18. INCENTIVE
    1) enticement 2) enjoyment
    3) overwhelm 4) spurious
    5) engulf

Directions (Q. 19-20):
*Choose the word which is MOST OPPOSITE in meaning to the word printed in **bold** as used in the passage.*

19. OBJECTIVE
    1) purpose 2) subjective
    3) change 4) bonus
    5) increment
20. FRIGHTENED
    1) ghastly 2) beastly
    3) horrified 4) courageous
    5) happy

Directions (Q. 21-25):
Each question below has two blanks, each blank indicating that something has been omitted. Choose the set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Scientists fear that many birds ----- heading towards a unisex existence that would ----- to extinction.
    1) is... make 2) are.. making
    3) is... moving 4) are...lead
    5) were...leading
22. Using ------ from government survey, he found ------ support for his line of reasoning.
    1) data... strong 2) date...much
    3) doubt...many
    4) dates...very 5) date...meek
23. Science consists of ------, Art consists of ------.
    1) naming...pleading
    2) knowing...doing
    3) doing... pleasing
    4) creation...erosion
    5) evolution...inspection
24. Technology is important but what is of great ---------- is the capturing of tacit knowledge.
    1) important 2) import
    3) improvement 4) importance
    5) importantly
25. The ------ of the hour is to evolve measures to tackle the issue.
    1) time 2) moment 3) need
    4) pride 5) speed

Directions (Q. 26-30):
Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

26. There is a misconception (1)/that freedom means(2)/to be doing (3)/your own thing.(4)/No error (5)
27. Shakespeare was (1)/ better than any poet(2)/of his days (3)/ according to critics. (4)/ No error (5)
28. I ordered for a cup of tea (1)/ but the bearer (2)/brought it only (3)/ at the end of the tea-session. (4)/ No error (5)
29. Lack of honesty(1)/ is sometimes labeled as(2)/tact public relations (3)/or politics. (4)/ No error (5)
30. in the aftermath of the September 11th (1)/ the American president's speech was (2)/ broadcasted and televised (3)/ all over the world. (4)/ No error (5)

Directions (Q. 31-35):
Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in bold in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.

31. The minister **hit out** at his critics and categorically denied his involvement in the scam.
    1) hit up 2) hit back
    3) hit upon 4) hit around
    5) no correction
32. He can **strike out** a friendship even with complete strangers.
    1) strike up 2) strike at
    3) strike on 4) strike back
    5) no correction
33. I prefer listening to soft music to help me **wind over** after a stressful day.
    1) wind up 2) wind down
    3) wind off 4) wind of
    5) no correction
34. The scheme has **fallen out** due to paucity of funds.
    1) fallen through 2) fallen over
    3) fallen apart 4) fallen back
    5) no correction
35. Over the years several extremists **laid up** their arms and joined the mainstream.
    1) laid out 2) laid upon
    3) laid by 4) laid down
    5) no correction

KEY

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 3;
6) 1; 7) 3; 8) 5; 9) 1; 10) 4;
11) 1; 12) 4; 13) 1; 14) 3; 15) 1;
16) 1; 17) 1; 18) 1; 19) 2; 20) 4;
21) 4; 22) 1; 23) 2; 24) 4; 25) 3;
26) 3; 27) 2; 28) 1; 29) 2; 30) 3;
31) 2; 32) 1; 33) 2; 34) 1; 35) 4.